

'రాష్ట్రాన్ని, దేశానికే అన్నం పెట్టే అన్నపూర్ణగా తీర్చిదిద్దాలనేది నా స్వప్నం'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 107

శనివారం 8-7-2023



జలయజ్ఞం చేసిన అపర భగీరథుడు
నేడు డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి జయంతి సందర్భంగా ప్రత్యేక వ్యాసం -4లో



గ్రీన్‌కార్డు ఆశలు తీరే మార్గం..
నిరుపయోగంగా ఉన్న 2.30 లక్షల గ్రీన్‌కార్డులను పునర్వినియోగం -6లో

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

పొలిటికల్ ట్రాక్‌పైనే..
పోరుగల్లు వ్యాగన్స్

నేడు రాష్ట్ర పర్యటనకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ..

అధికారిక కార్యక్రమాలపై వస్తున్నా.. రాజకీయ అంశాలకే ప్రాధాన్యత

బీఆర్ఎస్ సర్కారు, కేసీఆర్ విషయంలో వైఖరిని తేల్చే అవకాశం

రెండు పార్టీల మధ్య అవగాహన ఉందన్న ప్రచారానికి ఫుల్‌స్టాప్ పెట్టేలా ప్రసంగం

అవినీతి, కుటుంబ పాలన అంశాలపై ఘాటు విమర్శలు కూడా..!

ఈ సభతో పార్టీలో పునరుత్తేజం వస్తుందంటున్న బీజేపీ నేతలు

అసెంబ్లీ ఎన్నికలకు ప్రధాని శంఖారావం పూరిస్తారని వెల్లడి

రాజకీయాలు వేడెక్కిన క్రమంలో ఆసక్తి రేపుతున్న మోదీ పర్యటన



- రూ. 6,109 కోట్ల పనులకు అంకురార్పణ చేయనున్న మోదీ
- కాజీపేటలో రైల్వే వ్యాగన్ తయారీ పరిశ్రమకు శంకుస్థాపన
- జగిత్యాల-కరీంనగర్-వరంగల్, మంచిర్యాల-వరంగల్ హైవేల విస్తరణ పనుల ప్రారంభం 2లో



ఇది కమీషన్ల ప్రభుత్వం

- కల్వకుంట్ల ఫ్యామిలీని ఫామ్‌హౌజ్‌కే పరిమితం చేస్తాం
- వరంగల్ సభ రాజకీయంగా కీలకం: కిషన్ రెడ్డి 2లో

కేసీఆర్ ఎందుకు ముఖం చాటేస్తున్నారు?

- ప్రధాని వచ్చినప్పుడల్లా ఎందుకలా చేస్తున్నారు?
- ఎంపీ కె. లక్ష్మణ్ ధ్వజం 2లో

మోదీ టూర్‌ను బహిష్కరిస్తున్నాం

ఆ కార్యక్రమాల్లో మా ప్రజాప్రతినిధులు ఎవరూ పాల్గొనరు: మంత్రి కేటీఆర్

రూ.20వేల కోట్ల కోచ్ ఫ్యాక్టరీని గుజరాత్ తీసుకెళ్లి.. రూ.500 కోట్ల ఫ్యాక్టరీని తెలంగాణకు బిచ్చం వేస్తున్నారు



గిరిజన వర్సిటీ ఇవ్వలేదు.. ఏ ముఖం పెట్టుకుని వరంగల్‌కు వస్తున్నారు? 2లో

- గాంధీభవన్‌లో గాడ్సే ఉన్నాడు.. రేవంత్ ఆర్ఎస్ఎస్ మనిషి
- అసలు రాహుల్ గాంధీని లీడర్‌గా ఎవరు గుర్తిస్తున్నారని వ్యాఖ్య

త్వరలో టెట్ పరీక్ష!

నిర్వహించాలని అధికారులకు ప్రభుత్వ ఆదేశం.. తక్షణమే కసరత్తు మొదలుపెట్టాలని సూచన 3లో

అగ్నికీలల్లో 'ఫలక్‌నుమా'

- ఐదు బోగీలు పూర్తిగా, రెండు బోగీలు పాక్షికంగా దగ్ధం
- భువనగిరి సమీపంలోని బొమ్మాయిపల్లి వద్ద ఘటన
- ప్రయాణికులు సురక్షితం

12లో


మంటల్లో కాలిపోతున్న ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్ బోగీలు

క్లుప్తంగా...

చులకనగా మాట్లాడేవారికి చురకలు పెట్టే రోజులొస్తాయి

రాహుల్‌ను విమర్శించే హక్కు కేటీఆర్‌కు లేదు: మధుయాష్కీ



సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీ గురించిగానీ, తమ పార్టీ నాయకుల గురించిగానీ చులకనగా మాట్లాడేవారికి చురకలు పెట్టేరోజు దగ్గర్లోనే ఉందని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కీగౌడ్ అన్నారు. దేశానికి స్వాతంత్య్రం వచ్చిననాటి నుంచి ప్రజాసేవలో భాగంగా ప్రాణాలర్పించిన గాంధీ కుటుంబానికి చెందిన రాహుల్‌గాంధీని విమర్శించేస్థాయి రాష్ట్రమంత్రి కేటీఆర్‌కు లేదన్నారు. శుక్రవారం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మధుయాష్కీ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో త్యాగం కాంగ్రెస్ పార్టీది అయితే, వచ్చిన తెలంగాణలో అధికారం అనుభవిస్తున్న భోగం బీఆర్‌ఎస్‌దని పేర్కొన్నారు. తెలంగాణ కోసం ప్రాణాలర్పించిన అమరుల కుటుంబాల ఆదాయం పెరగలేదని, కేటీఆర్ ఆస్తులు మాత్రం పెరిగాయని ఆరోపించారు. రాష్ట్రంలో అంబేద్కర్ ఆశించిన పాలన వస్తుందని ప్రజలు భావిస్తే, కుటుంబపాలన జరుగుతోందని విమర్శించారు. గాడ్సేను పూజించే బీజేపీతో బీఆర్‌ఎస్ స్నేహం చేస్తోందని, అందుకే లిక్కర్ స్కాంలో కేసీఆర్ కుమార్తె కవిత ఉన్నప్పటికీ అరెస్టు చేయలేకపోతున్నారని ఆరోపించారు. తెలంగాణ అమరులకు ఇచ్చిన హామీలు, కొండా లక్ష్మణ్ బాపూజీ, జయశంకర్ ఆశయాలను కేసీఆర్, కేటీఆర్ విస్మరించారని, వచ్చే ఎన్నికల్లో తెలంగాణ ప్రజలు బీఆర్‌ఎస్‌ను బొందపెట్టడం ఖాయమని మధుయాష్కీ వ్యాఖ్యానించారు.

ఓటర్ల జాబితా సవరణపై జాగ్రత్త

టీటీడీపీ అధ్యక్షుడు జ్ఞానేశ్వర్



సాక్షి, హైదరాబాద్: రానున్న శాసనసభ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని ఓటర్ల జాబితా సవరణపై పార్టీ నాయకులు అప్రమత్తంగా ఉండాలని టీటీడీపీ అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ హెచ్చరించారు. ఓటర్ల జాబితాకు సంబంధించిన అంశాలపై శుక్రవారం ఆయన ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్‌లో పార్లమెంటు అధ్యక్షులు, అసెంబ్లీ ఇన్‌చార్జిలు, ఇతర పార్టీ నాయకులతో సమీక్ష జరిపారు. అనంతరం మాట్లాడుతూ ఒక్కొక్క ఓటరుకు రెండు, మూడు చోట్ల ఓట్లు ఉన్నాయన్నారు. రెండు రాష్ట్రాల్లో ఓట్లు ఉన్నవారు కూడా ఉన్నారని వివరించారు. సమావేశంలో టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు రావుల చంద్రశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని అరెస్ట్

ప్రధాని మోదీ పర్యటనను వ్యతిరేకిస్తూ కార్యక్రమాలు



సాక్షి, హైదరాబాద్: విభజన చట్టంలోని హామీలను అమలు చేయని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పర్యటనను నిరసిస్తూ సీపీఐ రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన కార్యక్రమాలను పోలీసులు అడ్డుకున్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావుసహా పలువురిని అరెస్ట్ చేయడంతో పలుచోట్ల ఉద్రిక్తత నెలకొంది. ఈ నెల 8న ప్రధాని వరంగల్ పర్యటనకు వస్తున్న నేపథ్యంలో విభజన హామీలపై నిరసన చేపట్టేందుకు హనుమకొండకు వెళ్లిన కూనంనేనిని అరెస్టు చేశారు. శాంతియుతంగా నిరసన తెలియజేస్తున్న వేలాదిమందిని పోలీసులు అరెస్టు చేయడాన్ని ఆ పార్టీ ఖండించింది. అనేకమందిని ముందస్తుగా ఉదయమే ఇళ్ల వద్ద పోలీసులు అరెస్టు చేశారు. ఈ అక్రమ అరెస్టులకు నిరసనగా రాష్ట్రవ్యాప్తంగా 33 జిల్లాల్లోని 80 కేంద్రాలలో దాదాపు 10 వేలమంది కార్యకర్తలు ఆందోళనలు చేశారని పార్టీ వెల్లడించింది. శనివారం కూడా విస్తృతంగా నిరసన ప్రదర్శనలు కొనసాగుతాయని కూనంనేని ఒక ప్రకటనలో వెల్లడించారు. సింగరేణి ప్రాంతంలో కార్మికులు నల్లబ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేయనున్నట్లు తెలిపారు. సీపీఐ నాయకులపై పోలీసులు వ్యవహరించిన తీరును సీపీఐ నేత చాడ వెంకటరెడ్డి తీవ్రంగా ఖండించారు.

ఇదండీ సంగతి



విపక్షాలు ఈ వంకతో మిమ్మల్ని ప్రధాని కాకుండా చేస్తున్నాయని నా అనుమానం సార్!

మోదీ సభా వేదికపై ఎనిమిది మందే..

అందులో సీఎం కేసీఆర్, మంత్రి ప్రశాంత్‌రెడ్డి, ఎంపీ పసునూరి పేర్లు

- బీఆర్‌ఎస్ బహిష్కరణతో ఆ సీట్లు ఖాళీనే!
- వేదికపై మోదీ, గవర్నర్ తమిళిసై, కేంద్ర మంత్రులు గడ్కరీ, కిషన్‌రెడ్డి, ఎంపీ బండి
- ఉదయం 10.15 గంటలకు హకీంపేట నుంచి మామునూరుకు ప్రధాని మోదీ



ప్రధాని సభ కోసం ఏర్పాటు చేస్తున్న వేదిక

సాక్షి ప్రతినిధి, వరంగల్: ప్రధాని మోదీ పర్యటన కోసం కాకతీయుల గడ్డ ఓరుగల్లు ముస్తాబైంది. సుమారు 30 ఏళ్ల తర్వాత దేశ ప్రధాని తొలిసారిగా వరంగల్‌కు వస్తుండటం గమనార్హం. ప్రధాని అధికారిక కార్యక్రమాల కోసం ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సభా వేదికపైకి ప్రధాని మోదీ సహా ఎనిమిది మందికే అవకాశం ఉంటుందని పీఎంఓ కార్యాలయ డిప్యూటీ సెక్రటరీ బిప్లవ్ కేఆర్ రాయ్ టూర్ షెడ్యూల్‌లో స్పష్టం చేశారు. ఇందులో మోదీతోపాటు గవర్నర్ తమిళిసై, సీఎం కేసీఆర్, కేంద్ర మంత్రులు నితిన్ గడ్కరీ, జి.కిషన్‌రెడ్డి, రాష్ట్ర మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, ఎంపీలు బండి సంజయ్, పసునూరి దయాకర్ ఉన్నారు. అయితే ప్రధాని మోదీ పర్యటనను బహిష్కరిస్తున్నామని, తమ ప్రజాప్రతినిధులెవరూ పాల్గొనబోరని బీఆర్‌ఎస్ ప్రకటించిన నేపథ్యంలో.. సీఎం కేసీఆర్, మంత్రి ప్రశాంత్‌రెడ్డి, ఎంపీ దయాకర్ పాల్గొనే అవకాశం లేదని, ఆ సీట్లు ఖాళీగానే ఉండే అవకాశం ఉందని బీజేపీ వర్గాలు చెప్తున్నాయి.

పోలీసు వలయంలో వరంగల్

ప్రధాని పర్యటన సందర్భంగా గ్రేటర్ వరంగల్ పరిధిలో భారీగా బందోబస్తు ఏర్పాటు చేశారు. ఇద్దరు అడిషనల్ డీజీపీల పర్యవేక్షణలో సుమారు పది వేల మందిని మోహరించారు. మోదీ వెళ్లే ప్రాంతాలు, సభా ప్రాంగణాన్ని డాగ్ స్క్వాడ్‌తో తనిఖీ చేశారు. నగరంలోని పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. కాగా శుక్రవారం రాత్రి కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, తరుణ్‌ఛుగ్, బండి సంజయ్, ఈటల రాజేందర్, డీకే అరుణ, ఏపీ జితేందర్‌రెడ్డి తదితరులు ప్రధాని సభ ఏర్పాట్లను పరిశీలించారు.

ప్రధాని పర్యటన షెడ్యూల్ ఇదీ..

టూర్ షెడ్యూల్ ప్రకారం.. ప్రధాని మోదీ శనివారం ఉదయం ప్రత్యేక విమానంలో హైదరాబాద్ శివార్లలోని హకీంపేట ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. అక్కడి నుంచి ప్రత్యేక హెలికాప్టర్‌లో బయలుదేరి 10.15 గంటలకు మామునూరు మినీ ఎయిర్‌పోర్టుకు వస్తారు. అక్కడి నుంచి రోడ్డుమార్గంలో భద్రకాళి అమ్మవారి ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు చేస్తారు. 11 గంటల సమయంలో కాకతీయ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానానికి చేరుకుంటారు. వివిధ అభివృద్ధి పనులకు వర్చువల్‌గా శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేస్తారు. రైల్వే, నేషనల్ హైవే అధికారుల పవర్ పాయింట్ ప్రజెంటేషన్లను తిలకిస్తారు. 11.45 గంటలకు అక్కడే ఏర్పాటు చేసిన విజయ సంకల్ప సభా వేదిక వద్దకు చేరుకుని ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తారు. మధ్యాహ్నం 12.30 గంటలకు తిరిగి హైదరాబాద్‌కు బయలుదేరుతారు.

పొలిటికల్ ట్రాక్‌పైనే.. పోరుగల్లు వ్యాగన్స్!

నేడు రాష్ట్ర పర్యటనకు ప్రధాని మోదీ..

- అధికారిక కార్యక్రమాలపై వస్తున్నా.. రాజకీయ అంశాలకే ప్రాధాన్యత

సాక్షి, హైదరాబాద్: అధికారిక కార్యక్రమాల కోసం ప్రధాని మోదీ రాష్ట్ర పర్యటనకు వస్తున్నా.. ఇది పొలిటికల్ ట్రాక్‌పైనే సాగే అవకాశం కనిపిస్తోందని, రాష్ట్రంలో బీజేపీ వ్యవహారాన్ని చక్కబెట్టే దిశగానే మోదీ ప్రసంగం ఉంటుందని ఆ పార్టీ వర్గాలు చెప్తున్నాయి. మరో నాలుగైదు నెలల్లోనే అసెంబ్లీ ఎన్నికలు ఉండటంతో.. అధికార బీఆర్‌ఎస్, కేసీఆర్ సర్కారు విషయంలో బీజేపీ అనుసరించబోయే వైఖరిని ప్రధాని సుస్పష్టం చేస్తారని అంటున్నాయి. కొన్నిరోజులుగా బీజేపీ, బీఆర్‌ఎస్ ఒక్కటేననే ప్రచారానికి దీనితో చెక్ పడుతుందని.. రాష్ట్ర పార్టీలో తిరిగి ఉత్సాహం నెలకొంటుందని వివరిస్తున్నాయి. మోదీ తన ప్రసంగంలో బీఆర్‌ఎస్ సర్కారు, కేసీఆర్ కుటుంబ పాలన అంశాలను ప్రత్యక్షంగా, లేదా పరోక్షంగా లేవనెత్తుతూ తీవ్రస్థాయిలో విమర్శలు చేసే అవకాశం ఉందని వివరిస్తున్నాయి. ఇదే సమయంలో కేంద్ర ప్రభుత్వం నుంచి తెలంగాణ రాష్ట్రానికి ఇచ్చిన నిధులు, అందించిన సహాయ, సహకారాలను వివరించే ప్రయత్నం చేస్తూ.. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల శంఖారావాన్ని పూరిస్తారని పేర్కొంటున్నాయి.

అవగాహన ప్రచారాన్ని ఆపేలా..

బీఆర్‌ఎస్, బీజేపీ మధ్య లోపాయకారీ అవగాహన కుదిరినందునే.. సీఎం కేసీఆర్‌పై కేంద్ర ప్రభుత్వ పెద్దలు విమర్శలు తగ్గించారని కొన్నిరోజులుగా జరుగుతున్న ప్రచారానికి ఫుల్‌స్టాప్ పడేలా ప్రధాని మోదీ ప్రసంగం ఉంటుందని బీజేపీ వర్గాలు చెప్తున్నాయి. ఈ క్రమంలో తీవ్ర విమర్శలు గుప్పించే అవకాశం ఉందని.. కేసీఆర్ కుటుంబ పాలన, బీఆర్‌ఎస్ సర్కారు అవినీతి, అక్రమాల అంశాలను లేవనెత్తుతారని అంటున్నాయి. ఇటీవల భోపాల్‌లో జరిగిన సమావేశంలో దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో కుటుంబ, వారసత్వ పాలన కారణంగా అభివృద్ధి మందగించిందని.. కేవలం కుటుంబ శ్రేయస్సే ధ్యేయంగా ఆ ప్రభుత్వాలు పనిచేస్తున్నాయని మోదీ విమర్శించిన విషయాన్ని గుర్తు చేస్తున్నాయి. ప్రజలు బీఆర్‌ఎస్‌ను గెలిపిస్తే.. కేవలం కేసీఆర్ కుమార్తె కవితకే ప్రయోజనం చేకూరుతుందని, అదే బీజేపీని గెలిపిస్తే ప్రజలకు మేలు చేకూరుతుందని వ్యాఖ్యానించారని ప్రస్తావిస్తున్నాయి. ఈ క్రమంలో ఢిల్లీ మద్యం కుంభకోణం కేసును పరోక్షంగా ప్రస్తావనకు తెచ్చి కేసీఆర్ కుటుంబాన్ని ఎండగడతారని బీజేపీ వర్గాలు పేర్కొంటున్నాయి. రాష్ట్రంలో సరైన అభివృద్ధికావాలంటే.. బీజేపీ ఆధ్వర్యంలోని డబుల్ ఇంజన్ సర్కారు రావాల్సిందేనని పిలుపునిస్తారని అంటున్నాయి.

కాంగ్రెస్, ఇతర విపక్షాల తీరును ఎండగట్టేలా

తెలంగాణతోపాటు మరో నాలుగు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు, లోక్‌సభ ఎన్నికలు కూడా ఉన్న క్రమంలో ప్రధాని మోదీ ఈ సభా వేదికను దానికి అనుగుణంగా వినియోగించుకోనున్నట్టు బీజేపీ వర్గాలు చెప్తున్నాయి. జాతీయ, రాష్ట్ర స్థాయిలో కాంగ్రెస్ పార్టీ, ఇతర విపక్షాల వైఖరి, రాజకీయ అంశాలపైనా మోదీ తన ప్రసంగంలో ఘాటు విమర్శలు చేస్తారని అంటున్నాయి. ఈ క్రమంలో శనివారం నాటి పర్యటన, ప్రసంగం ఎలా ఉంటుందన్న దానిపై రాజకీయవర్గాలతోపాటు ప్రజల్లోనూ ఆసక్తి నెలకొంది.

పార్టీ శ్రేణులను ఉత్సాహ పర్చేలా..

వరంగల్ బహిరంగ సభకు 'విజయ సంకల్ప సభ'గా నామకరణం చేసిన నేపథ్యంలో.. అందుకు తగ్గట్టుగా పార్టీని ఎన్నికలకు సమాయత్తం చేసేలా, నేతలు, కేడర్‌ను ఉత్సాహపర్చేలా ప్రధాని మోదీ ఉపన్యాసం ఉంటుందని బీజేపీ నేతలు చెప్తున్నారు. కొన్నిరోజులుగా పార్టీలో నెలకొన్న గందరగోళానికి ప్రధాని పర్యటన చెక్ పెడుతుందని, పార్టీ శ్రేణుల్లో పునరుత్తేజం వస్తుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. వివిధ రూపాల్లో తెలంగాణకు కేంద్రం అందించిన నిధులు, పథకాలు, ప్రాజెక్టులను ప్రధాని మోదీ ప్రస్తావిస్తారని.. వాటి వల్ల ప్రజలకు చేకూరిన ప్రయోజనాలను వివరిస్తారని అంటున్నారు. పార్టీ నేతలు, కార్యకర్తలు ఈ అంశాలను ప్రజల్లోకి తీసుకెళ్లేలా దిశానిర్దేశం చేస్తారని చెప్తున్నారు.

బీజేపీ రాష్ట్ర ఎన్నికల ఇన్‌చార్జిగా ప్రకాశ్ జవదేకర్

- సహ ఇన్‌చార్జిగా సునీల్ బన్సల్ నియామకం
- తెలంగాణ, రాజస్తాన్, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్‌లకు ఇన్‌చార్జీలను నియమించిన జేపీ నడ్డా



సాక్షి, న్యూఢిల్లీ: ఈ ఏడాది తెలంగాణ సహా ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా భారతీయ జనతాపార్టీ సన్నద్ధమవుతోంది. ఈ రాష్ట్రాల్లో ప్రధాని నరేంద్రమోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా సహా కేంద్రమంత్రుల పర్యటనల కోసం రాష్ట్ర నాయకత్వాలతో సమన్వయం చేసేందుకు ఎన్నికల ఇన్‌చార్జీలను ప్రకటించింది. తెలంగాణ ఎన్నికల బీజేపీ ఇన్‌చార్జిగా కేంద్ర మాజీమంత్రి ప్రకాశ్ జవదేకర్, సహ ఇన్‌చార్జిగా సునీల్ బన్సల్‌ను ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా నియమించారు. తెలంగాణసహా రాజస్తాన్, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాలకు ఎన్నికల ఇన్‌చార్జీలను నియమిస్తూ జాతీయ ప్రధాన కార్యదర్శి అరుణ్‌సింగ్ శుక్రవారం ఉత్తర్వులు విడుదల చేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన అనంతరం 2014 ఎన్నికల సమయంలో పార్టీ అధ్యక్షుడిగా కిషన్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జిగా ప్రకాశ్ జవదేకర్ కలిసి పనిచేసిన విషయం తెలిసిందే. రాజస్తాన్ ఎన్నికల ఇన్‌చార్జిగా కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషి, సహ ఇన్‌చార్జీలుగా నితిన్ పటేల్, కులదీప్ బిష్ణోయ్, ఛత్తీస్‌గఢ్ ఎన్నికల ఇన్‌చార్జిగా ఓంప్రకాశ్ మాథుర్, సహ ఇన్‌చార్జిగా కేంద్రమంత్రి మన్‌సుఖ్ మాండవీయ, మధ్యప్రదేశ్ ఎన్నికల ఇన్‌చార్జిగా కేంద్రమంత్రి భూపేంద్ర యాదవ్, సహ ఇన్‌చార్జిగా కేంద్రమంత్రి అశ్విని వైష్ణవ్‌లను జేపీ నడ్డా నియమించారు.

త్యాగాలు ప్రజలవి.. భోగాలు కేసీఆర్ కుటుంబానివి

బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్



కాసిపేట: ప్రజలు కొట్లాడి, త్యాగాలు చేసి తెచ్చుకున్న తెలంగాణ రాష్ట్రంలో సీఎం కేసీఆర్ కుటుంబం భోగాలు అనుభవిస్తోందని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ విమర్శించారు. మంచిర్యాల జిల్లా కాసిపేటలో వేతనాల పెంపు కోసం సమ్మె చేస్తున్న కేకే ఓసీ కాంట్రాక్టు కార్మికుల శిబిరాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. ఆర్‌వీఆర్ కాంట్రాక్టు సంస్థ రెండు చోట్లలో వేర్వేరు పాలసీలు చేపట్టిందని అన్నారు. గోదావరిఖనిలో రూ.20 వేల బేసిక్ వేతనం, కాసిపేటలో రూ.18 వేల బేసిక్ వేతనం ఇవ్వడమేమిటని ప్రశ్నించారు. ఇక్కడి కార్మికుల సమస్యలు పట్టించుకోవాల్సిన ఎమ్మెల్యేలు, ఎంపీలు ఆంధ్రా కాంట్రాక్టర్లకు ఊడిగం చేస్తున్నారా అని ఆయన ప్రశ్నించారు.

మోదీ టూర్‌ను బహిష్కరిస్తున్నాం

- ఆ కార్యక్రమాల్లో మా ప్రజాప్రతినిధులెవరూ పాల్గొనరు: మంత్రి కేటీఆర్
- రూ. 20 వేల కోట్ల కోచ్ ఫ్యాక్టరీని గుజరాత్ తీసుకెళ్లి.. రూ. 500 కోట్ల ఫ్యాక్టరీని తెలంగాణకు బిచ్చం వేస్తున్నారు
- గిరిజన యూనివర్సిటీ ఇవ్వలేదు.. ఏ ముఖం పెట్టుకుని వరంగల్‌కు వస్తున్నారు?



విలేకరుల సమావేశంలో మంత్రి కేటీఆర్. చిత్రంలో జగదీశ్‌రెడ్డి, సత్యవతి రాథోడ్, పల్లా

సాక్షి, హైదరాబాద్: తెలంగాణకు అన్ని రకాలుగా అన్యాయం చేస్తున్న ప్రధాని మోదీ రాష్ట్ర పర్యటనను బహిష్కరిస్తున్నామని బీఆర్‌ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు, మంత్రి కె. తారకరామారావు ప్రకటించారు. ప్రధాని పదవి చేపట్టిన రోజు నుంచీ తెలంగాణ వ్యతిరేకతను నింపుకొన్న వ్యక్తి మోదీ అని మండిపడ్డారు. రూ. 20 వేల కోట్ల పెట్టుబడితో కాజీపేటలో ఏర్పాటు చేయాల్సిన రైల్వే కోచ్ ఫ్యాక్టరీని ప్రధాని మోదీ తన స్వరాష్ట్రం గుజరాత్‌లోని దహోడ్‌కు తరలించుకుపోయారని.. దానికి బదులు రూ. 500 కోట్ల ఫ్యాక్టరీని బిచ్చం వేస్తున్నారని ఆరోపించారు. గిరిజన వర్సిటీ కూడా ఇవ్వడం లేదని.. ఏ ముఖం పెట్టుకుని వరంగల్‌కు వస్తున్నారని విమర్శించారు. శుక్రవారం తెలంగాణ భవన్‌లో మంత్రి సత్యవతి రాథోడ్, ఎమ్మెల్సీలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, దేశపతి శ్రీనివాస్‌తో కలిసి కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. వివరాలు ఆయన మాటల్లోనే..

"ప్రధాని బూటకపు మాటలు నమ్మడానికి తెలంగాణ ప్రజలు సిద్ధంగా లేరు. మహబూబాబాద్ జిల్లా బయ్యారంలో ఉక్కు కర్మాగారం పెడతామని చెప్పిన ప్రధాని.. ఆ హామీని నెరవేర్చకుండా ఎందుకు వస్తున్నారు? మతం పేరిట ప్రజల మధ్య చిచ్చుపెట్టిన వారిని తెలంగాణ ప్రజలు నమ్మరు.

కాంగ్రెస్ పార్టీయే విదేశీయుల చేతిలో ఉంది

ధరణి పోర్టల్ విదేశీ సంస్థల చేతిలో ఉందన్న రేవంత్‌రెడ్డి.. తానున్న కాంగ్రెస్ పార్టీయే విదేశీయుల చేతుల్లోనే ఉందని గుర్తించాలి. రేవంత్‌కు మతిస్థిమితం లేదు. సచివాలయం కింద వేలకోట్ల సంపద ఉందంటూ ఆయన చేసిన పిచ్చి ఆరోపణలు అందరికీ గుర్తున్నాయి. ధరణికి సంబంధించి ఏమైనా ఆధారాలుంటే కేంద్ర సంస్థలకు ఇవ్వాలి. దర్యాప్తు కోరాలి. ఆర్టీఐ చట్టాన్ని అడ్డుపెట్టుకుని అడ్డగోలుగా డబ్బులు సంపాదించిన రేవంత్‌రెడ్డి.. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా రిజిస్ట్రేషన్లు జరిగితే ఓర్వలేక పోతున్నారు. ధరణి ప్రయోజనాలపై మేం పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇస్తాం.

మోదీని తిట్టిన బాబు..మళ్లీ ఎలా వెళ్తాడు?

2019 ఎన్నికలకు ముందు ప్రధాని మోదీని పచ్చి బూతులు తిట్టిన టీడీపీ అధినేత చంద్రబాబు ఇప్పుడు ఎన్డీఏ సమావేశానికి ఎలా హాజరవుతారు. ఈ నాలుగేళ్లలో ఏపీకి మోదీ చేసిన మేలు ఏమిటో చంద్రబాబు చెప్పి హాజరుకావాలి. మోదీ తొమ్మిదేళ్లుగా దేశానికి ఏమైనా చేశాడేమో చెప్పాలి.

ఉమ్మడి పౌరస్మృతిపై వారంలో నిర్ణయం

దేశంలో ఉమ్మడి పౌరస్మృతి (యూనిఫైడ్ కామన్ సివిల్‌కోడ్)పై వారంలో మా పార్టీ నిర్ణయం ప్రకటిస్తాం. ఈ అంశంపై సీఎం కేసీఆర్ మేధావులు, పార్టీ నేతలతో సమాలోచనలు చేస్తున్నారు. కేంద్రం ఇంకా యూసీసీని పార్లమెంట్‌లో ప్రవేశపెట్టలేదు. రాజకీయ పార్టీలతోనూ చర్చించలేదు.. అయినా తమ పార్టీ అభిప్రాయం ప్రకటిస్తామని చెప్పారు.

రేవంత్ ఆర్‌ఎస్‌ఎస్.. రాహుల్‌ను లీడర్‌గా గుర్తించేదెవరు?

రేవంత్‌రెడ్డి ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీ మనిషి. అందుకే ప్రధాని మోదీని, బీజేపీని విమర్శించడు. అందుకే గాంధీభవన్‌లో గాడ్సే దూరాడని అంటున్నాం. రాష్ట్రంలో జరిగిన ఉప ఎన్నికల్లో కూడా కాంగ్రెస్, బీజేపీ కలిసే పనిచేశాయి. ఇవన్నీ ప్రజలకు తెలుసు. గట్టిగా నిలబడి మోదీని ఎవరు ఎదుర్కోగలరో తెలుసు. అందుకే మహారాష్ట్రలో కూడా కేసీఆర్ పర్యటనలకు మంచి స్పందన వస్తోంది. కాంగ్రెస్ 2018 ఎన్నికల్లో మహాకూటమి కట్టి ఎన్ని ప్రయత్నాలు చేసినా.. ప్రజలు వీపు పగలగొట్టి పంపించారని గుర్తు చేసుకోవాలి. రాహుల్ గాంధీని దేశంలో ఎవరూ నాయకుడిగా గుర్తించడం లేదు. పార్టీ అధ్యక్షుడు కాదు, కనీసం పార్టీ ఎంపీ కూడా కాని వ్యక్తి ఏ హోదాలో రాష్ట్రంలో పెన్షన్ పెంపు హామీలు ఇచ్చాడో చెప్పాలి?" అని కేటీఆర్ డిమాండ్ చేశారు.

ఇది కమీషన్లు, వాటాల ప్రభుత్వం!

- కల్వకుంట్ల ఫ్యామిలీని ఫామ్‌హౌస్‌కే పరిమితం చేస్తాం
- వచ్చే ఎన్నికల్లో బీజేపీదే ఘనవిజయం
- తొలిసారిగా వరంగల్‌కు ప్రధాని మోదీ.. రాజకీయంగా ఇది కీలక సభ
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్ రెడ్డి



ప్రధాని సభాస్థలాన్ని పరిశీలిస్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి తదితరులు

సాక్షి ప్రతినిధి, వరంగల్: తెలంగాణలో పాలన కల్వకుంట్ల కుటుంబ పాలనగా మారిందని, బీఆర్‌ఎస్‌ది పర్సంటేజీల, వాటాల ప్రభుత్వమని కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి ధ్వజమెత్తారు. రాష్ట్రంలో ఏ వ్యాపారం చేయాలన్నా మా వాటా, మా కమీషన్ ఎంత అని అడుగుతున్నారని ఆరోపించారు. ప్రైవేటు, ప్రభుత్వ కార్యక్రమమైనా, రియల్ ఎస్టేట్, గ్రానైట్, ఇసుక, మైనింగ్ వ్యాపారంతోపాటు ఏ వ్యాపారమైనా వాటా, కమీషన్లు ఎంత? అని అడుగుతున్నారని విమర్శించారు. ఇలాంటి అవినీతి, అరాచక పాలన త్వరలోనే అంతమవుతుందని, తెలంగాణ రాష్ట్రంలో త్వరలోనే కుటుంబ రహిత పాలన వస్తుందని.. వచ్చే ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం సాధించి ఈ రాష్ట్రాన్ని పాలిస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ప్రధాని మోదీ ఓరుగల్లు పర్యటన నేపథ్యంలో ఏర్పాట్ల పరిశీలన కోసం కిషన్‌రెడ్డి శుక్రవారం వరంగల్ నగరానికి వచ్చారు. హనుమకొండ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానంలో ఏర్పాట్లను పరిశీలించిన తర్వాత.. సభాప్రాంగణంలో మీడియాతో మాట్లాడారు. 30 ఏళ్ల తర్వాత వరంగల్ నగరానికి తొలిసారిగా వస్తున్న ప్రధాని నరేంద్ర మోదీకి పండుగ వాతావరణంలో స్వాగతం పలకాలని పార్టీ శ్రేణులు, ప్రజలకు పిలుపునిచ్చారు.

కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌లు ఒకే గూటి పక్షులు

కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌లు రెండూ ఒక గూటి పక్షులేనని, ఆ రెండు పార్టీల డీఎన్‌ఏ ఒక్కటేనని కిషన్‌రెడ్డి విమర్శించారు. ఒకే నాణానికి బొమ్మా, బొరుసులాంటి ఆ పార్టీలు ఏదో ఒక రోజు రెండూ ఒక్కటవుతాయన్నారు. కాంగ్రెస్ నుంచి గెలిచిన 12 మంది ఎమ్మెల్యేలు బీఆర్‌ఎస్‌లో ఉన్నారని, ఇందులో కొందరు మంత్రులుగా కొనసాగుతున్నారని చెప్పారు. రాష్ట్రపతి ఎన్నికల్లోనూ కాంగ్రెస్ అభ్యర్థికి బీఆర్‌ఎస్ సహకరించిందని గుర్తు చేశారు. తాము ఆ రెండు పార్టీలతో ఎప్పుడూ పొత్తు పెట్టుకోబోలేదని, భవిష్యత్తులోనూ పొత్తు పెట్టకోమన్నారు. మోదీ హాజరయ్యే విజయ సంకల్ప సభ రాజకీయంగా కీలకమైనదని కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. తెలంగాణలో కుటుంబ పాలనకు వ్యతిరేకంగా ఏవిధంగా పోరాడుతున్నామో మోదీ వివరిస్తారని చెప్పారు. కిషన్‌రెడ్డి వెంట బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ, నాయకులు మార్తినేని ధర్మారావు, గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి, ఏనుగుల రాకేష్ రెడ్డి ఉన్నారు.

కేసీఆర్ ఎందుకు ముఖం చాటేస్తున్నారు?

- ప్రధాని వచ్చినప్పుడల్లా ఎందుకలా?
- రాష్ట్ర ప్రభుత్వ సహకారం లేకపోయినా తెలంగాణ అభివృద్ధికి కేంద్రం కృషి: లక్ష్మణ్



సాక్షి, హైదరాబాద్: ప్రధాని మోదీ రాష్ట్ర పర్యటనకు వచ్చినప్పుడల్లా సీఎం కేసీఆర్ ఎందుకు మొహం చాటేస్తున్నారో చెప్పాలని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డా.కె.లక్ష్మణ్ డిమాండ్ చేశారు. రాష్ట్రానికి ప్రధాని వస్తున్నపుడు కేసీఆర్ గౌరవ సూచకంగా స్వాగతం కూడా ఎందుకు పలకడం లేదని ప్రశ్నించారు. అభివృద్ధికి పెద్ద పీట వేస్తున్న మోదీకి పేరు వస్తోందనే భయంతోనే కేసీఆర్ దూరంగా ఉంటున్నారని మండిపడ్డారు. శుక్రవారం హైదరాబాద్‌లో లక్ష్మణ్ మీడియాతో మాట్లాడారు. సమతా మూర్తి విగ్రహావిష్కరణ, ఇక్రిశాట్ సందర్శన, సికింద్రాబాద్ రైల్వే అభివృద్ధి పనులు, ఐఎస్‌బీ స్నాతకోత్సవం, రామగుండం ఎరువుల ఫ్యాక్టరీ ప్రారంభం, నీతి ఆయోగ్ సమావేశం.. ఇలా దేనికీ హాజరు కాకపోవడంలో ఆంతర్యమేమిటని నిలదీశారు. తమ రాష్ట్రాల్లోని ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం బెంగాల్, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్‌తో సహా కేరళలో కూడా ప్రొటోకాల్ పాటిస్తూ అభివృద్ధిలో పాలు పంచుకుంటున్నారని గుర్తు చేశారు. ప్రజల కోసం అన్ని రాష్ట్రాల ప్రభుత్వాలు ముందుకొస్తుంటే కేసీఆర్ మాత్రం ఫక్తు రాజకీయాలే చేస్తున్నారని ధ్వజమెత్తారు. రాష్ట్ర ప్రభుత్వం సహకరించకపోయినా వివక్ష లేకుండా అభివృద్ధి లక్ష్యంగా కేంద్రం కృషి చేస్తోందన్నారు. శనివారం మోదీ వరంగల్ పర్యటనలోనైనా కేసీఆర్ పాల్గొనాలని కోరారు. రాహుల్‌గాంధీపై కోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నామని లక్ష్మణ్ అన్నారు.

మోదీ సభకు బైక్ ర్యాలీగా...

వరంగల్‌లో నిర్వహిస్తున్న మోదీ సభలో పాల్గొనేందుకు నగరంలోని పార్టీ కార్యాలయం నుంచి బైక్ ర్యాలీగా వెళ్తోన్న బీజేపీ యువమోర్చా బృంద ర్యాలీకి లక్ష్మణ్ జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో యువమోర్చా రాష్ట్ర అధ్యక్షుడు భానుప్రకాష్ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ కార్యకర్త పాడె మోసిన 'బండి'



పాడె మోస్తున్న బీజేపీ ఎంపీ బండి సంజయ్‌కుమార్, ప్రభుత్వ విప్ కౌశిక్‌రెడ్డి

హుజూరాబాద్: కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ పట్టణానికి చెందిన బీఆర్‌ఎస్ సీనియర్ నేత నందగిరి మహేందర్‌రెడ్డి గురువారం గుండెపోటుతో మృతి చెందగా శుక్రవారం అంత్యక్రియలు నిర్వహించారు. మహేందర్‌రెడ్డి అంతిమయాత్రలో బీజేపీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్ పాల్గొని పాడె మోశారు. ఆయనతో కలిసి బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి కూడా పాడె మోయడం గమనార్హం. మహేందర్‌రెడ్డి మృతదేహానికి రాష్ట్ర బీజేపీ ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్ నివాళి అర్పించారు.

ఎన్‌కౌంటర్ల సృష్టికర్త కడియం

- నాటి ఎన్‌కౌంటర్లలో మాదిగలే ఎక్కువమంది చనిపోయారు
- కడియం శ్రీహరిపై ఎమ్మెల్యే రాజయ్య ధ్వజం
- ఆయన్ను బీఆర్‌ఎస్ నుంచి సస్పెండ్ చేయాలని డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజయ్య

స్టేషన్ ఘన్‌పూర్: ఎమ్మెల్సీ కడియం శ్రీహరి తాను దేవాదుల సృష్టికర్త అని గొప్పలు చెప్పుకుంటారని, వాస్తవానికి కడియం ఎన్‌కౌంటర్ల సృష్టికర్త అని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య సంచలన ఆరోపణలు చేశారు. కడియం ఉమ్మడి ఏపీకి మంత్రిగా ఉన్న సమయంలో రాష్ట్రవ్యాప్తంగా ఎక్కువ ఎన్‌కౌంటర్లు వరంగల్ జిల్లాలోనే జరిగాయని, అందులో ఎక్కువ మంది మాదిగలే మృతిచెందారని చెప్పారు. శుక్రవారం జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ మండలంలోని తాటికొండ గ్రామంలో ఆదిజాంబవంతుని విగ్రహ ప్రతిష్టాపన కోసం భూమిపూజతో పాటు దళితుల ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రాజయ్య మాట్లాడుతూ తాను అసలు, సిసలైన స్థానిక మాదిగ వాడినని, కానీ కడియం శ్రీహరిది ఎస్సీ ఉపకులమైన బైండ్ల కులమని చెప్పారు.

కడియం కావ్య ఎస్సీ కాదు

కడియం శ్రీహరి కుమార్తె కడియం కావ్య ఆంధ్రకు చెందిన ముస్లిం(దూదేకుల) వ్యక్తిని ప్రేమ వివాహం చేసుకున్నారని తెలిపారు. ఇస్లాం సిద్ధాంతం ప్రకారం ముస్లిం మతం తీసుకుంటేనే ముస్లింలను వివాహం చేసుకుంటారని, దాంతో కావ్య ఎస్సీ కాదని, బీసీ బీ కులానికి చెందుతారని చెప్పారు. బీఆర్‌ఎస్‌లో ఉంటూ పార్టీ వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడుతున్న కడియంను పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. 1994లో తాను తిరస్కరిస్తేనే కడియంకు టీడీపీ ఎమ్మెల్యే టికెట్ వచ్చిందని చెప్పారు.

నాకు త్రిమూర్తుల అండ ఉంది

'కడియం శ్రీహరి తస్మాత్ జాగ్రత్త, నీ వెంట ఉన్నవారు నావాళ్లే, వారు నా పక్కటెముకలు, నీ పక్కలో బల్లెంలా మారుతారు' అని రాజయ్య ఘాటు వ్యాఖ్యలు చేశారు. 'నీవెంట ఉన్న రాంబాబు నీకు ఆటంబాంబు అవుతాడు, బ్రహ్మారెడ్డి నా బ్రహ్మాస్త్రం నరేందర్‌రెడ్డి నావాడే నిన్ను నాశనం చేసేందుకే వచ్చారు' అని అన్నారు. కడియం శ్రీహరి ఎమ్మెల్యే కాక ముందు నీ ఆస్తి ఎంత, ప్రస్తుతం ఎంత అని ప్రశ్నించారు. నీ అనుచరుడైన గోరంటల బలరాములు కొండంత ఎలా ఎదిగాడని ప్రశ్నించారు. ఉమ్మడి ఏపీలో పదేళ్లు మంత్రిగా, తెలంగాణలో మూడేళ్లు డిప్యూటీ సీఎంగా చేసి ప్రస్తుతం ఎమ్మెల్యే సీటు కోసం వెంపర్లాడటం సిగ్గుచేటన్నారు. బీఆర్‌ఎస్‌లో త్రిమూర్తులైన సీఎం కేసీఆర్, మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు అండ తనకు ఉందని, టికెట్ తనకే వస్తుందని ఎమ్మెల్యే రాజయ్య ధీమా వ్యక్తం చేశారు. ఓం నమఃశివాయ అంటే సీఎం కేసీఆర్ పలుకుతాడని, ప్రైజ్ ది లార్డ్ అంటే కేటీఆర్, అల్లాహో అక్బర్ అంటే హరీశ్‌రావు పలుకుతారని ఎమ్మెల్యే వ్యాఖ్యానించారు.

ఫస్టియర్‌లో 63% సెకండియర్‌లో 46% పాస్

ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాలు విడుదల
- ద్వితీయ ఇంటర్‌లో ఏ గ్రేడ్ 24 మందికి మాత్రమే
- ఫలితాల్లో ములుగు జిల్లా ముందంజ
- రాజన్న సిరిసిల్ల జిల్లా ఆఖరు
- ఈ నెల 12 వరకు రీ కౌంటింగ్‌కు అవకాశం

సాక్షి, హైదరాబాద్: గత నెలలో జరిగిన ఇంటర్మీడియెట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్ష ఫలితాల్లో మొదటి సంవత్సరం విద్యార్థులు జనరల్ కేటగిరీలో 1,57,741 (63%) మంది, ఒకేషనల్‌లో 10,319 (55%) మంది ఉత్తీర్ణులయ్యారు. ఇంటర్ ద్వితీయ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీలో 59,669 (46%) మంది పాసయ్యారు. ఈ మేరకు శుక్రవారం అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాలను ఇంటర్మీడియెట్ బోర్డు ఆన్‌లైన్ ద్వారా విడుదల చేసింది. ఈ ఫలితాల్లో 89 శాతం ఉత్తీర్ణతతో ములుగు జిల్లా ముందు ఉంటే, 33 శాతం ఉత్తీర్ణత సాధించిన రాజన్న సిరిసిల్ల జిల్లా చివరన ఉంది. ఫస్టియర్‌లో ఏ గ్రేడ్ పొందిన విద్యార్థులు 75,541 మంది ఉంటే, ద్వితీయ ఇంటర్‌లో కేవలం 24 మంది మాత్రమే ఉన్నారు. రెండేళ్ల ఫలితాల్లోనూ బాలికల ఉత్తీర్ణత శాతమే ఎక్కువగా ఉంది. మొదటి సంవత్సరంలో మార్కులు మెరుగుపరచుకోవడానికి ఇంప్రూవ్‌మెంట్ రాసిన వారు 1,57,741 మంది ఉన్నారు. ఏదో ఒక సబ్జెక్టులో ఫెయిల్ అయి.. పరీక్షకు హాజరైన వారు 45,576 మంది ఉన్నారు. మార్కుల జాబితాను శనివారం నుంచి ఆన్‌లైన్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చని బోర్డు తెలిపింది. రీ కౌంటింగ్, రీ వెరిఫికేషన్ కోసం ఈ నెల 12వ తేదీ వరకు అవకాశం ఇచ్చినట్టు బోర్డు వెల్లడించింది.

ఫస్టియర్ ఫలితాలు ఇలా..	జనరల్	ఒకేషనల్
పరీక్ష రాసిన మొత్తం విద్యార్థులు	2,52,055	18,697
ఇంప్రూవ్‌మెంట్ రాసిన వారు	1,12,165	1,998
ఫెయిల్ అయి రాసిన వారు	45,576	8,321
ఉత్తీర్ణులు	1,57,741	10,319
ఏ గ్రేడ్	75,541	2,649
బీ గ్రేడ్	36,015	6,853
సీ గ్రేడ్	24,580	753
డీ గ్రేడ్	21,605	64
ఉత్తీర్ణత శాతం	63	55
బాలికల ఉత్తీర్ణత శాతం	68.62	69.09
బాలుర ఉత్తీర్ణత శాతం	57.40	47.82

సెకండియర్ ఫలితాలు ఇలా..	జనరల్	ఒకేషనల్
పరీక్ష రాసిన విద్యార్థులు	1,29,494	11,013
ఉత్తీర్ణులు	59,669	6,579
ఉత్తీర్ణత శాతం	46	60
బాలికల ఉత్తీర్ణత శాతం	51	71
బాలుర ఉత్తీర్ణత శాతం	43	56
ఏ గ్రేడ్ ఉత్తీర్ణులు	24	0
బీ గ్రేడ్ ఉత్తీర్ణులు	14	0
సీ గ్రేడ్ ఉత్తీర్ణులు	7	0
డీ గ్రేడ్ ఉత్తీర్ణులు	0	0

టెన్త్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీలో 80.59% ఉత్తీర్ణత

18 వరకూ వెరిఫికేషన్‌కు అవకాశం
- ఆన్‌లైన్‌లో అందుబాటులోకి మార్కుల జాబితా
- అత్యధికంగా ఉత్తీర్ణత సాధించిన జిల్లాగా సిద్దిపేట

సాక్షి,హైదరాబాద్: పదోతరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్ష ఫలితాల్లో 80.59% మంది ఉత్తీర్ణులయ్యారు. ఈ పరీక్షలకు మొత్తం 71,695 మంది దరఖాస్తు చేసుకోగా ఇందులో 66,732 మంది హాజరయ్యారు. పరీక్షరాసిన వారిలో 53,777 మంది ఉత్తీర్ణత సాధించారు. పాస్ అయిన వారిలో 78.50% మంది బాలురు, 83.50% మంది బాలికలు ఉన్నారు. 99.47% ఉత్తీర్ణతతో సిద్దిపేట జిల్లా తొలిస్థానంలో నిలవగా, 53.69% ఉత్తీర్ణతతో జగిత్యాల జిల్లా చివరిస్థానంలో నిలిచింది. రీ కౌంటింగ్, వెరిఫికేషన్ కావాలనుకునే విద్యార్థులు ఈ నెల 18లోగా దరఖాస్తు చేసుకోవాలని టెన్త్ పరీక్షల విభాగం తెలిపింది.

టెన్త్ ఉత్తీర్ణత వివరాలు

పరీక్ష రాసిన విద్యార్థులు			ఉత్తీర్ణులైన వారు			ఉత్తీర్ణత శాతం		
బాలురు	బాలికలు	మొత్తం	బాలురు	బాలికలు	మొత్తం	బాలురు	బాలికలు	మొత్తం
38,888	27,844	66,732	30,528	23,249	53,777	78.50	83.50	80.59

సబ్జెక్టుల వారీగా ఉత్తీర్ణత	సబ్జెక్టు	హాజరైన విద్యార్థులు	ఉత్తీర్ణులు	శాతం
	మొదటి భాష	8,770	8,175	93.22
	ద్వితీయ భాష	1,605	1,596	99.44
	మూడో భాష	7,185	6,699	93.24
	మేథ్స్	38,723	32,698	85.14
	జనరల్ సైన్స్	30,222	22,871	75.68
	సోషల్ స్టడీస్	5,349	5,010	93.66

డ్రైవింగ్ లైసెన్స్ ఉంటే ఫలితాలు వెల్లడించండి

పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డుకు హైకోర్టు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: చట్టప్రకారం హెవీ మోటార్ వెహికల్ లైసెన్స్ ఉన్నవారి పరీక్ష ఫలితాలు వెల్లడించాలని పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డును హైకోర్టు ఆదేశించింది. కొత్తగా డ్రైవింగ్ పరీక్షకు హాజరైన వారి ఫలితాలు కూడా వెల్లడించాలని స్పష్టం చేసింది. నిరంతరాయంగా రెండేళ్ల హెవీ మోటార్ వెహికల్ లైసెన్స్ లేదని, కొందరు ఇప్పుడే డ్రైవింగ్ పరీక్షకు హాజరయ్యారని.. పేర్కొంటూ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు పలువురి ఫలితాలను నిలిపివేసింది. దీన్ని సవాల్ చేస్తూ సంబంధిత అభ్యర్థులు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ పి.మాధవీదేవి ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ల తరపున న్యాయవాది రమేశ్ చిల్లా వాదనలు వినిపించారు. మోటార్ వెహికల్ చట్టానికి 2019లో చేసిన సవరణ మేరకు లైసెన్స్ పూర్తయిన తర్వాత ఏడాదిలోపు రెన్యువల్ చేసుకునే అవకాశం ఉంటుందని చెప్పారు. అలా రెన్యువల్ చేసుకున్న వారు నిరంతరాయంగా లైసెన్స్ కలిగి ఉన్నట్లేనని చట్టం చెబుతోందని వాదించారు. వాదనలు విన్న ధర్మాసనం.. చట్టప్రకారం లైసెన్స్ కలిగిన పిటిషనర్ల పరీక్ష ఫలితాలను వెల్లడించాలని పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డును ఆదేశించింది.

12 నుంచి పాలిటెక్నిక్‌లో ప్రవేశాల కౌన్సెలింగ్

సాక్షి, హైదరాబాద్: పాలిటెక్నిక్‌లో ప్రవేశాల కౌన్సెలింగ్ ఈనెల 12 నుంచి 15 వరకు నిర్వహించనున్నామని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఎం.వెంకటరమణ తెలిపారు. పాలిసెట్–23 ర్యాంకులు, రిజర్వేషన్ నిబంధనల ప్రకారం సీట్ల కేటాయింపు జరుగుతుందని శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కౌన్సెలింగ్, షెడ్యూల్, అభ్యర్థులు తీసుకురావలసిన సర్టిఫికెట్లు, ఫీజు తదితర వివరాలను www.pjtsau.edu.inలో చూడాలని సూచించారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం, గుర్తింపు పొందిన ప్రైవేటు పాలిటెక్నిక్‌లలో రెండేళ్ల పాటు వ్యవసాయం, సేంద్రియ వ్యవసాయ డిప్లొమా కోర్సులు, మూడేళ్ల పాటు డిప్లొమా ఇన్ అగ్రికల్చరల్ ఇంజనీరింగ్ కోర్సుల్లో 2023–24 విద్యా సంవత్సరానికి ఈ ప్రవేశాలు ఉంటాయని వివరించారు.

త్వరలో టెట్ పరీక్ష!

నిర్వహించాలని అధికారులకు ప్రభుత్వ ఆదేశం
- తక్షణమే కసరత్తు మొదలుపెట్టాలని సూచన
- మంత్రివర్గ ఉప సంఘం నిర్ణయం మేరకు చర్యలు
- టీచర్ పోస్టుల భర్తీపై మాత్రం స్పష్టత ఇవ్వని సర్కారు



సాక్షి, హైదరాబాద్: త్వరలో ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. దీనిపై వెంటనే కసరత్తు చేపట్టాలని అధికారులను ఆదేశించింది. శుక్రవారం హైదరాబాద్‌లో సమావేశమైన మంత్రివర్గ ఉప సంఘం దీనికి ఆమోదం తెలిపింది. మంత్రులు హరీశ్‌రావు, సబితా ఇంద్రారెడ్డి, సత్యవతి రాథోడ్, ఇంద్రకరణ్‌రెడ్డి, జగదీశ్‌రెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్, విద్యాశాఖ కార్యదర్శి వాకాటి కరుణ, పాఠశాల విద్య డైరెక్టర్ దేవసేన ఈ సమావేశంలో పాల్గొన్నారు. విద్యాశాఖలో దాదాపు 22 వేల ఉపాధ్యాయ పోస్టుల భర్తీ అంశం ఇందులో చర్చకు వచ్చినట్టు తెలిసింది. ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ పూర్తవకుండా నియామకాలు చేపట్టలేమని అధికారులు మంత్రులకు వివరించినట్టు సమాచారం. దీంతో నిరుద్యోగుల్లో అసంతృప్తిని పోగొట్టేందుకు తక్షణమే టెట్ నిర్వహించాలని భావించినట్టు తెలిసింది.

భర్తీ కోసం ఎదురుచూపులే..!

రాష్ట్ర అవతరణ తర్వాత 2016లో తొలిసారిగా టెట్ నిర్వహించారు. తర్వాత 2017, 2022లలోనూ నిర్వహించారు. ఇందులో గతేడాది టెట్ పరీక్ష సమయంలో టీచర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్లు వస్తున్నాయన్న ఆశతో ఎక్కువ మంది పరీక్ష రాశారు. కానీ ఏడాది గడచినా నియామకాలేవీ చేపట్టలేదు. 2016 నుంచి టెట్ అర్హత పొందిన వారంతా ఉద్యోగాల భర్తీ కోసం ఎదురుచూస్తున్నారు. మరోవైపు ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయ పదోన్నతులు, బదిలీలు చేస్తే తప్ప కొత్త నియామకాలు చేపట్టలేమని విద్యాశాఖ అధికారులు అంటున్నారు. ఈ ప్రక్రియ ఎప్పటికప్పుడు వాయిదా పడుతూనే ఉంది.

పోస్టుల భర్తీ లేకుండా టెట్ దేనికి?

“రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ స్కూళ్లలో దాదాపు 22వేల టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇప్పటికే లక్షల మంది టెట్ ఉత్తీర్ణులు ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్నారు. ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులు కల్పిస్తే నియామకాలు చేపట్టవచ్చు. ఇవేవీ చేయకుండా టెట్ చేపడితే ప్రయోజనం ఏమిటి? ప్రభుత్వం నియామకాలపై దృష్టి పెట్టాలి.”

– చావా రవి, టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

ఎమ్మెల్సీ ఎన్నికల ముందు హడావుడి జరిగినా, కోర్టు వివాదాల కారణంగా వాయిదా పడింది.

22వేల ఖాళీలు.. బోధనకు ఇబ్బంది

రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో దాదాపు 22 వేల పోస్టులు ఖాళీగా ఉన్నట్టు గతంలో విద్యాశాఖ అంచనా వేసింది. కానీ 12 వేల పోస్టులే ఖాళీగా ఉన్నాయని, వాటిని భర్తీ చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఉపాధ్యాయుల కొరతతో చాలా పాఠశాలల్లో బోధనకు ఇబ్బంది అవుతోంది. ఆంగ్ల మాధ్యమంలో బోధన చేపట్టిన నేపథ్యంలో ఈ సమస్య ఇంకా పెరిగింది. కొన్ని పాఠశాలల్లో సెకండరీ గ్రేడ్ టీచర్ల (ఎస్జీటీ)లను ఉన్నత తరగతుల బోధనకు పంపుతున్నారు. కోర్టు వివాదాలకు దారితీసే రీతిలో విద్యాశాఖ వ్యవహరించడం వల్లే పదోన్నతులు, బదిలీలు ముందుకెళ్లడం లేదని.. టెట్ చేపట్టినా ఉపయోగం ఏమిటని ఉపాధ్యాయ సంఘాలు పేర్కొంటున్నాయి.

సాయిచంద్ భార్య రజనికి వేర్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ పదవి

సాయిచంద్, జగదీశ్ కుటుంబాలకు కోటిన్నర చొప్పున సాయం



జగదీశ్ (ఫైల్)



సాయిచంద్ (ఫైల్)



రజనికి ఆర్థికసాయం సంబంధిత పత్రాలను అందజేస్తున్న బాల్కసుమన్, దాసోజు శ్రవణ్

సాక్షి, హైదరాబాద్: ఇటీవల మృతి చెందిన భారత్ రాష్ట్ర సమితి యువ నాయకుల కుటుంబాలను ఆదుకోవాలని పార్టీ నిర్ణయించింది. ఈ మేరకు పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు, మంత్రి కె.తారక రామారావు వారి కుటుంబాలకు ఆర్థికసాయం ప్రకటించారు. ములుగు జిల్లా పరిషత్ చైర్మన్ కుసుమ జగదీశ్, తెలంగాణ ఉద్యమంలో గాయకుడిగా ప్రజల్లో చైతన్యం రగిల్చిన రాష్ట్ర వేర్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ వేద సాయిచంద్ ఇటీవల గుండెపోటుతో మరణించిన సంగతి తెలిసిందే. ఈ యువ నాయకుల కుటుంబాలకు కోటిన్నర రూపాయల చొప్పున ఆర్థికసాయం అందించనున్నట్లు కేటీఆర్ ప్రకటించారు. బీఆర్‌ఎస్ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల ఒకనెల వేతనంతో ఈ సాయం అందించనున్నట్లు శుక్రవారం ఆయన తెలంగాణ భవన్‌లో మీడియాకు చెప్పారు. వారి తల్లిదండ్రులకు ఒక్కొక్కరికి రూ.25 లక్షలు, భార్యకు కోటి రూపాయల లెక్కన అందిస్తామని పేర్కొన్నారు. కాగా, వేర్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్‌గా ఉంటూ వేదసాయిచంద్ ఆకస్మికంగా మరణించడంతో ఆయన భార్య వేద రజనికి అదే సంస్థ చైర్మన్ పదవి ఇవ్వాలని సీఎం కేసీఆర్ నిర్ణయించారని కేటీఆర్ చెప్పారు. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సాయిచంద్ కుటుంబాన్ని శుక్రవారం ప్రభుత్వ విప్ బాల్కసుమన్, బీఆర్‌ఎస్ నేత దాసోజు శ్రవణ్ పరామర్శించారు. రజనికి రూ.1.5 కోట్ల సాయానికి సంబంధించిన పత్రాలను అందజేశారు.

గుగులోతు మమతకు మంత్రి సత్యవతి ప్రశంస



సాక్షి, హైదరాబాద్: సిరిసిల్ల జిల్లా తంగళ్ల పల్లిలో గిరిజన సంక్షేమ శాఖ పరిధిలో కొన సాగుతున్న ఫైన్ ఆర్ట్స్ అకాడమీలో ఫొటోగ్రఫీ కోర్సు అభ్యసిస్తున్న గుగులోతు మమతను రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు, గిరిజన సంక్షేమ శాఖల మంత్రి సత్యవతి రాథోడ్ ప్రత్యేకంగా అభినందించారు. మమత తీసిన గిరిజన మహిళ చిత్రం ప్రముఖ ఫ్యాషన్ మ్యాగజైన్ ‘వోగ్ ఇటాలియా’లో ప్రచురితమవడంపై హర్షం వ్యక్తం చేశారు.

నేను ప్రాణులందరిలోను సమంగా ఉన్నాను.
నాకు ద్వేషింప తగినవారు అంటూ లేరు.
ప్రేమించవలసిన వారూ లేరు.
– భగవద్గీత

సాక్షి
శనివారం, 8 జూలై 2023

ఘోరం... దారుణం!

కొన్ని ఉదంతాలు మనల్ని విషాదంలో ముంచెత్తుతాయి. మనం మనుషులుగానే మనుగడ సాగిస్తున్నామా, సమాజం ఇంత అమానుషంగా మారిందా అనే ఆందోళన కలిగిస్తాయి. మధ్యప్రదేశ్‌లో ప్రవేశ్ శుక్లా అనే దుండగుడు ఆదివాసీపై మూత్ర విసర్జన చేసిన ఉదంతం అటువంటిదే. అసలు ఊహకు కూడా అందని రీతిలో శుక్లా ఇలా రెచ్చిపోవడానికి కారణమేమిటి? మధ్యప్రదేశ్ ప్రభుత్వం ఈ ఉదంతం విషయంలో చకచకా కదిలింది. వెనువెంటనే ఆ దుండగుడిని కఠినమైన జాతీయ భద్రతా చట్టం(ఎన్‌ఎస్‌ఏ) కింద నిర్బంధించింది. అతను నివాసం ఉంటున్న ఇంటిని కూల్చేసింది. ఆదివాసీకి రూ. 6.5 లక్షలు పరిహారంగా ఇస్తున్నట్టు ప్రకటించింది. అంతేకాదు...ముఖ్యమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ బాధితుణ్ణి తన నివాసానికి పిలిపించుకొని అతని కాళ్లు కడిగి తలపై జల్లుకున్నారు. దుండగుడు స్థానిక బీజేపీ ఎమ్మెల్యే అనుచరుడు కావడంవల్ల తమపై ఆ మచ్చ పడుతుందన్న భయంతో ప్రభుత్వం వేగంగా కదిలివుండొచ్చు. సామాజిక మాధ్యమాల్లో ఈ ఉదంతంపై ఇంకా నిరసలు వెల్లువలా వస్తూనే ఉన్నాయి. ఏదైనా ఉదంతం చోటుచేసుకున్నప్పుడు ప్రభుత్వాలు తక్షణం స్పందించటం, కారకులపై కఠినమైన చర్యలు తీసుకోవటం, బాధితులకు రక్షణ కల్పించటం సాధారణ ప్రజలకు భరోసానిస్తుంది. అయితే స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లవుతున్నా ప్రవేశ్ శుక్లా వంటి దుండగులు ఈ సమాజంలో నాగరిక వేషంలో ఎలా మనుగడ సాగించగలుగుతున్నారు? రాజకీయ పార్టీల్లోకి ఎలా చొరబడగలుగుతున్నారు? ఈ ప్రశ్నలకు సమాధానం అన్వేషించకపోతే ఇవి పదే పదే పునరావృతమవుతూనే ఉంటాయి. దళితులనూ, ఆదివాసీలనూ, అట్టడుగు కులాల వారినీ అకారణంగా అవమానించటం, వారిని అత్యంత హీనంగా చూడటం మన దేశంలో కొత్తగాదు. తాజా ఉదంతం వీడియో సాక్షిగా బయటికొచ్చింది కనుక ఇంతగా స్పందన వచ్చింది. ప్రభుత్వం కూడా చురుగ్గా కదిలింది. కానీ చట్టానికి దొరక్కుండా, సాక్ష్యాలకు చిక్కకుండా నిత్యం సాగుతున్న దుండగాల మాటేమిటి?

ఈ ఉదంతంపై నిరసనల హోరు ప్రారంభమైన రోజే సర్వోన్నత న్యాయస్థానం విశ్వవిద్యాలయాల పర్యవేక్షణను చూస్తున్న యూజీసీకి కీలకమైన ఆదేశాలిచ్చింది. ఉన్నత విద్యాలయాల్లో వివక్షకు తావులేకుండా చేయటానికి ఇంతవరకూ తీసుకున్న, తీసుకోబోతున్న చర్యలేమిటో చెప్పాలని కోరింది. హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయంలో పీహెచ్‌డీ చేస్తూ వివక్షకు బలై ప్రాణం తీసుకున్న రోహిత్ వేముల తల్లి, ముంబైలో వైద్య విద్యలో పీజీ చేస్తూ తోటి విద్యార్థినుల వేధింపులు తాళలేక ఆత్మహత్య చేసుకున్న ఆదివాసీ యువతి పాయల్ తాడ్వి తల్లి దాఖలు చేసిన పిటిషన్‌లో సుప్రీంకోర్టు ఈ ఆదేశాలిచ్చింది. వారి తరఫున వాదించిన సీనియర్ న్యాయవాది ఇందిరా జైసింగ్ గత ఏడాది కాలంలో మూడు ఉన్నత శ్రేణి సంస్థల్లో ముగ్గురు విద్యార్థులు కులోన్మాదుల హింస భరించలేక ఆత్మహత్యలు చేసుకున్న వైనాలను ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. రోహిత్ వేముల, పాయల్ తాడ్వి ఉదంతాలప్పుడు విద్యాసంస్థల నిర్వాహకులు తమ సంస్థల్లో వివక్ష లేనేలేదని బుకాయించారు. వారికి వత్తాసు పలికిన విద్యార్థి సంఘాలు, రాజకీయ పార్టీలు కూడా ఉన్నాయి. సరిగ్గా గ్రామ స్థాయి నుంచి ఉన్నత శ్రేణి విద్యాసంస్థల వరకూ నిత్యం వినబడే ఇలాంటి బుకాయింపులే మన సమాజంలో ఆధిపత్య కులాల హింసకు లైసెన్సునిస్తున్నాయి. గ్రామాల్లో ఇప్పటికీ యథేచ్ఛగా కొనసాగుతూనే ఉన్న రెండు గ్లాసుల వ్యవస్థ, మహానగరాలనుకునేచోట అపార్ట్‌మెంట్లలో పనివాళ్ల పట్ల చూపే వివక్ష... అట్టడుగు కులాలవారికీ, మైనారిటీలకూ ఇళ్లు అద్దెకు దొరక్కపోవటం వంటివి ఈ హింసను అడుగడుగునా చాటుతూనే ఉన్నాయి. వాటిని సరిచేయటానికి పూనుకోవాల్సిన వ్యవస్థలు చాలా సందర్భాల్లో రాజీపడుతున్నాయి. పైకి ఎంతో గౌరవప్రదంగా కనబడే వ్యక్తులే ఈ వివక్షకు బాధ్యులవుతుండటం చేదు నిజం. ఎంతో గొడవ జరిగి, పెను వివాదమైతే తప్ప చర్యలకు సిద్ధపడటం లేదు. అసలు పట్టించుకోకపోవటం వేరు...అతిగా పట్టించుకోవటం వేరు. పర్వేశ్ శుక్లాను కఠినమైన చట్టంకింద అరెస్టు చేశారు. మంచిదే. ఆదివాసీ కాళ్లు కడిగి ఆ నీళ్లు నెత్తిపై జల్లుకున్నారు. పాలకుడిగా మానసిక వేదనకు లోనయి ఈ పని చేశారని సరిపెట్టుకోవచ్చు. కానీ దుండగుడి నివాసం కూల్చేయటం ఎలాంటి చర్య? తప్పు చేసిన ఏ వ్యక్తయినా చట్టం ముందు సమానమేనని, వారిపై కఠిన చర్య తీసుకుంటామని సందేశం పంపడానికి బదులు, తాము ఏం చేస్తే అదే చట్టమనే ధోరణి ప్రదర్శించటం ఎలాంటి సంకేతాలిస్తుంది? శివరాజ్ సింగ్ చౌహాన్ ఆలోచించాలి.

అట్టడుగు కులాలవారిపై ఆధిపత్య కులాల హింసను అంతమొందించటంలో, మహిళలపై నిత్యం సాగే అమానుషత్వాన్ని అరికట్టడంలో మన సమాజం పదే పదే విఫలమవుతున్న తీరు ఆందోళన కలిగించే అంశం. 2002లో గుజరాత్ అగ్నిగుండమైనప్పుడు బిల్కిస్ బానో అనే మహిళపై అత్యాచారానికి పాల్పడిన ఘటనలో యావజ్జీవ శిక్ష పడిన 11మంది నేరస్తులను నిరుడు విడుదల చేయటం, దీనికి వ్యతిరేకంగా ఆమె పోరాడుతున్నా ఇంకా అతీ గతీ లేకపోవటం అందరూ గమనిస్తూనే ఉన్నారు. అటువంటప్పుడు మధ్యప్రదేశ్‌లో ఈ ఏడాది ఆఖరులో ఎన్నికలు వస్తున్నందువల్లే శివరాజ్ సింగ్ సర్కారు వేగంగా స్పందించిందన్న విపక్షాల విమర్శలను కొట్టిపారేయగలమా? ఏదేమైనా చట్ట ప్రకారం వ్యవహరించటంలోనే, సంయమనం పాటించటంలోనే ప్రభుత్వాల సమర్థత వెల్లడవుతుంది. అది ప్రజాస్వామిక సంస్కృతిని మరింత బలోపేతం చేస్తుంది.

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు, ఆషాఢ మాసం, **తిథి:** బ.పంచమి ఉ.5.44 వరకు, తదుపరి షష్ఠి రా.3.28 వరకు, **నక్షత్రం:** పూర్వాభాద్ర రా.2.33 వరకు తదుపరి ఉత్తరాభాద్ర, **వర్జ్యం:** ఉ.10.03 నుండి 11.33 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.5.35 నుండి 7.19 వరకు, **అమృతఘడియలు:** రా.7.01 నుండి 9.03 వరకు.

సూర్యోదయం : 5.35
సూర్యాస్తమయం: 6.35
రాహుకాలం : ఉ.9.00 నుండి 10.30 వరకు
యమగండం : ప.1.30 నుండి 3.00 వరకు

ఈ శతాబ్దం మనదే(నా?)

భారతీయ శాస్త్ర రంగం ఎలాంటి లక్ష్యాన్ని కలిగి ఉండాలి అన్న ప్రశ్నకు, ''ఈ శతాబ్దాన్ని తీసుకోవలసింది ఇండియా. దాని లక్ష్యం కూడా అందుకు తగ్గకుండా ఉండాలి'' అన్నారు థామస్ బార్లో. జర్మనీ, అమెరికా, తాజాగా చైనా తర్వాత సైన్సులో ఇప్పుడిక భారత్ వంతు. ఈ దేశాల నుంచి నేర్చుకోవాల్సిన అంశాలు నేర్చుకుంటూనే భారత్ తనదైన ప్రత్యేక నమూనాను రూపొందించుకుని ముందుకు వెళ్లాల్సి ఉంటుంది. శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞాన రంగాల్లో భారత్ టాప్–3లో ఉండాలన్నదే మన లక్ష్యం కావాలి. మన పరిశోధనలు భారత్‌తో పాటు అంతర్జాతీయ సమాజం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంపై కూడా దృష్టి పెట్టాలి. గంగానదిని సమర్థంగా శుద్ధి చేయగలిగితే... అది ప్రపంచవ్యాప్తంగా కలుషిత జలాల శుద్ధికి ఉపయోగపడుతుంది కదా!

హైదరాబాద్ నగరంలో ఈ ఏడాది మొదట్లో జరిగిన ఇండియా సైన్స్ ఫెస్టివల్‌లో మేము బిడియపడకుండా ఓ ప్రశ్న వేశాం: ''భారతీయ శాస్త్ర రంగం ఎలాంటి లక్ష్యాన్ని కలిగి ఉండాలి?'' మాతోపాటు చర్చలో పాల్గొన్న గ్లోబల్ ఇన్నొవేషన్ నిపుణుడు థామస్ బార్లో సమాధానమిస్తూ... ''ఈ శతాబ్దాన్ని తీసుకోవలసింది ఇండియా. దాని లక్ష్యం కూడా అందుకు తగ్గకుండా ఉండాలి'' అన్నారు.

ఇదేదో యథాలాపంగా ఇచ్చిన సమాధానం కాదు. ప్రపంచ వ్యాప్తంగా సంచలనాత్మకమైన సైన్స్ మోడల్స్ పుట్టుకొచ్చిన తీరును, చరిత్రను గమనించినా ఇదే స్పష్టమవుతుంది. జర్మనీ పరిశోధనలు, టెక్నికల్ యూనివర్సిటీల ఏర్పాటు; అమెరికాలో యూనివర్సిటీ నెట్‌వర్క్, పరిశ్రమతో దాన్ని అనుసంధానించడం, అంతరిక్ష, రక్షణ సంస్థల ఏర్పాటు; తాజాగా కృత్రిమ మేధ, రసాయన, జీవశాస్త్ర రంగాల్లో చైనా పురోగతి–– వీటన్నింటిని చూస్తే ఇప్పుడిక భారత్ వంతు. ఈ దేశాల నుంచి నేర్చుకోవాల్సిన అంశాలు నేర్చుకుంటూనే భారత్ తనదైన ప్రత్యేక నమూనాను రూపొందించుకుని ముందుకు వెళ్లాల్సి ఉంటుంది. ప్రస్తుతం ఈ రకమైన ఏర్పాటు సాధ్యమే. ఎందుకంటే... ఆర్థిక వ్యవస్థ విస్తృతి బాగా ఉంది. పరిశ్రమలు తగినన్ని ఉన్నాయి. స్టార్టప్‌లతో కూడిన వ్యవస్థ, మార్కెట్ వ్యాప్తి, సైన్స్ అండ్ టెక్నాలజీల్లో పెట్టుబడులు పెట్టేందుకు తగిన వనరులు ఉన్నాయి. కానీ భారత్‌కు లేనిదల్లా సైన్స్ అండ్ టెక్నాలజీ వ్యూహంలో ఫోకస్!

మన లక్ష్యం ఏమిటన్న విషయాన్ని చర్చించే ముందు మన ఆశయం ఎంత పెద్దదిగా ఉందన్నది మాట్లాడుకోవాలి. 2019లో జరిగిన మొదటి ఇండియా సైన్స్ ఫెస్టివల్‌లో 'మసాచూసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ' లాంటి సంస్థను భారత్ ఎలా నిర్మించగలదని ప్రశ్నించాం. దానికి సైన్స్ ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ ఒకరు సమాధానమిస్తూ... భారత సైన్స్ సంస్థలు కూడా అంతర్జాతీయ స్థాయి పరిశోధనలు చేస్తున్నాయని అన్నారు. అదే రోజు మేము ఒక చైనా శాస్త్ర నిపుణుడిని చైనీస్ మోడల్ నుంచి భారత్ నేర్చుకోదగ్గ అంశాలేమిటని అడిగాం. ''చైనాలో సైన్స్ పురోగమిస్తోందని ఎవరు చెప్పారు? ఎంత మంది చైనీయులకు నోబెల్ అవార్డులు వచ్చాయి? ప్రపంచాన్ని మార్చేసే ఆవిష్కరణలు మేమెన్ని చేశాం? చేయాల్సింది చాలా ఉంది'' అని ఆయన సమాధానమిచ్చారు. ఇరు దేశాల ఆశయాల్లో ఉన్న వైరుధ్యాన్ని ఈ ఉదంతం స్పష్టం చేస్తుంది. ఆత్మవిమర్శ, ఉన్నతమైన ఆశయం, తగిన కార్యాచరణల మేళవింపుతోనే మనం సరైన ఫలితాలను చూడవచ్చు. వీటిల్లో ఒకటి మాత్రమే కలిగి ఉంటే మాటలకే పరిమితమవుతాం.

శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞాన రంగాల్లో భారత్ టాప్–3లో ఉండాలన్నదే మన లక్ష్యం కావాలి. అయితే దాన్ని అందుకోవడం ఎలా అన్నదే ప్రశ్న. ఓపెన్ ఎండెడ్ అంటే నిర్దిష్ట లక్ష్యమేదీ లేకుండా పరిశోధనలు చేయడమా, లేక సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పరిశోధనలు చేయడమా అన్నది మనం నిర్ణయించుకోవాలి.



దేశంలో మౌలిక శాస్త్ర పరిశోధనలు, అప్లైడ్ రీసెర్చ్ రెండూ వేర్వేరుగా ఎవరికి వారు చేసుకుంటున్నారు. ఈ అంతరం చెరిగిపోవాలి. 'సైకిల్స్ ఆఫ్ ఇన్వెన్షన్స్ అండ్ డిస్కవరీ' పుస్తకంలో వెంకటేశ్ నారాయణ మూర్తి (హార్వర్డ్ స్కూల్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ అప్లైడ్ సైన్స్ మాజీ డీన్) బేసిక్, అప్లైడ్ రీసెర్చ్ రెండింటి మేళవింపుతోనే మేలైన సృజన సాధ్యమంటారు. ఉదాహరణకు ఒకప్పటితో పోలిస్తే ఇప్పుడు జన్యుక్రమ నమోదు వెయ్యి రెట్లు వేగవంతం అయ్యింది. ఎందుకంటే శంకర్ బాల సుబ్రమణ్యన్, డేవిడ్ క్లెనెర్‌మాన్ కలిసికట్టుగా చేసిన 'సరళమైన' రసాయన శాస్త్ర ఆవిష్కరణ ఇందుకు దోహదపడింది. వీళ్లు అంతకుముందరి మైక్రోఫ్లూయిడ్స్, లేజర్, కంప్యూటింగ్ లాంటి సాంకేతిక విజ్ఞానం మీద ఆధారపడి ఈ పనిచేయగలిగారు.

అందుకే బేసిక్, అప్లైడ్ పరిశోధనల్లో ఏది ఎంపిక చేసుకోవాలి అన్న ప్రశ్న అర్థరహితం. ట్రాన్స్‌లేషనల్ రీసెర్చ్ వేగంగా ఫలితాలనిస్తుంది. మరోవైపు మౌలిక శాస్త్ర పరిశోధనలకు ఉన్న సామర్థ్యం చాలా ఎక్కువ. మధ్య, దీర్ఘకాలిక ప్రయోజనాలకు ఇది భారతదేశానికి బాగా అక్కరకొచ్చే విషయం. రెండింటిపైనా పెట్టుబడులు పెట్టాలన్న దానికి రెండు వాదనలు ఉన్నాయి. తరచూ వినిపించే విమర్శల గురించి కూడా చూద్దాం. మొదటి వాదన... కీలకమైన, ఓపెన్ ఎండెడ్ పరిశోధనలపై భారత్ డబ్బు ఖర్చుపెట్టదు అన్నది. పరిశోధనలపై పెట్టే ఖర్చు గణనీయంగా పెరగాలనే విషయాన్ని మేము అంగీకరిస్తున్నాం. అయితే నిధులు సమర్థంగా ఖర్చు పెట్టడం ఎలా అన్న విషయంలో మనం ఇంకా ఎంతో పురోగతి సాధించవచ్చు. ప్రస్తుతం ప్రభుత్వ నిధుల్లో సింహభాగం ప్రభుత్వ పరిశోధన సంస్థలకే వెళుతోంది. యూనివర్సిటీలకు దక్కుతున్నది కేవలం 10–15 శాతం మాత్రమే. ఈ మోతాదు అమెరికాలో 63 శాతం వరకూ ఉంటే, యునైటెడ్ కింగ్‌డమ్‌లో 80 శాతం, దక్షిణ కొరియాలో 50 శాతం ఉండటం గమనార్హం. 'ఫాస్ట్ ఇండియా' ఇటీవల సిద్ధం చేసిన 'ఈజ్ ఆఫ్ డూయింగ్ సైన్స్ ఇన్ ఇండియా' నివేదిక ప్రకారం దేశంలోని అత్యున్నత సంస్థలు కూడా పరిపాలనపరమైన అడ్డంకుల కారణంగా పరిశోధనలకు నిధులు సేకరించలేకపోతున్నాయి. ఖర్చు కూడా పెట్టలేకపోతున్నాయి.

వనరుల కేటాయింపును సమర్థంగా చేసి పరిశోధనలకు నిధులివ్వడంలోనూ పోటీతత్వాన్ని తెస్తే ఓపెన్ ఎండెడ్ రీసెర్చ్ పుంజుకునే అవకాశం ఉంది. ఈ విషయంలో ఇప్పటికే కొంత కదలిక కనపడుతోంది. రక్షణ రంగ పరిశోధనలకు సంబంధించిన బడ్జెట్‌లో 25 శాతాన్ని డీఆర్‌డీఓ ప్రయోగశాలల్లో కాకుండా, యూనివర్సిటీలు, పరిశ్రమకు కేటాయించాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశించింది.

ఇక రెండో వాదన గురించి... దీని ప్రకారం పాశ్చాత్య దేశాలు ఖరీదైన ఓపెన్ ఎండెడ్ రీసెర్చ్ ఇప్పటిలాగే కొనసాగించాలి. భారతదేశం ఆ పరిశోధనలను ఆవిష్కరణలుగా మార్చే ప్రయత్నించాలి. ఈ వాదన మనకు ఉపయోగపడదు. ఎందుకంటే... ఓపెన్ ఎండెడ్ పరిశోధనలను ఆవిష్కరణలుగా మార్చేందుకు ఆయా నిర్దిష్ట అంశాలపై పరిశోధనలు చేస్తున్న శాస్త్రవేత్తలు, అది కూడా చెప్పుకోదగ్గ సంఖ్యలో ఉండాలి. ఉదాహరణకు, కృత్రిమ మేధ రంగంలో 2012లోనే కీలక పరిశోధనలు జరిగినా, ఐటీ దిగ్గజంగా ఉన్నా భారత్ ఆ రంగంలోకి చెప్పుకోదగ్గ స్థాయిలో భాగస్వామి అయ్యేందుకు పదేళ్లు పట్టింది. ఎందుకంటే కృత్రిమ మేధ రంగంలో పరిశోధనలు చేస్తున్న శాస్త్రవేత్తలు తగినంత మంది భారత్‌లో లేకపోవడమే. క్వాంటమ్ కంప్యూటింగ్, న్యూరోసైన్స్, అంతరిక్షం, జన్యుశాస్త్ర రంగాల్లోనూ మనకు ఇదే రకమైన అనుభవాలు ఉన్నాయి. ఓపెన్ ఎండెడ్ పరిశోధనల్లో మన సామర్థ్యాన్ని పెంచుకోకపోతే మనం ఇతరులను అనుసరించే వారిగానే మిగిలిపోతాం. నేతృత్వం వహించే స్థాయికి ఎదగలేము.

చివరగా... ప్రపంచ సమస్యలను భారత్ పరిష్కరించాలా అన్న ప్రశ్నను పరిశీలిస్తే... ఈ ప్రశ్న ఎక్కువగా ట్రాన్స్‌లేషనల్ రీసెర్చ్ నేపథ్యంలో వస్తూంటుంది. ఇది దేశానికి ఉపయోగపడే, తొందరగా సాధించగలిగే విషయం. మన పరిశోధనలు భారత్‌తో పాటు అంతర్జాతీయ సమాజం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంపై కూడా దృష్టి పెట్టాలి. గంగానదిని సమర్థంగా శుద్ధి చేయగలిగితే... అది ప్రపంచవ్యాప్తంగా కలుషిత జలాల శుద్ధికి ఉపయోగపడుతుంది కదా! ఇలాంటి పలు అంశాలను భారతీయ శాస్త్రవేత్తలు చేపట్టాలి. ఇవి మన ఎగుమతుల సామర్థ్యాన్ని పెంచుతాయి.

కె. విజయ్ రాఘవన్, 'ఫాస్ట్ ఇండియా' ఛైర్మన్; కేంద్ర మాజీ ప్రధాన శాస్త్రీయ సలహాదారు; వరుణ్ అగర్వాల్, 'ఫాస్ట్ ఇండియా' సహ వ్యవస్థాపకుడు ('ది హిందుస్థాన్ టైమ్స్' సౌజన్యంతో)

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

ఎలా?



మనం తింటున్న ప్రతిదాని ధర నిజంగానే పైపైకి పోతున్నప్పుడు, ద్రవ్యోల్బణం ఎలా 'తగ్గినట్టు?', ఎలా 'నియంత్రణలో ఉన్నట్టు?'

– అజయ్ కామత్, నేత్ర వైద్యుడు

వృథా



మీకు తెలుసా? క్యాలీఫ్లవర్ ఆకుల్లో పాలకూర కంటే మూడింతల మాంసకృత్తులు, మూడింతల పీచు, తొమ్మిది రెట్ల కాల్షియం, 35 రెట్ల ఐరన్ అధికంగా ఉంటాయి. అయినా వాటిని తీసేస్తుంటాం.

– నందితా అయ్యర్, వైద్యురాలు

మహాదారుణం



మహారాష్ట్ర నాటకం: ప్రఫుల్ పటేల్, హసన్ ముష్రిఫ్, భుజ్‌బల్, ఇంకా మరికొందరికి వ్యతిరేకంగా ఉన్న 'ఈడీ' (ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్) కేసుల్ని మార్చడమో, లేదా వెనక్కి తీసుకోవడమో, లేదా మెత్తబరచడమో గనక చేస్తే అది దారుణం అవుతుంది.

– ప్రకాశ్ సింగ్, మాజీ పోలీస్ అధికారి

ఏది ఒరిజినల్?



మార్క్ జుకర్‌బర్గ్ ఫేస్‌బుక్‌ను వింకిల్‌వాస్ సోదరుల నుంచి దొంగిలించాడు. స్టోరీస్‌ను స్నాప్‌చాట్ నుంచి, రీల్స్‌ను టిక్‌టాక్ నుంచి, ఇప్పుడు థ్రెడ్స్‌ను ట్విట్టర్ నుంచి దొంగిలించాడు.

– పారిఖ్ పటేల్, ఇన్వెస్టర్

దుర్దశ



హాలీవుడ్ కథ ముగిసింది. మంచి సినిమాలే రావట్లేదు. కేవలం రీమేకులు, ఇంకేవో చెత్త. వందేళ్ల పాటు అయితే మంచి సినిమాలు వచ్చాయి. అంతవరకు గొప్పే!

– శర్గ్‌జాదే, అనువాదకుడు

ఎన్నికల మజా



తర్వాతి మహారాష్ట్ర ఎన్నికలు ఓటర్లకు ఎంతో వినోదం కలిగించనున్నాయి. శివసేన రెండు వర్గాలు, ఎన్సీపీ రెండు వర్గాలు, రెండు బీజేపీ 'బి' టీమ్స్, ఇద్దరు ఉప ముఖ్యమంత్రులు, ఏం జరుగుతుందో తెలియని ఒక ముఖ్యమంత్రి, ఎవరి మీద చర్యలకు దిగాలో గందరగోళంలో ఉన్న ఈడీ, సీబీఐ...

– ప్రియా యాదవ్, వ్యాఖ్యాత

విషాహారం



పొటాషియం బ్రోమేట్‌ను మనుషులు తినకుండా యూరప్, చైనా, బ్రెజిల్, కెనడా, ఇండియా, ఇంకా చాలా దేశాల్లో నిషేధించారు. అది విషపూరితమైనది. అది ట్యూమర్ల వృద్ధిని పెంచుతుంది. అలాంటిది అమెరికాలో పెల్పులోంచి ఏ ఆహారోత్పత్తిని తీసుకున్నా అందులో ఉంటుంది. బ్యాగెల్స్, బ్రెడ్, క్రాకెర్స్, డోనట్స్, మఫిన్స్, పేస్ట్రీస్, పిజ్జా, ప్రిట్జెల్స్, రోల్స్, టోర్టిల్లాస్, ఐస్‌క్రీమ్ కోన్స్, ఇంకా ఎన్నో. ఇందులో ఏది తిన్నా కడుపులోకి క్యాన్సర్‌ను పంపిస్తున్నట్టే. కానీ ఇదంతా కూడా 'బిగ్ ఫార్మా', ఇతరులకు లాభదాయకం. మన రోగాలను వాళ్లు సొమ్ము చేసుకుంటారు.

– జోయీ మన్నారినో, పొలిటికల్ స్ట్రాటెజిస్ట్

జలయజ్ఞం చేసిన అపర భగీరథుడు

సందర్భం



మాకిరెడ్డి పురుషోత్తమ రెడ్డి


వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి సందర్భంగా పలు రకాలుగా వారి సేవలను తెలుగు ప్రజలు స్మరించుకుంటున్నారు. ఒక వ్యక్తి గొప్పదనం వారి తదనంతరం వారిని గుర్తు చేసుకునే దాన్ని బట్టి ఉంటుంది. అదే ప్రజానేత అయితే వారు తీసుకునే నిర్ణయాల సార్వజనీనతను బట్టి ఉంటుంది. ఆ కోణంలో చూసినప్పుడు దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి విపక్ష నేతగా, ముఖ్యమంత్రిగా చేసిన పోరాటాలూ, తీసుకున్న నిర్ణయాలూ ఆంధ్రప్రదేశ్ రాజకీయాలలో మరీ ముఖ్యంగా రాయలసీమ ప్రస్థానంలో వారిని చిరస్థాయిగా నిలిచిపోయేట్లు చేశాయి.

ఎందరో మహానుభావులు రాయలసీమ ఉద్యమాన్ని నడిపారు. దాన్ని ప్రజా ఉద్యమంగా మలచడంలో వైఎస్ విజయం సాధించారు. జాతీయ పార్టీ ముఖ్యమంత్రి రేసులో ఉన్న వైఎస్ ఒక ప్రాంత సమస్యపై పోరాటంలో పాల్గొనడం సాహసం. కొందరు రాజకీయ ప్రయోజనాల కోసం అంటారు. అందులో ఏ మాత్రం నిజం లేదు. ఎందుకంటే 294 నియోజకవర్గాల ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ముఖ్యమంత్రి కావాలంటే 52 నియోజక వర్గాలు ఉన్న రాయలసీమ అంశాలపై ఎందుకు మాట్లాడతారు? రాయలసీమ ఉద్యమాన్ని ప్రజా ఉద్యమంగా మార్చిన కారణంగా... కేవలం చెన్నై నగరానికి త్రాగు నీరు కోసం రూపొందించిన 'తెలుగు గంగ' తిరుపతి వరకూ రాగలిగింది. కీలకమైన పోతిరెడ్డిపాడు సమస్య సమాజం ముందుకు వచ్చింది.

రాయలసీమ ఉద్యమంలో వైఎస్ ప్రస్థాన ఫలితమే 'జలయజ్ఞ' రూపకల్పన. వెనుకబడిన ప్రాంత అస్తిత్వ ఉద్యమంలో కీలక అంశంగా నీటి సమస్య ఉంటుంది. వైఎస్ అధికారంలోకి వచ్చిన వెంటనే అత్యంత ప్రాధాన్యత అంశంగా తీసుకున్నది జలయజ్ఞం. ఏపీలోని అన్ని ప్రాంతాలకు శాశ్వత పరిష్కారంగా జలయజ్ఞం రూపొందించారు. పోలవరం, దుమ్ముగూడెం టేల్ పాండ్, పులిచింతల, గాలేరు– నగరి, హంద్రీనీవా, పోతిరెడ్డిపాడు, సిద్ధేశ్వరం లాంటి ప్రాజెక్టులు నేడు ప్రజల ముందు ఉన్నాయి అంటే అది వైఎస్ దూర దృష్టి ఫలితమే. ఆధునిక కాలంలో ఆంగ్లేయుల తర్వాత మొత్తం తెలుగు ప్రజలకు శాశ్వత నీటి పరిష్కారం కోసం దూర దృష్టితో ఆలోచించింది రాజశేఖర రెడ్డి అనే చెప్పాలి.

జలయజ్ఞం పేరుతో అన్ని ప్రాజెక్టుల నిర్మాణం ఒకేసారి చేపట్టడం సరికాదని చాలా మంది వాదించారు. అలాంటి వాదనలకు వైఎస్ చెప్పిన సమాధానం 'రాష్ట్ర నీటి సమస్య పరిష్కారానికి నేడు రూపొందించిన ప్రాజెక్టులు మన హయాంలో పూర్తి కాకపోయినా ప్రజలు పోరాడి సాధించుకుంటారు.' అది వైఎస్ ఆలోచన. అలా ఆయన ఆలోచన చేయకుండా ఉంటే పోలవరం జాతీయ ప్రాజెక్ట్‌గా మారి ఉంటుందా? వారు ఊహించిన విధంగా నేడు ప్రజలు ప్రాజెక్టులు పూర్తి చేయాలని పోరాడుతున్నారు. ప్రభుత్వాలు తమ ప్రాధాన్యత అంశంగా ఇరిగేషన్ ప్రాజెక్టుల గురించి మాట్లాడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. రాయలసీమ ఉద్యమంలో పాల్గొన్న వైఎస్. తాను అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ ఉద్యమ డిమాండ్లకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చారు. కొన్ని సాహసోపేత నిర్ణయాలు తీసుకున్నారు. అందులో పోతిరెడ్డిపాడు రెగ్యులేటర్ వెడల్పునూ, శ్రీశైలం ప్రాజెక్ట్ నీటిమట్టాన్నీ పెంచాలని నిర్ణయించడం వంటివి కొన్ని మాత్రమే.

రాయలసీమ నీటి సమస్య పరిష్కారానికి పోతిరెడ్డిపాడు రెగ్యులేటర్ వెడల్పు పెంచడం అవసరం. వరద సమయంలో నీటి హక్కు లేని ప్రాజెక్టులకు నీరు విడుదల చేయడానికి వీలుగా పోతిరెడ్డిపాడు రెగ్యులేటర్ వెడల్పును 12 వేల క్యూసెక్కుల సామర్థ్యం నుంచి 44 వేల క్యూసెక్కుల సామర్థ్యానికి పెంచారు. శ్రీశైలం కనీస నీటి మట్టం 854 అడుగులు ఉండేలా జీఓ ఇచ్చినా రాజకీయ కుట్రల కారణంగా దాని అమలు సాధ్యం కాలేదు. దాని ఫలితం నేడు రెండు రాష్ట్రాల సమస్యగా మారింది. గండికోట ప్రాజెక్ట్ నిర్మాణం పూర్తి



నేడు డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి జయంతి

చేయడంతో బాటు కుందూ నదిపై జోలదరాసికీ, రాజోలుకూ శంకుస్థాపన చేశారు. అలాగే సిద్ధేశ్వరం అలుగు ఆలోచన చేశారు. కానీ వారి మరణానంతర ప్రభుత్వాల నిర్లక్ష్యంతో ఇవి సాకారం కాకపోవడంతో నేటికీ రాయలసీమ నీటి సమస్య పరిష్కారం కాలేదు.

గోదావరిపై పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణం చిరకాల వాంఛ. ఎందరో ఎన్నో ప్రయత్నాలు చేసినా ఓ కొలిక్కి రాలేదు. కానీ నీటి సమస్య గురించి అవగాహన కలిగిన వైఎస్ అత్యంత వ్యయంతో కూడిన పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి పూనుకున్నారు. కేంద్రాన్ని ఒప్పించి అన్ని అనుమతులూ మంజూరు చేయించుకొని కుడి ఎడమ కాల్వల నిర్మాణం చేపట్టారు. 'ప్రాజెక్టు పూర్తి కాకుండానే కాల్వల నిర్మాణం' అంటూ విపక్షాలు చేసే విమర్శలకు వెరవలేదు. విభజన సమయంలో పోలవరానికి జాతీయ హోదా లభించింది అంటే అది వైఎస్ కృషి ఫలితమే. అదీ నీటి ప్రాజెక్టులపై వైఎస్‌కున్న నిబద్ధత, దూరదృష్టి. అదే సమయంలో అపార నీటి వనరులు ఉన్న గోదావరి నీటిని పూర్తి స్థాయిలో వినియోగించే ప్రయత్నంలో భాగంగా దుమ్ముగూడెం పథకాన్ని రూపొందించి 500 కోట్లతో ప్రాథమిక పనులు పూర్తి చేశారు. విభజన సమయంలో పోలవరంలో భాగంగా 165 టీఎమ్‌సీల సామర్థ్యం కలిగిన దుమ్ముగూడేనికి జాతీయ హోదా వచ్చి ఉంటే తెలంగాణలో కొంత భాగం, కృష్ణా, గోదావరి డెల్టాలకు గోదావరి నీళ్లు; వెనుకబడిన రాయలసీమ, ప్రకాశం, దక్షిణ తెలంగాణ ప్రాజెక్టులకు కృష్ణ నీటినీ వినియోగించే అవకాశం ఉండేది. వైఎస్ మరణం, విభజన సమయంలో దూరదృష్టి లేని నేతల కారణంగా ఏపీ తీవ్రంగా నష్టపోయింది. శంకుస్థాపనకే పరిమితం అయిన గాలేరు–నగరి, హంద్రీనీవా, వెలుగొండ ప్రాజెక్టులను పరుగులు పెట్టించారు. ఫలితంగా నీటి హక్కులు లేకపోయినా మూడు ప్రాజెక్టులను ఉమ్మడి రాష్ట్రంలో రూపొందించిన విధంగా నిర్మాణం చేసుకోవచ్చని విభజన చట్టంలో అనుమతించారు.

వైఎస్ ఆశించిన శ్రీశైలం ప్రాజెక్ట్ నీటిమట్టం పెంపు, సిద్ధేశ్వరం, గుండ్రేవుల, కుందూపై నిర్మాణాలు... ముఖ్యంగా దుమ్ముగూడెం పథకం పూర్తి అయితే రాయలసీమ నీటి సమస్యకు పరిష్కారం లభిస్తుంది. విపక్ష నేతగా సీమ హక్కుల కోసం పోరాటం, అధికారంలోకి వచ్చిన తర్వాత సాకారం కోసం ప్రయత్నాలు చేసిన వైఎస్ రాజశేఖర రెడ్డి రాయలసీమ ప్రస్థానంలో ఎప్పటికీ చిరస్మరణీయులు.

వ్యాసకర్త రాయలసీమ మేధావుల ఫోరం సమన్వయ కర్త । 94904 93436

నీ ప్రాణం మాతోనే!

రాజన్నా...
పేదోళ్లకు నువ్వు ఇళ్లు కడితే
అతను ఊళ్లే కడుతున్నాడు

నువు పెంచిన పింఛను పదింతలు చేసి
నేరుగా గడప గడపకూ అందిస్తున్నాడు

నీ యజ్ఞం పరవళ్లు తొక్కుతోంది
నీ సంకల్పం బలం పుంజుకుంటోంది

మన బడులు కళకళలాడుతున్నాయి
పేదలు పెద్దగా చదువుతున్నారు

మన పల్లెలు పట్టుగొమ్మలుగా మారి
దేశానికి ఆదర్శమవుతున్నాయి

మన రైతు రాజులా బతుకుతూ
భరోసాగా సాగు చేస్తున్నాడు

సంక్షేమం అందిస్తున్న ఆసరాతో
మహిళలు లక్షాధికారులవుతున్నారు

ఇంటింటికీ డాక్టరు వస్తున్నాడు
రూపాయి తీసుకోకుండా మందులిస్తున్నాడు

నీ ప్రాణాన్ని మాకొదిలి వెళ్లి
నువ్వు లేవంటే ఎలాగయ్యా!
నువ్వున్నావు
నీ నవ్వులాగే ఉన్నావు
ప్రజల నవ్వుల్లో ఉన్నావు
హ్యాపీ బర్త్ డే టు యూ!

– పూడి శ్రీనివాసరావు
సీనియర్ జర్నలిస్ట్

క్లుప్తంగా...

నేడు, రేపు వీహెచ్‌పీ రాష్ట్ర కార్యవర్గ సమావేశాలు

సాక్షి, హైదరాబాద్: ఈనెల 8, 9 తేదీల్లో విశ్వహిందూ పరిషత్ (వీహెచ్‌పీ) తెలంగాణ రాష్ట్ర కార్యవర్గ సమావేశాలు జరగనున్నాయని వీహెచ్‌పీ ప్రచార ప్రముఖ్ పగుడాకుల బాలస్వామి తెలిపారు. ఈ సమావేశాలు ఘట్‌కేసర్ మండలం అన్నోజిగూడలోని రాష్ట్రీయ విద్యా కేంద్రం (ఆర్‌వీకే)లో నిర్వహించనున్నామని శుక్రవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. కార్యవర్గ సమావేశాలకు వీహెచ్‌పీ జాతీయ నాయకులు కోటేశ్వర శర్మ, స్థాను మలయన్, రాష్ట్ర, జిల్లా స్థాయి నాయకులు పాల్గొంటారని తెలిపారు. వచ్చే ఆరు నెలల పాటు నిర్వహించే భవిష్యత్తు కార్యక్రమాల రూపకల్పన, గడిచిన ఆరు నెలల కార్యక్రమాల నివేదికను ఈ సమావేశాల్లో చర్చిస్తామని పేర్కొన్నారు. ఏటా రెండు సార్లు వీహెచ్‌పీ సమావేశాల నిర్వహణలో భాగంగా జూలైలో నిర్వహిస్తున్నామని బాలస్వామి తెలిపారు.

లక్షలాది మందితో హైదరాబాద్‌లో మహాసభ



అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న మంద కృష్ణమాదిగ

రాయపర్తి: ఎస్సీ వర్గీకరణను నిర్లక్ష్యం చేస్తున్న కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని బీఆర్‌ఎస్‌ను ఎదుర్కొనేందుకు లక్షలాది మందితో హైదరాబాద్‌లో మాదిగల మహాసభ నిర్వహించనున్నట్లు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ తెలిపారు. వరంగల్ జిల్లా రాయపర్తి మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఈ నెల చివరి వారంలో హైదరాబాద్‌లో నిర్వహించే మహాసభకు ప్రతీ ఇంటినుంచి తరలివచ్చి పోరాటస్ఫూర్తిని చాటుకోవాలని కోరారు. బీజేపీ.. ఎస్సీ వర్గీకరణను సమర్థిస్తూ మాట్లాడుతున్నా పార్లమెంట్‌లో బిల్లు పెట్టడం లేదని అన్నారు. ప్రతిపక్ష కాంగ్రెస్ వర్గీకరణకు బయట అనుకూలంగా మాట్లాడుతూ చట్టసభల్లో వెనకడుగు వేస్తోందని తెలిపారు. అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లి సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చిన సీఎం కేసీఆర్.. తన హామీని అదేరోజు మరిచిపోయారని విమర్శించారు.

సింగరేణి వార్షిక లాభాలు రూ.2,222 కోట్లు

- ఆల్‌టైం రికార్డ్ అని ప్రకటించిన సంస్థ సీఎండీ శ్రీధర్
- గతేడాదితో పోలిస్తే 81 శాతం వృద్ధి



గోదావరిఖని: సింగరేణి ఆల్‌టైం రికార్డ్ సిరులు కురిపించింది. సంస్థ చరిత్రలోనే ఈ ఏడాది అత్యధిక లాభాలు ఆర్జించింది. కోల్ ఇండియాసహా మహారత్న కంపెనీలన్నింటి కన్నా లాభాల వృద్ధిలో అగ్ర స్థానంలో నిలిచింది. సింగరేణి సంస్థ చరిత్రలోనే అత్యధికంగా ఈ ఆర్థిక సంవత్సరం రూ.33,065 కోట్ల టర్నోవర్‌తో రూ.2,222 కోట్ల నికర లాభాలు సాధించినట్లు సంస్థ సీఎండీ ఎన్.శ్రీధర్ శుక్రవారం వెల్లడించారు. బొగ్గు, విద్యుత్ అమ్మకాల ద్వారా మొత్తం రూ.3,074 కోట్ల స్థూల లాభాలను ఆర్జించగా, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, ఇతర పన్నుల చెల్లింపుల అనంతరం రూ.2,222 కోట్ల నికర లాభాలు సాధించినట్లు ప్రకటించారు. సింగరేణి చరిత్రలోనే ఇది ఆల్‌టైం రికార్డు అని పేర్కొన్నారు. గతేడాది రూ.1,227 కోట్ల లాభాలు రాగా, ఈసారి 81 శాతం అధికంగా వచ్చాయని తెలిపారు. గత ఆర్థిక సంవత్సరం టర్నోవర్ రూ.26,585 కోట్లుకాగా, ఈ ఏడాది రూ.33,065 కోట్లు సాధించామని, గతం కన్నా 24 శాతం అధికమని పేర్కొన్నారు. బొగ్గు అమ్మకాల ద్వారా రూ.28,650 కోట్లు, విద్యుత్ అమ్మకాల ద్వారా రూ.4,415 కోట్లు గడించినట్లు చెప్పారు.

రాష్ట్ర ఏర్పాటు తర్వాత అత్యద్భుత వృద్ధి

సింగరేణి సంస్థ తన 134 ఏళ్ల చరిత్రలో తెలంగాణ ఆవిర్భా వం తర్వాత అత్యద్భుత ప్రగతి సాధించిందని శ్రీధర్ తెలిపారు. బొగ్గు ఉత్పత్తిలో 33 శాతం, రవాణాలో 39, అమ్మకాల్లో 177 శాతం లాభాలతో 430 శాతం వృద్ధి సాధించిందన్నారు. థర్మల్ విద్యుత్ ఉత్పాదన ద్వారా గణనీయమైన టర్నోవర్, లాభాలు సాధించిందన్నారు. కార్మికులు ఉద్యోగులు అంకితభావంతో పని చేసి కంపెనీని దేశంలోనే అగ్రస్థానంలో నిలి పారని కొని యాడారు. లాభాల ద్వారా సింగరేణి మరిన్ని కొత్త ప్రాజెక్టులు, కార్మికులకు లాభాల్లో వాటా, మరిన్ని సంక్షేమ కార్య క్రమాలు చేపడతామని తెలిపారు. ఈ ఏడాది నిర్దేశిత లక్ష్యాలు సాధిస్తే రూ.4 వేల కోట్ల లాభాలు సాధించే అవకాశం ఉందన్నారు.

'వైద్య, ఆరోగ్యం'లో మూడో స్థానంలో తెలంగాణ

- వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు
- ఆశా కార్యకర్తలకు అవగాహన కార్యక్రమం
- 1,560 మంది ఆశాలకు నియామక పత్రాలు అందజేత

మాదాపూర్ (హైదరాబాద్): తెలంగాణ ప్రాంతం గతంలో వైద్య, ఆరోగ్య రంగంలో 14వ స్థానంలో ఉండగా, ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తరువాత 3వ స్థానంలోకి చేరుకుందని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. శుక్రవారం మాదాపూర్‌లోని శిల్పకళావేదికలో హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో నియమితులైన ఆశా కార్యకర్తలకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. కొత్తగా నియమితులైన 1,560 మంది ఆశా కార్యకర్తలకు నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పేదల సంక్షేమమే లక్ష్యంగా పనిచేయాలని కోరారు. ఒక్కో ఆశా వర్కర్‌పై రూ.50 వేలు ఖర్చు పెట్టి శిక్షణ ఇచ్చి.. ఆరోగ్య కార్యకర్తలుగా తీర్చిదిద్దుతున్నట్టు తెలిపారు. రాష్ట్రంలో పనిచేస్తున్న 27 వేల మంది ఆశా వర్కర్లకు ఈనెల నుంచి సెల్‌ఫోన్ బిల్లులు కూడా ప్రభుత్వ మే చెల్లిస్తుందని చెప్పారు. కొత్తగా వచ్చిన వారికి కూడా స్మార్ట్ ఫోన్‌లను అందజేసి వారి బిల్లులను చెల్లిస్తామని తెలిపారు. దేశంలో ఆశా వర్కర్లకు అత్యధిక వేతనం తెలంగాణలోనే ఇస్తున్నట్టు తెలిపారు. ప్రస్తుతం వారికి రూ.9,900 చెల్లిస్తున్నామని, గతంలో వేతనం పెంచమని అడిగితే.. గుర్రాలతో తొక్కించి, అరెస్టులు చేసి పోలీస్‌స్టేషన్‌లలో ఉంచిన చరిత్ర కాంగ్రెస్‌దని అన్నారు. అలాగే సెకండ్ ఏఎన్‌ఎంలకు రాష్ట్రంలో రూ.27 వేలకు పైగా వేతనం అందిస్తున్నట్టు తెలిపారు. కాంగ్రెస్, బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఇంత వేతనం ఇవ్వడం లేదన్నా రు. బస్తీ దవాఖానాల ఏర్పాటువల్ల ఉస్మానియాలో 60 శాతం ఓపీ భారం తగ్గిందన్నారు. అలాగే గాంధీ ఆస్పత్రిలో 56 శాతం, ఫీవర్ ఆస్పత్రిలో 72 శాతం ఓపీ భారం తగ్గిందన్నారు. గర్భిణుల కోసం 3 సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులు ఏర్పాటు చేయనున్నట్టు మంత్రి తెలిపారు. కోర్టు కేసు తేలగానే ఉస్మానియా ఆస్పత్రికి అధునాతన భవనం నిర్మించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రులు మహమూద్ అలీ, తలసాని శ్రీనివాస్‌యాదవ్, మల్లారెడ్డి, ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ తదితరులు పాల్గొన్నారు.



ఆశా కార్యకర్తకు నియామక పత్రం అందజేస్తున్న మంత్రులు హరీశ్‌రావు, తలసాని శ్రీనివాస్ యాదవ్

చంద్రబాబు హయాంలో | నీళ్లకోసం భిక్షమెత్తుకోవాల్సి వచ్చేది

- స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి



ఎస్సారెస్పీలోకి వస్తున్న కాళేశ్వరం నీరు. (ఇన్‌సెట్‌లో) పంప్‌హౌస్‌లో బటన్ నొక్కి నీటిని విడుదల చేస్తున్న పోచారం. చిత్రంలో జీవన్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, ఇంద్రకరణ్‌రెడ్డి

బాల్కొండ: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో టీడీపీ, కాంగ్రెస్ పార్టీల పాలనలో తెలంగాణ రైతాంగం తీవ్రంగా నష్టపోయిందని శాసనసభ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం నిజామాబాద్ జిల్లా ముప్కాల్ మండల కేంద్రం శివారులో వరద కాలువ జీరో పాయింట్ వద్ద ఎస్సారెస్పీ పునరుజ్జీవన పథకం ద్వారా కాళేశ్వరం నీటిని శ్రీరాంసాగర్‌లోకి విడుదల చేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో పోచారం మాట్లాడుతూ, నిజాంసాగర్ ప్రాజెక్ట్ నుంచి నిజామాబాద్ జిల్లాకు నీటి విడుదల చేపట్టాలంటే చంద్రబాబు ఇంటి వద్ద భిక్ష మెత్తుకునే పరిస్థితి ఉండేదన్నారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత కేసీఆర్ నాయకత్వంలో సాగు నీటి కష్టాలు తీరాయన్నారు. పునరుజ్జీవన పథకంతో ఆయకట్టు కింద అదనంగా 50 లక్షల ఆయకట్టు స్థిరీకరణ జరుగుతోందన్నారు.మంత్రి ప్రశాంత్‌రెడ్డి మాట్లాడుతూ ఎస్సారెస్పీ పునరుజ్జీవన పథకం ద్వారా కాళేశ్వరం నీళ్లను శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి తరలించడం అపూర్వ ఘట్టమన్నారు. మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి మాట్లాడుతూ ఎస్సారెస్పీ పునరుజ్జీవ పథకంతో భూములను కోల్పోయిన రైతులకు, పునరావాస గ్రామాలకు శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నీళ్ల అంది ప్రతిఫలం దక్కుతోందన్నారు. రాజ్యసభ సభ్యుడు సురేశ్‌రెడ్డి, ఎమ్మెల్యేలు జీవన్‌రెడ్డి, బాజిరెడ్డి గోవర్ధన్, రేఖా నాయక్, విఠల్‌రెడ్డి, మహిళా సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్ ఆకుల లలిత, జెడ్పీ చైర్మన్ విఠల్‌రావు, మాజీ ఎమ్మెల్సీలు రాజేశ్వర్‌రావు, వీజీగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సారెస్పీలోకి కాళేశ్వరం నీళ్లు..

శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి కాళేశ్వరం నీళ్లు ఎస్సారెస్పీ పునరుజ్జీవన పథకం ద్వారా ఎదురెక్కాయి. శుక్రవారం శాసన సభ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి మూడవ పంపు వద్ద బటన్ నొక్కి మోటార్లను ప్రారంభించారు. నాలుగు మోటార్ల ద్వారా నీరు ఎస్సారెస్పీలోకి ఉరకలేసింది. అనంతరం కాళేశ్వరం నీళ్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రాజెక్ట్ నీటితో కాళేశ్వరం నీళ్లు కలుస్తున్న ప్రాంతాన్ని పరిశీలించారు.

పెరిగిన రవాణా శాఖ ఆదాయం

- నాలుగేళ్లలో రూ.6,300 కోట్ల రాబడి: పువ్వాడ



యువతికి లెర్నింగ్ లైసెన్స్ స్లాట్ బుకింగ్ పత్రం అందజేస్తున్న మంత్రి పువ్వాడ

సాక్షి ప్రతినిధి, ఖమ్మం: నాలుగేళ్లలో రవాణాశాఖ ఆదాయం గణనీయంగా పెరిగిందని, ప్రజలపై అదనపు భారం వేయకుండానే ఆదాయాన్ని రూ.3,500 కోట్ల నుంచి రూ.6,300 కోట్లకు పెంచామని రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ వెల్లడించారు. ఖమ్మంలోని క్యాంపు కార్యాలయంలో పువ్వాడ ఫౌండేషన్ ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన ఉచిత లెర్నింగ్ లైసెన్స్ మేళాను శుక్రవారం ఆయన ప్రారంభించాక మాట్లాడారు. రవాణా శాఖ మంత్రిగా తాను బాధ్యతలు స్వీకరించాక దాదాపు అన్ని సేవలను ఆన్‌లైన్ చేయడంతో వాహనదారులకు దళారుల బెడద తగ్గిందని చెప్పారు. గతంలో ఫ్యాన్సీ నంబర్లను సిఫారసుల ఆధారంగా కేటాయించగా, ఇప్పుడు ఆన్‌లైన్‌లో వేలం నిర్వహిస్తుండడంతో గత ఏడాది ప్రభుత్వానికి రూ.74 కోట్ల ఆదాయం వచ్చిందని వివరించారు. ఈ ఏడాది రూ.100 కోట్లు దాటుతుందనే అంచనాతో ఉన్నట్లు తెలిపారు. మంత్రి హరీశ్‌రావు సలహా మేరకు ఉచిత లెర్నింగ్ లైసెన్స్ మేళాను ఖమ్మం నియోజకవర్గ స్థాయిలో ఏర్పాటు చేశానని పేర్కొన్నారు.

గోదావరిలో 3,396 టీఎంసీల నీటిలభ్యత

- ఉమ్మడి ఏపీకి 1,486 టీఎంసీలు
- 75% లభ్యత ఆధారంగా తేల్చిన సీడబ్ల్యూసీ
- ప్రాజెక్టుల అనుమతులకు మార్గం సుగమం

సాక్షి, హైదరాబాద్: గోదావరి నదిలో 75 శాతం డిపెండబిలిటీ ఆధారంగా మొత్తం 3,396 టీఎంసీల నీటిలభ్యత ఉందని కేంద్ర జల సంఘం(సీడబ్ల్యూసీ) తేల్చింది. అందులో ఉమ్మడి ఏపీకి 1,486 టీఎంసీల లభ్యత ఉందని స్పష్టం చేసింది. 1941–42 నుంచి 1979–80 మధ్యకాలానికి సంబంధించిన లెక్కల ఆధారంగా ఈ అంచనా వేసింది. తాజాగా గోదావరి నదీ యాజమాన్య బోర్డు(జీఆర్‌ఎంబీ)కి రాసిన లేఖలో ఈ విషయాన్ని వెల్లడించింది. గోదావరిలో నీటిలభ్యతను తేల్చాలని సీడబ్ల్యూసీకి విజ్ఞప్తి చేస్తూ గతంలో జరిగిన 14వ గోదావరి బోర్డు సమావేశంలో తీర్మానించారు. ఇందులో భాగంగా గత జనవరి 19న సీడబ్ల్యూసీకి గోదావరిబోర్డు లేఖ రాసి నీటిలభ్యతను తేల్చాలని విజ్ఞప్తి చేసింది. గత మార్చి 9న సీడబ్ల్యూసీలోని హైడ్రాలజీ విభాగం అధికారులతో గోదావరి బోర్డు చైర్మన్, సభ్యులు సమావేశమై ఈ అంశంపై చర్చించారు. ఎట్టకేలకు సీడబ్ల్యూసీ నీటిలభ్యతను నిర్ధారించి గోదావరి బోర్డుకు తెలియజేసింది.

నెగ్గిన తెలంగాణ వాదన

గోదావరిలో 1,486 టీఎంసీల నీటిలభ్యత మాత్రమే ఉందని, అందులో తమకు 968 టీఎంసీలు, ఏపీకి 518 టీఎంసీలు కేటాయించాలని కొంతకాలంగా తెలంగాణ డిమాండ్ చేస్తోంది. వ్యాప్కోస్ నివేదిక–2004 ఆధారంగా గోదావరిలో 1,360 టీఎంసీల లభ్యత మాత్రమే ఉందని, గోదావరిలో నీటిలభ్యత తేలే వరకు తెలంగాణ ప్రాజెక్టులకు అనుమతులు జారీ చేయరాదని పలుమార్లు సీడబ్ల్యూసీ గోదావరి బోర్డులకు ఏపీ లేఖలు రాసింది. అయితే సీడబ్ల్యూసీ తాజా లేఖతో నీటిలభ్యతపై అనుమానాలు వీగిపోయాయి. తెలంగాణ వాదనే నెగ్గడంతో రాష్ట్ర ప్రాజెక్టులకు అనుమతుల జారీ సులువుకానుంది.

రైతువేదికల వద్ద నానో యూరియా విక్రయాలు

- రాష్ట్ర ప్రభుత్వానికి మార్క్‌ఫెడ్ ప్రతిపాదన
- లిక్విడ్ యూరియాపై రైతుల్లో అవగాహనకు కసరత్తు

సాక్షి, హైదరాబాద్: రైతువేదికలు నానో యూరియా అమ్మకాలకు వేదికలుగా మారనున్నాయి. ఈ మేరకు మార్క్‌ఫెడ్ సంస్థ కసరత్తు చేస్తోంది. వ్యవసాయ శాఖకు తాజాగా ప్రతిపాదనలు పంపింది. లిక్విడ్ నానో యూరియా పట్ల రైతులకు అవగాహన కల్పించడం, వాటి అమ్మకాలు పెంచడమే లక్ష్యంగా రైతువేదికల వద్ద ప్రత్యేకంగా స్టాల్స్ ఏర్పాటు చేయాలని అధికారులు భావిస్తున్నారు. అయితే వ్యవసాయ శాఖ ఈ ప్రతిపాదనపై ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని సమాచారం. ఈ వానాకాలం సీజన్‌లో రాష్ట్రంలో 8 లక్షల బాటిళ్ల నానో యూరియా అమ్మేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. వాటన్నింటినీ విక్రయించాలంటే పెద్ద ఎత్తున ప్రచారం నిర్వహించాల్సి ఉంటుంది.

సాధారణ యూరియావైపే రైతుల మొగ్గు

కేవలం అర లీటర్ నానో యూరియా 45 కిలోల సాధారణ యూరియాతో సమానం. సాధారణ ఘన రూపంలోని యూరియా కంటే కూడా నానో లిక్విడ్ యూరియాతో లాభాలు ఎక్కువని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ప్రస్తుతం రైతులు వినియోగిస్తున్న యూరియాతో భూమికి హాని జరుగుతోందని, భూసారం తగ్గుతోందని అంటున్నారు. అయితే రైతులు సాధారణ యూరియాకు అలవాటు పడటం వల్ల నానో యూరియాను వినియోగించడానికి అంతగా ఆసక్తి చూపించడంలేదని తెలుస్తోంది. నానో యూరియాను సాధారణ ఎరువుల దుకాణాల్లో అమ్మకానికి పెడితే రైతులు ముందుకు వచ్చే పరిస్థితి కనిపించడంలేదు. అందుకే రైతువేదికల వద్ద రైతులకు అవగాహన కల్పించి విక్రయించాలనేది మార్క్‌ఫెడ్ ఉద్దేశం. తక్కువ ధర, అధిక దిగుబడి వంటి అంశాలను ప్రచారం చేయాలని నిర్ణయించారు. పైగా రైతు వేదికలు వినియోగంలోకి రాకపోవడంతో అనేకచోట్ల నిరుపయోగంగా మారాయి. ఇప్పటికే కొన్ని బ్రాండెడ్ కంపెనీలు కొన్ని రైతువేదికల వద్ద సమావేశాలు కూడా నిర్వహించి తమ విత్తనాల నాణ్యతను తెలియజెప్పాయి. ప్రభుత్వం ఏర్పాటు చేసిన 2,601 రైతు వేదికల ద్వారా నానో యూరియా విక్రయానికి అన్ని రకాలుగా మార్క్‌ఫెడ్ అధికారులు సిద్ధమయ్యారు.

ఆహారం వికటించి విద్యార్థినులకు అస్వస్థత

- 60 మందికిపైగా విరేచనాలు
- 12 మంది పరిస్థితి విషమం
- అర్ధరాత్రి నుంచి ఉదయం దాకా అందని వైద్యసేవలు
- కేజీబీవీ సిబ్బంది నిర్లక్ష్యం
- వనపర్తి జిల్లా అమరచింతలో ఘటన



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినులు

ఆత్మకూర్/అమరచింత/వనపర్తి: ఆహారం విషతుల్యమై.. 60 మంది విద్యార్థినులు అనారోగ్యానికి గురికాగా.. 12 మంది పరిస్థితి విషమంగా ఉంది. వనపర్తి జిల్లా అమరచింతలోని కేజీబీవీలో గురువారం అర్ధరాత్రి ఈ సంఘటన జరిగితే.. శుక్రవారం ఉదయం వరకు బాధిత విద్యార్థినులకు కనీసం వైద్యం అందించలేకపోయారు.

అమరచింతలోని కేజీబీవీలో 6వ తరగతి నుంచి ఇంటర్ వరకు మొత్తం 340 మంది విద్యార్థినులు చదువుకుంటున్నారు. గురువారం హాజరైన 270 మంది విద్యార్థినులు రాత్రి 7.30 గంటలకు అన్నం, పప్పు, సాంబార్, వంకాయకూర, మజ్జిగతో భోజనాలు చేశారు. అయితే అర్ధరాత్రి 2 గంటల నుంచి విద్యార్థినులకు కడుపునొప్పి రావడంతో వెంటనే అందుబాటులో ఉన్న ఇద్దరు ఉపాధ్యాయులకు సమాచారం ఇచ్చారు. ఏఎన్‌ఎం, ఇతర సిబ్బంది లేకపోవడంతో.. కోలుకుంటారని ఉదయం వరకు నిరీక్షించారు. కానీ, ఉదయం విద్యార్థినులు హాహాకారాలు చేయడంతో అంబులెన్స్‌లో ఆత్మకూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మొదట 10 మందితో మొదలైన బాధితుల తరలింపు 50 మందికి చేరుకుంది. అమరచింతలోని డీఎంఆర్ ఆస్పత్రిలో మరో 10 మంది విద్యార్థినులను చేర్పించారు. ఇందులో 12 మంది పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యానికి వనపర్తి జనరల్ ఆస్పత్రికి తరలించారు.

ఎస్‌వో తొలగింపు.. ఇద్దరు అధికారుల సస్పెన్షన్

అమరచింత కేజీబీవీలో విద్యార్థినులు అస్వస్థతకు గురైన సంఘటనను కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ తీవ్రంగా పరిగణించారు. కేజీబీవీ ఎస్‌వో స్వప్నరాణిని ఉద్యోగం నుంచి తొలగిస్తూ, ఇన్‌చార్జ్ డీఈవో గోవిందరాజులు, జీసీడీవో సుబ్బలక్ష్మికి శుక్రవారం రాత్రి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. వంట ఏజెన్సీని తక్షణమే మార్చాలని ఆదేశించారు. కొన్ని రోజులుగా సాయంత్రం విధులకు హాజరు కాకపోవడం.. పరిశీలనకు వెళ్లిన కలెక్టర్‌కు మద్యం తాగి విధులు నిర్వహిస్తున్నట్లు కనిపించిన ఏఎస్‌డబ్ల్యూవో సేవ్యానాయక్‌ను.. రూరల్ ఎస్‌ఐ నాగన్నతో డ్రంకెన్ టెస్ట్ నిర్వహించి సస్పెండ్ చేశారు. కొన్నిరోజులుగా నిర్లక్ష్యంగా విధులు నిర్వహిస్తున్న కొత్తకోట ఎస్సీ హాస్టల్ వార్డెన్ సంతోష్‌ను కూడా సస్పెండ్ చేశారు.

రాహుల్‌కు బాసటగా..

- రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ ఆందోళనలు...
- గుజరాత్ కోర్టు తీర్పునకు నిరసనగా గాంధీ భవన్ ఎదుట మోదీ దిష్టిబొమ్మను దహనం చేసిన కార్యకర్తలు

సాక్షి, హైదరాబాద్: ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ ఎదుర్కొంటున్న పరువు నష్టం కేసులో కింది కోర్టు ఇచ్చిన తీర్పుపై స్టే ఇచ్చేందుకు గుజరాత్ హైకోర్టు నిరాకరించడం పట్ల రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఆందోళన బాట పట్టాయి. రాహుల్ పిటిషన్‌ను కోర్టు స్వీకరించలేదన్న వార్త తెలిసిన వెంటనే రాష్ట్ర వ్యాప్తంగా ఆ పార్టీ కార్యకర్తలు నిరసన తెలియజేశారు. ప్రధాని మోదీ దిష్టిబొమ్మలను ఎక్కడికక్కడ దహనం చేశారు. శుక్రవారం గాంధీభవన్ ఎదుట ఖైరతాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో టీపీసీసీ ఫిషర్‌మెన్ కమిటీ చైర్మన్ మెట్టు సాయికుమార్, డీసీసీ అధ్యక్షుడు రోహిణ్‌రెడ్డి నేతృత్వంలో ఆందోళన చేపట్టారు. అనంతరం ప్రధాని దిష్టిబొమ్మను దహనం చేశారు. సికింద్రాబాద్ డీసీసీ ఆధ్వర్యంలో ట్యాంక్‌బండ్ వద్ద, వేములవాడలో మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్, ఆదిశ్రీనివాస్, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనారెడ్డి నేతృత్వంలో రాస్తారోకో చేసి మోదీ దిష్టిబొమ్మలను దహనం చేశారు. సిరిసిల్ల, ఆదిలాబాద్, నిజామాబాద్ ప్రాంతాల్లో కూడా ఆందోళనలు జరిగాయి. కాగా, సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు టి.నర్సారెడ్డి కోవర్టు రాజకీయాలు చేస్తున్నారని, ఆయన్ను పార్టీ నుంచి తొలగించాలని సిద్దిపేట కార్యకర్తలు ఆందోళన నిర్వహించారు.

క్ర.సం.	ఉద్యోగం పేరు	ఉద్యోగాల సంఖ్య	నియామక విధానం
1.	ప్రొక్యూర్‌మెంట్ ఎక్స్‌పర్ట్	ఒకటి	కాంట్రాక్చువల్/ డిప్యూటేషన్
2.	ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్ ఎక్స్‌పర్ట్	ఒకటి	
3.	ఇన్‌స్టిట్యూట్ & కెపాసిటీ బిల్డింగ్ ఎక్స్‌పర్ట్	ఒకటి	
4.	నేషనల్ వాటర్‌షెడ్ మేనేజ్‌మెంట్ ఎక్స్‌పర్ట్	ఒకటి	

క్లుప్తంగా...

తుపాకీతో కాల్చుకుని డీఐజీ ఆత్మహత్య



సాక్షి, చెన్నై: తమిళనాడు రాష్ట్రం కోయంబత్తూరు రేంజ్ డీఐజీ విజయ కుమార్(45) శుక్రవారం ఉదయం తుపాకీతో కాల్చుకుని ఆత్మహత్య చేసుకున్నారు. ఉదయం వాకింగ్‌కు వెళ్లి వచ్చి నానంతరం కోయంబత్తూరు రేస్ కోర్సులోని క్యాంప్ కార్యాలయం వద్ద తన భద్రతా ఉద్యోగి రవి నుంచి తుపాకీ తీసుకుని కాల్చుకున్నారు. ఈ సమాచారంతో తమిళనాడు పోలీసు యంత్రాంగం ఉలిక్కి పడింది. సీఎం స్టాలిన్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. విచారణలో మానసిక ఒత్తిడి కారణంగానే ఆయన ఈ చర్యకు పాల్పడినట్టు తేలింది. గత కొంతకాలంగా ఆయన మానసిక ఒత్తిడికి సంబంధించి కౌన్సెలింగ్ తీసుకుంటున్నట్లు వెలుగుచూసింది. పోస్టుమార్టం అనంతరం విజయకుమార్ భౌతిక కాయానికి స్వగ్రామం తేని జిల్లా బోడినాయకనూరు సమీపంలోని అన్నైకార పట్టి గ్రామానికి తీసుకెళ్లారు. తమిళనాడు డీజీపీ శంకర్ జివ్వాల్, ఏడీజీపీ అరుణ్‌తోపాటు ఎస్పీ విజయకుమార్ పాడెను మోశారు. విజయకుమార్ తొలుత టీఎన్‌పీఎస్సీ ద్వారా డీఎస్పీగా ఎంపికయ్యారు. ఆ తర్వాత యూపీఎస్సీ పరీక్ష రాసి 2009 బ్యాచ్ ఐపీఎస్ అధికారిగా తమిళనాడులో విధుల్లోకి చేరారు. ఆయనకు భార్య, ఓ కుమార్తె ఉన్నారు.

ఆ 5 పథకాలకు ఏటా రూ.52 వేల కోట్లు



బెంగళూరు: కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన అయిదు ప్రధాన ఎన్నికల హామీల అమలుకు ఏడాదికి రూ.52 వేల కోట్లు ఖర్చవుతాయని కర్ణాటక సీఎం, ఆర్థికమంత్రి పోర్ట్‌ఫోలియో నిర్వహిస్తున్న సిద్ధరామయ్య చెప్పారు. శుక్రవారం ఆయన 2023–24 సంవత్సరానికి గాను రూ.3,27,747 కోట్లతో రాష్ట్ర బడ్జెట్‌ను అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. అయిదు హామీలతో 1.3 కోట్ల కుటుంబాలు లబ్ధి పొందుతాయని, ఒక్కో కుటుంబానికి సరాసరిన నెలకు రూ.4 వేల నుంచి రూ.5 వేల వరకు సాయం అందుతుందని సిద్ధరామయ్య చెప్పారు. ఆర్థిక వనరులను సమకూర్చుకునేందుకు ప్రభుత్వ అనవసర వ్యయాన్ని తగ్గించుకుని, పకడ్బందీగా పన్ను వసూళ్లకు చర్యలు చేపడతామని తెలిపారు. బీజేపీని అధికారం నుంచి దింపేందుకు కాంగ్రెస్ ఇచ్చిన..మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్తు, పేదలకు నెలకు 10 కిలోల ఆహారధాన్యాలు, ప్రతి కుటుంబంలో మహిళకు నెలకు రూ.2 వేలు, నిరుద్యోగ భృతి రూ.3 వేలు పంపిణీ హామీలు పనిచేశాయని పరిశీలకులు అంటున్నారు.

పరువు నష్టం కేసులో రాహుల్‌కు ఎదురుదెబ్బ

శిక్ష నిలుపుదలకు గుజరాత్ హైకోర్టు నిరాకరణ • సుప్రీంకోర్టులో సవాల్ చేస్తామన్న కాంగ్రెస్

అహ్మదాబాద్/న్యూఢిల్లీ: మోదీ ఇంటిపేరుపై వ్యాఖ్యలకు సంబంధించిన పరువు నష్టం కేసులో కాంగ్రెస్ అగ్ర నాయకుడు రాహుల్ గాంధీకి ఎదురుదెబ్బ తగిలింది. గుజరాత్‌లో కింద కోర్టు విధించిన రెండేళ్ల జైలు శిక్షను నిలిపివేయడానికి హైకోర్టు నిరాకరించింది. తనకు విధించిన శిక్షను నిలిపివేయాలంటూ రాహుల్ గాంధీ దాఖలు చేసిన పిటిషన్‌ను జస్టిస్ హేమంత్ ప్రచ్ఛక్ శుక్రవారం తోసిపుచ్చారు. ఆ శిక్షను నిలుపుదల చేయడానికి ఎలాంటి కారణాలు కనిపించడం లేదని అన్నారు. ''రాహుల్ గాంధీపై 10కి పైగా క్రిమినల్ కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. పరువు నష్టం కేసులో రాహుల్ గాంధీకి కింద కోర్టు విధించిన రెండేళ్ల జైలు శిక్ష సరైనదే, న్యాయపరమైనదే. ఈ శిక్షను నిలిపివేయడానికి తగిన కారణాలు ఏమీ లేవు''అని జస్టిస్ హేమంత్ వ్యాఖ్యానించారు. 2019 లోక్‌సభ ఎన్నికల ప్రచారం సందర్భంగా కర్ణాటకలోని కోలార్‌లో దొంగలందరికీ మోదీ అనే ఇంటి పేరే ఎందుకు ఉంటుందో అంటూ రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం లేపాయి. ఈ వ్యాఖ్యలపై గుజరాత్ బీజేపీ ఎమ్మెల్యే పూర్ణేశ్ మోదీ సూరత్ కోర్టులో పరువు నష్టం దావా వేశారు. దీనిపై విచారించిన ట్రయల్ కోర్టు రాహుల్ గాంధీకి రెండేళ్ల జైలు శిక్ష విధించడంతో ఆయన లోక్‌సభ సభ్యత్వం రద్దయిన విషయం తెలిసిందే.

రాహుల్ గొంతు నొక్కేయడానికి కొత్త టెక్నిక్కులు : కాంగ్రెస్

గుజరాత్ హైకోర్టు తీర్పుని సుప్రీం కోర్టులో సవాల్ చేస్తామని కాంగ్రెస్ స్పష్టం చేసింది. రాహుల్ అన్నీ నిజాలు మాట్లాడుతూ ఉండడంతో ఆయన గొంతు నొక్కేయడానికి కేంద్ర ప్రభుత్వం కొత్త టెక్నిక్కులు ఉపయోగిస్తోందని కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి అభిషేక్ సింఘ్వి ఆరోపించారు. గుజరాత్ హైకోర్టు రాహుల్ పిటిషన్‌ను కొట్టేయడం తీవ్ర అసంతృప్తికి లోను చేసిందని, కానీ తాము ఊహించిన తీర్పే వచ్చిందన్నారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే మాట్లాడుతూ బీజేపీ రాజకీయ కుట్రలకు ఎవరూ భయపడడం లేదన్నారు. పార్లమెంటులో రాహుల్ గొంతు నొక్కేయడానికి బీజేపీ కుట్రలు పన్నుతోందని ఆరోపించిన ఖర్గే రాహుల్ గాంధీ న్యాయం కోసం , నిజం కోసం తన పోరాటం కొనసాగిస్తారని ట్విటర్ వేదికగా పేర్కొన్నారు. ఇక పార్టీ ప్రధాన కార్యదర్శి కె.సి. వేణుగోపాల్ ఇలాంటి తీర్పు రావడం పట్ల తమకు ఎలాంటి ఆశ్చర్యం లేదన్నారు. ''ప్రస్తుత పరిస్థితుల్లో గుజరాత్ వంటి రాష్ట్రం నుంచి న్యాయం జరుగుతుందని మేము ఎలా భావిస్తాం. ఈ తీర్పులు రాసేవారు, కోర్టుల్లో పిటిషన్‌లు వేసేవారంతా ఒక్కటి గుర్తు ఉంచుకోవాలి. రాహుల్ లాంటి నాయకుడిని ఏ తీర్పులు , అనర్హత వేటులు ఆపలేవు''అని వ్యాఖ్యానించారు. దేశాన్ని ఏకం చేసే మిషన్ నుంచి రాహుల్‌ని అడ్డుకునే శక్తి దేనికీ లేదన్నారు.



పరువు తీయడం కాంగ్రెస్‌కు అలవాటే: బీజేపీ

గుజరాత్ హైకోర్టు తీర్పుని బీజేపీ స్వాగతించింది. ఇతరుల పరువు తీయడం , వారిని దూషించడం కాంగ్రెస్‌కు తరతరాలుగా వస్తున్న ఒక అలవాటేనని ఆరోపించింది. మోదీ ఇంటి పేరు వ్యాఖ్యలపై క్షమాపణ కోరడానికి రాహుల్ నిరాకరించడం ఆయనకున్న అహంకారాన్ని సూచిస్తుందని బీజేపీ నాయకుడు రవిశంకర్ ప్రసాద్ పేర్కొన్నారు. రాహుల్ గాంధీ ప్రవర్తన ఇలాగే ఉంటే చట్టం తన పని తాను చేసుకుపోతుందని అన్నారు. రాహుల్ గాంధీకి విధించిన శిక్ష అత్యంత కఠినమైనదని అంటున్న వారంతా అంత కఠినమైన నేరాన్ని ఆయన ఎందుకు చేశారో సమాధానం ఇవ్వాలని రవిశంకర్ ప్రసాద్ డిమాండ్ చేశారు.

'వాల్‌మార్ట్' కాల్పుల దోషికి 90 జీవిత ఖైదులు

ఎల్ పాసో: అమెరికాలోని ఎల్ పాసో నగరంలోని వాల్‌మార్ట్ స్టోర్‌లో 2019లో కాల్పులు జరిపి 23 మంది మృతికి కారణమైన వ్యక్తికి కోర్టు 90 వరుస జీవిత ఖైదులను విధించింది. దోషి పాట్రిక్ క్రుసియస్(24)పై సుమారు 50 ఫెడరల్ విద్వేష నేరాభియోగాలున్నాయి. దీనిపై జిల్లా కోర్టు విచారణ జరిపి, శిక్షలు ప్రకటించింది. రాష్ట్ర కోర్టులో విచారణకొస్తే మరణ శిక్ష సహా మరిన్ని శిక్షలపై పట్టుబడతామని న్యాయవాదులు అంటున్నారు. ఈ నేరానికి పాల్పడేందుకు పథకం ప్రకారం క్రుసియస్ డల్లాస్‌లోని సొంతింటి నుంచి ఏకే రైఫిల్‌తో తన వాహనంలో 700 మైళ్ల దూరంలోని ఎల్ పాసోకు వచ్చినట్లు పోలీసులు తెలిపారు. హిస్పానిక్ ప్రజలే లక్ష్యంగా అతడు వాల్ మార్ట్ స్టోర్ లోపల, వెలుపల యథేచ్ఛగా కాల్పులకు తెగబడ్డాడు. ఈ కాల్పుల్లో 23 మంది చనిపోగా మరో 25 మంది గాయపడ్డారు. 2006 తర్వాత అమెరికాలో జరిగిన జాత్యహంకార కాల్పుల ఘటనల్లో అత్యంత తీవ్రమైందిగా ఎల్ పాసో ఘటనను పరిగణిస్తున్నారు.

పవార్ X పవార్

మహారాష్ట్రలోని నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్సీపీ)లో పోరు ముదురుతోంది. ఎన్సీపీ ఎవరిది? శరద్ పవార్‌దా? అజిత్ పవార్‌దా? ఎవరికి వారే పార్టీ తమదేనని వాదిస్తున్నారు. చిన్నాన్నపై ఎదురు తిరిగి అధికార బీజేపీ కూటమితో కలిసిపోయిన అజిత్ పవార్ మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేశాక పార్టీ అధ్యక్ష పదవి నుంచి శరద్ పవార్‌ను తొలగించామని తమదే అసలైన ఎన్సీపీ అంటూ ఎన్నికల సంఘానికి లేఖ రాశారు. ఎన్సీపీ ఎన్నికల గుర్తు గడియారం తమకే కేటాయించాలని ఆ లేఖలో కోరారు. ఆ మర్నాడే జాతీయ కార్యవర్గ సమావేశాన్ని ఏర్పాటు చేసిన శరద్ పవార్ తానే అధ్యక్షుడినని ప్రకటించుకున్నారు. ఇలా ఇరు వర్గాలు పోటాపోటీగా బలప్రదర్శన కోసం సమావేశాలు ఏర్పాటు చేస్తూ మహారాష్ట్రలో రాజకీయ వేడిని పెంచాయి. పార్టీల్లో చీలికలు, ఏది అసలు సిసలు పార్టీ అన్న ప్రశ్నలు కేంద్ర ఎన్నికల సంఘానికి కొత్తేం కాదు. ఇదే ఏడాది మహారాష్ట్రలో శివసేనలో చీలికలు ఏర్పడినప్పుడు ఏక్‌నాథ్ షిండే చీలిక వర్గానికే విల్లు బాణాలు గుర్తుని కేటాయించి అదే అసలైన శివసేన అంటూ ఈసీ తేల్చి చెప్పింది. ఇప్పుడు ఎన్సీపీ వంతు వచ్చింది.

-సాక్షి, నేషనల్ డెస్క్



ఎవరి బలాలు ఏంటి?

మహారాష్ట్ర అసెంబ్లీలో ఎన్సీపీకున్న 53 మంది ఎమ్మెల్యేలకు గాను ప్రస్తుతానికి 32 మంది ఎమ్మెల్యేలు అజిత్ పవార్ వెంట ఉన్నారు. ఆ సంఖ్య 36కి చేరుకుంటే ఎలాంటి అనర్హత వేటు లేకుండా అధికార పక్షంలో కలిసిపోవచ్చు. ఇక ఎన్నికల గుర్తు రావాలన్నా మెజార్టీయే కీలకం. అజిత్ పవార్ నాలుగు దశాబ్దాలుగా ఎన్సీపీలో కీలకంగా వ్యవహరిస్తూ ఉన్నారు. క్షేత్రస్థాయిలో ఆయనకు పట్టు ఉంది. ఎంతో మంది కార్యకర్తలు, జిల్లా స్థాయి నాయకుల మద్దతు అజిత్ పవార్‌కు ఉంది. ఇప్పుడు ఉప ముఖ్యమంత్రిగా అధికారంలో ఉన్నారు కాబట్టి ఆయన బలం మరింత పెరిగే అవకాశాలున్నాయి. అయితే పవార్‌కు ఇలా పార్టీని వీడడం కొత్త కాదు. గతంలో పలు మార్లు బయటకు వచ్చి తిరిగి శరద్ పవార్‌కే జై కొట్టిన సందర్భాలున్నాయి. అందుకే ఎమ్మెల్యేలు ఆయనను ఎంతవరకు నమ్ముతారన్న ప్రశ్న తలెత్తుతోంది. మరోవైపు వచ్చే ఎన్నికల్లో బీజేపీ, శివసేన (షిండే వర్గం)తో కలిసి పోటీ చేస్తే టికెట్లు ఎంతమందికి వస్తాయన్న అనుమానాలు ఉన్నాయి. ఎన్డీయేతో కలిస్తే ముస్లిం, దళిత ఓట్లు పోగొట్టుకుంటామన్న ఆందోళన కూడా చాలా మంది ఎమ్మెల్యేల్లో ఉంది. అందుకే ఆఖరి నిమిషంలో ఎంతమంది అజిత్ పవార్ వెంట నడుస్తారన్నది మిలియన్ డాలర్ ప్రశ్నగా మారింది. ఇక మహారాష్ట్ర దిగ్గజ నాయకుడిగా శరద్ పవార్‌కున్న పాపులారిటీయే వేరు. గత కొన్ని దశాబ్దాలుగా గౌరవప్రదమైన రాజకీయ నాయకుడిగా హోదా అనుభవిస్తున్నారు. ఆయన కనుసైగ చేస్తే చాలు ఎలాంటి పనినైనా చక్కపెట్ట గల అనుచరగణం ఉంది. 82 ఏళ్ల శరద్ పవార్‌కు ఆయన వయసే ప్రతిబంధకంగా మారింది.

మహారాష్ట్ర అసెంబ్లీలో ఎన్సీపీ సభ్యులు	శరద్ పవార్ వెంట ఉన్న ఎమ్మెల్యేలు	అజిత్ పవార్ సమావేశానికి హాజరైనవారు
53	15	32
ప్రస్తుతానికి తటస్థంగా ఉన్న ఎమ్మెల్యేలు	6	

మెజార్టీయే శిరోధార్యం

ఏ పార్టీలోనైనా మెజార్టీ ఎమ్మెల్యేలు, పార్టీలో జిల్లా అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు అత్యధికులు ఎవరివైపు ఉంటే వారిదే అసలైన పార్టీ అని ఈసీ తేలుస్తుంది. దీనికి సంబంధించి పూర్తి స్థాయి కసరత్తు నిర్వహించి పార్టీని స్థాపించిన వారు కాకుండా మెజార్టీ ఎవరి వైపు ఉంటే వారికే పార్టీని, గుర్తుని కేటాయిస్తుంది. 1968లో ఎన్నికల గుర్తుకు సంబంధించిన స్పష్టమైన ఉత్తర్వులున్నాయి. ఈ ఉత్తర్వుల కింద మొట్టమొదటిసారిగా కాంగ్రెస్ పార్టీలో చీలికల కేసుని పరిష్కరించారు. 1969లో కె.కామరాజ్, నీలం సంజీవ రెడ్డి, ఎస్. నిజలింగప్ప, అత్యుల ఘోష్ వంటి నాయకులు ఒక్కటై ఇందిరాగాంధీని పార్టీ నుంచి బహిష్కరించారు. దీంతో పార్టీ రెండుగా విడిపోయింది. నిజలింగప్ప ఆధ్వర్యంలో పాత కాంగ్రెస్‌కే అధికారిక గుర్తు కాడెద్దులు గుర్తు దక్కింది. 1968కి ముందు ఎన్నికల నిబంధనలు, 1961 కింద కార్యనిర్వాహక ఉత్తర్వుల జారీతో ఈసీ ఈ వివాదాన్ని పరిష్కరించేది. 1964లో కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా (సీపీఐ) చీలిక అతి పెద్దదిగా చెప్పుకోవాలి. సీపీఐ (మార్క్సిస్టు) వర్గం తమని ప్రత్యేక పార్టీగా గుర్తించాలని కోరింది. అప్పట్లో ఆంధ్రప్రదేశ్, కేరళ, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల ఎమ్మెల్యేలు, ఎంపీలు మద్దతుగా ఉన్నట్టుగా ఈసీకి లేఖ సమర్పించింది. ఏదేమైనా ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు ఎవరి వెంట ఎక్కువ మంది ఉంటే వారిదే అసలు సిసలు పార్టీగా ఎన్నికల సంఘం గుర్తించడం ఆనవాయితీగా వస్తోంది.

లోక్‌సభ ఎన్నికలపై ఎలాంటి ప్రభావం ?

మహారాష్ట్ర ఎన్సీపీలో సంక్షోభం వచ్చే లోక్‌సభ ఎన్నికలపై పడే ప్రభావంపైనే సర్వత్రా చర్చ జరుగుతోంది. బీజేపీ వెనక ఉండి నడిపించినట్టు ఆరోపణలు వస్తున్న ఆపరేషన్ అజిత్ పవార్‌తో ఇప్పటికిప్పుడు మహారాష్ట్ర అసెంబ్లీకి వచ్చే లాభమేమీ లేదు. ఇప్పటికే ఏక్‌నాథ్ షిండే సర్కార్ పూర్తి స్థాయి మెజార్టీతో బలంగానే ఉంది. వచ్చే ఏడాది జరగనున్న లోక్‌సభ ఎన్నికల్ని దృష్టిలో ఉంచుకొనే బీజేపీ అజిత్ పవార్ తిరుగుబాటును ప్రోత్సహించినట్టుగా తెలుస్తోంది. ఉత్తరప్రదేశ్ తర్వాత అత్యధిక లోక్‌సభ స్థానాలు కలిగిన రాష్ట్రం మహారాష్ట్ర. 48 ఎంపీ స్థానాలతో ఈ రాష్ట్రం పార్లమెంటు ఎన్నికల్లో అత్యంత కీలకంగా ఉంది. 2019 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ–శివసేన కూటమి 41 లోక్‌సభ స్థానాలను గెలుచుకున్నాయి. కానీ ఇప్పుడు ఎన్డీయేతో శివసేన లేకపోవడంతో ఆ పార్టీలో చీలికలు తెచ్చి ఏక్‌నాథ్ షిండే వర్గాన్ని తమ వైపు లాక్కుంది. అయినప్పటికీ గత ఎన్నికల మాదిరిగా సీట్లు వచ్చే అవకాశం లేకపోవడంతో ఎన్సీపీని కూడా చీల్చడానికి ప్రయత్నించిందన్న విశ్లేషణలు వినిపిస్తున్నాయి. విపక్షాలను బలహీన పరచడమే కాకుండ ప్రజాకర్షణ బలంగా ఉన్న మరాఠా నాయకులైన ఏక్‌నాథ్ షిండే, అజిత్ పవార్ వంటి వారి అండ బీజేపీ వైపు ఉంది. ఈ సారి కాంగ్రెస్, శివసేన ఉద్ధవ్ వర్గంతో ఎన్సీపీ శరద్ పవార్ వర్గం చేతులు కలిపినప్పటికీ తమ వైపు ఉన్న నాయకులే బలంగా ఉన్నట్టుగా బీజేపీ నమ్ముతోంది. ఓ రకంగా మహారాష్ట్ర బీజేపీ చెయ్యి జారిపోకుండా కాపాడుకోవడానికే ఇదంతా చేస్తోందన్న విశ్లేషణలు వినిపిస్తున్నాయి.



అమెరికాలోని నెవార్క్ పోర్టులో నిలిచిన ఇటాలియన్ సరుకు నౌక ఇది. సుమారు 1,200 పాత, కొత్త వాహనాలతో పశ్చిమ ఆఫ్రికా వైపు వెళుతుండగా మంటలు చెలరేగాయి. మూడు రోజులుగా ప్రయత్నిస్తున్నా మంటలు అదుపులోకి రాలేదు. ప్రమాదవశాత్తు ఇద్దరు ఫైర్ ఫైటర్లు ప్రాణాలు కోల్పోయారు.

ఉత్తరాఖండ్‌లో టమాటా కేజీ రూ. 250



''ఏవండీ టమాటాలు చాలా చీప్‌గా ఉన్నాయట. కేజీ 15 వందలేనట. ఇంటికి వచ్చేటప్పుడు ఓ రెండు కేజీలు తీసుకురండి'' అని ఆదిత్య 369 సినిమాలో ఒక డైలాగ్ ఉంటుంది. అప్పట్లో అదో పెద్ద జోక్‌లా అందరూ పడి పడి నవ్వారు. కానీ ఇప్పుడు టమాటా ధరల్ని చూస్తూ ఉంటే అదెంత కఠోర వాస్తవమో తెలుస్తుంది. మరీ ఆ సినిమాలో చూపించిన స్థాయిలో కాకపోయినా లీటర్ పెట్రోల్ ధర కంటే టమాటా ధరలు మండిపోతున్నాయి. ఢిల్లీ, ముంబై, బెంగుళూరు వంటి రాష్ట్రాల్లో కేజీ టమాటా రూ.160కి చేరుకుంటే ఉత్తరాఖండ్‌లో అత్యధికంగా టమాటా కేజీ ధర రూ.250గా ఉంది. గంగోత్రి రిటైల్ మార్కెట్లో శుక్రవారం కేజీ టమాటా రూ.250 ధర పలికింది. ఉత్తరకాశీలో టమాటా ధర రూ.180 నుంచి రూ.200 వరకు ఉంది. దీంతో టమాటా కొనడానికి సామాన్యులెవరూ ముందుకు రావడం లేదు. సాధారణంగా ప్రతీ ఏడాది జూన్, జూలై నెలల్లో టమాటా ధరలు పెరిగిపోతాయి. కానీ ఈ సారి అసాధారణంగా రేట్లు భగ్గుమనడంతో సామాన్య జనం గగ్గోలు పెడుతున్నారు. టమాటా పండించే ప్రాంతాలలో అతివృష్టి లేదంటే అనావృష్టి పరిస్థితులు, రుతుపవనాలు ఆలస్యం కావడం, ఉష్ణోగ్రతలు భారీగా పెరిగిపోవడం వంటి కారణాలతో దిగుబడి పడిపోయి ధరలు ఆకాశాన్నంటాయి. టమాటా ధరలు పెరిగిపోవడంపై సోషల్ మీడియాలో మీమ్స్ వెల్లువెత్తుతున్నాయి. కొందరు నెటిజన్లు టమాటా కంటే పెట్రోల్ తక్కువ ధరకి వస్తోందని అంటే మరికొందరు టమాటా అమ్మకందారులు రుణాలిచ్చే అధికారుల్ని కూడా వెంట తీసుకురావాలంటూ సెటైర్లు వేస్తున్నారు.

మెక్‌డొనాల్డ్స్ బర్గర్లలో నో టమాటా

టమాటో ధరలు రోజు రోజుకి పెరిగిపోతూ ఉండడంతో ఫాస్ట్ ఫుడ్ రెస్టారెంట్ మెక్‌డొనాల్డ్ తమ బర్గర్లలో ఇక టమాటాలు వేయమని తేల్చి చెప్పింది. న్యూఢిల్లీలోని మెక్‌డొనాల్డ్స్ ఔట్‌లెట్ బయట బర్గర్లలో టమాటాలు వెయ్యలేమని అందరూ సహకరించాలంటూ ఒక నోటీసు అంటించింది. టమాటా ధరతో పాటు నాణ్యత కూడా లోపించడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్టుగా తెలిపింది. కేవలం నెల రోజుల వ్యవధిలో టమాటా ధరలు అయిదు రెట్లు పెరిగిపోవడంతో వాటిని కొనడానికి ముందు వెనుక ఆలోచించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

- సాక్షి, నేషనల్ డెస్క్

అవినీతే కాంగ్రెస్ ఊపిరి

- అది లేకుండా ఆ పార్టీ బతకలేదు
- ప్రధానమంత్రి మోదీ ఘాటు విమర్శలు
- ఛత్తీస్‌గఢ్, యూపీల్లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

రాయ్‌పూర్/గోరఖ్‌పూర్: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మరోసారి కాంగ్రెస్‌పై నిప్పులు చెరిగారు. కాంగ్రెస్ ఊపిరి, ముఖ్య సిద్ధాంతం అవినీతేనని పేర్కొన్నారు. అవినీతి లేకుండా ఆ పార్టీ బతకలేదని విమర్శించారు. శుక్రవారం ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం రాయ్‌పూర్‌లో జరిగిన వివిధ కార్యక్రమాల్లో ప్రధాని మోదీ పాల్గొని మాట్లాడారు. ఛత్తీస్‌గఢ్ అభివృద్ధిని అధికారంలో ఉన్న కాంగ్రెస్ అడ్డుకుంటోందని ఆరోపించారు. రాష్ట్రాన్ని ఆ పార్టీ ఏటీఎంలా మార్చేసుకుందని వ్యాఖ్యానించారు. అవినీతికి కాంగ్రెస్ గ్యారెంటీ అయితే, అవినీతి పరులపై చర్యలకు తనదీ గ్యారెంటీ అని అన్నారు. 'కుంభకోణాల్లో మునిగిన కాంగ్రెస్ ప్రభుత్వం దుష్పరిపాలనకు ఆదర్శంగా మారింది. అభివృద్ధికి అడ్డుగోడగా నిలిచింది. ప్రజల హక్కుల్ని లాగేసుకుని, రాష్ట్రాన్ని లూటీ చేసి, నాశనం చేసేందుకు పూనుకుంది. అందుకే వచ్చే ఎన్నికల్లో ఈ ప్రభుత్వాన్ని సాగనంపాలని ప్రజలు నిర్ణయించుకున్నారు'అని ప్రధాని నిప్పులు చెరిగారు. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో ప్రకటించిన మద్య నిషేధం తదితర 36 వాగ్దానాలను ఆ పార్టీ నెరవేర్చలేకపోయింది. మద్య నిషేధానికి బదులుగా కోట్లాది రూపాయల మద్యం కుంభకోణానికి పాల్పడింది. ఈ డబ్బంతా కాంగ్రెస్ ఖాతాలోకే చేరింది. ఒక్క మద్యానికే కాదు. ప్రతి శాఖలోనూ అవినీతే. అవినీతి కాంగ్రెస్‌కు ఊపిరిగా మారింది. అది లేకుండా ఆ పార్టీకి శ్వాస ఆడదు. అవినీతే కాంగ్రెస్ ముఖ్య సిద్ధాంతం'అని అన్నారు. కాంగ్రెస్ అవినీతికి గ్యారెంటీ అని నేను విమర్శిస్తే కొందరు నాపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దానర్థం, అవినీతికి వ్యతిరేకంగా కేంద్ర ప్రభుత్వం పనిచేస్తున్నట్లే. కాంగ్రెస్ అవినీతికి గ్యారెంటీ అయితే, అవినీతిపై చర్యలకు మోదీ గ్యారెంటీ'అని ఆయన స్పష్టం చేశారు. అవినీతి పరులు, గతంలో పరస్పరం దూషించుకున్నవారు ఇప్పుడు దగ్గరవుతున్నారంటూ బీజేపీకి వ్యతిరేకంగా ఏకమయ్యేందుకు ప్రతిపక్షాలు చేస్తున్న ప్రయత్నాలపై ఆయన మండిపడ్డారు. ఇటువంటి వాటికి భయపడేది లేదన్నారు. 'తప్పుడు పనుల్లో మునిగి తేలేవారు తప్పించుకోలేరు. నా దగ్గర ఉన్నదంతా మీరు (ప్రజలు), ఈదేశం ఇచ్చినవేనని ధైర్యంగా చెబుతున్నా. నాపై కుట్రలు పన్నుతున్న వారికి, నా సమాధి తవ్వాలని చూస్తున్న వారికి భయపడను. భయపడితే మోదీనే కాను'అని ప్రధాని చెప్పారు. రాష్ట్రం నుంచి నక్సలిజంను లేకుండా చేసేందుకు కేంద్రం తీసుకుంటున్న చర్యలు ఫలితమిస్తున్నాయని తెలిపారు. నక్సల్ ప్రభావిత జిల్లాల సంఖ్య 126 నుంచి 70కి తగ్గిపోయిందన్నారు.



రాయ్‌పూర్‌లో మహిళా లబ్ధిదారుతో ప్రధాని మోదీ

అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు

రాయ్‌పూర్‌లో రూ.7,600 కోట్ల విలువైన ఎనిమిది ప్రాజెక్టులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కాంకేర్ జిల్లా అంతగఢ్– రాయ్‌పూర్ రైలుకు వర్చువల్‌గా జెండా ఊపారు. ఆయుష్మాన్ భారత్ పథకం కార్డులను పంపిణీ చేశారు. దశాబ్దాలుగా అన్యాయానికి గురవుతున్న వారికి ఆధునిక సౌకర్యాలు కల్పించేందుకు తమ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. శంకుస్థాపన చేసిన రాయ్‌పూర్– ధన్‌బాద్ ఎకనామిక్ కారిడార్, రాయ్‌పూర్–విశాఖపట్టణం ఆర్థిక కారిడార్ ప్రాజెక్టులతో ఈ ప్రాంత రూపురేఖలే మారనున్నాయన్నారు.

గీతా ప్రెస్ శతాబ్ది ఉత్సవాల్లో ప్రధాని

శుక్రవారం ప్రధాని మోదీ గోరఖ్‌పూర్‌లో పర్యటించారు. గీతా ప్రెస్ శతాబ్ది ఉత్సవాల ముగింపు కార్యక్రమంలో పాల్గొన్నారు. గీతా ప్రెస్ కేవలం పుస్తకాలను ముద్రించే ముద్రణాలయం కాదు, ప్రజల విశ్వాసం, దేవాలయమని పేర్కొన్నారు. మహాత్మాగాంధీకి గీతా ప్రెస్‌తో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేశారు. గీతా ప్రెస్ ఆధ్వర్యంలో నడిచే కల్యాణ్ మేగజీన్ కోసం ఆయన వ్యాసాలు రాసే వారని చెప్పారు. ప్రధాని రెండు వందేభారత్ రైళ్లను ప్రారంభించారు. అనంతరం సొంత నియోజకవర్గం వారణాసికి చేరుకున్నారు. అక్కడ రూ.12 వేల కోట్ల 29 అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించారు. గత ప్రభుత్వాలహయాంలో ఏసీ గదుల్లో కూర్చుని సంక్షేమ పథకాలను తయారు చేసే, ప్రభావం ఏమిటనే దానిపై అప్పటి నాయకులకు అవగాహన లేదని ప్రధాని అన్నారు.

త్రిపుర అసెంబ్లీలో గందరగోళం

అగర్తలా: త్రిపుర అసెంబ్లీలో శుక్రవారం గందరగోళం చెలరేగింది. సభా కార్యకలాపాలకు అంతరాయం కలిగించినందుకు స్పీకర్ అయిదుగురు సభ్యులను సస్పెండ్ చేశారు. మార్చిలో అసెంబ్లీ సమావేశాలు జరుగుతుండగా బీజేపీకి చెందిన జాదవ్‌లాల్ నాథ్ సభలోనే తన సెల్‌ఫోన్‌లో అశ్లీల చిత్రాలు చూశారనే ఆరోపణలొచ్చాయి. ఆ ఘటనపై చర్చను చేపట్టాలంటూ తిప్రా మోథా పార్టీకి చెందిన అనిమేశ్ దేబ్‌వర్మ వాయిదా తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. స్పీకర్ బిశ్వ బంధు సేన్ ఆ తీర్మానాన్ని తోసిపుచ్చుతూ ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి గాను రాష్ట్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టాలని ఆర్థిక మంత్రిని కోరారు. స్పీకర్ నిర్ణయంపై తిప్రా మోథా సభ్యులు నిరసనకు దిగారు. సీపీఎం, కాంగ్రెస్ సభ్యులు వారికి తోడయ్యారు. దీంతో, స్పీకర్ బిశ్వ బంధు సేన్..తిప్రా మోథాకు చెందిన ముగ్గురు, కాంగ్రెస్, సీపీఎంలకు చెందిన ఒక్కో ఎమ్మెల్యేలను సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ నిర్ణయంపై ప్రతిపక్ష సభ్యులు వాకౌట్ చేశారు. సీఎం మాణిక్ సాహా జోక్యంతో స్పీకర్ సస్పెన్షన్ ఎత్తివేస్తున్నట్లు ప్రకటించడంతో ఆ ఎమ్మెల్యేలు తిరిగి సభలోకి వచ్చారు. అయితే, ఎమ్మెల్యే జాదవ్ లాల్ చేసిన తప్పును ఖండిస్తూ తీర్మానం చేయాలన్నారు. స్పీకర్ తిరస్కరించడంతో మళ్లీ వాకౌట్ చేశారు.

సిసోడియా తదితరుల ఆస్తులు అటాచ్

న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం కుంభకోణంలో మనీ లాండరింగ్ ఆరోపణలు ఎదుర్కొంటున్న ఆప్ నేత, ఢిల్లీ మాజీ డిప్యూటీ సీఎం మనీష్ సిసోడియా, ఆయన భార్య, ఇతరులకు చెందిన రూ.52 కోట్ల విలువైన ఆస్తులను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) అటాచ్ చేసింది. మనీష్ సిసోడియాను మార్చిలో ఈడీ అరెస్ట్ చేసింది. ప్రస్తుతం జ్యుడీషియల్ కస్టడీలో ఉన్నారు.

ఎన్సీపీ చీలి పోలేదు: ప్రఫుల్ పటేల్

ముంబై: నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ(ఎన్సీపీ) చీలిపోలేదని ఆ పార్టీ నేత ప్రఫుల్ పటేల్ చెప్పారు. పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు, వివిధ విభాగాలు జూన్ 30వ తేదీన సమావేశమై అజిత్ పవార్‌ను అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నాయని వెల్లడించారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. అజిత్ పవార్ తమ పార్టీ అధ్యక్షుడని పేర్కొంటూ 40 మందికి పైగా ఎమ్మెల్యేలు ఎన్నికల సంఘం(ఈసీఐ)కి నివేదిక అందజేశారన్నారు. పార్టీ పేరు, గుర్తులను తమకే కేటాయించాలని కోరారని కూడా చెప్పారు. గురువారం శరద్‌పవార్ నేతృత్వంలో ఢిల్లీలోని జరిగిన ఎన్సీపీ సమావేశం అధికారికం కాదన్నారు. అజిత్ పవార్‌ను, ఆయన వర్గానికి చెందిన వారిని బహిష్కరిస్తూ శరద్ పవార్ వర్గం తీసుకున్న నిర్ణయం చెల్లదని చెప్పారు. అసలైన రాజకీయ పార్టీ ఎవరిదనే నిర్ణయించాల్సింది ఎన్నికల సంఘమేనన్నారు.

గ్రీన్‌కార్డు ఆశలు తీరే మార్గం..



- నిరుపయోగంగా ఉన్న 2 లక్షల గ్రీన్‌కార్డుల పునర్వినియోగం
- ప్రతిపాదనకు అమెరికా అధ్యక్షుడి సలహా మండలి ఆమోదం
- ఎక్కువ కార్డులు కుటుంబం, ఉద్యోగం కేటగిరీల్లోనివే..

వాషింగ్టన్: గ్రీన్‌కార్డుల కోసం ఏళ్లుగా ఎదురు చూస్తున్న భారతీయ అమెరికన్లకు శుభవార్త. 1992 నుంచి నిరుపయోగంగా ఉన్న 2.30 లక్షలకు పైగా గ్రీన్‌కార్డులను స్వాధీనం చేసుకుని, పునర్వినియోగించాలన్న సిఫారసుపై అధ్యక్షుడి సలహా మండలి ఆమోద ముద్ర వేసింది. ఫలితంగా, మరింత మంది గ్రీన్‌కార్డులను అందుకునేందుకు వీలు ఏర్పడింది. దీని ప్రకారం..ఏటా ఇచ్చే 1.40 లక్షల గ్రీన్‌కార్డులకు అదనంగా 2.30 లక్షల కార్డుల్లో ఏటా కొన్నిటిని జారీ చేస్తారని ప్రముఖ భారతీయ అమెరికన్ అజయ్ భుటోరియా చెప్పారు. అధ్యక్షుడు బైడెన్‌కు ఆసియన్ అమెరికన్ల సలహా మండలిలో భుటోరియా సభ్యుడు. ఇందుకు సంబంధించిన సిఫారసులను మండలికి గురువారం అందజేసినట్లు ఆయన తెలిపారు. గ్రీన్ కార్డు అంటే అమెరికాలో వలసదారులకు అందజేసే శాశ్వత నివాస పత్రం. ఉపయోగంలో లేని గ్రీన్‌కార్డులను తిరిగి స్వాధీనం చేసుకోవడం, ముమ్ముందు గ్రీన్‌కార్డుల వృథాను అరికట్టేందుకు పలు సిఫారసులను చేశామన్నారు. వీటి అమలుతో గ్రీన్‌కార్డు కోసం ఎదురుచూస్తున్న వారికి ఎంతో ఊరటనిస్తుందని చెప్పారు. తమ కమిషన్ సిఫారసులకు ఆమోదం తెలిపిన బైడెన్ ప్రభుత్వానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కుటుంబ, ఉద్యోగ ప్రాతిపదికన వలసదారులకు ఏటా నిర్ణీత సంఖ్యలో గ్రీన్‌కార్డులను జారీ చేసే అధికారం డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ(డీహెచ్ఎస్)కి కాంగ్రెస్ ఇస్తుంటుంది. అయితే, పరిపాలనాపరమైన జాప్యంతో జారీ అయిన గ్రీన్‌కార్డుల్లో కొన్ని నిరుపయోగంగా ఉండిపోతున్నాయి. అనేక ఏళ్లుగా ఇలా కార్డులు లక్షలుగా పేరుకుపోయాయని భుటోరియా వివరించారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు రెండు చర్యలను తాము సూచించినట్లు వెల్లడించారు. అందులో ఒకటి...1992 నుంచి ఉపయోగంలో గ్రీన్‌కార్డులను తిరిగి స్వాధీనం చేసుకోవాలి. ఏటా ఇచ్చే 1.40 లక్షల గ్రీన్‌కార్డులకు తోడుగా స్వాధీనం చేసుకున్న 2.30 లక్షల కార్డుల్లో ఏటా కొన్నిటినీ జారీ చేయాలి. రెండోది..ఆ ఆర్థిక సంవత్సరంలో సంబంధిత పత్రాలను ఏజెన్సీలు ప్రాసెస్ చేయలేకపోయినప్పటికీ, అన్ని గ్రీన్ కార్డ్‌లు వార్షిక పరిమితి ప్రకారం అర్హులైన వలసదారులకు అందుబాటులో ఉండేలా కొత్త విధానాన్ని తీసుకురావడం. కొత్త విధానం అమల్లోకి రాకముందే ఉపయోగించని గ్రీన్ కార్డ్‌లను తిరిగి పొందేందుకు ఈ విధానాన్ని ముందస్తుగా వర్తింపజేయడం'అని ఆయన వివరించారు. ఈ సిఫారసులు అమల్లోకి వస్తే ఎన్నో కుటుంబాలు, వ్యక్తులతోపాటు అమెరికా ఆర్థిక వ్యవస్థకు కూడా ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. నిరుపయోగంగా ఉండే గ్రీన్‌కార్డుల ప్రభావం ముఖ్యంగా భారతీయ అమెరికన్లు, ఫిలిపినో అమెరికన్లు, చైనీస్ అమెరికన్ల కుటుంబాలపైనే ఉంటుందని చెప్పారు. గ్రీన్‌కార్డుల కొరత ప్రభావం తాత్కాలిక ఉద్యోగాలు చేసుకునే హెచ్–1బీ వీసాదారులపై ఉంటుందని, వారి పిల్లల వలస హోదాపైనా పడుతోందన్నారు. 2020 గణాంకాల ప్రకారం 42 లక్షల కుటుంబాలు సగటున ఆరేళ్లుగా గ్రీన్‌కార్డుల కోసం ఎదురుచూస్తున్నారు. భారతీయ ఐటీ నిపుణులు గ్రీన్‌కార్డు కోసం సగటున దశాబ్ద కాలంపాటు ఎదురు చూపులు చూడాల్సిన పరిస్థితులున్నాయి.

సాక్షి
హైదరాబాద్
శనివారం ၊ 8 ၊ జూలై ၊ 2023



లష్కర్ బోనాలకు రండి సార్

సికింద్రాబాద్: లష్కర్‌లో జరిగే బోనాల వేడుకలకు శుక్రవారం సీఎం కేసీఆర్‌ను అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్ ఆహ్వానించారు.



నకిలీ ఎన్‌ఓసీలతో బ్యాంకులకు టోకరా

నకిలీ ఎన్‌ఓసీలు సృష్టించి బ్యాంకులకు దాదాపు రూ.1.26 కోట్లు ఎగవేసిన ముఠా గుట్టును పోలీసులు రట్టు చేశారు. -8లో

వీధి దీపాల సమస్యను రెండ్రోజుల్లో పరిష్కరించాలి



నగరంలో వీధి దీపాల సమస్యను రెండు రోజుల్లోనే పరిష్కరించాలని మేయర్ విజయ లక్ష్మి అధికారులను ఆదేశించారు. -8లో

న్యూస్‌రీల్

ముగిసిన హజ్ ఆరాధనలు

సాక్షి, సిటీబ్యూరో: తెలంగాణ రాష్ట్రం నుంచి వెళ్లిన హజ్ యాత్రికుల ఆరాధనలు ముగియడంతో భక్తులు మదీనా నగరానికి వెళ్తున్నారని హజ్ కమిటీ చైర్మన్ మహ్మద్ సలీం తెలిపారు. శుక్రవారం నాంపల్లిలోని ఆయన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రం నుంచి వెళ్లిన 5,583 మంది యాత్రికులు క్షేమంగా ఉన్నారని, అనారోగ్య కారణాలతో ఇద్దరు యాత్రికులు మృతి చెందినట్లు ఆయన తెలిపారు. వీరిలో ఒకరు బార్కస్‌కు చెంది అహ్మద్ బిన్ అబ్దుల్లా (76), మరొకరు నిజామాబాద్ అహ్మద్‌పురా కాలనీకి చెందిన సయ్యద్ అబ్దుల్ ఖుద్దుస్ (73) ఉన్నట్లు చెప్పారు. హజ్ ఆరాధనలు పూర్తయ్యాక మూడు గ్రూప్‌లుగా మదీనా నగరానికి చేరుకుంటారన్నారు. మదీనా నగరంలో వారం రోజులు ఉండి ఈ నెల 15న నుంచి నగరానికి తిరుగు పయనమవుతారని సలీం తెలిపారు. 30వ తేదీ వరకు యాత్రికులంతా ఎయిర్‌పోర్ట్‌కు చేరుకుంటారని వివరించారు.

అదుపుతప్పిన బీఎండబ్ల్యూ కారు

- జీహెచ్‌ఎంసీ ఉద్యోగికి తీవ్ర గాయాలు

బంజారాహిల్స్: అదుపుతప్పిన వేగంతో వచ్చిన బీఎండబ్ల్యూ కారు ఢీకొట్టడంతో జీహెచ్‌ఎంసీ ఉద్యోగికి తీవ్ర గాయాలయ్యాయి. బంజారాహిల్స్ వార్డు జీహెచ్‌ఎంసీ ఫీల్డ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న జి.బాలచందర్ యాదవ్ శుక్రవారం తెల్లవారుజామున బంజారాహిల్స్ రోడ్ నెం.13లో పారిశుద్ధ్య పనులను పరిశీలించేందుకు ద్విచక్ర వాహనంపై వెళ్తున్నాడు. అదే సమయంలో రాంగ్ రూట్‌లో మితిమీరిన వేగంతో దూసుకు వచ్చిన బీఎండబ్ల్యూ కారు బాలచందర్ బైక్‌ను ఢీకొట్టింది. దీంతో ఆయనకు తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదం అనంతరం బీఎండబ్ల్యూ కారు ఆగకుండా ముందుకు దూసుకువెళ్లింది. ఈ మేరకు స్థానికులు బంజారాహిల్స్ పోలీసులకు సమాచారం ఇవ్వగా 108 అంబులెన్స్ సాయంతో సెంచరీ ఆస్పత్రిలో చేర్చారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు హిట్ అండ్ రన్ కేసు నమోదు చేశారు. ఈ కారు ప్రస్తుతం మాదాపూర్‌కు చెందిన నిర్మాణ సంస్థ పేరుతో ఉందని, ఇటీవల షాహబాజ్ అనే వ్యక్తి కొనుగోలు చేసినట్లు తెలుస్తోంది. కారును తన పేరు మీదకు మార్చుకోలేదని తేలింది. కాగా ప్రమాద సమయంలో సాహిల్ అనే యువకుడు కారు నడుపుతున్నట్లు పోలీసులు గుర్తించారు, ఆ సమయంలో కారులో ఇద్దరు యువతులతో పాటు మరో ముగ్గురు యువకులు ఉన్నట్లు తేలింది.

సమన్వయంతోనే డ్రగ్స్‌కు అడ్డుకట్ట: సీపీ

సాక్షి, సిటీబ్యూరో: రాష్ట్రంలో మాదకద్రవ్యాలకు చెక్ చెప్పడానికి ప్రత్యేకంగా ఏర్పాటైన నేషనల్ కో–ఆర్డినేషన్ కమిటీ (ఎన్–కాడ్) తొలి సమావేశం గురువారం జరిగిందని శుక్రవారం కొత్వాల్ సీవీ ఆనంద్ పేర్కొన్నారు. సచివాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి నేతృత్వంలో జరిగిన ఈ సమావేశంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన అన్ని ఏజెన్సీలు పాల్గొన్నట్లు ఆయన వివరించారు. పోలీసు విభాగంతో పాటు పాఠశాల విద్య, వైద్య ఆరోగ్య శాఖ నుంచి ఎఫ్‌ఆర్‌ఆర్‌ఓ, ఐబీ తదితర సంస్థలు పాల్గొన్నట్లు ఆయన తెలిపారు. అన్ని విభాగాలు సమన్వయంతో పని చేస్తేనే డ్రగ్స్‌ను నిరోధించగలమని, దీనికోసం ఏఏ విభాగాలు ఏ పాత్ర పోషించాలనేది ఈ సమావేశంలో చర్చించామని ఆనంద్ పేర్కొన్నారు. ఇకపై ప్రతినెలా ఈ సమావేశాలు జరుగుతాయని ఆయన తెలిపారు.

ఫీజు బకాయిలు రూ.5 వేల కోట్లు విడుదల చేయాలి

ఆర్.కృష్ణయ్య

విజయనగర్‌కాలనీ: కళాశాల విద్యార్థుల ఫీజు బకాయిలు రూ.5 వేల కోట్లు వెంటనే విడుదల చేయడంతో పాటు రూ.20 వేల స్కాలర్‌షిప్‌లు మంజూరు చేయాలని రాజ్యసభ సభ్యుడు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. సంఘం కన్వీనర్ లాల్‌కృష్ణ ఆధ్వర్యంలో వందలాది మంది విద్యార్థులతో కలిసి శుక్రవారం ఆయన మాసబ్‌ట్యాంక్‌లోని బీసీ సంక్షేమ భవన్‌ను ముట్టడించారు. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ.. ఇంజినీరింగ్, ఎంబీఏ, ఎంసీఏ, పీజీ, డిగ్రీ, ఇంటర్ కాలేజీ కోర్సులు చదివే బీసీ విద్యార్థుల మొత్తం ఫీజుల స్కీంను పునరుద్ధరించడంతో పాటు ఐఐటీ, ఐఐఎం, ఎన్‌ఐటీ తదితర కోర్సులకు పూర్తి ఫీజులు చెల్లించాలన్నారు. కళాశాల విద్యార్థులకు సంవత్సరానికి ఆంధ్రప్రదేశ్‌లో ఇస్తున్నట్లు రూ.20 వేల స్కాలర్‌షిప్‌లను మన రాష్ట్రంలోనూ మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం నాయకులు గుజ్జ కృష్ణ, ఎర్ర సత్యనారాయణ, అంజి, రామకృష్ణ, నీల వెంకటేష్, సతీష్, నీరడి భూపేష్ సాగర్, రాజ్‌కుమార్, నందగోపాల్, భాస్కర్, ప్రజాపతి, శివకుమార్, ఉదయ్ పాల్గొన్నారు.







ప్రయాణికులకు నీళ్ల బాటిల్ ఇస్తున్న సిబ్బంది

గందరగోళం

ఫలక్‌నుమా రైలు దగ్ధం ఘటనతో ఆందోళన

- సికింద్రాబాద్ స్టేషన్‌లో ప్రయాణికుల పడిగాపులు
- సహాయ కేంద్రాన్ని ఏర్పాటు చేసిన ద.మ.రైల్వే

సాక్షి, సిటీబ్యూరో: ఘట్‌కేసర్ సమీపంలోని పగిడిపల్లి వద్ద శుక్రవారం జరిగిన ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్ ప్రమాద ఘటన ప్రయాణికులను తీవ్ర ఆందోళనకు గురిచేసింది. అదృష్టవశాత్తు ఎలాంటి ప్రాణనష్టం లేకుండా ప్రయాణికులంతా క్షేమంగా బయటపడినప్పటికీ.. కళ్ల ముందే అగ్నికీలలు వ్యాపించడంతో భయాందోళనతో పరుగులు తీశారు. దగ్ధమైన బోగీలను వదిలేసి మిగతా బోగీలలో ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్ సికింద్రాబాద్ స్టేషన్‌కు చేరుకొంది. కొందరు ప్రయాణికులు మాత్రం పగిడిపల్లి నుంచే బస్సులు, ఇతర వాహనాల్లో నగరానికి చేరుకున్నారు. ప్రయాణికులంతా ప్రాణాలు అరచేతుల్లో పెట్టుకొని బిక్కుబిక్కుమంటూ వచ్చారు. చాలామంది ప్రమాదం నుంచి తేరుకోలేకపోయారు. పగటిపూట కావడంతో పెద్ద ప్రమాదం తప్పిందని, రాత్రి వేళలో ప్రమాదం జరిగి ఉంటే ఇలా ప్రాణాలతో బయటకు వచ్చే వాళ్లం కాదని కొందరు ప్రయాణికులు తెలిపారు. పైగా మంటలు అంటుకోవడంతో పాటే ట్రైన్ నిలిచిపోవడం వల్ల బయటపడగలిగినట్లు చెప్పారు. వందల కిలోమీటర్లు దాటుకొని వచ్చిన హౌరా– ఫలక్‌నుమా (12703) ఎక్స్‌ప్రెస్ మరికొద్ది సేపట్లో ప్రయాణకులు గమ్యం చేరుకొంటారనగా ప్రమాదానికి గురికావడం గమనార్హం.ఈ రైలు ప్రమాదంతో తమకు ఒడిశా ఘటనే గుర్తుకు వచ్చిందని, తలుచుకొంటేనే ఒల్లు గగుర్పొడుస్తోందని కొందరు ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేశారు. మరోవైపు వివిధ మార్గాల్లో నగరానికి బయలుదేరిన ప్రయాణికులకు దక్షిణమధ్య రైల్వే అన్ని ఏర్పాట్లు చేసింది.



ప్రయాణికుల వివరాలను సేకరిస్తున్న రైల్వే పోలీసులు

పలు మార్గాల్లో రైళ్లు రద్దు..



- ఫలక్‌నుమా ప్రమాద ఘటన నేపథ్యంలో సికింద్రాబాద్ నుంచి శుక్రవారం బయలుదేరాల్సిన పలు రైళ్లు రద్దయ్యాయి. వివిధ ప్రాంతాల నుంచి నగరానికి వచ్చే రైళ్లను పాక్షికంగా రద్దు చేశారు. కొన్నింటిని ఇతర రూట్‌లలోకి మళ్లించారు.దీంతో ప్రయాణికులు గందరగోళానికి గురయ్యారు. ఆకస్మికంగా రైళ్లు రద్దు కావడంతో టిక్కెట్ రీఫండ్ కోసం బారులు తీరారు. మరోవైపు ఏ ట్రైన్ వస్తుందో, ఏది రద్దయిందో తెలియకపోవడంతో ఆందోళన నెలకొంది.
- సికింద్రాబాద్– రేపల్లె (17645), సికింద్రాబాద్–మన్మాడ్ (17064) ఎక్స్‌ప్రెస్ రైళ్లను అధికారులు పూర్తిగా రద్దు చేశారు. శుక్రవారం సాయంత్రం 6.40 కి బయలుదేరాల్సిన సికింద్రాబాద్–తిరుపతి (12764) ఎక్స్‌ప్రెస్ రెండు గంటలు ఆలస్యంగా రాత్రి 8.40 గంటలకు బయలుదేరింది. తిరువనంతపురం– సికింద్రాబాద్ (17229)ఎక్స్‌ప్రెస్ రామన్నపేట్–సికింద్రాబాద్ మధ్య రద్దయింది.
- రేపల్లె– సికింద్రాబాద్ (17646) ఎక్స్‌ప్రెస్ ట్రైన్‌ను నడికుడి–సికింద్రాబాద్ మధ్య రద్దు చేశారు. అలాగే సికింద్రాబాద్– తిరువనంతపురం (17230),సికింద్రాబాద్– హౌరా (12704) రైళ్లను కాజీపేట, విజయవాడ మీదుగా మళ్లించారు.విశాఖపట్నం–లింగంపల్లి (12805),నర్సాపూర్–నాగర్‌సోల్ (17231)రైళ్లను విజయవాడ, కాజీపేట మీదుగా మళ్లించారు.

సహాయ కేంద్రం..

సికింద్రాబాద్ స్టేషన్ నుంచి రద్దయిన రైళ్లతో పాటు, వివిధ మార్గాల్లో రాకపోకలు సాగించే రైళ్ల సమాచారం కోసం ప్రత్యేకంగా సహాయ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ప్రయాణికులకు రైళ్ల సమాచారాన్ని అందజేయడంతో పాటు అన్ని విధాలా సహాయ సహకారాలను అందజేశారు. ప్రమాద ఘటన తెలిసిన వెంటనే దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్నారు. సహాయక చర్యలను స్వయంగా పర్యవేక్షించారు. సాయంత్రం 5.55 గంటల వరకు ఆ సెక్షన్‌లో రైళ్ల రాకపోకలను పునరుద్ధరించినట్లు అధికారులు తెలిపారు.

కోకాపేట్.. హాట్ కేక్!



నియోపోలిస్‌లో అపరిమిత అంతస్తులు

- రెండో దశ అమ్మకాలకు హెచ్ఎండీఏ నోటిఫికేషన్
- మొత్తం 7 ప్లాట్లలో అమ్మకానికి 45.33 ఎకరాలు
- వచ్చే నెల 3న రెండు విడతలుగా భూముల వేలం.. ఎకరా కనీస ధర రూ.35 కోట్లుగా నిర్ణయం

సాక్షి, సిటీబ్యూరో: కోకాపేట్ ఇప్పుడు ఒక హాట్‌కేక్. అక్కడ భూమి బంగారం కంటే ఎంతో విలువైంది. మహా నగరానికి పడమటి వైపున ఆకాశ హర్మ్యాలతో అలరారే కోకాపేట్ అంతర్జాతీయ హంగులతో దేశ విదేశాలకు చెందిన వ్యాపార దిగ్గజ సంస్థలను విశేషంగా ఆకట్టుకుంటోంది. ఒకవైపు ఔటర్ రింగ్‌రోడ్డు, మరోవైపు రాయదుర్గం నుంచి శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయానికి నిర్మించతలపెట్టిన ఎయిర్‌పోర్టు మెట్రోకు అందుబాటులో ఉన్న కోకాపేట్‌లో హెచ్ఎండీఏ ఎంతో ప్రతిష్టాత్మకంగా అభివృద్ధి చేసిన నియోపోలిస్ లేఅవుట్‌లో రెండో దశ ప్లాట్ల అమ్మకాలకు సన్నాహాలు చేపట్టింది.

విశాలమైన రహదారులు.. అత్యాధునిక సదుపాయాలు

- సుమారు వంద ఎకరాలకుపైగా విస్తీర్ణంలో అభివృద్ధి చేసిన ఈ లేఅవుట్‌లో మొదటి దశలో ఎకరం రూ.40 కోట్ల నుంచి రూ.50 కోట్ల చొప్పున 64 ఎకరాలను విక్రయించారు. తాజాగా మరో 7 ప్లాట్‌లలో విస్తరించిన ఉన్న 45.33 ఎకరాల భూమిని అమ్మకానికి పెట్టింది. ఈసారి ఎకరా కనీస ధర రూ.35 కోట్లుగా నిర్ణయించినప్పటికీ ఆన్‌లైన్ వేలం ద్వారా రూ.50 కోట్ల నుంచి రూ.70 కోట్ల వరకు కూడా అమ్ముడయ్యే అవకాశం ఉన్నట్లు అంచనా. విశాలమైన రహదారులతో, అత్యాధునిక సదుపాయాలతో ఈ ప్రాజెక్టును అభివృద్ధి చేసింది.
- హైటెక్‌సిటీ, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, నాలెడ్జ్ సొసైటీకి చేరువలో ఉన్న నియోపోలిస్ లే అవుట్ చుట్టూ 5 కిలోమీటర్ల పరిధిలోనే అమెజాన్, గూగుల్, మైక్రోసాఫ్ట్ వంటి ఫార్చ్యూన్ 500 కంపెనీలు ఉండడంతో ఈ భూమికి భారీ డిమాండ్ నెలకొంది.పైగా బహుళ వినియోగ అనుమతులు ఉండడంతో అంతర్జాతీయ వ్యాపార దిగ్గజ సంస్థలు, బడా రియల్టర్లు, డెవలపర్లు నియోపోలిస్ కోసం పెద్ద ఎత్తున పోటీపడనున్నారు.
- మొదటి దశలో ఒకటి నుంచి 5 ప్లాట్ వరకు విక్రయించగా ప్రస్తుతం 6 నుంచి 14 వరకు ఉన్న ప్లాట్‌లలో భూమిని అమ్మకానికి పెట్టారు. ప్లాట్‌ల సైజు మేరకు కనిష్టంగా 3.60 ఎకరాల నుంచి గరిష్టంగా 9.71 ఎకరాల భూమి ఉంది.ఆసక్తిగల కొనుగోలుదారులు ఈ నెల 31వ తేదీ వరకు రిజిస్ట్రేషన్లు చేసుకోవచ్చు. ఆగస్టు ఒకటో తేదీ వరకు డిపాజిట్ చెల్లించేందుకు గడువు విధించారు. ఆగస్టు 3న ఉదయం, మధ్యాహ్నం రెండు విడతలుగా ఆన్‌లైన్ బిడ్డింగ్ నిర్వహించనున్నారు.

ప్రత్యేకతలెన్నో..


- సముద్ర మట్టానికి 588 మీటర్ల ఎత్తులో ఉన్న నియోపోలిస్ ప్రాజెక్టు అభివృద్ధి కోసం హెచ్ఎండీఏ రూ.300 కోట్లు ఖర్చు చేసింది. సుమారు 40 ఎకరాలలో అన్ని రకాల మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేశారు.
- సైకిల్ ట్రాక్‌లు, ఫుట్‌పాత్‌లు తదితర సదుపాయాలతో 45 మీటర్ల, 36 మీటర్ల వెడల్పుతో అంతర్గత రోడ్లను అభివృద్ధి చేశారు. భూగర్భ డ్రైనేజీ, విద్యుత్తు, తదితర అన్ని సదుపాయాలు ఉన్నాయి. కమర్షియల్, రెసిడెన్షియల్, ఎంటర్‌టైన్‌మెంట్ తదితర అన్ని రకాల భవనాలకు అనుమతులు ఇచ్చారు.
- నియోపోలిస్‌లో ఎన్ని అంతస్తుల వరకైనా హైరైజ్ బిల్డింగ్‌లను నిర్మించవచ్చు.
- ఔటర్ రింగ్‌రోడ్డుకు కేవలం 2 నిమిషాల్లో చేరుకోవచ్చు. అలాగే ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌కు 5 నిమిషాలు, ఎయిర్‌పోర్టుకు 20 నిమిషాలు, హైటెక్ సిటీకి 20 నిమిషాల వ్యవధిలో చేరుకొనే విధంగా రోడ్డు నెట్‌వర్క్ అందుబాటులో ఉంది.

ఈ నెల 20న ప్రీబిడ్ మీటింగ్..

నియోపోలిస్ రెండో దశ భూముల వేలంపై ఈ నెల 20న ప్రీబిడ్ సమావేశం నిర్వహించనున్నట్లు హెచ్ఎండీఏ అధికారులు తెలిపారు. ఆసక్తిగల కొనుగోలుదారులు ఈ సమావేశంలో పాల్గొని తమ సందేహాలను నివృత్తి చేసుకోవచ్చు. భూముల అమ్మకాలు, రిజిస్ట్రేషన్లు తదితర కార్యక్రమాల్లో ఎలాంటి జాప్యానికి తావు లేకుండా సింగిల్‌విండో పద్ధతిలో పూర్తి చేయనున్నట్లు పేర్కొన్నారు.

స్కీంలతో స్కాం

7,000 మంది నుంచి రూ.200 కోట్లు వసూలు



హెర్బల్ ఉత్పత్తులను పరిశీలిస్తున్న సీపీ

సాక్షి, సిటీబ్యూరో: మల్టీ లెవల్ మార్కెటింగ్ (ఎంఎల్‌ఎం) దందా చేస్తూ దేశ వ్యాప్తంగా 7,000 మంది నుంచి రూ.200 కోట్ల మేర స్వాహా చేసిన పర్‌ఫెక్ట్ హెర్బల్ కేర్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ గుట్టును సీసీఎస్ పోలీసులు రట్టు చేశారు. ఈ స్కాం సూత్రధారి సహా ఇద్దరిని అరెస్టు చేశామని నగర కొత్వాల్ సీవీ ఆనంద్ పేర్కొన్నారు. అదనపు సీపీ ఏఆర్ శ్రీనివాస్, డీసీపీ డాక్టర్ పి.శబరీష్‌లతో కలిసి ఆయన వివరాలు వెల్లడించారు.

పర్‌ఫెక్ట్ ముసుగు..

- ఢిల్లీ వాసి రియాజుద్దీన్ అలియాస్ రియాజ్ అహ్మద్ పర్‌ఫెక్ట్ సంస్థను ఏర్పాటు చేశాడు. దీని ముసుగులో పర్‌ఫెక్ట్ బజార్స్ పేరుతో సూపర్ మార్కెట్లు ఏర్పాటు చేయించాడు. నగరంలోని కాటేదాన్, శాలిబండ, దారుల్‌షిఫా, మల్కాజిగిరి, సీతాఫల్‌మండితో పాటు ఢిల్లీ, యూపీ, గుల్బర్గాల్లో ఇవి ఉన్నాయి.
- ఐడీ స్కీంలో చేరి రూ.9999 చెల్లిస్తే నెలకు రూ.880 చొప్పున 36 నెలలు, పర్‌ఫెక్ట్ హెర్బల్ స్టోర్ స్కీంలో చేరి రూ.6 లక్షలు చెల్లిస్తే నెలకు రూ.30 వేలు చొప్పున 30 నెలలు, పర్‌ఫెక్ట్ బజార్ స్కీంలో చేరి రూ.25 లక్షలు చెల్లించి సభ్యత్వం తీసుకుంటే నెలకు రూ.లక్ష చొప్పున 36 నెలలు ఇస్తామని ప్రచారం చేశారు. ఇలా చేరిన వాళ్ళు మరికొందరినీ చేరుస్తూ తమ ఉత్పత్తులు విక్రయిస్తే 3 నుంచి 5 శాతం కమీషన్ అంటూ నమ్మబలికారు.
- తమ మల్టీ లెవల్ మార్కెటింగ్ స్కీంల్లో 75 మంది నుంచి 50 వేల మంది వరకు చేర్చే అవకాశం ఉందని, ఇలా చేర్చిన వారికి హిల్ స్టేషన్ టూర్, ల్యాప్‌టాప్, బైక్, కారు, బంగారు ఆభరణాలు ఇస్తామని ప్రచారం చేసిన రియాజుద్దీన్ వేల మందిని ఆకర్షించాడు. ఇలా దేశ వ్యాప్తంగా వివిధ ప్రాంతాలకు చెందిన ఏడు వేల మంది నుంచి రూ.200 కోట్లు స్వాహా చేశాడు. క్యూ–నెట్ స్కాంలో నిందితులను నగర పోలీసులు గత నెలలో అరెస్టు చేశారు.
- ఆ సందర్భంలో ఇలాంటి ఎంఎల్ఎం దందాపై ఫిర్యాదు చేయాలని ప్రజలను కోరారు. ఇలా వచ్చిన ఓ ఫిర్యాదు ఆధారంగా సీసీఎస్‌లో కేసు నమోదైంది. ఏసీపీ వి.జయపాల్‌రెడ్డి నేతృత్వంలో ఇన్‌స్పెక్టర్ ఎం.అప్పలనాయుడుతో కూడిన బృందం దర్యాప్తు చేసింది. ఢిల్లీలో రియాజుద్దీన్‌తో పాటు పూజకుమారిని అరెస్టు చేసింది. పరారీలో ఉన్న షకీల కోసం గాలిస్తున్నారు.

మహంకాళి దర్శనానికి ప్రత్యేక ఏర్పాట్లు

మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్



రాంగోపాల్‌పేట్: సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి జాతరలో అమ్మవారిని సులభంగా దర్శించుకునేలా అన్ని ఏర్పాట్లు చేపట్టినట్లు మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ తెలిపారు. ఈ నెల 9, 10వ తేదీల్లో జరగనున్న సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి అమ్మవారి జాతర సందర్భంగా జీహెచ్‌ఎంసీ కమిషనర్ రోనాల్డ్‌రాస్, ఉత్తర మండలం డీసీపీ చందనాదీప్తితో పాటు వివిధ శాఖల అధికారులతో కలిసి శుక్రవారం ఆయన దేవాలయ పరిసరాల్లో పర్యటించారు. బోనాలతో వచ్చే భక్తులు నేరుగా అమ్మవారి దర్శనానికి వెళ్లేలా ప్రత్యేక క్యూ లైన్లు ఏర్పాటు చేశామని చెప్పారు. పోలీసులు కూడా ఎలాంటి సమస్యలు లేకుండా జాతర ప్రశాంతంగా సాగేలా బందోబస్తును ఏర్పాటు చేసి పర్యవేక్షించాలన్నారు. మహంకాళి దేవాలయం చుట్టు పక్కల వీధి దీపాలు వెలిగేలా జీహెచ్‌ఎంసీ అధికారులు శ్రద్ధ వహించాలన్నారు. ప్రశాంతంగా ఉత్సవాలు ముగిసేందుకు భక్తులు, ఫలహార బండ్ల ఊరేగింపు నిర్వాహకులు, అన్ని శాఖల అధికారులు ప్రత్యేక చొరవతీసుకోవాలని మంత్రి సూచించారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ రవికిరణ్, ఆర్డీఓ వసంతకుమారి, ట్రాఫిక్ డీసీపీ రాహుల్ హెగ్డె, ఏసీపీ రమేష్, ఎండోమెంట్ డీసీ రామకృష్ణ, ఆలయ ఈఓ మనోహర్‌రెడ్డి, జలమండలి డైరెక్టర్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రంగంలోకి మాన్సూన్ టీమ్స్

వర్షాకాల ఇబ్బందుల పరిష్కారానికి..



సాక్షి, సిటీబ్యూరో: వర్షాకాల సమస్యలను ఎదుర్కొనే సన్నద్ధతలో భాగంగా జీహెచ్‌ఎంసీ 386 మాన్సూన్ ఎమర్జెన్సీ టీమ్స్‌ను ఏర్పాటు చేసింది. వర్షాకాలం ముగిసేంత వరకు అక్టోబర్ వరకు ఈ టీమ్స్ పని చేస్తాయి. ఇందుకుగాను దాదాపు రూ. 43.65 కోట్లు ఖర్చు చేయనున్నారు. నగరంలో వానొస్తే రోడ్లపై నీరు నిలిచిపోయి చెరువులుగా మారడం.. మ్యాన్‌హోళ్లు, క్యాచ్‌పిట్లు పొంగిపొర్లడం తెలిసిందే. దీంతో వాహనాలు ముందుకు సాగకుండా ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతాయి. ఈ ఇబ్బందులు లేకుండా నిల్వ నీటిని ఎప్పటికప్పుడు తోడిపోసేందుకు, అవసరమైన ఇతరత్రా పనులు చేసేందుకు మాన్సూన్ ఎమర్జెన్సీ టీమ్స్ రంగంలోకి దిగుతాయి. నగరంలో నీటి నిల్వ ప్రాంతాలేవో జీహెచ్‌ఎంసీ అధికారులకు తెలుసు. అలాంటి ప్రాంతాల్లో 226 స్టాటిక్ టీమ్స్ ఉంటాయి. వర్షం రాగానే నిలిచిపోయిన నీటిని ఈ టీమ్స్ తొలగిస్తాయి. ఇవికాక వాహనాలతో కూడిన మొబైల్ టీమ్స్ మరో 156 ఉంటాయి. ఇవి కాలనీలు, బస్తీలతో పాటు ఎక్కడ నీరు నిలిచినా అందే ఫిర్యాదులను బట్టి అక్కడకు వెళ్లి నీటిని తొలగిస్తాయి. మొత్తం 382 టీమ్స్ పనిచేస్తాయి. వర్షాకాలంలో ప్రజల ఇబ్బందులు ఎప్పటికప్పుడు తొలగించేందుకు మూడు షిఫ్టుల్లోనూ ఈ టీమ్స్ పనిచేస్తాయని జీహెచ్‌ఎంసీ ఈఎన్‌సీ జియావుద్దీన్ తెలిపారు. ఈ టీమ్స్‌లో అవసరమైన యంత్రసామాగ్రి, పనిచేసే కార్మికులు ఉంటారు.

మరింత అప్రమత్తం..

ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు స్థానికంగానే పరిష్కరించాలనే తలంపుతో ఇటీవలే వార్డు కార్యాలయాలను ఏర్పాటు చేయడం తెలిసిందే. ఫిర్యాదు చేయగానే పరిష్కరించకుంటే ప్రజలు వార్డు కార్యాలయాలను ముట్టడించే అవకాశం ఉండటంతో టీమ్స్ మరింత అప్రమత్తంగా పనిచేసేందుకు ఇంజినీరింగ్ అధికారులు అవసరమైన చర్యలు తీసుకుంటున్నారు.

లాల్‌దర్వాజా బోనాలకు అంకురార్పణ



ఆలయ శిఖర పూజ చేస్తున్న సీపీ ఆనంద్

చాంద్రాయణగుట్ట: లాల్‌దర్వాజా సింహవాహిని మహంకాళి ఆలయ 115వ బోనాల ఉత్సవాలు శుక్రవారం శాస్త్రోక్తంగా ప్రారంభమయ్యాయి. వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ నగర పోలీస్ కమిషనర్ సి.వి.ఆనంద్, దక్షిణ మండలం డీసీపీ సాయి చైతన్యతో కలిసి శిఖర పూజ, ధ్వజారోహణ అనంతరం అమ్మవారికి పూజలు నిర్వహించారు. అంతకుముందు ఉదయం ఆలయ ప్రధాన అర్చకులు నర్సింహయ్య శర్మ అమ్మవారికి అభిషేకం చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ సి.రాజేందర్ యాదవ్ కలశస్థాపన పూజలు చేశారు. కార్యక్రమంలో ట్రాఫిక్ డీసీపీ ప్రసాద్, ఏసీపీలు శ్రీనివాసరావు, దామోదర్ రెడ్డి, ఛత్రినాక ఇన్‌స్పెక్టర్ ఎ.భోజ్యా నాయక్, కమిటీ ప్రధాన కార్యదర్శి బి.మారుతీ యాదవ్, కోశాధికారి పోసాని సదానంద్ ముదిరాజ్, కన్వీనర్ జి.అరవింద్ కుమార్ గౌడ్, కమిటీ ప్రతినిధులు విష్ణు గౌడ్, కె.వెంకటేష్, కాశీనాథ్ గౌడ్, ఎ.మాణిక్ ప్రభు గౌడ్ పాల్గొన్నారు. బోనాల ఉత్సవాలకు గట్టి బందోబస్తు ఏర్పాటు చేసినట్లు కొత్వాల్ సీవీ ఆనంద్ పేర్కొన్నారు. కాగా.. సింహవాహిని మహంకాళి అమ్మవారికి ఆలయ కమిటీ మాజీ చైర్మన్ ఎ.మాణిక్ ప్రభుగౌడ్ కుటుంబం తరపున తొలిబోనం సమర్పించారు.



అమ్మవారికి తొలిబోనం సమర్పిస్తున్న మాణిక్ ప్రభు గౌడ్ కుటుంబ సభ్యులు

నకిలీ టాస్క్‌ఫోర్స్ పోలీసుల అరెస్ట్

నిందితులను పట్టించిన ఇయర్ బడ్స్





మహ్మద్ సైఫ్ అష్వక్ అహ్మద్ ఇద్రిస్ ఖాన్

ఫిలింనగర్: జల్సాలకు అలవాటు పడి టాస్క్‌ఫోర్స్ పోలీసుల అవతారం ఎత్తి డబ్బులు వసూలు చేస్తున్న ముగ్గురు యువకులను ఫిలింనగర్ పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాల్లోకి వెళ్తే... టోలీచౌకి ఎస్‌ఏ కాలనీకి చెందిన ఖాషిఫ్ అహ్మద్‌చౌదరి బీటెక్ చదువుతున్నాడు. ఈ నెల 4న తెల్లవారుజామున అతను హకీంపేట దర్గా సమీపంలోని బృందావన్ కాలనీలోని హబీబ్ మంజిల్‌లో ఉండే సోదరుడి ఇంటికి వెళ్లాడు. అదే సమయంలో బైక్‌పై అక్కడికి వచ్చిన ముగ్గురు యువకులు తాము స్పెషల్ టాస్క్‌ఫోర్స్ పోలీసులమని ఈ సమయంలో ఇక్కడ ఏం చేస్తున్నావంటూ బెదిరించారు. తన సోదరుడిని కలవడానికి వచ్చానని చెప్పినా వినిపించుకోకుండా బెదిరింపులకు గురిచేయడంతో పాటు డబ్బులు డిమాండ్ చేశారు. డబ్బులు ఇవ్వకపోతే కేసు రిజిష్టర్ చేస్తామని హెచ్చరించారు. దీంతో అతను తన అకౌంట్‌లో రూ.3వేలు మాత్రమే ఉన్నాయని చెప్పగా ఫోన్ తీసుకుని రూ. 3 వేలు ట్రాన్స్‌ఫర్ చేయించుకున్నారు. అంతటితో ఆగకుండా ఖాషిఫ్ చౌదరి వద్ద ఇయర్‌బడ్స్ లాక్కుని ఉడాయించారు. ఈ మేరకు బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకున్న ఫిలింనగర్ పోలీసులు రంగంలోకి దిగారు. బాధితుడి సమాచారం మేరకు స్థానికంగా గాలింపు చేపట్టారు. కాగా బాధితుడి నుంచి లాక్కున్న ఇయర్‌బడ్‌కు, ఐఫోన్‌తో కనెక్షన్ ఉండడంతో లోకేషన్ ఆధారంగా నిందితులను గుర్తించిన పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని విచారించగా కొంతకాలంగా చెడు అలవాట్లకు బానిసలైన వీరు దారి కాచి డబ్బులు లాక్కుంటున్నట్లు తేలింది. నిందితులను మెహిదీపట్నం రాయల్ కాలనీకి చెందిన షేక్ మహ్మద్ సయీఫ్, హుమాయున్‌నగర్‌కు చెందిన డిగ్రీ విద్యార్థి అష్వక్ అహ్మద్, మెహదీపట్నంకు చెందిన ఎల్ఎల్‌బీ విద్యార్థి ఎండీ ఇద్రిస్‌ఖాన్‌గా గుర్తించారు. వీరిని అరెస్ట్ చేసిన ఫిలింనగర్ పోలీసులు వారి నుంచి ఇయర్‌బడ్స్‌తో పాటు నగదు స్వాధీనం చేసుకున్నారు.

రూ.2 వేల బ్లాంకెట్ రూ.12 వేలకు విక్రయం!

- మేజోన్ ఈ-మార్ట్ సంస్థ వ్యవహారం ఇలా
- 25 నగరాలు, పట్టణాల్లో సాగిన వీరి దందా
- రూ.12 కోట్లు వసూలు
- ప్రధాన సూత్రధారి అరెస్ట్

సాక్షి, సిటీబ్యూరో: 'బోర్డ్ లగావో పైసా కమావో' అంటూ ప్రచారం చేసుకుంటూ మల్టీ లెవల్ మార్కెటింగ్ (ఎంఎల్ఎ) దందా నిర్వహించిన మేజోన్ ఈ-మార్ట్ నిర్వాహకుడు బాబీ చౌదరిని సీసీఎస్ పోలీసులు అరెస్టు చేశారు. దాదాపు 25 నగరాలు, పట్టణాల్లో స్టోర్స్ ఏర్పాటు చేయించిన ఇతడు రూ.12 కోట్లు స్వాహా చేసినట్లు నగర పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్ పేర్కొన్నారు. ఉత్తరప్రదేశ్‌లోని ఘజియాబాద్ కేంద్రంగా మేజోన్ ఈ-మార్ట్ (ఓపీసీ) ప్రైవేట్ లిమిటెడ్ ఏర్పాటు చేసిన బాబీ చౌదరి గతేడాది మార్చ్‌లో నగరంలోనే కొన్ని సమావేశాలు ఏర్పాటు చేశాడు. వీటికి హాజరైన వారిని తన ఎంఎల్ఎం దందాలోకి లాగడానికి సూపర్ మార్కెట్, ఐడీ స్కీమ్స్ పరిచయం చేశాడు. సూపర్ మార్కెట్ స్కీమ్‌లో రూ.4 లక్షలు చెల్లిస్తే ప్రతి నెలా రూ.1.2 లక్షల చొప్పున 40 నెలలు, ఐడీ స్కీమ్‌లో రూ.12 వేలు చెల్లిస్తే నెలకు రూ.వెయ్యి చొప్పున 38 నెలలు ఇస్తానని ప్రచారం చేసుకున్నాడు. తమ సంస్థ బోర్డులు ఏర్పాటు చేసి, ఉత్పత్తులు విక్రయిస్తూ మరికొందరిని చేర్చాలని, అలా జరిగే విక్రయాలు, కొత్తగా చేరే వారు చెల్లించిన మొత్తం నుంచి కమీషన్లు ఇస్తామని నమ్మబలికాడు. తమ ఉత్పత్తులు మార్కెట్ ధరకంటే 36 శాతం తక్కువ ఉంటాయని చెప్పి మోసం చేశాడు. నాసిరకం, తక్కువ విలువ కలిగిన వస్తువులు ఎక్కువ రేట్లు చూపించి, డిస్కౌంట్‌ల పేరుతో అమ్ముతున్నాడు. కేవలం రూ.2 వేలు విలువైన బ్లాంకెట్‌ను మేజోన్ ఈ-మార్ట్ సంస్థ రూ.12 వేలకు విక్రయిస్తుండటం ఓ ఉదాహరణ మాత్రమే. ఇలా బాబీ చౌదరి ఇప్పటి వరకు నగరంలో 200 మంది నుంచి రూ.2 కోట్లు, దేశ వ్యాప్తంగా అనేక మంది నుంచి రూ.12 కోట్లు వసూలు చేశాడు. ఈ స్కామ్‌పై నమోదైన కేసును దర్యాప్తు చేసిన సీసీఎస్ ఎస్సై జి.బాలరాజు నేతృత్వంలోని బృందం నిందితుడిని ఘజియాబాద్‌లో అరెస్టు చేసి తీసుకువచ్చింది. ఇతడు చేస్తున్న మోసాలపై ఇప్పటికే ఉత్తరప్రదేశ్‌లోని ఘజియాబాద్‌లోని కవినగర్, బులంద్‌షహర్‌లోని సికింద్రాబాద్, మీరట్ ఠాణాల్లో ఒక్కోటి చొప్పున కేసులు నమోదయ్యాయి. ఈ ఎంఎల్ఎం స్కీముల్లో చేరి మోసపోయిన సికింద్రాబాద్ బాధితుడు ఏకంగా ఆత్మహత్య చేసుకున్నాడు. ఆయా పోలీసులు ఇప్పటి వరకు బాబీ చౌదరిని అరెస్టు చేయలేకపోయారు. సాంకేతిక ఆధారాలను బట్టి ముందుకు వెళ్లడంతో సీసీఎస్ పోలీసులకు చిక్కాడు.



బ్లాంకెట్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ సీవీ ఆనంద్

మా సినిమాల్లో నువ్వే హీరో!

సినిమా అవకాశాలు ఇప్పిస్తామని మోసం

- సోషల్ మీడియా వేదికగా టోకరా
- నగర యువకుడి నుంచి రూ.10లక్షలు స్వాహా

హిమాయత్‌నగర్: తాము నిర్మించబోయే సినిమాల్లో హీరోగా చాన్స్ ఇస్తామంటూ నగరానికి చెందిన ఓ యువకుడికి సైబర్ నేరగాళ్లు టోకరా. హీరో కావాలని ప్రయత్నాలు చేస్తున్న అతగాడికి గుర్తుతెలియని వ్యక్తి నుంచి వాట్సప్ మెసేజ్ వచ్చింది. ఇద్దరు కొద్దిరోజుల పాటు చాటింగ్ చేసుకున్నారు. ఆ తర్వాత కొన్ని కారణాలు చెప్పి యువకుడి నుంచి పలు దఫాలుగా రూ.10 లక్షలు వసూలు చేశారు. హీరోగా అవకాశం ఇవ్వకపోగా మరిన్ని లక్షలు కావాలని డిమాండ్ చేస్తుండటంతో బాధితుడు శుక్రవారం సిటీ సైబర్ క్రైం ఏసీపీ కేవీఎం ప్రసాద్‌ను కలిసి ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది. నగరానికి చెందిన యువకుడికి సినిమాలంటే క్రేజీ. ఆ పిచ్చితో కొంతకాలంగా పలు ప్రయత్నాలు చేస్తున్నాడు. ఈ క్రమంలో ఫేస్‌బుక్‌లోని ఓ పేజ్ ద్వారా ఓ వ్యక్తితో పరిచయం ఏర్పడింది. తాను డైరెక్టర్‌నని అతను సదరు యువకుడికి వాట్సప్ ద్వారా దగ్గరయ్యాడు. యువకుడి పోర్ట్ పోలియో సేకరించి తాము నిర్మించే సినిమాలన్నింటిలో హీరో నువ్వే అని నమ్మించాడు. అయితే ఫొటోషూట్స్, ఇతర పార్టీలకు తదితర అవసరాల పేరుతో నమ్మించి రూ.10లక్షలు దోచుకున్నాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏసీపీ తెలిపారు.

నిద్రమత్తులో ప్రాణాలు గల్లంతు

- కల్వర్టును ఢీకొట్టిన వాహనం
- ఇద్దరు మృతి, నలుగురికి గాయాలు
- మృతులు హైదరాబాద్ వాసులు



కల్వర్టును ఢీకొట్టిన వాహనం



కొండూరు వెంకటయ్య, గౌరిశెట్టి రజిత మృతదేహాలు

కాశీబుగ్గ/చైతన్యపురి: తీర్థ యాత్రల కోసం బయల్దేరారు. దైవ దర్శనాలన్నీ సజావుగా జరిగాయి. తెలంగాణ నుంచి ఒడిశా వరకు ప్రయాణం అంతా సరదాగా గడిచిపోయింది. కానీ దేవుడు వారి నుదుటిపై తిరుగు ప్రయాణాన్ని రాయలేదు. ఒడిశా వెళ్లి దేవుడిని దర్శించుకున్న యాత్రికులు.. తిరిగి ఇంటికి చేరకుండానే అనంతలోకాలకు వెళ్లిపోయారు. పలాస పరిధి రామకృష్ణాపురం వద్ద శుక్రవారం జరిగిన ప్రమాదంలో ఇద్దరు మృతి చెందగా.. నలుగురు గాయపడ్డారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు..

హైదరాబాద్ దిల్‌సుఖ్‌నగర్‌లోని చైతన్యపురికి చెందిన రెండు కుటుంబాలు ఒడిశా టూర్‌కు బయల్దేరాయి. వీరు ఆదివారం బొలేరోలో బయల్దేరి పూరి, కోణార్క్ పుణ్యక్షేత్రాలను సందర్శించారు. గురువారం తిరుగు ప్రయాణమయ్యారు. ఆంధ్రా-ఒడిశా బోర్డర్‌లో ఉన్న ఓ పెట్రోల్ బంకు వద్ద డ్రైవర్ నిద్రపోయాడు. కానీ వేగంగా ఇంటికి చేరుకోవాలనే తొందరలో యాత్రికులు అతడిని నిద్రలేపి మరీ ప్రయాణం సాగించారు. ఉదయం ఆరున్నర గంటల సమయంలో పలాస మండలం రామకృష్ణాపురం వద్దకు వచ్చేసరికి డ్రైవర్‌కు కళ్లు మూతలు పడడంతో బండి కల్వర్టును ఢీకొట్టింది. ఈ ఘటనలో గౌరిశెట్టి రజిత(వేదవతి)(55) అక్కడికక్కడే మృతి చెందగా.. ఆమె భర్త కొండూరు వెంకటయ్య(65) పలాస ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. అలాగే సముద్రాల కృష్ణయ్య(67), సముద్రాల పద్మ (50), కొండూరు విజయలక్ష్మి (55)లతో పాటు నల్గొండ జిల్లా మద్దిరాల గ్రామానికి చెందిన డ్రైవర్ పగిండ్ల జానయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రులకు సపర్యలు చేసి పోలీసులు, 108కు సమాచారం అందించారు. క్షతగాత్రులను శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించినట్లు కాశీబుగ్గ సీఐ జి.శ్రీనివాసరావు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, నిద్రమత్తు కారణంగానే ప్రమాదం జరిగి ఉంటుందని చెప్పారు. మృతుల కుటుంబాలకు సమాచారం అందించారు. మంత్రి సీదిరి అప్పలరాజు కూడా ఆయా కుటుంబాలతో మాట్లాడి.. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందిస్తామని ధైర్యం చెప్పారు.

వీధి దీపాల సమస్యను రెండ్రోజుల్లో పరిష్కరించాలి

కమిషనర్‌తో కలిసి విద్యుత్ విభాగంపై మేయర్ సమీక్ష



సాక్షి,సిటీబ్యూరో: నగరంలో వీధి దీపాల సమస్యపై అందుతున్న ఫిర్యాదులను రెండు రోజుల్లోనే పరిష్కరించాలని మేయర్ విజయలక్ష్మి అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆమె కమిషనర్ రొనాల్డ్‌రాస్‌తో కలిసి విద్యుత్ అధికారులు, వీధిదీపాల నిర్వహణ చూస్తున్న ఈఈఎస్ఎల్ ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ వార్డు కార్యాలయాలకు అందుతున్న ఫిర్యాదుల్లో ఎక్కువగా వీధి దీపాలవే ఉంటున్నాయన్నారు. గతంలో ఈఈఎస్ఎల్ ప్రతినిధులతో మేయర్ సమావేశం నిర్వహించగా, ఇకపై సవ్యంగా పనులు నిర్వహిస్తామని పేర్కొనడం తెలిసిందే. అయినా ఇచ్చిన హామీ మేరకు ఇప్పటి వరకు బఫర్‌స్టాక్ సమకూర్చుకోలేదని, దాంతో ప్రజల ఫిర్యాదులు పరిష్కారం కావడం లేవన్నారు. ఈ నేపథ్యంలో ప్రజలు, కార్పొరేటర్ల నుంచి ఫిర్యాదులు పెరుగుతున్నాయన్నారు. ఇప్పటికైనా పనితీరు మార్చుకోకపోతే చర్యలు తప్పవని మరోమారు హెచ్చరించారు. ఈఈఎస్ఎల్‌కు జీహెచ్ఎంసీ నెలనెలా చెల్లిస్తున్న చార్జీలతో అవసరమైన బఫర్‌స్టాక్ సమకూర్చుకోకుండా ఇతర మునిసిపాలిటీలకు మళ్లించడం తగదన్నారు. వీధిదీపాలు పగలు వెలుగుతూ, రాత్రుళ్లు వెలగడం లేదనే ఫిర్యాదులు ఉన్నాయన్నారు. వీధిదీపాల నిర్వహణలో ఈఈఎస్ఎల్ వైఫల్యాలతో 'సాక్షి'లో కథనాలు వెలువడిన విషయం తెలిసిందే.

ఎప్పటికప్పుడు నివేదికలు ఇవ్వాలి: కమిషనర్ రొనాల్డ్‌రాస్

ఈ సందర్భంగా కమిషనర్ రోనాల్డ్ రోస్ మాట్లాడుతూ... ప్రస్తుతం ఉన్న బఫర్ స్టాక్‌తో రెండు రోజుల్లో పనులు చేయాలన్నారు. రోజువారీగా ఎన్ని వీధిలైట్లు అమర్చారో సాయంత్రం వరకు పూర్తి నివేదిక అందజేయాలని విద్యుత్ ఎస్ఈ శ్రీనివాస్‌ను ఆదేశించారు. సంబంధిత కార్పొరేటర్లకు కూడా సమాచారం ఇవ్వాలన్నారు. జోనల్ కమిషనర్లు పనుల్ని పర్యవేక్షించాలన్నారు. సమావేశంలో ఈఎన్‌సీ జియావుద్దీన్, జోనల్ కమిషనర్లు, విద్యుత్ విభాగం అధికారులు పాల్గొన్నారు.

నకిలీ ఎన్‌ఓసీలతో బ్యాంకులకు టోకరా

- వాహనాలపై రుణం తీసుకుని రూ. 1.26 కోట్లు ఎగవేత
- ఐదుగురిపై కేసు నమోదు
- ప్రధాన నిందితుడి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ సాయిశ్రీ

హయత్‌నగర్: నకిలీ ఎన్‌ఓసీలు సృష్టించి బ్యాంకుల్లో వాటిని తనఖా పెట్టిన వాహనాలను విడిపించుకుని దాదాపు రూ. 1.26 కోట్లు ఎగవేసిన ముఠా గుట్టును పోలీసులు బట్టబయలు చేశారు. ఎల్‌బీనగర్ డీసీపీ సాయిశ్రీ శుక్రవారం వివరాలు వెల్లడించారు. ఏపీ లోని విశాఖపట్నం అల్లిపురానికి చెందిన వీరవెంకట సత్యగుప్త నాగరాజు నగరానికి వలస వచ్చి తిరుమలగిరిలో వర్ధన్ పేరుతో ప్యాకింగ్ ఇండస్ట్రీని ఏర్పాటు చేశాడు. వాహనాలపై రుణం తీసుకుని బ్యాంకులను మోసం చేయాలనే ఉద్దేశంతో అతను 2018లో సికింద్రాబాద్ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులో రూ. 19 లక్షలు లోన్ తీసుకుని మహింద్రా షోరూంలో కారు కొనుగోలు చేశాడు. ఆ తర్వాత ఓ వ్యక్తి బ్యాంకు రుణం చెల్లించి తీసుకున్న ఎన్‌ఓసీ సర్టిఫికెట్ ఫోటో తీసుకున్న అతను దాని ఆధారంగా నకిలీ ఎన్‌ఓసీ పత్రాన్ని సృష్టించాడు. సదరు సర్టిఫికెట్‌ను ఆర్‌టీఏ కార్యాలయంలో చూపించి కారును తనఖా నుంచి విడిపించుకుని తన పేరున రిజిస్ట్రేషన్ చేసుకున్నాడు. అనంతరం దానిని పరిచయస్తులకు విక్రయించి వారి పేరుతో యాక్సిస్, ఐసీఐసీఐ బ్యాంకులలో రుణాలు తీసుకుని నకిలీ ఎన్‌ఓసీలతో పేర్లు మార్చి అదే కారును ఆంధ్రాకు తరలించి అక్కడ రిజిస్ట్రేషన్ చేయించాడు. ఇలా మరో కారుపై ఉప్పల్ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులో రూ. 22 లక్షలు రుణం తీసుకున్నాడు. తన స్నేహితురాలి భర్త రవికుమార్ ఆధార్‌కార్డును మార్చి నాగభూషణం పేరుతో ఆధార్ కార్డు సృష్టించి అతని పేరుతో బొలేరో వాహనం కొనుగోలు చేసి హయత్‌నగర్‌లోని హెచ్‌డీఎఫ్‌సి బ్యాంకులో రూ: 10. లక్షల లోన్ తీసుకున్నాడు. ఇదే తరహాలో మరో మూడు ద్విచక్ర వాహనాలు కొనుగోలు చేశాడు. ఇలా బ్యాంకులను మోసం చేసి తీసుకున్న వాహనాలను ఏపీకి తరలించి నెంబర్లు మార్చి విక్రయించేవాడు. బ్యాంక్ అధికారుల ఫిర్యాదుతో అతడిపై హయత్‌నగర్, వనస్థలిపురం పోలీస్‌స్టేషన్‌లలో కేసులు నమోదు కావడంతో దర్యాప్తు చేపట్టిన మల్కాజ్‌గిరి ఎస్‌ఓటీ, హయత్‌నగర్ పోలీసులు నిందితుడు నాగరాజును అరెస్ట్ చేశారు. అతడికి సహకరించిన శ్రావణి, నాగభూషణం, సంతోష్‌కుమార్, లక్ష్మికాంత్‌లపై కేసు నమోదు చేసిన పోలీసులు వారి నుంచి 5 కార్లు, ఒక బైక్, ల్యాప్‌టాప్, నకిలీ స్టాంపులు, స్వాధీనం చేసుకున్నారు. సమావేశంలో సీఐ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

బంజారాహిల్స్ ట్రాఫిక్ పీఎస్‌కు స్థలం కేటాయింపు

బంజారాహిల్స్: బంజారాహిల్స్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ కు స్థలం కేటాయిస్తూ జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. బంజారాహిల్స్ రోడ్ నెంబర్-3లోని బంజారాహిల్స్ లా అండ్ ఆర్డర్ పోలీస్ స్టేషన్‌ను ఆనుకుని ఉన్న 2865 గజాల స్థలంలో ఈ ట్రాఫిక్ పోలీసు స్టేషన్ తో పాటు పంజాగుట్ట ట్రాఫిక్ ఏసీపీ కార్యాలయాన్ని నిర్మించేందుకు స్థలం కేటాయించారు. ట్రాఫిక్ పీ.ఎస్. కు రూ.1.60 కోట్లు, ఏసీపీ కార్యాలయానికి రూ.40 లక్షలు పోలీసు హౌసింగ్ బోర్డు మంజూరు చేసింది. త్వరలోనే వీటి నిర్మాణం చేపట్టనున్నారు. ఈ మేరకు కలెక్టర్ ఎన్.ఓ.సీ. జారీ చేశారు. బంజారాహిల్స్ ట్రాఫిక్ సీ.ఐ. నరసింహరాజు పలు మార్లు కలెక్టర్‌ను కలిసి ఈ స్థలం కేటాయించడానికి కృషి చేశారు.

రైల్వే ఉద్యోగి ఆత్మహత్య

పోచారం: అనారోగ్యం కారణంగా రైల్వే ఉద్యోగి ఆత్మహత్యకు సంఘటన పోచారం మున్సిపాలిటీ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఘట్‌కేసర్‌లోని ఈడబ్ల్యూఎస్ కాలనీకి చెందిన జి.రాజేందర్ (37) ఘట్‌కేసర్ రైల్వే స్టేషన్ పరిధిలో గ్యాంగ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న అతను జీవితంపై విరక్తి చెంది శుక్రవారం ఉదయం యమ్నంపేట్‌లోని రైల్వే ట్రాక్‌పై రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికుల సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బొలెరో ఢీకొని యువకుడి దుర్మరణం

లంగర్‌హౌజ్: బొలెరో బైక్‌ను ఢీకొనడంతో ఓ యువకుడు అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన లంగర్‌హౌజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్సై రాజు కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. కొడంగల్ ప్రాంతానికి చెందిన మధుసూదన్‌రెడ్డి(22) ప్రైవేట్ సంస్థలో పని చేస్తూ అత్తాపూర్‌లో నివాసం ఉంటున్నాడు. గురువారం రాత్రి అతను లంగర్‌హౌజ్ నుంచి మెహిదీపట్నం వైపు వెళ్తుండగా అదే రూట్‌లో వస్తున్న బొలెరో వాహనం అతని బైక్‌ను ఢీకొట్టింది. దీంతో మధుసూదన్‌రెడ్డి ఎగిరి రోడ్డుపై పడ్డాడు. ఆయన తలపై నుంచి బొలెరో టైర్ వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. బైక్‌పై ఉన్న మరో వ్యక్తికి ఎలాంటి గాయాలు కాలేదు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. శుక్రవారం మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. బొలేరో డ్రైవర్ రెడ్యానాయక్‌పై కేసు నమోదు చేసి అరెస్టు చేశారు.

క్లుప్తంగా...

విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ



పంపిణీ చేస్తున్న విజయారెడ్డి

బంజారాహిల్స్: ఎర్రమంజిల్ ప్రభుత్వ పాఠశాలలో శుక్రవారం పీజేఆర్ ఫౌండేషన్ అధ్యక్షురాలు, ఖైరతాబాద్ కాంగ్రెస్ నేత పి.విజయారెడ్డి విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ చేశారు. ఏటా తన తండ్రి పీజేఆర్ జ్ఞాపకార్థం తాము నోట్ బుక్స్ పంపిణీ చేస్తామని విజయారెడ్డి తెలిపారు.

రేపు క్వారీలో అమ్మవారి బోనాలు

రహమత్‌నగర్: ఎస్పీఆర్‌హిల్స్ క్వారీ స్థలంలో కొలువుదీరిన బండ మైసమ్మ, కొండ పోచమ్మ అమ్మవార్ల బోనాల జాతరను ఆదివారం అంగ రంగ వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు వడ్డెర ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వేముల యాదయ్య తెలిపారు. ఎస్పీఆర్ హిల్స్ క్వారీలో ఆయన మాట్లాడుతూ... ఎస్పీఆర్ హిల్స్ క్వారీలో పాతిక సంవత్సరాలు క్రితం స్వయంభూగా వెలిసిన అమ్మ వార్లను వడ్డెర కులస్తులు తమ కులదైవంగా ఆరాధిస్తున్నారని తెలిపారు. వడ్డెర ఐక్య వేదిర నగర అధ్యక్షుడు ముద్దంగుల శేఖర్ నేతృత్వంలో బోనాల జాతరను ఘనంగా నిర్వహిస్తున్నట్లు యాదయ్య పేర్కొన్నారు. డివిజన్‌లోని వడ్డెర కులస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి బోనాలు సమర్పించాలని కోరారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు గొలుసుల ఎల్లయ్య, రహమత్‌నగర్ డివిజన్ నేత నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

మెట్రో స్టేషన్ల కిందా తాగుడే!

మంత్రి కేటీఆర్‌కు ట్వీట్



వెంకటేశ్వరకాలనీ: బహిరంగ ప్రదేశాలు, బస్టాప్‌లే కాకుండా ఇప్పుడు మెట్రోస్టేషన్ల కింద కూడా తాగుబోతులు వీరంగం సృష్టిస్తున్నారని నగరానికి చెందిన టీఏవీ శ్రీనివాస్ అనే వ్యక్తి మంత్రి కేటీఆర్‌కు ట్వీట్ చేశారు. పంజగుట్ట మెట్రో స్టేషన్ కింద ఇద్దరు వ్యక్తులు బహిరంగంగా మద్యం సేవిస్తున్న దృశ్యాలను తన సెల్‌ఫోన్‌లో బంధించి తన ట్వీట్‌తో జతపరిచారు. ఇలాంటి వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

రేపు ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల సమస్యలపై జాతీయ సదస్సు

పంజగుట్ట: అఖిల భారత షెడ్యూల్డ్ కులాల, జాతుల హక్కుల పరిరక్షణ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 9న ఖైరతాబాద్‌లోని విశ్వేశ్వరయ్య భవన్‌లో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ సమస్యలపై జాతీయ సదస్సును నిర్వహించనున్నట్లు సంఘం అధ్యక్షుడు జి.మురళీధర్ రావు తెలిపారు. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో సంఘం సెక్రటరీ జనరల్ ఆర్.చంద్రశేఖర్, ప్రతినిధులతో కలిసి వివరాలను వెల్లడించారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను అమలు చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని వారు ఆరోపించారు. ప్రతి చిన్న విషయాన్ని ప్రభుత్వాలు సమస్యాత్మకంగా చేస్తున్నాయని, మా హక్కులు మాకివ్వాలన్నారు. తమను ఓటు బ్యాంకు రాజకీయాల కోసమే వాడుకోవడం తగదన్నారు. ఈ నెల 9న జరిగే జాతీయ సదస్సులో ఏసీబీ సంయుక్త సంచాలకులు డాక్టర్ చేతన, సీనియర్ సంపాదకులు కె.శ్రీనివాస్, ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ ఎస్.జె.రహమాన్, తెలంగాణ సారస్వత పరిషత్ ఓరియంటల్ కాలేజీ ప్రిన్సిపాల్ సిల్మా నాయక్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి చొల్లేటి ప్రభాకర్, మేధావులు తదితరులు పాల్గొంటారన్నారు. ఇటీవల ఎన్నికైన తెలంగాణ హైకోర్టు అడ్వొకేట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పల్లె నాగేశ్వరరావును సన్మానించనున్నట్లు వారు తెలిపారు. సమావేశంలో సీనియర్ అసోసియేట్ అధ్యక్షుడు పి.యాదగిరి, ఎగ్జిక్యూటివ్ ప్రెసిడెంట్స్ ఎ.శివరాజ్, ఎ. చెన్న దాస్ తదితరులు పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న ఓబీసీ ప్రతినిధులు

బీజేపీ గ్రాఫ్ పడిపోయినందునే అక్రమ కేసులు: కాంగ్రెస్

బంజారాహిల్స్: దేశంలో రాహుల్ గాంధీకి పెరుగుతున్న ఆదరణను చూసి ఓర్వలేకనే అక్రమ కేసులు నమోదు చేసి వేధిస్తున్నారని ఖైరతాబాద్ డీసీసీ అధ్యక్షుడు డాక్టర్ సి. రోహిణ్‌రెడ్డి అన్నారు. రాహుల్ గాంధీపై అక్రమ కేసులు పెట్టి వేధిస్తున్నందుకు నిరసనగా శుక్రవారం గాంధీ భవన్ వద్ద ఏర్పాటు చేసిన ప్రధాని నరేంద్రమోదీ దిష్టిబొమ్మ కార్యక్రమంలో ఆయన పాల్గొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కర్ణాటక ఎన్నికల తర్వాత బీజేపీ గ్రాఫ్ దేశంలో అమాంతం పడిపోయిందనే విషయం స్పష్టం అవుతోందన్నారు. ఈ నేపథ్యంలో ఏం చేయాలో పాలుపోని బీజేపీ నేతలు ఇలా తమ పార్టీ అధినేతపై అక్రమ కేసులు పెట్టి ఇబ్బందులకు గురి చేస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో స్థానిక నేత సాయి తదితరులు పాల్గొన్నారు.



దిష్టిబొమ్మ దహనంలో పాల్గొన్న డాక్టర్ రోహిణ్‌రెడ్డి తదితరులు

వైద్యుల నిర్లక్ష్యం: పసికందుకు శ్వాస సమస్య

నారాయణగూడ పీఎస్‌లో తల్లిదండ్రుల ఫిర్యాదు

హిమాయత్‌నగర్: వైద్యుల నిర్లక్ష్యం కారణంగా పసికందుకు శ్వాస సమస్య ఏర్పడింది. పసికందు ముక్కు ముందు భాగం కొంతమేర కట్ అయినందున శ్వాస పీల్చుకునేందుకు సమస్యగా ఏర్పడిందని తల్లిదండ్రులు ఆరోపించారు. దీనిపై సదరు ఆసుపత్రి యాజమాన్యంను తల్లిదండ్రులు ప్రశ్నించగా వారు దురుసుగా ప్రవర్తించారంటూ నారాయణగూడ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. వివరాలివీ... కాలపత్తార్‌కు చెందిన ఇమ్రాన్‌ఖాన్ భార్య అఫ్రియ ఉన్నీసా 20 రోజుల క్రితం హైదర్‌గూడలోని ఫెర్నాండేజ్ ఆసుపత్రిలో అడ్మిట్ అయ్యారు. అఫ్రియాకు మగ బిడ్డ జన్మించగా.. జాండీస్ సోకింది. దీంతో వైద్యులు ఫొటో థెరపీ ట్రీట్‌మెంట్‌ను అందించారు. ఆ సమయంలో అక్కడి సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా పసికందు ముక్కు కొంతమేర ధ్వంసమైంది. ఆ కారణంతో పసికందు శ్వాస పీల్చుకునేందుకు ఇబ్బంది పడుతున్నాడు. దీనికి సర్జరీ చేసి తమ బిడ్డను కాపాడాలని ఇమ్రాన్‌ఖాన్, ఉన్నీసాలు వైద్యుల్ని కోరారు. 20 రోజుల పసికందుకు ముక్కు భాగంలో సర్జరీ చేయడం కుదరదని, 14 సంవత్సరాలు వచ్చాక సర్జరీ చేస్తామన్నారు. ఇందుకు తన కుమారుడిపై పేరుపై కొంత డబ్బు జమ చేసి ఆ సమయంలో సర్జరీ చేయాలని తల్లిదండ్రులు కోరగా.. దీనికి ఆసుపత్రి యాజమాన్యం నిరాకరించింది. దీంతో వారు నారాయణగూడ పోలీసుల్ని ఆశ్రయించి ఫిర్యాదు చేయడంతో ఆసుపత్రి యాజమాన్యంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌ఓ శ్రీనివాస్ తెలిపారు.

బెల్టు షాప్ నిర్వాహకుడి అరెస్టు

బంజారాహిల్స్: అక్రమంగా మద్యం విక్రయిస్తున్న బెల్టు షాప్ నిర్వాహకుడిని పోలీసులు అరెస్టు చేశారు. ఫిలింనగర్ ఎంజీనగర్‌కు చెందిన పి.గోపాల్ అర్ధరాత్రి తరువాత అక్రమంగా మద్యం అమ్మకాలు చేస్తున్నట్టు పోలీసులకు సమాచారం అందింది. దీంతో ఎస్‌ఐ వినోద్ సిబ్బంది దాడి చేసిన గోపాల్‌ను అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుంచి 19 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. ఫిలింనగర్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కోమటిరెడ్డి పీఏ ఫేస్‌బుక్ ఖాతా హ్యాక్

డబ్బులు డిమాండ్ చేస్తున్నారంటూ ఫిలింనగర్ పోలీసులకు ఫిర్యాదు

ఫిలింనగర్: తన ఫేస్‌బుక్ ఖాతాను గుర్తుతెలియని వ్యక్తులు హ్యాక్ చేసి డబ్బులు డిమాండ్ చేస్తున్నారని భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పీఏ సైదులు శుక్రవారం ఫిలింనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాలివీ... ఎంపీ కోమటిరెడ్డి వద్ద సైదులు అనే వ్యక్తి పీఏగా పనిచేస్తున్నాడు. అయనకు సంబంధించిన ఫేస్‌బుక్ అకౌంట్‌ను గుర్తుతెలియని వ్యక్తులు హ్యాక్ చేయడంతో పాటు తెలిసిన వారికి మెసేజీలు చేస్తూ అర్జెంట్‌గా డబ్బులు కావాలని కోరుతున్నారు. ఈ విషయాన్ని గురించి సైదులు స్నేహితులు గుర్తించి సమాచారం ఇవ్వగా తన ఫేస్‌బుక్ హ్యాక్ చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని శుక్రవారం ఫిలింనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు విచారణ చేపట్టారు.

మటన్ షాపులో మేకలు చోరీ

బంజారాహిల్స్: మటన్ షాపులో అమ్మకానికి ఉంచిన మేకలు, నగదు చోరీకి గురయ్యాయి. నాంపల్లికి చెందిన మహ్మద్ అల్తాఫ్ పారామౌంట్ కాలనీలో బిస్మిల్లా చికెన, మటన పేరిట వ్యాపారం నిర్వహిస్తున్నాడు. అతని వద్ద ఆసిఫ్ అనే యువకుడు మూడు నెలల క్రితం పనిలో చేరాడు. ఇదిలా ఉండగా బక్రీద్‌ను పురస్కరించుకొని 23 మేకలను తీసుకువచ్చాడు. వాటిలో ఆరు మేకలను అమ్మేశాడు. ఇంకా 17 మేకలు అలాగే మిగిలి ఉండటంతో వాటిని ఎవరూ దొంగలించకుండా ఉండేందుకు ఆసిఫ్‌ను దుకాణంలోనే పడుకోమనే వాడు. ఈ నెల 6న ఉదయం అల్తాఫ్ షాపునకు వెళ్లేసరికి మేకలు, షాపులో ఉన్న రూ. 19,750లు కనిపించలేదు. ఆసిఫ్‌కు ఫోనగా చేయగా పనిచేయలేదు. దీంతో అల్తాఫ్ ఫిలింనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఆసిఫ్‌పై అనుమానాలు ఉన్నట్టు పేర్కొన్నాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఇద్దరు మహిళల అదృశ్యం



నూర్జహాన్ రిమ్మాదేవి

రహమత్‌నగర్ (బోరబండ): బోరబండ పోలీస్ స్టేషన్ పరిధిలోని వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు మహిళలు అదృశ్యమయ్యారు. ఎస్‌ఐ మహేశ్ సమాచారం మేరకు... బోరబండ ఎస్‌ఆర్‌ఆర్‌పురానికి చెందిన మహమూదాబేగం కుమార్తె నూర్జహాన్ ఎల్లారెడ్డిగూడకు చెందిన మహ్మద్ కైసర్‌తో వివాహమైంది. వ్యాపారి అయిన కైసర్ తరచూ గుజరాత్‌కు వెళ్లి వస్తుండేవాడు. ఈ క్రమంనే నిజామాబాద్‌కు చెందిన షోయబ్‌తో నూర్జహాన్‌కు ఇన్‌స్టాగామ్‌లో పరిచయం ఏర్పడింది. తరచూ వీరిద్దరు ఇన్‌స్టాగామ్‌లో చాటింగ్ చేసుకునేవారు. ఈ క్రమంలో షోయబ్ కొన్ని ఓటీపీలను తీసుకున్నాడు. అనంతరం ఆమెను వేధింపులకు గురిచేశాడు. తట్టుకోలేక నూర్జహాన్ తన తల్లికి విషయాన్ని తెలియ జేసింది. ఈ నెల 3న తల్లి మహమూదా బేగం ఆస్పత్రికి వెళ్లి తిరిగి రాగా తనకు మార్తె నూర్జహాన్ కనిపించకపోవడంతో బోరబండ పోలీసులకు ఫిర్యాదు చేసింది. తనకు షోయబ్‌పై అనుమానం ఉన్నట్టు తన ఫిర్యాదులో పేర్కొంది. రహమత్‌నగర్ డివిజన్ కార్మికనగర్‌కు చెందిన జితేందర్‌కు భార్య రిమ్మాదేవి, ముగ్గురు పిల్లలు ఉన్నారు. గత నెల 27న భార్య రిక్మా తన చిన్న కుమారుడితో ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాకపోవడంతో జితేందర్ బోరబండ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బిట్టుసింగ్ అనే వ్యక్తిపై అనుమానం ఉన్నట్టు ఫిర్యాదులో పేర్కొన్నాడు.

ప్రభుత్వ స్థలంలో ఆక్రమణలు తొలగించండి

ఫిలింనగర్: జూబ్లీహిల్స్ డివిజన్ ఫిలింనగర్లోని స్వామి వివేకానందనగర్‌బస్తీలో ఓ మహిళ తన ఇంటిపక్కన ఉన్న ఖాళీ స్థలాన్ని ఆక్రమించి గుడిసెలు వేస్తున్నదని, వాటిని తొలగించాలంటూ శుక్రవారం బస్తీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు షేక్‌పేట మండల తహసీల్దార్ రామకృష్ణ నాయక్‌కు ఫిర్యాదు చేశారు. గుడిసెలు ఎందుకు వేస్తున్నవంటూ ప్రశ్నిస్తే తమమీదనే ఆక్రమంగా పోలీసులకు ఫిర్యాదులు చేస్తున్న మహిళపై చర్యలు తీసుకోవాలని వారు కోరారు. తక్షణం ప్రభుత్వ స్థలంలో అక్రమంగా వేసిన నాలుగైదు గుడిసెలను కూల్చేసి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని, బస్తీవాసులకు ఉపయోగపడేలా భవనం నిర్మించాలని కోరారు. ఫిర్యాదు చేసిన వారిలో 47 మంది బస్తీ మహిళలు ఉన్నారు.

అన్ని వర్గాల అభ్యున్నతికి మంద కృష్ణ మాదిగ కృషి



బంజారాహిల్స్: మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ పుట్టిన రోజు సందర్భంగా బొప్పురం వేణు మాదిగ ఆధ్వర్యంలో జూబ్లీహిల్స్ డివిజన్ ఫిలింనగర్ మహనీయుల విగ్రహాల వద్ద, బీజేనగర్‌లో జెండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎంఎస్పీ జాతీయ నాయకుడు రాగటి సత్యం మాదిగ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మాదిగలకే కాకుండా సమాజంలోని అన్ని వర్గాల అభ్యున్నతికి కృష్ణ మాదిగ కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో నేతలు తిప్పారపు లక్ష్మణ్ మాదిగ, టీవీ నరసింహారావు మాదిగ, బుంజూరు విజయ్ మాదిగ, వి.ఎస్.రాజు మాదిగ, బొప్పారం వేణు మాదిగ, శ్యాంసోన్ రాజ్ మాదిగ, సంధ్య రాంబాబు మాదిగ పాల్గొన్నారు.

16న అవార్డుల ప్రదానం

లిబర్టీ: వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందిస్తున్న వారికి ఈ నెల 16న అవార్డులను ప్రదానం చేయనున్నట్లు ఆదిలీలా ఫౌండేషన్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ ఎస్.ఆదినారాయణ వెల్లడించారు. ఆదిలీలా ఫౌండేషన్ జీసీఎస్ వేలూరు గ్రూప్ ఆధ్వర్యంలో సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో అవార్డుల ప్రదానోత్సవం ఉంటుందన్నారు. ఫౌండేషన్ కార్యాలయంలో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ఫాదర్స్‌డే పురస్కరించుకొని బంగారు నంది అవార్డ్స్ 2023 పేరిట అవార్డులను ప్రదానం చేస్తామన్నారు.



సీఎం జగన్‌ను కలిసిన కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు

సాక్షి, అమరావతి: ముఖ్యమంత్రి నివాసంలో ఏపీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కేంద్ర భూవిజ్ఞాన శాఖ మంత్రి కిరణ్ రిజిజు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో మచిలీపట్నం ఎంపీ వి. బాలశౌరి పాల్గొన్నారు.

ఎన్డీయే భేటీకి.. టీడీపీని పిలవలేదు

- ఇది వీరబ్రహ్మేంద్రస్వామి వంటి కొందరు కాలజ్ఞానుల ప్రచారమేనని వ్యాఖ్య
- ఏపీ బీజేపీ ప్రధాన కార్యదర్శి మాధవ్ వెల్లడి



సాక్షి, అమరావతి: ఈనెల 18న జరిగే ఎన్డీయే పక్షాల సమావేశానికి బీజేపీ నుంచి తెలుగుదేశం పార్టీకి ఎలాంటి ఆహ్వానంలేదని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్ వెల్లడించారు. పార్టీ సహచరులతో కలిసి శుక్రవారం విజయవాడలోని బీజేపీ రాష్ట్ర పార్టీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. '2017 ఆగస్టు నుంచి ఎన్డీయేలో తెలుగుదేశం లేదు. ఇప్పటికీ లేదు. ఏ పక్షాలైతే ఎన్డీయేలో ఉన్నాయో, ఆ పార్టీలకే ఎన్డీయే సమావేశానికి ఆహ్వానం ఉంటుంది. 18న జరిగే భేటీకి టీడీపీ ఆహ్వానం లేదు' అని మాధవ్ కుండబద్దలు కొట్టారు. ఈ రోజుల్లో సోషల్ మీడియాలో వీర బ్రహ్మేంద్రస్వామి వంటి కాలజ్ఞానులు కొంతమంది వ్యక్తులున్నారని.. వారే ఊహించి అలాంటివన్నీ సోషల్ మీడియాలో రాస్తున్నారన్నారు. వాటిని నమ్మాల్సిన అవసరంలేదని ఒక ప్రశ్నకు మాధవ్ బదులిచ్చారు. ఇలాంటి రాజకీయ వ్యవహారాలు ఏమైనా ఉంటే తమ పార్టీ బహిరంగ ప్రకటన చేస్తుందన్నారు. ఇక వచ్చే ఎన్నికల్లో ప్రధాని మోదీని ఢీకొనేందుకు పనికిరాని ప్రతిపక్షాలు నిత్యం తప్పుడు ప్రచారం చేస్తూ, ఇప్పుడు కూటమి ఏర్పాటుచేసుకుంటున్నాయని.. వారు చేస్తున్న తప్పుడు ప్రచారం మరింత సమర్థవంతంగా తిప్పికొట్టే అంశంపై ప్రణాళిక రూపకల్పనకే 18న ఎన్డీయే పక్షాల సమావేశం నిర్వహిస్తున్నట్లు మాధవ్ తెలిపారు. ప్రస్తుతం జనసేన తమతో కలిసి ఉందని, ఎన్డీయే పక్షాల సమావేశానికి జనసేనకు పిలుపువస్తుందని భావిస్తున్నామన్నారు.

'గుట్టలు గుల్ల'కు ఇక చెల్లు

- బట్టాపూర్ గుట్ట స్వాహాను అడ్డుకోవాలన్న హైకోర్టు
- 'గుట్టలు గుల్ల'కథనంతో క్వారీ వ్యవహారాన్ని వెలుగులోకి తెచ్చిన 'సాక్షి'
- 7 మండలాల్లో 'సాక్షి' కథనాలతో ఫ్లెక్సీలు కట్టిన స్థానికులు, బీజేపీ శ్రేణులు



వేల్పూర్ మండల కేంద్రంలో స్థానికులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: నిజామాబాద్ జిల్లాలోని ఏర్గట్ల మండలం బట్టాపూర్ వద్ద నిబంధనలు అతిక్రమించి గుట్టను తవ్వడాన్ని అడ్డుకోవాలని రాష్ట్ర హైకోర్టు వెలువరించిన తీర్పు నేపథ్యంలో స్థానికులు, బీజేపీ శ్రేణుల నుంచి హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. కాలుష్య నియంత్రణ మండలి అనుమతులు లేకుండా బట్టాపూర్‌లో గుట్టలను తొలిచేయడంపై గతేడాది 'సాక్షి'ప్రధాన సంచికలో 'గుట్టలు గుల్ల'శీర్షికన కథనం ప్రచురితమైంది. ఈ కథనం ఆధారంగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఏలేటి మల్లికార్జున్‌రెడ్డి హైకోర్టులో 'పిల్' దాఖలు చేశారు. దీనిపై గత నెల 16న 'బట్టాపూర్ గుట్ట మింగివేతపై పిల్'అనే కథనం ప్రచురితమైంది. ఈ నేపథ్యంలో హైదరాబాద్ నుంచి వచ్చిన మైన్స్ అండ్ జియాలజీ విభాగానికి చెందిన బృందం 'ఈటీఎస్'(ఎలక్ట్రానిక్ టోటల్ సర్వే) గుట్టలను పరిశీలించి నివేదిక ఇచ్చింది. ఈ క్రమంలో క్వారీ, క్రషర్‌ను సీజ్ చేయాలని చెప్పిన హైకోర్టు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సహా మొత్తం 13 మందికి నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణ నాటికి కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ, విచారణను ఆగస్టు 4కు వాయిదా వేసింది. హైకోర్టు తీర్పుపై బీజేపీ నేతలు, స్థానికులు హర్షం వ్యక్తం చేస్తూ శుక్రవారం బాల్కొండ నియోజకవర్గంలోని ఏర్గట్ల, మోర్తాడ్, బాల్కొండ, ముప్కాల్, మెండోరా, వేల్పూర్, భీంగల్ మండలాల్లో ఫ్లెక్సీలు కట్టారు. గతంలో 'సాక్షి'లో ప్రచురితమైన కథనాలను వాటిపై ముద్రించారు. మరోపక్క గురువారం బట్టాపూర్ గుట్ట వద్ద బీజేపీ శ్రేణులు టపాకాయలు కాల్చి కోర్టు తీర్పుపై హర్షం వ్యక్తం చేశాయి. కార్యకర్తలు స్వీట్లు పంచుకున్నారు.

ఈ పేద జీవితంలో ఆశలు చిగురించాయి

- వైఎస్ జగన్ ప్రభుత్వంపై ఎనలేని అభిమానం
- ఇంటికి తాను పొందిన సంక్షేమ పథకాల ఫ్లెక్సీ



సుభానీ తన ఇంటికి ఏర్పాటు చేసుకున్న బ్యానర్

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): ''నేను నిరుపేదను. ఎలాంటి స్థిరాస్తులు లేవు. రోజువారీ కూలీ అయిన నేను కుటుంబ అవసరాలు తీర్చలేకపోవడంతో పాటు పిల్లల చదువుల కోసం ఎంతో ఇబ్బందులు పడుతుండేవాడిని. ఇలాంటి నా జీవితంలో సంక్షేమ పథకా లతో వెలుగులు నింపారు. సగర్వంగా తలెత్తుకుని జీవించేలా చేశారు. ఆర్థికంగా చితికిపోకుండా జీవితంపై ఆశలు చిగురింప చేసిన జగనన్న ఏమిచ్చి మీ రుణం తీర్చుకోవాలి. మా కుటుంబం మొత్తం మీ వెనుక నడుస్తాం'' అంటూ ఓ నిరుపేద తన అభిమానాన్ని ఫ్లెక్సీ రూపంలో తెలిపాడు. ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం మండలం కొండపల్లికి చెందిన ఎస్ఎన్ మీరా (సుభానీ) కుటుంబం కూలీ పనులు చేసుకుని జీవిస్తుంటుంది. అన్నింటికీ ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న సమయంలో వైఎస్ జగన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. అతనికి పలు పథకాల ద్వారా లబ్ధి అందించింది. దీంతో అతను దీన స్థితి నుంచి బయటపడి సగౌరవంగా జీవిస్తున్నాడు. తన కుటుంబానికి ప్రభుత్వం ఏమి లబ్ధి చేకూర్చిందో ఫ్లెక్సీ వేసి తన ఇంటి గోడకి అతికించాడు. 'మీ ఉప్పు తింటున్నాం.. మీకు విశ్వాసంగా ఉంటాం' అంటూ ఫ్లెక్సీ వేయించి సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి, స్థానిక ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ఫ్లెక్సీలో ఇలా రాశాడు..

- వైఎస్సార్ చేయూత పథకంలో వచ్చిన రూ. 56,250తో నా భార్య జక్రియా బేగం కిరాణా షాపు ఏర్పాటు చేసుకుంది.
- డ్వాక్రా రుణమాఫీతో రూ. 36 వేలు లబ్ధి చేకూరింది.
- కుమార్తె ఫాతిమా జేఎన్టీయూలో ఎంటెక్ చదువుకు వసతి దీవెన కింద రూ. 40 వేలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ కింద రూ.30 వేలు, కుమారుడు బీకాం కంప్యూటర్స్ చదువుకు రూ. 45 వేలు ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన కింద రూ.30 వేలు, మరో కుమార్తె నబీనా ఎంఎస్సీ బీఈడీ చదువుకు ఫీజు రూ. 30 వేల లబ్ధి చేకూరింది.

ఈ కోర్టులో పిటిషన్ ఎందుకు వేశారు?

- మార్గదర్శి చిట్‌ఫండ్‌ను ప్రశ్నించిన న్యాయమూర్తి

సాక్షి, హైదరాబాద్: మార్గదర్శి చిట్‌ఫండ్ ప్రైవేట్ లిమిటెడ్ కేసులన్నీ ఒకే న్యాయమూర్తి విచారణ జరపాలని ప్రధాన న్యాయమూర్తి ఆదేశించిన తర్వాత కూడా ఈ కోర్టులో ఎందుకు పిటిషన్ దాఖలు చేశారని పిటిషనర్ న్యాయవాదిని జస్టిస్ సురేందర్ ప్రశ్నించారు. మార్గదర్శి యాజమాన్యంపై ఎలాంటి బలవంతపు చర్యలు తీసుకోవద్దని కోర్టు ఆదేశించినా.. నోటీసులు జారీచేశారంటూ చెరుకూరి శైలజ, మార్గదర్శి చిట్ ఫండ్స్ తెలంగాణ హైకోర్టులో కోర్టు ధిక్కార పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ కె. సురేందర్ శుక్రవారం విచారణ చేపట్టారు. ప్రతివాదుల తరఫున ఏపీ స్పెషల్ జీపీ గోవిందరెడ్డి వాదనలు వినిపించారు. మార్గదర్శి దాఖలు చేసిన పిటిషన్లపై విచారణ జరిపే అర్హత తెలంగాణ హైకోర్టుకు ఉందా? లేదా? అన్న అంశంపై సుప్రీం కోర్టు ఈనెల 18న విచారణ జరపనుందని, అప్పటి వరకు ఈ పిటిషన్‌లో విచారణను వాయిదా వేయాలని కోరారు. హైకోర్టులో ఇతర కేసులు ఈనెల 20కి వాయిదా వేశారన్న విషయాన్ని గుర్తుచేశారు. సుప్రీంకోర్టు ఒకసారి ఈ అంశాన్ని విచారణకు స్వీకరించిన తర్వాత అదే అంశంపై హైకోర్టు విచారణ జరపలేదని వెల్లడించారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. ఏపీ సీఐడీ అధికారులకు నోటీసులు జారీచేస్తూ, విచారణను ఆగస్టు 14వ తేదీకి వాయిదా వేశారు.



'రోజుకో యాపిల్.. డాక్టర్‌ను దూరం పెడుతుంద'ని ఓ సామెత ఉంది. అది సీజనల్. రేటు కూడా కాస్త ఎక్కువే. అదే సీజన్‌తో సంబంధం లేకుండా ఏడాది పొడవునా అందుబాటులో ఉండేది అరటి పండు. ధర కూడా తక్కువే. మరి యాపిల్‌లా అరటిపండుతోనూ బోలెడన్ని పోషకాలు అందితే.. తక్కువ ఖర్చుతోనే మంచి ఆరోగ్యం సొంతం. ఈ ఆలోచనతోనే ఉగాండా, ఆస్ట్రేలియా శాస్త్రవేత్తలు బిల్‌గేట్స్ ఫౌండేషన్ సాయంతో 'సూపర్ బనానా'ను రూపొందించారు. అతి త్వరలోనే దీనిని అందుబాటులోకి తేనున్నట్టు ప్రకటించారు.

సూపర్ ఖానా ఈ బనానా

ఈ అరటి పండు.. డాక్టర్‌కు దూరం ఉండు!

- పోషకాహార లోపాన్ని ఎదుర్కొనేందుకు శాస్త్రవేత్తల సృష్టి
- 'విటమిన్ ఏ' సహా అత్యవసర పోషకాలన్నీ ఉండేలా అభివృద్ధి
- అరటిలో ఈ తరహా జన్యుమార్పిడి ప్రపంచంలోనే తొలిసారి
- కరువు పరిస్థితుల్లోనూ సాగు చేసేందుకు వీలు

ఆసియా, ఆఫ్రికా ఖండాల్లోని పేద దేశాల్లో కోట్లాది మంది ప్రజలు పోషకాహార లోపంతో బాధపడుతున్నారు. ముఖ్యంగా విటమిన్ 'ఏ' లోపంతో చిన్నారుల్లో ఎదుగుదల సరిగా లేకపోవడం, కంటి చూపు దెబ్బతినడం, వ్యాధినిరోధక శక్తి

కోట్ల మందికి ప్రయోజనం

లేక రోగాల పాలవడం వంటి సమస్యలు తలెత్తుతున్నట్టు ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) ఇప్పటికే పేర్కొంది. ప్రపంచవ్యాప్తంగా 19 కోట్ల మంది ఐదేళ్ల లోపు చిన్నారులు విటమిన్ ఏ లోపంతో బాధపడుతున్నారని ప్రకటించింది. ఈ క్రమంలోనే విటమిన్ ఏ, ఇతర పోషకాలు అధికంగా ఉండే సూపర్ బనానాను శాస్త్రవేత్తలు అభివృద్ధి చేశారు.

బనానా21 ప్రాజెక్టు పేరిట.. జన్యు మార్పిడితో..

- మైక్రోసాఫ్ట్ వ్యవస్థాపకుడు బిల్‌గేట్స్‌కు చెందిన ఫౌండేషన్ ఆర్థిక సాయం, ఆస్ట్రేలియా వ్యవసాయ శాస్త్రవేత్త జేమ్స్ డేల్ సహకారంతో ఉగాండా జాతీయ అగ్రికల్చర్ రీసెర్చ్ లేబొరేటరీ శాస్త్రవేత్తలు 'సూపర్ బనానా'పై 2005లో పరిశోధన చేపట్టారు.
- అత్యవసర పోషకాలన్నీ ఉండటంతోపాటు తెగుళ్లు, ఫంగస్‌లను తట్టుకోవడం, కరువు ప్రాంతాల్లోనూ పండించగలిగేలా నీటి ఎద్దడిని తట్టుకోగలగడం వంటి లక్షణాలు ఉండేలా అరటిని అభివృద్ధి చేశారు.
- జన్యు మార్పిడి విధానంలో సుమారు 18 ఏళ్ల పరిశోధన తర్వాత.. విటమిన్ ఏ సహా అత్యవసర పోషకాలన్నీ ఉండేలా సరికొత్త వంగడాన్ని అభివృద్ధి చేయగలిగారు.

ప్రపంచంలో ఇదే మొదటిసారి..

ఇలా పోషకాలన్నీ ఉండేలా జన్యుమార్పిడి అరటి పండ్లను అభివృద్ధి చేయడం ప్రపంచంలో ఇదే తొలిసారి అని ఈ పరిశోధనలో పాల్గొన్న శాస్త్రవేత్తలు తెలిపారు. దీని ద్వారా ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది చిన్నారుల జీవితాలను కాపాడవచ్చని పేర్కొన్నారు. కొత్త అరటి రకం సాగుకు సిద్ధమైనట్టేనని, అనుమతులు రావాల్సి ఉందని వెల్లడించారు.



దుర్గమ్మకు వజ్రాలు పొదిగిన ముక్కెర



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మకు హైదరాబాద్‌కు హైదరాబాద్‌కు చెందిన అడ్డగట్ల సంతోషిణి, ప్రశాంత్ దంపతులు శుక్రవారం రూ. 2 లక్షల విలువైన ముక్కెరను కానుకగా సమర్పించారు. ముక్కెరను అమ్మవారి చెంతన ఉంచి పూజలు నిర్వహించిన అనంతరం దాతలు ఆలయ ఈవో భ్రమరాంబకు అందజేశారు. అనంతరం దాతలకు వేద పండితుల ఆశీర్వచనం అందజేశారు. ఆలయ ఈవో అమ్మవారి ప్రసాదాలను బహూకరించారు. సీనియర్ ఐఏఎస్ ఉదయలక్ష్మి దాతలతో పాటు అమ్మవారిని దర్శించుకున్నారు.

నగర వార్తలు

కంటోన్మెంట్ బోర్డు కార్యాలయం ఆధునికీకరణ

నూనత పేషీని ప్రారంభించిన సీఈఓ



ఆధునికీకరించిన పేషీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న సీఈఓ మధుకర్ నాయక్

కంటోన్మెంట్: దాదాపు 150 ఏళ్ల క్రితం నిర్మితమైన చారిత్రాత్మక కంటోన్మెంట్ బోర్డు కార్యాలయం ఆధునికతను సంతరించుకుంటోంది. ముఖ్య కార్య నిర్వాహక అధికారి(సీఈఓ) పేషీని ఇటీవలే ఆధునీకీకరించారు. సందర్శకులు వేచి ఉండేందుకు సైతం ప్రత్యేకంగా సోఫాలతో సదుపాయాలు కల్పించారు. ఈ మేరకు నూతన పేషీ కార్యాలయాన్ని సీఈఓ మధుకర్ నాయక్ శుక్రవారం ప్రారంభించారు. బ్రిటిష్ జమానాలో కోర్టు హాల్‌గా ఉపయోగించిన ఈ భవనాన్నే 1924 నుంచి సికింద్రాబాద్ కంటోన్మెంట్ ప్రధాన కార్యాలయంగా వినియోగిస్తున్నారు. పదేళ్ల క్రితం భవనం లోపలి భాగంలో కొద్దిపాటి మరమ్మతులతో పాటు మెరుగులు దిద్దారు. తాజాగా సీఈఓ పేషీని ఆధునీకరించగా, దశలవారీగా అన్ని విభాగాలను ఆధునికీకరిస్తామని అధికారులు వెల్లడించారు. కార్యక్రమంలో బోర్డు ఉన్నతాధికారులు గోపాలకృష్ణ, బాలకృష్ణ, ఉమాశంకర్, దేవేందర్, మహేందర్, రమణ, నర్సింగ్ రావు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ గిరిజన గురుకులాల్లో ఇంటర్ స్పాట్ అడ్మిషన్లు

రాజేంద్రనగర్: రంగారెడ్డి, సంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల పరిధిలోని గిరిజన సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాలల్లో ఇంటర్మీడియట్ మొదటి విద్యా సంవత్సరం (2023-24)లో మిగిలిన సీట్ల భర్తీకి దరఖాస్తులు స్వీకరించనున్నామని రంగారెడ్డి, సంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల రీజనల్ కో ఆర్డినేటర్ (ప్రాంతీయ సమన్వయ అధికారి) పి.ఎస్.కళ్యాణి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 10వ తేదీన బాలికల కోసం రాజేంద్రనగర్‌లోని రీజనల్ కో ఆర్డినేటర్ కార్యాలయంలో, 11వ తేదీన కొత్తూరు బాలుర కళాశాల నాదర్‌గుల్ వద్ద ఉదయం 11 గంటలకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నామన్నారు. అడ్మిషన్ల కోసం పదవ తరగతి మెమో, టీసీ, బోనాఫైడ్, కుల, ఆదాయ, ఫిజికల్ ఫిట్నెస్ ధ్రువీకరణ పత్రాలతో పాటు ఆధార్ కార్డు, ఎనిమిది పాస్ పోర్ట్‌సైజ్ ఫొటోలు తీసుకురావాలన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

సమష్టి కృషితోనే ఆర్టీసీ అభివృద్ధి

హైదరాబాద్ రీజనల్ మేనేజర్ వరప్రసాద్



మాట్లాడుతున్న ఆర్ఎం వరప్రసాద్

కాచిగూడ: అధికారులు, కార్మికుల సమష్టి కృషితోనే ఆర్టీసీ అభివృద్ధి సాధ్యమని సంస్థ హైదరాబాద్ రీజనల్ మేనేజర్ బి.వరప్రసాద్ పేర్కొన్నారు. హైదరాబాద్ రీజియన్ పరిధిలో ఉత్తమ సేవలు అందించిన, రాష్ట్ర స్థాయిలో ఎంపికైన అధికారులు, ఉద్యోగులను శుక్రవారం కాచిగూడ బస్‌స్టాండ్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన అభినందించారు. ఈ సందర్భంగా ఆర్ఎం మాట్లాడుతూ... ఇటీవలి కరోనా గడ్డు పరిస్థితిని, ప్రైవేట్ వాహనాల తాకిడిని తట్టుకొని నిలబడగలిగే స్థాయికి సంస్థ ఎదగడంలో ప్రతి ఒక్క ఉద్యోగి కృషి దాగి ఉందన్నారు. అందులో భాగంగా అత్యుత్తమ సేవలు అందిస్తున్న సిబ్బందిని, అధికారులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో సంస్థ 'ప్రగతి చక్రం' అవార్డులను ఆర్టీసీ చైర్మన్, ఎండీలు ప్రదానం చేశారని తెలిపారు. బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమం నిరంతర ప్రక్రియగా కొనసాగుతుందన్నారు. రోల్ ఆఫ్ హానర్, ఎక్స్ట్రామైల్, సంస్థ వ్యూహాత్మక లక్ష్యాలకు అనుగుణంగా దసరా, సంక్రాంతి తదితర పర్వదినాల సమయంలో చేపట్టి, ఇన్నోవేషన్ బెస్ట్ ఎంప్లాయి, ఉత్తమ డిపో, ఉత్తమ రీజియన్, ఉత్తమ డివిజన్ వంటి వివిధ కేటగిరీల ద్వారా 79 మంది సిబ్బందికి అవార్డులు అందజేసినట్లు తెలిపారు. ఆర్టీసీ డిప్యూటీ మేనేజర్లు, డిపో మేనేజర్లు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉత్తమ రీజియన్‌గా సికింద్రాబాద్

ప్రయాణికులకు అత్యుత్తమ రవాణా సేవలను అందజేస్తున్న విభాగాలకు ఇటీవల టీఎస్ఆర్టీసీ అందజేసిన ప్రగతి చక్రాలు అవార్డులలో సికింద్రాబాద్ ఉత్తమ రీజియన్ అవార్డును అందుకుంది. ఈ సందర్భంగా రీజనల్ మేనేజర్ వెంకన్న అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది సేవలను అభినందించారు.

– సాక్షి, సిటీబ్యూరో



'ఐఎస్‌బీ'లో మరో రెండు కొత్త ఆన్‌లైన్ కోర్సులు

రాయదుర్గం: ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బీ)లో మరో రెండు కొత్త కోర్సులకు శ్రీకారం చుట్టారు. ఐఎస్‌బీలోని భారతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ పాలసీ(బీఐపీపీ), కెపాసిటీ బిల్డింగ్ కమిషన్ (సీబీసీ) భారత ప్రభుత్వ సంయుక్త ఆధ్వర్యంలో ఈ రెండు కొత్త కోర్సులను ప్రారంభించారు. మిషన్ కర్మయోగి చొరవ కింద ఐజీఓటీ ప్లాట్‌ఫారమ్‌లో ఈ ఆన్‌లైన కోర్సులను నిర్వహిస్తారు. ఐఎస్‌బీ భారతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ పాలసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ప్రొఫెసర్ అశ్విని ఛత్రే సమక్షంలో సీబీసీ ప్రోగ్రామ్ మేనేజర్ హిమాన్షు పాండేతో కలిసి భారత ప్రభుత్వంలోని సిబ్బంది, శిక్షణ శాఖ కెపాసిటీ బిల్డింగ్ కమిషన్ సెక్రటరీ హేమంగ్ జానీ ఈ కోర్సులను శుక్రవారం ప్రారంభించారు.

కొత్త ఆన్‌లైన్ కోర్సులు ఇవే...

ఐఎస్‌బీలో బీఐపీపీ, సీబీసీ సంయుక్తంగా ఆన్‌లైన్ కొత్త కోర్సులు రెండింటిని ప్రారంభించారు. 'ఎవిడెన్స్ ఇన పబ్లిక్ పాలసీ' మరియు 'ఇన్‌సైట్స్ ఫ్రమ్ డేటా ఫర్ పాలసీ' పేరిట ప్రొఫెసర్ అశ్విని ఛత్రే రచించినవి, సీనియర్ ప్రభుత్వ ఉద్యోగుల పబ్లిక్ పాలసీలో నైపుణ్యాన్ని బలోపేతం చేయడం లక్ష్యంగా పెట్టుకున్నాయి.

ఈ సందర్భంగా కెపాసిటీ బిల్డింగ్ కమిషన్ కార్యదర్శి హేమంగ్ జానీ మాట్లాడుతూ... బీఐపీపీ సహకారంతో పబ్లిక్‌పాలసీపై రెండు కోర్సులను ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. ఐఎస్‌బీలోని బీఐపీపీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ప్రొఫెసర్ అశ్విని ఛత్ర మాట్లాడుతూ... ఈ కొత్త కోర్సులు పౌరులకు దాని ఫలితాలను మెరుగు పరచాలనే లక్ష్యంతో పబ్లిక్ పాలసీల సామర్థ్యాన్ని, ప్రభావాన్ని పెంచడమే లక్ష్యంగా పెట్టుకొని ప్రారంభించినవని అన్నారు.

తెలుగులో తీర్పు గొప్ప నిర్ణయం

చార్మినార్: తెలంగాణ హైకోర్టు సీనియర్ జస్టిస్ పి.నవీన్‌రావు, జస్టిస్ నగేష్ భీమపాక నేతృత్వంలోని ధర్మాసనం ఇటీవల తెలుగులో తీర్పు వెలువరించడం ప్రజాస్వామ్యబద్ధమైన గొప్ప నిర్ణయమని ప్రభుత్వ సిటీ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య పి.బాల భాస్కర్ అన్నారు. తెలుగులో తీర్పు వెలువరించి న్యాయవ్యవస్థ ఫలాలను సామాన్యులకు అందేలా కృషి చేసిన జస్టిస్ నవీన్‌రావుని కళాశాల తెలుగు శాఖ పక్షాన ప్రిన్సిపాల్, అధ్యాపక బృందం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ... ఇటీవల భూవివాదంలో ఆస్తి వారసత్వానికి సంబంధించిన 44 పేజీల సమగ్ర తీర్పును తెలుగులో వెలువరించి అత్యున్నత న్యాయస్థానం విలువలను అందరికీ అందించారని కొనియాడారు. తెలుగు శాఖ అధ్యక్షుడు డాక్టర్ కోయి కోటేశ్వర్ రావు మాట్లాడుతూ... తెలుగు భాష మూలాలను తెలంగాణ కేంద్రంగా పరిశోధకులు పునర్నిర్వచిస్తున్న నేపథ్యంలో జస్టిస్ నవీన్ రావు తెలుగు తీర్పు భాషాభిమానులకు ఎంతో సంతోషాన్ని కలిగించిందన్నారు. ఐక్యూఏసి కో ఆర్డినేటర్ డాక్టర్ జె.నీరజా, హైకోర్టు పూర్వ రిజిస్ట్రార్ విద్యాధర్ భట్, తెలుగు ఆచార్యులు అవధానం సుజాత, డాక్టర్ ఎస్.అనంత లక్ష్మి, బి.కేథరీన, సుజాత అజ్మీర, డాక్టర్ కమల సుధారాణి తదితరులు పాల్గొన్నారు.



జస్టిస్ నవీన్ రావును సన్మానిస్తున్న దృశ్యం

సేవా కార్యక్రమాలే మేలు చేస్తాయి

ఎంపీ సంతోష్‌కుమార్



సేవా సంస్థలకు చెక్కులు అందిస్తున్న ఎంపీ సంతోష్‌కుమార్

మణికొండ: వ్యక్తులైనా, సంస్థలైనా వారు చేపట్టే సేవా కార్యక్రమాలే వారికి మేలు చేస్తాయని ఎంపీ జోగినిపల్లి సంతోష్‌కుమార్ అన్నారు. వట్టినాగులపల్లి ప్రధాన్ కన్వెన్షన్‌లో జరిగిన కళామందిర్ ఫౌండేషన్ డే ఉత్సవాలు శుక్రవారం రాత్రి జరిగాయి. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ... వ్యాపార సంస్థలు సహజంగా తమ వ్యవస్థాపక దినోత్సవాన్ని ఆటపాటలతో సందడిగా నిర్వహిస్తారన్నారు. అందుకు భిన్నంగా కళామందిర్ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా చేనేత కార్మికులు, మహిళలు, చిన్నారుల కోసం పనిచేస్తున్న సంస్థలకు విరాళాలు అందజేయటం అభినందనీయమన్నారు. పర్యావరణాన్ని కాపాడేందుకు ప్రతి ఒక్కరు మొక్కలు నాటి పరిరక్షించాలన్నారు. కళామందిర్ వ్యవస్థాపకులు చల్వాది ప్రసాద్, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే గణేష్‌గుప్తా, రాష్ట్ర ఐటీ కార్యదర్శి అనిల్, నటులు సత్యదేవ్, హైపర్ ఆది, మీనాక్షి చౌదరి, నిత్యానరేష్, మాజీ జేడీ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దివ్యాంగ విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

చేనేత ఉత్పత్తులను ప్రోత్సహించాలి



సంప్రదాయ చీరలను ప్రదర్శిస్తున్న మోడల్స్



మాట్లాడుతున్న వైజయంతి

శ్రీనగర్‌కాలనీ: ఇండియన్ సిల్క్ గ్యాలరీలో నాణ్యమైన సిల్క్, కాటన్ వస్త్రాలు లభిస్తామని, మన సంప్రదాయ చీరలు చాలా ప్రత్యేకమని, చేనేత పరిశ్రమను ప్రోత్సహించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తెలంగాణ స్టేట్ పోలీస్ ప్రాసిక్యూషన్ వింగ్ డైరెక్టర్ జి. వైజయంతి అన్నారు. శుక్రవారం శ్రీనగర్‌కాలనీలోని సత్యసాయి నిగమాగమంలో ఇండియన్ సిల్క్ గ్యాలరీ ఆధ్వర్యంలో శారీస్ ఆఫ్ ఇండియా ఫ్యాషన్ పేరిట శ్రావణమాస వెడ్డింగ్ స్పెషల్ ఫ్యాషన్ షోను ఏర్పాటు చేశారు. ఈ నెల 8 నుంచి 16వ తేదీ వరకు నిర్వహించనున్న ఎగ్జిబిషన్‌కు సంబంధించి దేశంలోని ప్రముఖ నగరాలను చెందిన చేనేతకళాకారుల చీరలను మోడల్స్ ధరించి ప్రదర్శించారు. ముఖ్య అతిథిగా హాజరైన వైజయంతి మాట్లాడుతూ... ఇక్కడ నాణ్యమైన సిల్క్, కాటన్ చీరలు లభిస్తాయని, చేనేతకారుల ఉత్పత్తులను నేరుగా ప్రదర్శిస్తారని తెలిపారు. చేనేత కళాకారులను ప్రోత్సహిస్తున్న ఇండియన్ సిల్క్ గ్యాలరీ నిర్వాహకులు శ్రీనివాసరావు, వినయ్ కుమార్‌లను అభినందించారు. మోడల్స్ ప్రదర్శించిన రంగురంగుల చీరలు ఆహూతులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. మినిస్ట్రీ ఆఫ్ టెక్స్‌టైల్స్ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా సౌజన్యంతో ఈ ప్రదర్శను ఏర్పాటు చేశామని, ఎక్కడా దొరకని సరికొత్త బెనారస్ చీరలు ప్రత్యేక స్టాల్స్ ఏర్పాటు చేశామని నిర్వాహకుడు వినయ్ తెలిపారు. కార్యక్రమంలో మినిస్ట్రీ ఆఫ్ టెక్స్‌టైల్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ డాక్టర్ అరుణ్‌కుమార్, డాక్టర్ విజయలక్ష్మి, చేనేత కళాకారులు పాల్గొన్నారు.

వావ్ సెయిలింగ్!

- సెయిలింగ్ వీక్‌తో నగరానికి కొత్త కళ
- మూడవ రోజు ఉత్సాహంగా రేసింగ్



రితిక



శశాంక్



అద్వైత్



వివి వైష్ణవి

సాక్షి, సిటీబ్యూరో: ఈఎంఈ సెయిలింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో యాటింగ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా, లేసర్ క్లాస్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా సహకారంతో నగరం వేదికగా నిర్వహిస్తున్న హైదరాబాద్ సెయిలింగ్ వీక్ పోటీలు మూడవ రోజు కోలాహలంగా జరిగాయి.

హుస్సేన్ సాగర్ వేదికగా దేశవ్యాప్తంగా పాల్గొన్న సెయిలర్స్ తమ 3వ రోజు పోటీల్లో రెగట్టా సెయిలింగ్ రేస్‌లను పూర్తి చేశారు. హుస్సేన్ సాగర్ వేదికగా వాతావరణం స్థిరంగా ఉండటంతో సెయిలర్స్ ఉత్తమ నైపుణ్యాలను ప్రదర్శించారని నిర్వాహకులు పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం సెషన్‌లో ఐఎల్‌సీఏ 6 'ఓపెన్, మహిళలు' రెండు విభాగాల్లో రేసులు నిర్వహించారు. అన్ని రేసుల్లో సెయిలర్ రితికా సత్తాచాటింది. ఓపెన్ కేటగిరీ రేసుల్లో అద్విత్ (ఐఎన్‌డబ్ల్యూటీసీ), కోటేశ్వరరావు (ఏవైఎన్) మధ్య హోరాహోరీ పోరు జరిగింది. ఐఎల్‌సీఏ7 (ఓపెన్)లో మోహిత్ సైనీ ఇప్పటికీ తన ర్యాంకింగ్‌ను 1వ స్థానంలో కొనసాగిస్తున్నాడు. 8వ రేసులో ఫ్లీట్ చాలా దూకుడుగా ఉండటంతో ప్రిన్సిపల్ రేస్ ఆఫీసర్ శ్రీకాంత్ చతుర్వేది (ఐఆర్‌ఓ) సాధారణ రీకాల్‌ను కొత్తగా ప్రారంభించారు. ఈ 37వ హైదరాబాద్ సెయిలింగ్ వీక్ 9వ తేదీ వరకు కొనసాగనుంది.

బోనాలకు 150 ప్రత్యేక బస్సులు

సాక్షి, సిటీబ్యూరో: సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళీ బోనాల వేడుకలను పురస్కరించుకొని ఈ నెల 9, 10వ తేదీల్లో ప్రత్యేక బస్సులను నడపనున్నట్లు ఆర్టీసీ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ ప్రాంతాల నుంచి సికింద్రాబాద్‌కు వచ్చే భక్తుల కోసం 150 ప్రత్యేక బస్సులను నడుపుతామన్నారు. బాలాజీనగర్, రిసాలాబజార్, వెంకటాపురం, ఓల్డ్ అల్వాల్, మెహిదీపట్నం, కుషాయిగూడ, చర్లపల్లి, హకీంపేట్, ఓల్డ్‌బోయిన్‌పల్లి, చార్మినార్, సైనిక్‌పురి, సనత్‌నగర్, జామై ఉస్మానియా, కేపీహెచ్‌బీ, పటాన్‌చెరు తదితర ప్రాంతాల నుంచి ఈ బస్సులు సికింద్రాబాద్‌కు రాకపోకలు సాగిస్తాయి. ఈ బస్సులకు ఉజ్జయిని బోనాలు స్పెషల్ అనే తాత్కాలిక డెస్టినేషన్ బోర్డులను ఏర్పాటు చేస్తారు.

క్లుప్తంగా...

మత్స్యకారుల సమస్యల పరిష్కారానికి 'హెల్ప్‌లైన్'

ఫిషరీస్ ఫెడరేషన్ చైర్మన్ పిట్టల రవీందర్ వెల్లడి



సాక్షి, హైదరాబాద్: మత్స్యకారుల సమస్యల పరిష్కారానికి 'హెల్ప్‌లైన్'సౌకర్యాన్ని అందుబాటులోకి తీసుకురానున్నామని తెలంగాణ ఫిషరీస్ ఫెడరేషన్ చైర్మన్ పిట్టల రవీందర్ తెలిపారు. ఈనెల 10న బేగంపేటలోని హరిత ప్లాజా హోటల్‌లో జరిగే 'జాతీయ మత్స్య రైతుల దినోత్సవం'సందర్భంగా ఈ హెల్ప్‌లైన్‌ను పశుసంవర్ధక, మత్స్యశాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ ప్రారంభిస్తారని శుక్రవారం ఆయన ఒక ప్రకటనలో వెల్లడించారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ సౌకర్యం అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఈ హెల్ప్‌లైన్ విధానంతో మత్స్యకారులు తమ సమస్యలను నేరుగా అధికారులకు విన్నవించుకోవడానికి అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. దేశంలోనే మొదటిసారిగా ఫిషరీస్ ఫెడరేషన్ నిర్వహణలో ప్రయోగాత్మకంగా ఏర్పాటు చేస్తున్న ఈ 'హెల్ప్‌లైన్'సౌకర్యాన్ని రాష్ట్రంలోని మత్స్యకారులందరూ సద్వినియోగం చేసుకోవాలని పిట్టల రవీందర్ కోరారు.

'పారా స్పోర్ట్స్'కు 2 శాతం రిజర్వేషన్: హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: పారా స్పోర్ట్స్ క్రీడాకారులకు 2 శాతం రిజర్వేషన్ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. అన్ని ప్రభుత్వ నియామకాలు, సీట్ల భర్తీకి సంబంధించిన అంశాల్లో ఈ రిజర్వేషన్ వర్తింపజేయాలని స్పష్టం చేసింది. ఈ మేరకు పిటిషనర్ దాఖలు చేసిన పిటిషన్‌ను అనుమతించింది. ప్రభుత్వం 2012లో జారీ చేసిన జీవో 74లో స్పోర్ట్స్ కోటాను మాత్రమే పేర్కొందని.. పారా స్పోర్ట్స్ క్రీడాకారులను కూడా చేర్చాలని.. జూనియర్ పంచాయతీ కార్యదర్శుల నియామకాల్లో ఈ రిజర్వేషన్ వర్తింపజేసేలా అధికారులకు ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ.. సూర్యాపేట జిల్లా మేళ్లచెరువుకు చెందిన రాగుల నరేశ్‌యాదవ్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్, జస్టిస్ తుకారాంజీ ధర్మాసనం ఇటీవల విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫున బాగ్లేకర్ ఆకాశ్ కుమార్ వాదనలు వినిపించారు. పారా స్పోర్ట్స్ క్రీడాకారులకు రిజర్వేషన్ వర్తింపజేయకపోవడంతో వారు నియామకాల్లో, సీట్ల భర్తీలో అవకాశాలు కోల్పోతున్నారని పేర్కొన్నారు. వాదనలు విన్న ధర్మాసనం.. పారా స్పోర్ట్స్ వారికి కూడా 2 శాతం రిజర్వేషన్ వర్తింపజేయాలని ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ తీర్పునిచ్చింది.

నిలబడు.. బలపడు



స్టాండింగ్ పొజిషన్‌లో వర్క్ పట్ల ఆసక్తి
- వివిధ ఆరోగ్య సమస్యల నుంచి విముక్తి
- స్టాండింగ్ డెస్క్‌లకు డిమాండ్


వర్క్ ఫ్రమ్ హోమ్‌లో ఉండగా కార్పొరేట్ ప్రొఫెషనల్ అన్షుల్‌కి వెన్నునొప్పి మొదలైంది. క్రమంగా అది అతని ఇతర రోజువారీ కార్యకలాపాలను సైతం ప్రభావితం చేయడం ప్రారంభించింది. దాంతో అన్షుల్ స్నేహితుల సలహా మేరకు స్టాండింగ్ డెస్క్‌ను ఎంచుకున్నారు. 'ఇప్పుడు, నా వెన్నునొప్పి తగ్గిపోయింది' అని అన్షుల్ చెబుతున్నారు. ఎక్కువ గంటలు కూర్చోవడం స్మోకింగ్‌తో సమానమైన వ్యసనంగా ఇప్పుడు వైద్యులు పరిగణిస్తున్నారు. ఈ నేపథ్యంలో నగరానికి చెందిన కార్పొరేట్ ఉద్యోగులు, ఇతర డెస్క్ జాబ్స్ చేసేవారు నిలబడు...బలపడు అంటున్నారు. వీరికి స్టాండింగ్ డెస్క్‌లు పరిష్కారంగా మారుతున్నాయి.

— సాక్షి, హైదరాబాద్ —

ఆధునిక పరిస్థితుల్లో మనం కంప్యూటర్లు, టెలివిజన్లు ఇతర ఎలక్ట్రానిక్ పరికరాల ముందు కూర్చొని ఎక్కువ సమయం గడుపుతున్న కొద్దీ, మన శారీరక, మానసిక ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావాలు మరింత స్పష్టంగా కనిపిస్తున్నాయి.ఈ ప్రతికూల ప్రభావాలను ఎదుర్కోవడానికి ఒక సులభ పరిష్కారం స్టాండింగ్ డెస్క్., వీటినే సిట్–స్టాండ్ డెస్క్‌లు అని కూడా పిలుస్తారు. కూర్చున్న, నిలబడి ఉన్న భంగిమలకు అనుగుణంగా రోజంతా రెండు రకాల భంగిమలకు మధ్య మారడానికి వీలుగా ఇవి రూపొందాయి.

కూర్చోవడం- నుంచోవడం మధ్య వ్యత్యాసాల గురించి వైద్యులు చెబుతున్న ప్రకారం...

ఎక్కువసేపు కూర్చోవడం వల్ల ఊబకాయం, గుండె జబ్బులు, కొన్ని రకాల క్యాన్సర్స్ వంటి అనేక ఆరోగ్య సమస్యలు ఉత్పన్నమవుతాయి.	ఎక్కువసేపు కూర్చున్నప్పుడు, మెదడుకు రక్త ప్రసరణ పరిమితమవుతుంది, ఇది చిత్త వైకల్యం వంటి మెదడు జబ్బుల ప్రమాదానికి దారితీస్తుంది.
నిలబడి ఉన్నప్పుడు, మెదడుకు రక్త ప్రసరణ పెరుగుతుంది. దానికి అవసరమైన ఆక్సిజన్ ఇతర పోషకాలను అందిస్తుంది.	
చాలా సేపు కూర్చోవడం వల్ల అలసట, బద్ధకం వస్తాయి. అయితే స్టాండింగ్ శక్తి స్థాయిలను పెంచి చురుకుదనాన్ని ఇస్తుంది.	గంటల తరబడి ఒకే భంగిమలో కూర్చోవడం వల్ల వెన్నునొప్పికి దారి తీస్తుంది. అదే నిలబడి ఉన్న డెస్క్‌లు నిటారుగా నిలబడటానికి మన కోర్ కండరాలకు మద్దతు అందించడం ద్వారా వెన్నెముక ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో సహాయపడతాయి.



చలనం...ఆలోచనల ఫలం

నగరానికి చెందిన ప్రోగ్రామర్ అభిషేక్ మాండ్లోయ్ 3 నెలల క్రితం స్టాండింగ్ డెస్క్‌కి మారారు, దీని కోసం కంపెనీ అతనికి ఫర్నిచర్ అలవెన్స్ మంజూరు చేసింది. ''ఈ మార్పునకు నాకు రూ.27,000 ఖర్చయింది. దీని వల్ల శారీరక ఆరోగ్యమే కాదు అంతకుమించి ప్రయోజనాలు కనిపిస్తున్నాయి. నిలబడి ఉన్నప్పుడు నేను నలువైపులా కదలగలను. అది నేను మరింత వేగంగా ఆలోచించగలిగేలా పనిలో చురుకుతనం పెరిగేలా చేస్తోంది''అని మాండ్లోయ్ అన్నారు. దీని గురించి ఫిట్‌నెస్ అగ్రిగేటర్ జింపిక్ సంస్థ వ్యవస్థాపకుడు అమరేష్ ఓజా మాట్లాడుతూ, 'స్టాండింగ్ డెస్క్ మరింత చురుకుగా పని చేసేలా చేస్తుందనీ తన స్టార్టప్‌లోని సగం మంది సిబ్బంది ఇప్పటికే స్టాండింగ్ డెస్క్‌లను కొనుగోలు చేశారని చెప్పారు. అదే క్రమంలో యాపిల్ సంస్థ సైతం తన కొత్త ప్రధాన కార్యాలయం యాపిల్ పార్క్‌లో పనిచేసే ఉద్యోగులందరికీ స్టాండింగ్ డెస్క్‌లను ఏర్పాటు చేసిందని సమాచారం.

డెస్క్‌కు డిమాండ్...

వర్క్ ఫ్రమ్ హోమ్ ట్రెండ్ బలపడడంతో అది స్టాండింగ్ డెస్క్‌ల డిమాండ్ పెరగడానికి దారితీసింది. 'కోవిడ్‌కు ముందుతో పోలిస్తే ఈ డెస్క్‌ల సేల్స్ ఇప్పుడు రెట్టింపైంది' అని ఎర్గో డెస్క్ రిటైల్ స్టోర్ నిర్వాహకులు రాహుల్ మాథుర్ అన్నారు. గత త్రైమాసికం నుంచి వర్క్ ఫ్రమ్ హోమ్ సొల్యూషన్‌ల డిమాండ్ 45% కంటే పెరిగి, ఇప్పటికీ స్థిరంగా పెరుగుతోందని ఫర్నిచర్ రెంటల్ పోర్టల్ సిటీ ఫర్నిష్ వ్యవస్థాపకుడు నీరవ్ జైన్ వెల్లడించారు.

సరిగ్గా ఉపయోగిస్తేనే..

నగరంలోని ఓ ఆసుపత్రికి చెందిన సర్జన్ డాక్టర్ అరుణ్ మాట్లాడుతూ ''సరైన భంగిమలో ఉపయోగించినప్పుడు స్టాండింగ్ డెస్క్‌లు మంచి ఫలితాలను అందిస్తాయి'' అని స్పష్టం చేశారు. అయితే ఒంగిన భంగిమలో లేదా మరేదైనా అపసవ్య భంగిమలో గాని నిలుచుని పనిచేస్తే అది కొత్త సమస్యలకు దారితీస్తుంది, అని ఆయన హెచ్చరిస్తున్నారు. మణికట్టు డెస్క్‌పై ఫ్లాట్‌గా ఉన్నప్పుడు మోచేతులు 90–డిగ్రీల కోణంలో ఉండాలని ఆయన సూచిస్తున్నారు. అయితే 30 నిమిషాల కంటే ఎక్కువసేపు ఒకే భంగిమలో నిలబడడం కూడా మంచిది కాదని అటూ ఇటూ చలనం అవసరమని అంటున్నారు.

నైజీరియన్ల డ్రగ్స్ దందాకు చెక్

రూ. కోటి విలువైన మాదకద్రవ్యాలు స్వాధీనం
- బెంగళూరు కేంద్రంగా ముఠా కార్యకలాపాలు
- ఆర్థిక లావాదేవీల కోసం కొయంబత్తూర్‌లో ఖాతా
- అరెస్టైన వారికి సహకరించేందుకు అసోసియేషన్
- చెక్ చెప్పిన తెలంగాణ నార్కోటిక్స్ బ్యూరో అధికారులు



వివరాలు వెల్లడిస్తున్న నగర కొత్వాల్ సీవీ ఆనంద్

సాక్షి, హైదరాబాద్: బెంగళూరు కేంద్రంగా వ్యవస్థీకృతంగా డ్రగ్స్‌దందా చేస్తున్న ముగ్గురు నైజీరియన్ల ముఠాకు తెలంగాణ నార్కోటిక్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (టీ–నాబ్) చెక్ చెప్పింది. గత నెలలో ఈ వింగ్ ఏర్పడిన తర్వాత పట్టుకున్న తొలి కేసు ఇదే. ముగ్గురు నిందితుల నుంచి రూ.కోటి విలువైన ఎండీఎంఏ, కొకైన్ స్వాధీనం చేసుకున్నట్లు నగర కొత్వాల్, టీ–నాబ్ డైరెక్టర్ సీవీ ఆనంద్ శుక్రవారం వెల్లడించారు. కొయంబత్తూరులోని బ్యాంకు ఖాతాలు నిర్వహిస్తూ, డెడ్ డ్రాప్, సడన్ డెలివరీ విధానాల్లో మాదకద్రవ్యాలు సరఫరా చేస్తున్న ఈ ముఠా ఏడాదిలో రూ.4 కోట్ల దందా చేసినట్లు అనుమానిస్తున్నామని ఐసీసీసీలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సీపీ తెలిపారు.

నైజీరియా నుంచి 2011లో మెడికల్ వీసాపై ముంబై వచ్చి, బెంగళూరులో స్థిరపడిన అగ్బోవో మాక్స్‌వెల్ నబూసి ఈ సిండికేట్‌కు సూత్రధారిగా ఉన్నాడు. 2012లో బిజినెస్ వీసాపై ముంబై వచ్చిన ఒకెకో చిగోజా బ్లెస్సింగ్ గతేడాది మాక్స్‌వెల్ వద్దకు చేరాడు. 2021లో స్టూడెంట్ వీసాపై బెంగళూరు వచ్చిన ఇకెమ్ ఆస్టిన్ ఒబాక కూడా వీరితో కలవడంతో డ్రగ్ సిండికేట్ ఏర్పాటైంది. డ్రగ్ దందా ప్రారంభించిన మాక్స్‌వెల్ ప్రస్తుతం ఘనాలో ఉంటున్న స్నేహితురాలు మజీ సహకారంతో కొయంబత్తూరులోని కెనరా బ్యాంకులో మరో ఘనా జాతీయుడు ఎవ్వాన్ ఎరీన్ కావా పేరుతో ఖాతా తెరిచాడు. ఆన్‌లైన్ ద్వారా డ్రగ్స్ మార్కెటింగ్ చేసే 'మాక్స్‌వెల్ అండ్ కో' కొనుగోలుకు ఆసక్తి చూపిన కస్టమర్లతో కేవలం వీఓఐపీ కాల్స్, వర్చువల్ నంబర్లతోనే మాట్లాడతారు. రేటు ఖరారైన తర్వాత కొయంబత్తూరులోని బ్యాంకు ఖాతాలోకి నగదు బదిలీ చేయాల్సి ఉంటుంది. ఆపై సరుకును ఆయా ప్రాంతాల్లో ఉన్న స్థానిక పెడ్లర్స్ ద్వారా కస్టమర్లకు డెలివరీ చేయిస్తారు. బెంగళూరుతో పాటు ముంబై, హైదరాబాద్‌లో వీరి కస్టమర్లు ఉన్నారు. డ్రగ్స్‌ను కస్టమర్లకు నేరుగా ఇవ్వరు. నగదు జమ అయినట్లు ఘనా నుంచి సమాచారం వచ్చాక .. ద్విచక్ర వాహనంపై వచ్చి అతడి చేతిలో డ్రగ్ ప్యాకెట్ పెట్టి సడన్‌గా డెలివరీ చేసి వెళ్లిపోతారు.

డెకాయ్ ఆపరేషన్ ద్వారా వెలుగులోకి.

నైజీరియన్లకు పెడ్లర్స్‌గా పనిచేస్తున్న సంజయ్, భాను తేజలను హెచ్–న్యూ అధికారులు గతంలో అరెస్టు చేశారు. వీరి విచారణలో మాక్స్‌వెల్, బ్లెస్సింగ్, ఇకెమ్ పేర్లు వెలుగులోకి వచ్చాయి. వీరికోసం టీ–నాబ్ ఎస్పీ సునీతరెడ్డి నేతృత్వంలో ఇన్‌స్పెక్టర్ పి.రాజేష్, ఎస్సై జీఎస్ డానియేల్ రంగంలోకి దిగారు. బెంగళూరులో నెల రోజులు మకాం వేసి కస్టమర్లుగా నటిస్తూ డెకాయ్ ఆపరేషన్ ద్వారా పట్టుకున్నారు. వీరి నుంచి రూ.కోటి విలువైన 100 గ్రాముల కొకైన్, 300 గ్రాముల ఎండీఎంఏ స్వాధీనం చేసుకున్నారు.

వీరి కస్టమర్లను గుర్తిస్తాం

ఈ నిందితులు బెంగళూరు కేంద్రంగా అసోసియేషన్ ఆఫ్ నైజీరియన్స్ పేరుతో సంఘం ఏర్పాటు చేశారు. వివిధ నేరాలు చేస్తూ పట్టుబడిన నైజీరియన్లకు బెయిల్స్ వంటి న్యాయ సహాయం కోసం వీళ్లు నిధి కూడా ఏర్పాటు చేశారు. దీనిలోకి రెండు నెలల్లో రూ.8.75 లక్షలు జమయ్యాయి. ఇలా వ్యవస్థీకృతంగా వీరి వ్యవహారం సాగడం ఆందోళనకర అంశం. కొయంబత్తూరులోని బ్యాంకు ఖాతా విశ్లేషణ బాధ్యతల్ని ఓ కంపెనీకి చెందిన ఆడిటర్‌కు అప్పగించాం. అలా నగరంలో వీరికి ఉన్న కస్టమర్లను గుర్తిస్తాం.

– సీవీ ఆనంద్, హైదరాబాద్ పోలీసు కమిషనర్


శంకర్‌కు భూ కేటాయింపు సబబే: హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: ప్రముఖ సినీ దర్శకుడు ఎస్.శంకర్‌కు ప్రభుత్వం రంగారెడ్డి జిల్లా శంకరపల్లి మండలం మోకిల్ల గ్రామంలో 5 ఎకరాల భూమి కేటాయించడాన్ని హైకోర్టు సమర్థించింది. సినిమా, టీవీ స్టుడియో నిర్మాణంతో పలువురికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని పేర్కొంది. స్టూడియో నిర్మాణంకోసం శంకర్ వినతిపత్రం అందజేసిన తర్వాతే రాష్ట్ర కేబినెట్ భూ కేటాయింపుపై నిర్ణయం తీసుకుందని స్పష్టం చేసింది. ప్రభుత్వం నేరుగా భూమి కేటాయించిందన్న పిటిషనర్ వాదనను తప్పుబట్టింది. ప్రభుత్వం జారీ చేసిన జీవో నంబర్ 75 సబబేనని తీర్పు వెలువరించింది. భూ కేటాయింపులకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వానికి అధికారాలు ఉంటాయని.. ఈ క్రమంలోనే సినీ రంగానికి, క్రీడాకారులకు కేటాయిస్తుందని చెప్పింది. గతంలోనూ పలువురు ప్రముఖులకు భూములు కేటాయించిన సందర్భాలు ఉన్నాయని వెల్లడించింది. సుప్రీంకోర్టు కూడా సినీ, క్రీడా.. తదితర రంగాల ప్రముఖులకు ఆయా రంగాల అభివృద్ధి కోసం భూమి కేటాయించడాన్ని సమర్థించిందని గుర్తుచేసింది. మోకిల్ల గ్రామం సర్వే నంబర్ 8లో ఎకరం రూ.5 లక్షల చొప్పున 5 ఎకరాలను ప్రభుత్వం శంకర్‌కు కేటాయిస్తూ 2019లో జీవో నంబర్ 75 జారీ చేయడాన్ని సవాల్ చేస్తూ కరీంనగర్‌కు చెందిన జె.శంకర్ 2020లో హైకోర్టులో ప్రజాహిత వ్యాజ్యం దాఖలు చేశారు. విచారణ పూర్తి కావడంతో బుధవారం తీర్పును రిజర్వు చేసిన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్, జస్టిస్ తుకారాంజీ ధర్మాసనం శుక్రవారం తుది ఉత్తర్వులు వెలువరించింది. 'సినీ పరిశ్రమను ప్రోత్సహించే సదుద్దేశంతోనే స్టూడియో నిర్మాణం కోసం శంకర్‌కు ప్రభుత్వం భూమి కేటాయించింది. ఇతర ఏ పనులకు వినియోగించకూడదన్న నిబంధన కూడా విధించింది. బలహీన వర్గానికి చెందిన శంకర్ 40 ఏళ్లుగా సినీ పరిశ్రమకు సేవలు అందిస్తున్నారు. తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్నారు. ఆయనకు భూమి కేటాయించే నాటికి అక్కడ ఎకరం మార్కెట్ విలువ రూ.20 లక్షలు మాత్రమే ఉంది. స్టూడియో నిర్మాణంతో పలువురు కళాకారులను సినీ రంగానికి అందించిన వారమవుతాం. చట్ట ప్రకారమే అన్ని నిబంధనలను పాటిస్తూ భూ కేటాయింపు జరిగింది'అని అడ్వొకేట్ జనరల్ (ఏజీ) బీఎస్ ప్రసాద్ చేసిన వాదనలతో ధర్మాసనం ఏకీభవించింది. స్టుడియో నిర్మాణానికి భూమి కేటాయించడాన్ని సమర్థించింది.

సాక్షి రియల్టీ

తుక్కుగూడలో జీహెచ్ఆర్ ప్రాజెక్ట్

సాక్షి, హైదరాబాద్: నిర్మాణ రంగంలో మూడు దశాబ్దాల అనుభవం కలిగిన జీహెచ్ఆర్ ఇన్‌ఫ్రా తుక్కుగూడలోని అల్మాస్‌గూడలో స్మార్ట్ విల్లా గేటెడ్ కమ్యూనిటీ ప్రాజెక్ట్‌కు శ్రీకారం చుట్టింది. కొల్లూరులో కాలిస్టో ప్రాజెక్ట్‌లో కస్టమర్ల సంతృప్తిని చూసి ఫేజ్–2లో కొత్త టవర్‌ను ప్రారంభించామని సంస్థ సీఈఓ ఎం కార్తీష్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో చ.అ. ధర రూ. 5,799గా నిర్ణయించామన్నారు. ఈ ప్రాజెక్ట్‌లో సౌకర్యవంతమైన, ఆహ్లాదకరమైన జీవనశైలితో పాటు స్మార్ట్ లివింగ్ ఫీచర్లను అందిస్తాయని చెప్పారు. కాలిస్టో ప్రాజెక్ట్‌లో 1,190 యూనిట్లలో 60% విక్రయాలు పూర్తయ్యాయని చెప్పారు. ఫేజ్–1 డిసెంబర్ 2025 నాటికి పూర్తవుతుందన్నారు.



ఆకాశమే హద్దుగా..



సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ డెవలపర్లు ఆకాశమే హద్దుగా చెలరేగిపోతున్నారు. నింగికి నిచ్చెనలు వేసినట్టుగా నిర్మాణాలు చేపడుతున్నారు. హైరైజ్ భవన నిర్మాణాలలో దేశంలోనే హైదరాబాద్ రెండో స్థానంలో నిలిచింది. దేశంలోని ఏ ఇతర నగరాల్లో లేని విధంగా నగరంలో అపరిమిత ఫ్లోర్ స్పేస్ ఇండెక్స్ (ఎఫ్ఐఎస్) అందుబాటులో ఉండటమే ఆకాశహర్మ్యాల పెరుగుదలకు ప్రధాన కారణమనేది అక్షర సత్యం.

- రియల్ ఎస్టేట్ కన్సల్టెన్సీ సీబీఆర్ఈ సౌత్ ఏషియా 'స్కై ఈజ్ లిమిట్: రైజ్ ఆఫ్ టాల్ బిల్డింగ్స్ ఇన్ ఇండియా' టైటిల్‌తో నివేదికను విడుదల చేసింది. రిపోర్ట్‌లోని పలు ఆసక్తికర అంశాలివే... 150 మీటర్ల కంటే ఎక్కువగా ఉన్న భవనాలను ఆకాశహర్మ్యాలుగా కౌన్సిల్ ఆన్ టాల్ బిల్డింగ్ అండ్ అర్బన్ హాబిటాట్ (సీటీబీయూహెచ్) నిర్వచించింది. ఈ మేరకు దేశంలో హైరైజ్ భవన నిర్మాణాలలో ముంబై ఆధిపత్యాన్ని కొనసాగిస్తుంది.
- ప్రస్తుతం దేశంలో పూర్తయిన, నిర్మాణంలో 250 ఆకాశహర్మ్యాలున్నాయి. వీటిలో 77 శాతం వాటాతో ముంబై తొలి స్థానంలో నిలిచింది. ప్రస్తుతమిక్కడ వందకు పైగా హైరైజ్ బిల్డింగ్‌లున్నాయి. ప్రపంచంలోనే అత్యధిక ఎత్తయిన భవన నిర్మాణాలు కలిగిన నగరాలలో ముంబై 17వ స్థానంలో, ఆసియాలో అయితే 14వ స్థానంలో నిలిచింది. ఆర్థిక రాజధానిలో స్థలాల ధరలు ఖరీదైన నేపథ్యంలో వర్టికల్ నిర్మాణాలే డెవలపర్లకు లాభసాటిగా మారాయి.
- దేశంలోనే ఎత్తయిన భవన నిర్మాణాలలో 8 శాతం వాటాతో హైదరాబాద్ రెండో స్థానంలో ఉంది. మిగిలిన నగరాలైన కోల్‌కతా 7 శాతం, నోయిడా 5 శాతం, బెంగళూరు, చెన్నై, గుర్గావ్ నగరాలలో ఒక్కో శాతం హైరైజ్ భవనాల వాటాను కలిగి ఉన్నాయి. ఎత్తయిన భవనాలలో నివాస సముదాయాలే అత్యధికం. దేశంలోని మొత్తం హైరైజ్ బిల్డింగ్‌లలో రెసిడెన్షియల్ విభాగం 89 శాతం వాటాను కలిగి ఉండగా.. కార్యాలయ భవనాలు 6%, మిశ్రమ నిర్మాణాలు 4%, హోటల్స్ 1% వాటాతో ఉన్నాయి.
- దేశంలో పట్టణ జనాభా 2030 నాటికి 600 మిలియన్లను దాటుతుందని అంచనా. ప్రధాన నగరాలలో కొత్త మార్గాలలో అభివృద్ధి జరగాలి. పట్టణాలలో స్థలాల కొరతను అధిగమించేందుకు ఎత్తయిన భవనాలే మార్గంగా మారాయని సీబీఆర్ఈ ఇండియా, సౌత్ ఈస్ట్ ఏషియా చైర్మన్ అన్షుమన్ మేగజైన్ అభిప్రాయపడ్డారు. అయితే హైరైజ్ భవనాలు నిర్మించడం అంత సులభమేమీ కాదని, అనేక సవాళ్లుంటాయని పేర్కొన్నారు.

పశ్చిమంలోనే అత్యధికం..

హైదరాబాద్‌లోని అపరిమిత ఎఫ్ఎస్ఐను వంద శాతం సద్వినియోగం చేసుకునేందుకు నిర్మాణ సంస్థలు, వాటాదారులు పోటీపడుతున్నారు. దీంతో గత కొన్నేళ్లుగా నగరంలో హైరైజ్ భవనాలు పెరిగిపోతున్నాయి. ఆహ్లాదకరమైన వాతావరణం, సిటీ వ్యూ, ప్రైవసీ వంటి కారణంగా హైరైజ్ భవనాలలో నివాసం ఉండాలని కొనుగోలుదారులు ఇష్టపడుతుంటారు. అయితే ఆయా భవనాలలో ధరలు ప్రీమియంగా ఉంటాయి. హైదరాబాద్‌లో పశ్చిమ హైదరాబాద్‌లోనే ఎక్కువగా హైరైజ్ భవనాలు కేంద్రీకృతమై ఉన్నాయి. ప్రధానంగా కోకాపేట, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, గచ్చిబౌలి, తెల్లాపూర్, నల్లగండ్ల వంటి ఐటీ కారిడార్ ప్రాంతాలలోనే ఎత్తయిన నివాస, ఆఫీసు, వాణిజ్య సముదాయాలున్నాయి.



● థాంక్యూ మేడం!

నిర్మాణ అనుమతులు జారీ చేసే ప్రభుత్వ విభాగాలతో సచివాలయంలో సమావేశం సందర్భంగా సీఎస్ శాంతి కుమారికి డెవలపర్ల సంఘాలు కృతజ్ఞతలు తెలిపాయి. ఈ కార్యక్రమంలో క్రెడాయ్ అధ్యక్షుడు పి. రామకృష్ణారావు, తెలంగాణ నరెడ్కో ప్రెసిడెంట్ సునీల్ చంద్రారెడ్డి, టీబీఎఫ్ ప్రెసిడెంట్ సీ ప్రభాకర్ రావు, టీడీఏ ప్రెసిడెంట్ జీవీ రావులు పాల్గొన్నారు.




కాలి బూడిద అయిన బోగీ లోపలి భాగం


సామగ్రితో నడుచుకుంటూ వెళ్తున్న ప్రయాణికులు


మిగిలిన బోగీల్లో ప్రయాణికులను సికింద్రాబాద్ స్టేషన్‌కు తరలిస్తున్న సిబ్బంది

క్లుప్తంగా...

దేశ ప్రగతిలో యువతే కీలకం

డీజీపీ అంజనీకుమార్



సాక్షి, హైదరాబాద్: దేశ అభివృద్ధి, పురోగమనంతోపాటు సామాజిక సంస్కరణలను తీసుకు రావడంలో యువతదే ప్రధాన పాత్ర అని డీజీపీ అంజనీ కుమార్ అన్నారు. అక్షయ విద్య స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం డీజీపీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో సింగరేణి కాలనీ, రసూల్ పురా తదితర బస్తీలకు చెందిన 80 మంది నిరుపేద విద్యార్థులకు లాప్‌టాప్‌లను డీజీపీ అంజనీ కుమార్ అందజేశారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ, చదువుకున్న యువత తమ బస్తీలలో చెడు మార్గాలలో పయనిస్తున్న తోటి యువకులను గుర్తించి వారు సరైన మార్గంలో పయనించేలా కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఖరగ్‌పూర్ ఐఐటీలో సీటు సాధించిన రమేష్ అనే యువకుడిని డీజీపీ ప్రత్యేకంగా అభినందించారు. ఐజీ రమేశ్‌రెడ్డి, పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

సకాలంలో సమన్వయంతో చర్యలు: డీజీపీ

సాక్షి, హైదరాబాద్: హౌరా నుంచి సికింద్రాబాద్ వస్తున్న ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్ అగ్నిప్రమాదంలో ప్రయాణికులంతా సురక్షితంగా ఉన్నారని డీజీపీ అంజనీకుమార్ శుక్రవారం ట్వీట్ చేశారు. 'ప్రయాణికులను బస్సులలో వారి గమ్యస్థానాలకు తరలించాం. పోలీస్, అగ్నిమాపక, రైల్వే శాఖల అధికారులు సకాలంలో సమన్వయంతో చర్యలు తీసుకున్నారు. మొత్తం 18 బోగీలలో 11 బోగీలను మంటలు అంటుకోకుండా వేరు చేశాం. ఏడు బోగీలకు మంటలు అంటుకున్నాయి'అని ట్వీట్‌లో డీజీపీ పేర్కొన్నారు.

విద్యుత్ సంస్థకు వినియోగదారులే ఓనర్స్

కొత్త ఏఈలుగా ఎంపికైన అభ్యర్థులతో మంత్రి జగదీశ్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: విద్యుత్ సంస్థలకు వినియోగదారులే యజమానులని విద్యుత్ శాఖమంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి పేర్కొన్నారు. సంస్థలో నూతనంగా ఉద్యోగంలో చేరే వారు ఈ విషయాన్ని గుర్తుపెట్టుకోవాలని, వినియోగదారుల పట్ల పాజిటివ్ దృక్పథంతో వ్యవహరిస్తే అద్భుత మైన విజయాలు నమోదు చేసుకోవచ్చని తెలిపారు. ఎస్‌పీడీసీఎల్‌లో నూతనంగా నియమితులైన 48 అసిస్టెంట్ ఇంజనీరింగ్ ఉద్యోగులకు మింట్ కాంపౌండ్‌లోని సంస్థ కార్పొరేట్ కార్యాలయంలో శుక్రవారం నియామకపు ఉత్తర్వులను మంత్రి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ సంస్థలో నూతనంగా చేరిన వారికి ట్రాన్స్‌కో సీఎండీ ప్రభాకర్‌రావు, డిస్కం సీఎండీ రఘుమారెడ్డి ఓ రోల్ మోడల్‌లు అని చెప్పారు. ప్రభాకర్‌రావుకు ఇంతకంటే మంచి ఆఫర్లు వచ్చినా.. వాటన్నింటినీ వదులుకుని జన్మ భూమికి సేవ చేయాలనే లక్ష్యంతో ఇక్కడే పని చేస్తున్నారని చెప్పారు. అదే విధంగా రఘుమా రెడ్డి విద్యుత్ సంస్థను సొంత ఇల్లుగా భావించి, సంస్థలో పనిచేసే సిబ్బందిని కుటుంబం అనుకుని సంస్థను నడిపిస్తున్నార న్నారు. సీఎండీ ప్రభాకర్‌రావు మాట్లాడుతూ. విద్యుత్ ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు.

రాత్రి తొమ్మిదింటి దాకా 'టి-9 టికెట్'కు ఓకే

ఆర్టీసీ బస్సుల్లో రేపటి నుంచి అమలు

సాక్షి, హైదరాబాద్: కొత్తగా ప్రవేశపెట్టిన 'టి-9 టికెట్' సమయాల్లో ఆర్టీసీ మార్పులు చేసింది. పల్లెవెలుగు బస్సుల్లో ప్రయాణించే మహిళలు, వృద్ధుల కోసం అందుబాటులోకి తెచ్చిన ఈ టికెట్‌ను ఇక నుంచి ఉదయం 9 నుంచి రాత్రి 9 గంటల వరకు వినియోగించుకోవచ్చని ప్రకటించింది. ఇప్పటివరకు ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకే ఈ టికెట్ చెల్లుబాటయ్యేది. ప్రయాణికుల నుంచి వచ్చిన అభ్యర్థనల మేరకు ఈ మార్పు చేసింది. దీనితో పాటు 'టి-9 టికెట్'తో ఎక్స్‌ప్రెస్ సర్వీసుల్లోనూ ప్రయాణించే వెసులుబాటు కల్పించింది. రూ.100 చెల్లించి ఈ టికెట్ కొనుగోలు చేసిన ప్రయాణికులు తిరుగు ప్రయాణంలో రూ.20 కాంబీ టికెట్‌తో ఎక్స్‌ప్రెస్ బస్సుల్లోనూ ప్రయాణించవచ్చు. తిరుగు ప్రయాణంలో మాత్రమే ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో రూ.20 కాంబీ టికెట్ వర్తిస్తుంది. టి-9 టికెట్ సవరణ సమయాలు, రూ.20 కాంబి టికెట్ ఈ నెల 9 నుంచి అమల్లోకి వస్తాయని సంస్థ ప్రకటించింది.

అగ్నికీలల్లో 'ఫలక్‌నుమా'

- ఐదు బోగీలు పూర్తిగా, రెండు బోగీలు పాక్షికంగా దగ్ధం
- శుక్రవారం ఉదయం భువనగిరి సమీపంలోని బొమ్మాయిపల్లి వద్ద ఘటన
- తొలుత ఎస్4 బోగీలో పొగలు.. కాసేపటికే మంటలు
- అది గుర్తించి చైన్ లాగిన ఓ ప్రయాణికుడు
- భయంతో లగేజీ వదిలేసి రైల్లోంచి దిగిపోయిన ప్రయాణికులు
- కాసేపటికే అటు ఎస్ 2, 3.. ఇటు 5, 6 బోగీలకూ వ్యాపించిన అగ్ని కీలలు
- షార్ట్ సర్క్యూట్ జరిగిందా?.. విద్రోహ చర్యా?
- విచారణ జరుపుతున్న రైల్వే శాఖ.. రూ. 6 కోట్ల నష్టం
- 'త్వరలో బాలాసోర్ తరహా రైలు ప్రమాదం'అంటూ వచ్చిన హెచ్చరిక లేఖ నేపథ్యంలో కలకలం.. బోగీలలో ఆధారాలు సేకరించిన ఫోరెన్సిక్ నిపుణులు

సాక్షి, యాదాద్రి/సికింద్రాబాద్ (హైదరాబాద్): శుక్రవారం ఉదయం సుమారు 10 గంటలు.. కోల్‌కతా నుంచి సికింద్రాబాద్ మీదుగా మన్మాడ్ వెళ్తున్న ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్ రైలు.. ప్రయాణికులంతా మాటాముచ్చట్లతో, సెల్‌ఫోన్‌లో గడుపుతున్నారు.. ఉన్నట్టుండి ఎస్4 బోగీలో పొగలు వచ్చాయి.. కొద్దిసేపట్లోనే మంటలు మొదలయ్యాయి.. అది చూసిన ప్రయాణికులంతా హాహా కారాలు పెట్టారు.. ఓ ప్రయాణికుడు అప్రమత్తమై చైన్ లాగడం, అదే సమయంలో రైల్వే గార్డు హెచ్చరికలతో లోకోపైలట్లు బ్రేక్ వేయడంతో రైలు ఆగిపోయింది. వెంటనే ప్రయాణికులంతా ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని.. లగేజీని రైల్లోనే వదిలేసి కిందికి దిగిపోయారు. ఎలాంటి ప్రాణనష్టం సంభవించలేదు. యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి శివార్లలోని బొమ్మాయిపల్లి రైల్వేస్టేషన్ సమీపంలో ఈ ఘటన జరిగింది. ప్రమాదంలో ఐదు బోగీలు పూర్తిగా, రెండు బోగీలు పాక్షికంగా దగ్ధమయ్యాయి. ఈ ఘటన షార్ట్‌సర్క్యూట్ వల్ల జరిగిందా? విద్రోహ చర్య ఏదైనా ఉందా అన్నదానిపై అధికారులు విచారణ జరుపుతున్నారు. కారణాలేమిటనేది అధికారికంగా ప్రకటించలేదు.

లగేజీ, సామగ్రి దగ్ధమైపోయి..

ప్రమాదంలో ఎస్4 బోగీతోపాటు ఓవైపు ఉన్న ఎస్2, ఎస్3, మరోవైపున్న ఎస్5, ఎస్6 బోగీలు పూర్తిగా కాలిపోయాయి. వాటిలో చాలా మంది ప్రయాణికుల లగేజీ, వస్త్రాలు, ల్యాప్‌టాప్‌లు, సర్టిఫికెట్లు, ఇతర సామగ్రి కాలిబూడిదయ్యాయి. అటూ ఇటూ ఉన్న మరో రెండు బోగీలు పాక్షికంగా దహనమయ్యాయి. రైల్వే శాఖకు రూ.6 కోట్ల మేరకు నష్టం వాటిల్లినట్టు ప్రాథమికంగా అంచనా వేశారు. దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ప్రమాదానికి కారణంపై విచారణ జరుపుతున్నామని ప్రకటించారు. కాలిపోయిన బోగీలను బీబీనగర్ రైల్వేస్టేషన్‌కు తరలించగా.. ఫోరెన్సిక్ నిపుణులు ఆధారాలను సేకరించారు.

వేగంగా సహాయక చర్యలు

రైల్లో మంటల విషయం తెలియగానే ఎన్డీఆర్ఎఫ్, అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి బయలుదేరారు. అయితే రైల్వేస్టేషన్‌కు దూరంగా పొలాల మధ్య ఉన్న ఘటనా స్థలానికి చేరుకోవడానికి కాస్త ఆలస్యమైంది. మొత్తంగా పది ఫైరింజన్లతో మంటలు ఆర్పారు. రైల్లోంచి దిగిన ప్రయాణికులకు స్థానిక గురుకుల పాఠశాలలో వసతి కల్పించి, ఆహారం మంచినీరు అందించినట్టు భువనగిరి జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి వెల్లడించారు. మధ్యాహ్న సమయంలో కాలిపోయిన బోగీలను వదిలేసి మిగతా బోగీలలో ప్రయాణికులను ఎక్కించి రైలును సికింద్రాబాద్‌కు పంపించారు.

విద్రోహ చర్యపై అనుమానాలు

'హైదరాబాద్-ఢిల్లీ మార్గంలో బాలాసోర్ తరహా రైలు ప్రమాదం జరుగుతుంది'అని హెచ్చరిస్తూ వారం కింద దక్షిణ మధ్య రైల్వేకు బెదిరింపు లేఖ వచ్చిన నేపథ్యంలో తాజా ప్రమాదం కలకలం రేపింది. దీనితో ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్ ప్రమాదం వెనుక విద్రోహ చర్యపై అనుమానాలు వ్యక్తమవుతున్నా యి. అయితే షార్ట్ సర్క్యూట్‌తోగానీ, బోగీ టాయిలెట్‌లో ప్రయాణికులెవరైనా మద్యం తాగుతూ, సిగరెట్ అంటించే క్రమంలోగానీ మంటలు మొదలై ఉండొచ్చని అధికారులు భావిస్తున్నారు.

పిల్లలకు ఏమవుతుందోనని భయపడ్డాం..

రైల్లో మంటలు మొదలవడంతో ఎటువెళ్లాలో, ఏం చేయాలో తెలియని పరిస్థితిలో ఇరుక్కుపోయామని.. పిల్లలకు ఏమవుతుందోనని భయపడ్డామని ప్రయాణికులు తెలిపారు. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌కు చేరుకున్నాక తమ బాధ వెళ్లబోసుకున్నారు. రైలు ఆగిపోగానే ఒక్కసారిగా కిందికి దూకేశామని చెప్పారు. తమ వస్త్రాలు, ఇతర సామగ్రి ఆ బోగీల్లోనే కాలిపోయాయని వాపోయారు.

గాలి ధాటికి మంటలు విస్తరించి..

18 బోగీలతో వెళ్తున్న ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్ రైలు భువనగిరి జిల్లా నాగిరెడ్డిపల్లి రైల్వేస్టేషన్ దాటగానే ఎస్4 బోగీలో పొగలు, మంటలు మొదలయ్యాయి. ఇవి టాయిలెట్‌లో మొదలయ్యాయని కొందరు, బోగీ మధ్యలోని అప్పర్ బెర్త్ పక్కన మొదలయ్యా యని మరికొందరు ప్రయాణికులు చెప్తున్నారు. అయితే రైలు వేగంగా వెళుతుండటంతో గాలి ధాటికి అగ్నికీలలు విస్తరించాయి. అది గుర్తించి రైలును ఆపేసరికే సుమారు ఆరు కిలోమీటర్ల దూరంలోని బొమ్మాయిపల్లి సమీపంలోకి చేరుకుంది. రైలు ఒక్కసారిగా కుదుపుతో ఆగిందని, లగేజీ వదిలి కిందికి దూకామని ప్రయాణికులు చెప్తున్నారు. ఈ క్రమంలో ఒకరి మీద ఒకరు పడటంతో పలువురికి స్వల్పగాయాలయ్యాయి. ప్రయాణికులు, రైల్వే సిబ్బంది స్పందించి బోగీల మధ్య లింక్‌ను వేరు చేయడంతో.. మంటలు ఇతర బోగీలకు వ్యాపించడం ఆగిపోయింది. ప్రమాదంతో శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి ఈ మార్గంలో రైళ్ల రాకపోకలను నిలిపివేశారు. వాటిని విజయవాడ-కాజీపేట మీదుగా మళ్లించారు. సాయంత్రం 6.30 గంటల తర్వాత రాకపోకలను పునరుద్ధరించారు.

మంటలు చూసి చైన్ లాగాను



మాది విజయనగరం .కుటుంబంతో కలసి షిర్డీకని బయలుదేరాం. మధ్యలో హైదరాబాద్‌లో కొన్ని పర్యాటక ప్రాంతాలు చూడాలని అనుకున్నాం. రైలు వేగంగా వెళ్తున్న సమయంలో ఎస్4 బోగీలో పొగలు, మంటలు మొదలయ్యాయి. అక్కడున్న వారంతా పరుగులు పెట్టారు. నేను వెంటనే అప్రమత్తమై చైన్ లాగాను. రైలు ఆగగానే అందరం కిందికి దిగేశాం. లగేజీలు తీసుకుందామనుంటే మొత్తంగా మంటలు వ్యాపించి కాలిపోయాయి. – ఎల్.పవలేష్, విజయనగరం

పగటి వేళ అవడమే ప్రాణాలు కాపాడింది

- ప్రయాణికులు అప్రమత్తమై చైన్ లాగడం, దిగేయడంతో తప్పిన ప్రాణ నష్టం
- 2008లో అర్ధరాత్రి గౌతమి ఎక్స్‌ప్రెస్‌లో మంటలు
- ప్రయాణికులు గాఢనిద్రలో ఉండటంతో 40 మంది మృతి
- బోగీల్లో దర్జాగా ధూమపానంతో ప్రమాదాలకు ఆస్కారం
- సరిగా లేని విద్యుత్ సాకెట్లు, లూజ్ వైరింగ్‌తోనూ డేంజర్

సాక్షి, హైదరాబాద్: ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్ ప్రమాదం పగటి వేళ జరగడం, ప్రయాణికులు అప్రమత్తంగా ఉండటంతోనే ప్రాణ నష్టం తప్పిందని.. లేకుంటే ఘోర ప్రమాదం జరిగి ఉండేదని అధికారులు చెప్తున్నారు. ఇదే తరహాలో 2008 ఆగస్టు 1న జరిగిన గౌతమి ఎక్స్‌ప్రెస్ ప్రమాదాన్ని గుర్తు చేస్తున్నారు. సికింద్రాబాద్ నుంచి కాకినాడ వెళ్తున్న గౌతమి ఎక్స్‌ప్రెస్ రైలు కేసముద్రం–తాళ్ల పూసపల్లి మధ్య ఉండగా.. అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో ఎస్10 బోగీలో మంటలు మొదలయ్యాయి. ప్రయాణికులంతా గాఢ నిద్రలో ఉండటంతో వెంటనే గుర్తించలేకపోయారు. రైలు ఆగేసరికే మంటలు మరో నాలుగు బోగీలకు వ్యాపించి 32 మంది సజీవ దహనమయ్యారు. మరో వంద మంది తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో చికిత్స పొందుతూ 8 మంది మృతి చెందారు. అయితే ఇప్పుడు ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్‌లోనూ అదే తరహాలో పొగలు, మంటలు వచ్చాయి. ప్రయాణికులు దీనిని గుర్తించి, చైన్ లాగారు. రైలు ఆగగానే కిందికి దిగి దూరంగా పరుగెత్తారు. కాసేపటికే మంటలు ఐదు బోగీలను చుట్టుముట్టాయి. ఆస్తి నష్టం జరిగినా, ప్రాణ నష్టం తప్పింది.

బోగీల్లో దర్జాగా ధూమపానం.. తనిఖీలేవి?

కోల్‌కతా నుంచి వస్తున్న ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్‌లో హౌరా నుంచి వస్తున్న కొందరు యథేచ్ఛగా ధూమపానం చేస్తూనే ఉన్నారని సికింద్రాబాద్ స్టేషన్‌కు చేరుకున్నాక బాధిత ప్రయాణికులు ఫిర్యాదు చేశారు. ఈ ప్రమాదానికి షార్ట్ సర్క్యూట్ అవడమా, సిగరెట్/బీడీ కాల్చిపడేయడం వల్ల జరిగిందా అన్న స్పష్టత ఏదీ లేకున్నా.. నిప్పు పుట్టేందుకు ఆస్కారమున్న ధూమపానం మాత్రం ఆందోళన రేపుతూనే ఉంది. దీనిపై ఎన్ని ఫిర్యాదులు ఉన్నా రైల్వే అధికారులు పట్టించుకోవడం లేదని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. టికెట్ తనిఖీ సిబ్బంది, గార్డులు ఎప్పుడైనా రైలులో ధూమపానాన్ని గమనిస్తే.. హెచ్చరించి వదిలేయడమో, నామమాత్రపు ఫైన్ వేయడమో చేస్తున్నారని.. ప్రత్యేక తనిఖీలు, కఠిన చర్యలు ఉండటం లేదని అంటున్నారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో పశ్చిమ రైల్వే అధికారులు నాలుగు రోజులపాటు రైళ్లలో తనిఖీలు నిర్వహిస్తే.. ఏకంగా 787 మంది ధూమపానం చేస్తూ పట్టుబడ్డారు. దక్షిణ మధ్య రైల్వే పరిధిలో అలాంటి తనిఖీల ఊసే లేకపోవడం గమనార్హం.

ప్రమాదకరంగా విద్యుత్ సాకెట్లు

ప్రస్తుతం సెల్‌ఫోన్ వాడకం విస్తృతం కావటంతో రైలుబోగీల్లో సెల్‌ఫోన్ల చార్జింగ్ కోసం విద్యుత్ సాకెట్లు ఏర్పాటు చేస్తున్నా రు. అధునాతన ఎల్‌హెచ్‌బీ బోగీల్లో వాటి తయారీ సమయంలోనే బిగిస్తారు. వాటితో సమస్య తక్కువ. కానీ పెద్ద సంఖ్యలో ఉన్న సాధారణ బోగీల్లో ఈ మధ్యే ఏర్పాటు చేశారు. వీటికి లూజ్ వైరింగ్ ఉండటం, ప్రయాణికులు అటూఇటూ కదల్చడంతో.. షార్ట్ సర్క్యూట్‌కు ఆస్కారం ఏర్పడుతోందన్న విమర్శలు ఉన్నాయి.


దగ్ధమైన బోగీలో ఆధారాలను సేకరిస్తున్న ఫోరెన్సిక్ అధికారులు

తప్పుడు రిఫండ్ క్లెయిమ్‌లు సరిచేసుకోండి

- అర్హత లేని పత్రాలతో క్లెయిమ్ చేసుకుంటే జైలు శిక్ష
- తప్పుడు పత్రాలతో రిటర్న్ ఫైల్ చేసిన వేలాది మందిని గుర్తించాం..
- వారిపై దర్యాప్తు కొనసాగుతోంది..
- ఐటీ రిటర్న్ ఫైలింగ్‌లో అధికారుల నుంచి సాయం పొందవచ్చు..
- ఐటీ ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్ మిథాలి మధుస్మిత



సాక్షి, హైదరాబాద్: ఐటీ రిఫండ్ క్లెయిమ్ కోసం సమర్పించిన ధ్రువపత్రాల్లో ఏవైనా పొరపాట్లు ఉంటే వాటిని సరిచేసుకుని తిరిగి సమర్పించాలని ఆదాయ పన్నుశాఖ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్ మిథాలి మధుస్మిత పన్ను చెల్లింపుదారులకు సూచించారు. తప్పుడు ధ్రువపత్రాలు సమర్పించి ఐటీ రిఫండ్ పొందేందుకు ప్రయత్నించిన రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల వ్యవహారం వెలుగులోకి రావడంతో ఆ కుంభకోణంపై సమగ్రంగా దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు. ఆ తరహా మోసాలకు పాల్పడితే ఐటీ చట్టాల ప్రకారం శిక్షలు తప్పవని హెచ్చరించారు. శుక్రవారం ఇన్‌కమ్ ట్యాక్స్ టవర్స్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మిథాలి మధుస్మిత మాట్లాడారు.

డిసెంబర్ 31 లోగా సవరించిన రిటర్న్స్ దాఖలు

తప్పుడు క్లెయిమ్స్ చేసి రిఫండ్ పొందిన పన్ను చెల్లింపుదారులు 2023-24. 2022-23. 2021-22 కోసం దాఖలు చేసిన రిటర్న్సు లో అర్హతలేని తప్పుడు క్లెయిమ్స్‌ను సరిచూసుకోవాలని ఆమె స్పష్టం చేశారు. పునఃపరిశీలన తరువాత, సవరించిన రిటర్న్సు ను ఈ ఏడాది డిసెంబర్ 31 లోగా దాఖలు చేయాలని సూచించారు. ఐటీ రిఫండ్ కోసం తప్పుడు ధ్రువపత్రాలు సమర్పించినా, అర్హత లేని మినహాయింపులు కోరినా ఆదాయపన్ను చట్టం 1961 ప్రకారం కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. తప్పుడు పత్రాలు సమర్పించిన వారికి ఏడాదికి 12శాతం వడ్డీతో పాటు జరిమానాగా 200శాతం పన్ను విధింపు ఉంటుందని తెలిపారు. రెండేళ్ల జైలు శిక్ష సైతం విధించే అవకాశం ఉందని హెచ్చరించారు.

రిఫండ్ శాతం పెరుగుదలతో అనుమానం

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రీజియన్‌లో గత ఏడాదిలో పలువురు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, కొన్ని ప్రముఖ ఐటీ కంపెనీలకు చెందిన ఉద్యోగులు 75% నుంచి 90% వరకు ఐటీ రిఫండ్ క్లెయిమ్ చేయడంతో అనుమానం వచ్చి ఆరా తీసినట్టు వివరించారు. గత రిఫండ్ చెల్లింపులు 2021-22 ఏడాదిలో 34% ఉండగా, 2023-24 ఏడాదికి సంబంధించి 84శాతానికి చేరినట్టు గుర్తించామన్నారు. దీంతో ఏపీ, తెలంగాణలోని మొత్తం తొమ్మిది ప్రాంతాల్లో వేలాది మంది పన్నుచెల్లింపుదారుల క్లెయిమ్‌లను సర్వే చేయగా అందులో బోగస్ పత్రాలు పెట్టినట్టు వెలుగు చూసిందన్నారు. 'ఏపీ, తెలంగాణ రాష్ట్రాలకు అవతల వున్న కంపెనీలలో పనిచేస్తున్న వారిలో కొంతమంది తమకు జీతం చెల్లించే యాజమాన్యం, ఆయా చెల్లింపు సమయాల్లో తగ్గించిన పన్నులో సుమారు డెబ్బై అయిదు శాతం నుంచి తొంబై శాతం మేర రిఫండ్ క్లెయిమ్ చేశారు. ఈ విషయాలపై క్షేత్ర స్థాయిలో విచారణ జరపగా.. , జీతాలు తీసుకుంటున్న కొంతమంది ఉద్యోగులు మధ్యవర్తుల మాటలకు ఆకర్షితులై, అసంబద్ధమైన క్లెయిమ్స్ చేశారని తేలింది. ఈ ప్రక్రియలో వారు కొంత మొత్తాన్ని కమీషన్ రూపంలో తీసుకున్నట్లు కూడా బయటపడింది'అని వివరించారు. ఈ మదింపు ఇంకా కొనసాగుతోందని, ప్రభుత్వ ఉద్యోగులు ఏయే శాఖల వారు ఉన్నారు..ఐటీ కంపెనీల్లో ఏయే కంపెనీల ఉద్యోగులు ఉన్నారు..ఎంత మేర కుంభకోణం జరిగిందన్న వివరాలు ఇప్పుడే వెల్లడించలేమని చెప్పారు..

ఏ సందేహమైనా మమ్మల్ని సంప్రదించండి

''ఆదాయపు పన్ను శాఖ పన్ను చెల్లింపుదారుల లావాదేవీలు సులభంగా జరిగేలా చర్యలు తీసుకుంటుంది. పన్ను చెల్లింపుదారులు స్వచ్ఛందంగా పన్నులు చెల్లించడాన్ని ప్రోత్సహిస్తోంది. కన్సల్టెన్సీలను నమ్మి మోసపోవద్దు''అని ఆమె సూచించారు. ఈ ప్రక్రియలో సహాయం లేదా సందేహాల నివృత్తి కోసం స్థానిక ఐటీ కార్యాలయంలోని ఆయకర్ సేవా కేంద్రాన్ని సంప్రదించవచ్చని తెలిపారు. www.incometaxindia.gov.in వెబ్‌సైట్, హెల్ప్ లైన్ నెంబర్ 18001030025/18004190025 కు సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

పీఎఫ్ ఫిర్యాదుల పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణ..

- చందాదారులు, వాటాదారుల నుంచి సలహాలు, సూచనల స్వీకరణ
- పక్కా ఆధారాలున్న ఫిర్యాదుల తక్షణ పరిష్కారమే ప్రధాన లక్ష్యం
- క్షేత్రస్థాయిలో చర్యలు చేపట్టిన ఈపీఎఫ్‌ఓ



సాక్షి, హైదరాబాద్: ప్రావిడెంట్ ఫండ్ చందాదారుల నుంచి వచ్చే ఫిర్యాదుల పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని ఎంప్లాయీ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్(ఈపీఎఫ్‌ఓ) నిర్ణయించింది. ఎంప్లాయీ ప్రావిడెంట్ ఫండ్(ఈపీఎఫ్), ఎంప్లాయి పెన్షన్ స్కీం(ఈపీఎస్) పథకాల అమలుపై ఈపీఎఫ్‌ఓకు తరచుగా ఫిర్యాదులు వస్తున్నాయి. ఇందులో చాలావాటికి పూర్తిస్థాయిలో ఆధారాలు సమర్పిస్తున్న ఘటనలు సైతం ఉంటున్నాయి. ఈ క్రమంలో వీటిని పరిష్కరించేందుకు ఈపీఎఫ్‌ఓ విజిలెన్స్ విభాగానికి ఫిర్యాదులను పంపిస్తున్నప్పటికీ వాటి పరిష్కారానికి సంబంధించి ప్రత్యేక కార్యాచరణ ఏమీ లేదు. ఫిర్యాదుదారులు ఇస్తున్న వాటిపై విచారణ చేసి పరిష్కరిస్తుండడం.. చర్యలకు సిఫార్సు చేయడం జరుగుతున్నప్పటికీ... కార్యాలయాలకు వస్తున్న ఫిర్యాదులు సంఖ్య, పరిష్కరిస్తున్న వాటి సంఖ్యకు పొంతన లేదు. ఈ క్రమంలో నిర్దిష్ట గడువులోగా వాటిని పరిష్కరించే దిశగా ఈపీఎఫ్‌ఓ చర్యలు మొదలుపెట్టింది. ఇందులో భాగంగా క్షేత్ర స్థాయిలో చందాదారులు, వాటాదారుల నుంచి సలహాలు, సూచనలు స్వీకరించేందుకు ఉపక్రమించింది. ఈమేరకు రెండ్రోజుల క్రితం ఈపీఎఫ్‌ఓ ప్రత్యేక ప్రకటన జారీ చేసింది. ప్రకటన వెలువడినప్పటి నుంచి పక్షం రోజుల పాటు సలహాలు, సూచనలు స్వీకరించనున్నట్లు అందులో పేర్కొంది.

ఆధారం ఉంటేనే విచారణ...

ఈపీఎఫ్‌ఓకు వస్తున్న ఫిర్యాదులను కేటగిరీలుగా వర్గీకరించి చర్యలు చేపట్టనుంది. కార్యాలయానికి అందుతున్న ఫిర్యాదుల్లో ఆధారాలున్నవి, కేవలం విమర్శలు, ఆరోపణలతో కూడినవి వేరువేరుగా విభజిస్తారు. పక్కా ఆధారాలతో ఉన్న ఫిర్యాదును వేగంగా పరిష్కరిస్తారు. ఫిర్యాదు తీరు, దాని ప్రభావం, జాప్యంతో నెలకొనే పరిస్థితులు తదితరాలను నిశితంగా పరిశీలిస్తారు. ఫిర్యాదుల పరిష్కారం, తీసుకోవల్సిన చర్యలకు సంబంధించి లోతైన సమాచారాన్ని ఈపీఎఫ్‌ఓ వెబ్‌సైట్‌లో పొందుపర్చింది. వీటిని పరిష్కరించే క్రమంలో తీసుకోవల్సిన చర్యలపైనా క్షేత్రస్థాయిలో వాటాదారులు, చందాదారుల నుంచి సలహాలు సూచనలను ఈపీఎఫ్‌ఓ స్వీకరిస్తోంది.

రోడ్డు భద్రత అంతేనా... ప్రపంచ బ్యాంకు ప్రాజెక్టు గల్లంతేనా?

గతేడాది వచ్చిన ప్రతినిధుల బృందం.. రూ.360 కోట్లను కేటాయించనున్నట్టు వెల్లడి.. ఏడాది గడుస్తున్నా జాడే లేని నిధులు

సాక్షి, హైదరాబాద్: ప్రపంచబ్యాంకు, ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంకు(ఏడీబీ)లు రోడ్డు రవాణా, జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖతో సంయుక్తంగా చేపట్టే రోడ్డు భద్రత ప్రాజెక్టుపై నీలినీడలు కమ్ముకున్నాయి. ఆరేళ్లపాటు నిర్వహించే ఈ ప్రాజెక్టులో భాగంగా రాష్ట్రానికి రూ.360 కోట్ల నిధులు అందాల్సి ఉంది. రోడ్డు భద్రతకు సంబంధించి సుప్రీం కోర్టు కమిటీ పనిచేస్తుండగా, ఈ కొత్త ప్రాజెక్టును దానితో అనుసంధానించాలా వద్దా అన్న విషయంలో ఓ స్పష్టత రాలేదని అంటున్నారు. దీంతో ఈపాటికే ప్రాజెక్టు పట్టాలెక్కాల్సి ఉండగా.. అసలు ఉంటుందా లేదా అనే సంశయం ఇప్పుడు నెలకొంది.

అంతా సిద్ధమయ్యాక..

మన దేశంలో సగటున సాలీనా లక్షన్నర మంది రోడ్డు ప్రమాదాలకు బలవుతున్నారు. మరో నాలుగున్నర లక్షల మంది గాయపడుతున్నారు. రోడ్డు ప్రమాదాలను తగ్గించటం, క్షతగాత్రులకు సకాలంలో వైద్యం అందించటం లక్ష్యంగా ప్రపంచ బ్యాంకు ఓ ప్రాజెక్టుకు రూపకల్పన చేసింది. దేశంలోని 14 పెద్ద రాష్ట్రాలను దీని అమలుకు ఎంపిక చేసి ప్రాజెక్టులో ఏడీబీని చేర్చింది. ఈ రెండు బ్యాంకులు 250 మిలియన్ డాలర్ల చొప్పున ఈ ప్రాజెక్టుకు విరాళంగా అందిస్తాయి. వీటికి సమంగా కేంద్రప్రభుత్వం భరించాల్సి ఉంటుంది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, గుజరాత్, ఒడిశా, ఉత్తర్‌ప్రదేశ్, పశ్చిమబెంగాల్, తమిళనాడులను ప్రపంచ బ్యాంకు దత్తత తీసుకోగా, అస్సాం, బీహార్, హర్యానా, కర్ణాటక, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, రాజస్థాన్‌లను ఏడీబీ తీసుకుంది. ఈ మేరకు గతేడాది ప్రపంచ బ్యాంకు ప్రతినిధులు హైదరాబాద్‌కు వచ్చి ఇక్కడి అధికారులతో ప్రాజెక్టుపై చర్చించి వెళ్లారు.

ఏం చేస్తారంటే..

ప్రమాదాలకు కారణమవుతున్న రోడ్ల లోపాలను మెరుగుపరచటం, రోడ్లపై ట్రాఫిక్ ఉల్లంఘనలు లేకుండా పోలీసు శాఖకు కావాల్సిన వాహనాలు, స్పీడ్‌గన్స్‌లాంటివి సమకూర్చటం, రోడ్డు భద్రతపై రవాణాశాఖ ఆధ్వర్యంలో ప్రజల్లో అవగాహన తెచ్చే కార్యక్రమాలు నిర్వహించటం, ప్రమాదాల్లో గాయపడ్డ వారికి వేగంగా సరైన చికిత్స అందించేందుకు ట్రామాకేర్ సెంటర్లు, అంబులెన్సులు ఏర్పాటు చేయటం ఈ ప్రాజెక్టు లక్ష్యం. ఇందుకోసం అందే నిధులను సంబంధిత శాఖలు సమన్వయంతో ఖర్చు చేయాల్సి ఉంటుంది. అవసరమైతే భవిష్యత్తులో నిధుల మొత్తాన్ని పెంచుతారు. ప్రపంచ బ్యాంకు ప్రతినిధులతో జరిగిన సమావేశంలో తెలంగాణకు రూ.360 కోట్లు కేటాయిస్తున్నట్టు ప్రాథమిక వివరాలు వెల్లడయ్యాయి. ఈ సంవత్సర నుంచే ఆ నిధులతో పనులు చేపట్టనున్నట్టు కూడా ప్రకటించారు. కానీ ఇప్పటి వరకు వాటి అతీగతీ లేకుండా పోయింది.

సుప్రీం కోర్టు కమిటీ సీరియస్..

తెలంగాణలో రోడ్ల నిర్వహణ సరిగా లేదని, ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని ఇటీవల రెండు పర్యాయాలు రోడ్డు భద్రతపై ఏర్పడిన సుప్రీం కోర్టు కమిటీ పేర్కొంది. ఆ మేరకు కమిటీ చైర్మన్ జస్టిస్ అభయ్ సాప్రే హైదరాబాద్‌లో అధికారులతో నిర్వహించిన భేటీలో సీరియస్ అయ్యారు. సమస్య పరిష్కారానికి కొన్ని సూచనలు కూడా చేశారు. ఈ కమిటీ రోడ్డు భద్రతపై పని చేస్తున్నందున, ప్రపంచ బ్యాంకు ఇచ్చే నిధులను ఈ కమిటీ ఆధ్వర్యంలో వ్యయం చేయాలన్న అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. దీనిపై సరైన నిర్ణయం తీసుకోవటంలో జరిగిన జాప్యం వల్లనే ఆ ప్రాజెక్టు పడకేసిందన్న అభిప్రాయాలూ వ్యక్తమవుతున్నాయి. గతంలో చేవెళ్ల మీదుగా కర్ణాటకలోని బీజాపూర్ వరకు కొనసాగే జాతీయ రహదారిని రోడ్ సేఫ్టీలో భాగంగా మెరుగుపరిచేందుకు పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసినప్పటికీ అది అర్థాంతరంగా ఆగిపోయిన విషయం తెలిసిందే. దీంతో ఈ ప్రాజెక్టుపై కూడా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ఇక మరోవైపు ఆ ప్రాజెక్టు నిధులు లభ్యమవుతాయన్న ఉద్దేశంతో స్థానికంగా రోడ్డు భద్రతకు సంబంధించిన కార్యక్రమాలకు నిధులు విడుదలతో నిర్లక్ష్యం జరుగుతోందన్న విమర్శలు కూడా వినిపిస్తున్నాయి.

*** మనం మాట్లాడుకోవాల్సిందే!**

సోషల్ మీడియా ద్వారా చిన్న చిన్న అట్రాక్షన్స్‌కు లోనై 'లవ్' పేరుతో ట్రాఫికింగ్ బారిన పడుతున్న అమ్మాయిల వ్యథలు ఇటీవల ఎన్నో ఉంటున్నాయి. ఈ సమస్య సమాజంలో ఎలాంటి పరిణామాలను సృష్టిస్తుందో, ముందే ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో నిపుణులు చెప్పే విషయాలను 'మనం మాట్లాడుకోవాల్సిందే!'


ప్రతీకాత్మక చిత్రం

ఆన్‌లైన్ లవ్ మాయలో పడొద్దు!

'ప్రియ (పేరుమార్చడమైనది) కనిపించక రెండు రోజులవుతోంది. ఏం జరిగిందో తెలియక తల్లిదండ్రులు తల్లడిల్లిపోయారు. కంప్లైంట్ ఇచ్చిన ఒక రోజులోనే ప్రియని తీసుకొచ్చి, తల్లిదండ్రులకి అప్పజెప్పారు పోలీసులు.

వారు చెప్పిన విషయం విన్న తల్లిదండ్రులు ఆశ్చర్యపోయారు.

ప్రియ వయసు పదిహేనేళ్లు. పదో తరగతి చదువుతోంది.

కరోనా టైమ్‌లో ఆన్లైన్ క్లాసెస్ కోసం తండ్రి స్మార్ట్ ఫోన్ కొనిచ్చాడు. ఇప్పటికీ ఆ ఫోన్ తనే వాడుతోంది.

మూడు నెలల క్రితం సోషల్ మీడియాలో ఆమెకు ఒక వ్యక్తి పరిచయం అయ్యాడు. అతని పేరు విక్కీ.

ఫ్రెండ్‌గా ఆమె మంచి చెడులు కనుక్కుంటూ, చాటింగ్ చేస్తూ ఉండేవాడు.

మొదట వాయిస్ కాల్స్, ఆ తర్వాత వీడియో కాల్స్ మాట్లాడుతుండేవాడు.

అతను చెప్పే ప్రేమ కబుర్లు ప్రియకు బాగా నచ్చాయి. అమ్మానాన్నలు ఎంతసేపూ చదువు చదువు అని అంటుంటారు. కానీ, వాటి గురించి విక్కీ మాట్లాడడు.

ఒక్కరోజు విక్కీ చాట్ చేయకపోయినా, ఫోన్‌లో మాట్లాడకపోయినా ప్రియకు ఊపిరాడనట్లుండేది.

విక్కీ ఏం చెప్పినా ప్రియ వెనకాడకపోయేది.

రోజు రోజుకూ విక్కీ లేకపోతే తను బతకలేనని అనిపించసాగింది ప్రియకు.

దీంతో ఓ రోజు విక్కీ చెప్పిన చోటుకు వెళ్లిపోవాలనుకుంది.

దాంతో తల్లికి తెలియకుండా డబ్బులు తీసుకుని చెప్పకుండా వెళ్లిపోయింది.

ఎవరికైనా చెబితే పరువు పోతుందనే భయం ఓ వైపు, కూతురు ఏమైందోననే భయం మరోవైపు వారిని కుదిపేసింది.

తల్లిదండ్రులు ఇచ్చిన కంప్లైంట్‌తో.. ప్రియ ముంబైకి చేరుకున్నట్టు కనిపెట్టిన పోలీసులు, ఆమెను సురక్షితంగా తిరిగి తీసుకొచ్చారు. ఇలాంటి కథనాలు ఇటీవల మనం తరచూ వింటున్నాం.

– నిర్మలారెడ్డి

పెద్ద శిక్ష

అలవాట్లు రుగ్మతలు అవుతున్నాయి. రుగ్మతలుగా మారడం వల్లే నేరాలు కూడా భిన్నంగా మారిపోయాయి. ఇంటర్నెట్ వల్ల మంచి ఎంత పెరిగిందో, చెడు అంతకన్నా ఎక్కువ పెరిగింది. కొందరికి ఇదొక ఉపయోగకరమైన అడిక్షన్‌గా కూడా మారింది. ప్రతిదీ అందుబాటులోకి వచ్చిన ఈ రోజుల్లో అందరిలోనూ కాన్ఫిడెన్స్ లెవల్స్ కూడా పెరిగాయి. దేనికోసం మనం ముందుకు వెళుతున్నాం అనే స్పష్టత ప్రతి ఒక్కరిలోనూ ఉండాలి. షార్ట్‌కట్స్‌లో సంపాదించాలనే ఆలోచన వల్ల కూడా సైబర్ క్రైమ్స్ పెరుగుతున్నాయి. చూడకూడనివి ఎక్కువ చూడటం వల్ల మనస్తత్వాలు మారుతున్నాయి. ఫోన్ చూడద్దని, ఇంటర్నెట్ చూడద్దని, ఎక్స్‌పోజర్ తగ్గించుకోమని చెప్పలేం. ఇవన్నీ మన జీవితంలో భాగమైనప్పుడు ఎలా డీల్ చేయాలో తెలుసుకోవడం మాత్రమే ఈ రోజుల్లో కుటుంబాలకు అవసరం. ఈ రోజుల్లో మైనర్లు ఇంటర్నెట్‌లో ఎక్కువ ఉంటున్నారు. వారిని గమనిస్తూ, మంచి చెడులను చర్చిస్తూ ఉండాలి. ప్రేమ, పెళ్లి పేరుతోనో వెళ్లిపోయారని, వీటిని మిస్సింగ్ కేస్ కింద చూడం. కిడ్నాప్ కింద రిజిస్టర్ చేస్తాం. ట్రేస్ అవగానే రేప్ సెక్షన్స్ యాడ్ చేస్తాం. ఒక్కసారి పోక్సో కేసు కింద నమోదు చేసిన తర్వాత నేరస్తులకు శిక్ష భారీ ఎత్తున పడుతుంది. నాన్‌బెయిలబుల్ సెక్షన్స్ కింద కేస్ బుక్ అవుతుంది. మైనర్‌ని తీసుకువెళ్లి, పెళ్లి చేసుకున్నా అది చట్టరీత్యా నేరం. మైనర్ అమ్మాయి లేదా అబ్బాయి ఇద్దరిలో ఎవరు మిస్ అయినా దానిని ట్రాఫికింగ్‌కు సంబంధించిన సెక్షన్స్ కింద కేస్ రిజిస్టర్ చేస్తాం. రూరల్, అర్బన్ ఏరియాల్లో ఈ సమస్య ఎక్కువగా కనిపిస్తుంది. ఆన్‌లైన్ ప్రేమల జోలికి వెళ్లకుండా ఉండటమే ఉత్తమం.



– సుమతి,
ఐపీఎస్,
డీఐజీ,
ఉమెన్ సేఫ్టీ వింగ్,
తెలంగాణ

- ఆన్‌లైన్‌లోనే కాదు బయట కూడా అమ్మాయిలను ట్రాప్ చేయడానికి చిన్న చిన్న ఆకర్షణ పథకాలను అమలు చేసేవారుంటారు.
- మైనర్ అమ్మాయిలు/అబ్బాయిలు పరిచయం లేని వ్యక్తులు ఇచ్చే కానుకలకు కూడా అట్రాక్ట్ అవుతుంటారు.
- అవతలి వారు చెప్పేది నిజం అని నమ్మి, ఇంటిని వదిలి వెళ్లిపోతుంటారు.
- ఇంట్లో ప్రేమ దక్కలేదనో, మరో కారణం చేతనో బయటి వ్యక్తుల పట్ల ఆకర్షితులవుతుంటారు.

ఇదొక వ్యసనం

పరిచయం లేని వ్యక్తులు తమ పట్ల చూపే కన్సర్న్‌ని నిజమైన ప్రేమ అనుకొని భ్రమిస్తుంటారు కొందరు. ఈ మోహం ఆమె/అతడి ఆరోగ్యం, భవిష్యత్తు సంబంధాలను ప్రభావితం చేస్తుంది. న్యూరలాజికల్ కెమికల్ అయిన ఫినైల్ ఇథైలమైన్ పెరగడం వల్ల ప్రేమభావాలు కలుగుతాయని పరిశోధనలు సూచిస్తున్నాయి. మోహానికి గురైన వ్యక్తులు ఆల్కహాల్, డ్రగ్స్ వంటి అలవాట్లకు కూడా లోనవుతుంటారు. వారిలో ఆనందపు స్థాయిలను పెంచుకోవడానికి రకరకాల మార్గాలను అన్వేషిస్తుంటారు. ఇందుకు సినిమాలు, ఇంటర్నెట్ పోర్న్ సదుపాయాలు కూడా పిల్లల మెదళ్లపై ప్రభావం చూపుతున్నాయి. ఇదొక వ్యసనం అని చాలామంది గుర్తించరు. ఆన్‌లైన్ రిలేషన్‌షిప్స్ తల్లిదండ్రులకు తెలియడం లేదు. పిల్లల ఆన్లైన్ నెట్‌వర్కింగ్ గురించి తల్లితండ్రులకు, కౌన్సెలింగ్ థెరపీ ద్వారా పిల్లల్లోనూ మంచి మార్పులు తీసుకురావచ్చు. స్కూళ్లు, కాలేజీల్లో కూడా 'లవ్, రిలేషన్‌షిప్స్' డిజిటల్ వాడకం, ఏది నమ్మాలి, ఏది నమ్మకూడదు అనే విషయాల పైన అవగాహన తరగతులు తీసుకోవాలి.



– డాక్టర్ గిడియన్,
డి-అడిక్షన్ థెరపిస్ట్
లివింగ్ సోబర్, హైదరాబాద్

బ్యూటిప్స్



పాల నిగారింపు

- పచ్చిపాలు, రోజ్ వాటర్‌ను సమపాళ్లల్లో తీసుకుని కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి అప్లై చేసి వలయాకారంగా మర్దన చేయాలి. పదినిమిషాల తరువాత కాటన్ బాల్‌తో తుడిచేసి గోరువెచ్చని నీటితో శుభ్రం చేసుకోవాలి.
- పచ్చిపాలలో చిటికెడు ఉప్పు వేసి కలిపి, ముఖానికి అప్లై చేయాలి. ఐదు నిమిషాలు మర్దన చేసి చల్లటి నీటితో కడిగేయాలి.
- రెండు టేబుల్ స్పూన్ల వేపాకు పేస్టులో టేబుల్ స్పూను తేనె, ఒకటిన్నర టేబుల్ స్పూన్ల పచ్చి పాలు పోసి పేస్టులా కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి అప్లై చేయాలి. పూర్తిగా ఆరాక గోరు వెచ్చని నీటితో కడిగేయాలి. వారంలో మూడు సార్లు ఈ ప్యాక్ వేసుకోవడం వల్ల మొటిమలు పోయి ముఖం ఫ్రెష్‌గా కనిపిస్తుంది.
- పచ్చిపాలు ఎండవేడికి పొడైన చర్మాన్ని సంరక్షించడంలో ప్రముఖ పాత్ర పోషిస్తాయి. తేమ కోల్పోయిన చర్మానికి తేమనందిస్తాయి. రోజూ క్రమం తప్పకుండా రెండు పూటలా ఈ వీటిలో ఏదైనా ఒక పద్ధతిని అనుసరిస్తే ముఖం మీద మొటిమలు వాటి తాలుకూ మచ్చలు పోయి ముఖం నిగారింపుతో మెరిసిపోతుంది.

కిచెన్ టిప్



ఊరగాయలను నిల్వచేసుకునే చిన్న జాడీలను పొడిగా ఆరబెట్టిన తరువాత, వేడివేడి నూనెను జాడీలోపల రాయాలి. తరువాత ఊరగాయ పెడితే బూజు పట్టదు. రోజూ మూతతీసి వాడుతున్నప్పటికి పచ్చడి ఎక్కువరోజులపాటు నిల్వ ఉంటుంది.

ఇంటిప్స్



- వానాకాలంలో బట్టలను ఉతికాక కర్పూరం కలిపిన నీటిలో జాడించడం వల్ల దుస్తుల నుంచి దుర్వాసన రాకుండా ఉంటుంది. ఆరీ ఆరని దుస్తులను ఇస్త్రీ చేసినా అదోవిధమైన వాసన వస్తాయి. అందువల్ల దుస్తులు పూర్తిగా ఆరిన తర్వాతనే ఐరన్ చేయాలి.
- అల్మారా లో బట్టలను పెట్టేముందు అక్కడక్కడ కొన్ని కర్పూరం బిళ్లలు ఉంచాలి. దీనివల్ల చిమటల వంటి కీటకాలు చేరకుండా ఉంటాయి. అంతేకాకుండా బట్టల్లో దుర్వాసన తొలగిపోతుంది.

చదువు.. సంస్కారం.. పర్యావరణం

పదో తరగతి చదివే పిల్లలు... స్కూలు, ట్యూషన్లు అంటూ బిజీబిజీగా ఉంటారు. ఆఖరి పరీక్షలు పూర్తయ్యేవరకు చదువు తప్ప మరో ధ్యాస ఉండదు వీరికి. అలాంటిది లితిషా బగాడియా చదువుతో పాటు చుట్టుపక్కల పేరుకుపోయిన చెత్తను నిర్మూలిస్తూ పర్యావరణ పరిరక్షణకు నడుం బిగించింది. గత రెండేళ్లుగా వివిధ రకాల కార్యక్రమాలతో ప్రకృతి సంరక్షణకు కృషిచేస్తోన్న లితిషాను 'ద ప్రిన్సెస్ డయానా క్లైమెట్ యాక్షన్' అవార్డు వరించింది. ఈ అవార్డుతో పిల్లలకు చదువు, సంస్కారంతోపాటు పర్యావరణ స్పృహ కూడా ఉండాలి అనడానికి ఉదాహరణగా నిలుస్తోంది లితిషా.

ముంబైకు చెందిన లితిషాకు... చెత్తపేరుకుపోయిన నగరాల జాబితాలో ముంబై కూడా ఉండడం నచ్చలేదు. దీంతో నగరాన్ని శుభ్రం చేయాలనుకుంది. అదే విషయాన్ని తన స్నేహితురాలు సియా జోషికి చెప్పింది. ఇద్దరూ కలిసి ఎన్జీవోని ఏర్పాటు చేసి ముంబైని క్లీన్ చేద్దామనుకున్నారు. కానీ ఆ సమయంలో కరోనా ఆంక్షలు ఉండడంతో బయటకు రావడం కుదరలేదు. దీంతో 2021 ఆగస్టు 31న 'ఐకా' ఫౌండేషన్‌ను ఇన్‌స్టాగ్రామ్‌లో ప్రారంభించారు. ఐకా ద్వారా... పర్యావరణ సమస్యలు, వ్యర్థాల నిర్వహణ, టపాసులు కాల్చడం, నీటి వృథా... వంటి అంశాలపై ప్రచారం చేస్తూ అవగాహన కల్పించేవారు. ఇది నచ్చిన కొంతమంది ఔత్సాహికులు ముందుకు రావడంతో వారితో కలిసి చెత్తను శుభ్రం చేయడం మొదలు పెట్టారు. వీరికి మరికొంతమంది తోడవడంతో అంతా సమూహంగా ఏర్పడి పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలను విస్తరించారు.


లితిషా బగాడియా


సియా జోషి

■ పూల నుంచి పెర్ఫ్యూమ్స్

ప్రాజెక్ట్ 'అవిఘ్న' పేరుతో... వినాయక చవితి వేడుకల్లో మండపాల దగ్గర చల్లే పూలు, ఇతర పండుగల్లో వాడేసిన పూలను, నిమజ్జనం తరువాత మిగిలిపోయే ఇనుము వ్యర్థాలను సేకరించి రీసైక్లింగ్‌కు తరలిస్తున్నారు. ఈ పూలను పెర్‌ఫ్యూమ్స్‌గా, ఎరువులుగా మార్చడం వల్ల నిరుపేదలకు ఆదాయం కూడా వస్తోంది. గణేష ఉత్సవాల్లో మూడువందల కేజీలకు పైగా పూల వ్యర్థాలను సేకరించి 'మోబి ట్రాష్' అనే స్టార్టప్‌కు అందించారు. ఈ స్టార్టప్ పూలను గిరిజన, మురికివాడల్లోని నిరుపేదలకు ఇచ్చి అగరు బత్తీలు, రంగులు తయారు చేయించి వారికి ఉపాధి కల్పిస్తోంది. దీనిద్వారా నగరంలో చెత్త శుభ్రం అవడమేగాక, పరిసరాలు పరిశుభ్రంగా మారుతున్నాయి.

■ ఈ వేస్ట్‌తోపాటు బీచ్‌క్లీనింగ్

వాడిపడేసిన ల్యాప్‌టాప్స్, ఫోన్ ఛార్జర్లు, ఇయర్‌ఫోన్స్ వంటి ఎలక్ట్రానిక్ వేస్ట్‌ను కూడా సేకరించి ఈ వేస్ట్ రీసైక్లింగ్ సెంటర్లకు చేరవేస్తున్నారు. స్వాతంత్ర్య దినోత్సవం రోజున ప్రత్యేకంగా 'ఈ వేస్ట్ కలెక్షన్ డ్రైవ్' నిర్వహించి వేస్ట్ సేకరిస్తున్నారు. 'బీచ్‌క్లీన్ – అప్' కార్యక్రమాలు నిర్వహిస్తూ.. బీచ్‌లో దొరికిన ప్లాస్టిక్ వ్యర్థాలను 'శక్తి ప్లాస్టిక్స్' కంపెనీకి ఇస్తున్నారు. ఈ కంపెనీ ప్లాస్టిక్ వ్యర్థాలను రీసైకిల్ చేసి ఫర్నీచర్, ఇతర వస్తువులను తయారు చేసి విక్రయిస్తోంది. ఇవేగాక ఏడోతరగతిలోపు పిల్లలకు వర్క్‌షాప్స్ ద్వారా పర్యావరణ ప్రాముఖ్యత, కాలుష్యం నుంచి పర్యావరణాన్ని ఎలా కాపాడుకోవాలో అవగాహన కల్పిస్తున్నారు. హోలీ, దీపావళి సమయాల్లో ఇకోఫ్రెండ్లీ సంబరాలు జరుపుతూ.. పర్యావరణంపై అవగాహన కల్పిస్తున్నారు.

■ చదువుతూనే...

ఇంకా జీవితంలో స్థిరపడేంతగా చదువుకోలేదు. అయినా ఇన్ని కార్యక్రమాలతో బిజీగా ఉన్న ఈ ఇద్దరూ ప్రస్తుతం తమ కాలేజీ చదువుని నిర్లక్ష్యం చేయకుండా ముంబైని క్లీన్ చేయడం విశేషం. తల్లిదండ్రుల ప్రోత్సాహం కూడా ఉండడంతో.. భవిష్యత్‌లో పర్యావరణ అవగాహన కార్యక్రమాలను దేశంలోని మరిన్ని నగరాలకు విస్తరిస్తామని ఈ చిచ్చరపిడుగులు చెబుతున్నారు. నేటి బాలలే రేపటి పౌరులు, ఇలాంటి బాలలు మరింతమంది తయారైతే మన దేశ భవిష్యత్ ఉజ్వలంగా వెలిగిపోతుంది.


'ఐకా' టీమ్

"ఈ అవార్డు వచ్చినందుకు ఎంతో సంతోషంగా ఉంది. నా స్నేహితురాలు, ఐకా ఫౌండేషన్ సహవ్యవస్థాపకురాలు సియా జోషి నా వెన్నంటే ఉండి ప్రోత్సహించడం వల్లే ఈ గౌరవం దక్కింది. అందుకే మరిన్ని ప్రాజెక్టుల ద్వారా అందరిలో అవగాహన కల్పిస్తూ.. పర్యావరణాన్ని కాపాడతాము" అని లితిషా బగాడియా చెబుతోంది.

గోయింగ్ సోలో

● ఇద్దరు విజేతల అరుదైన కథ

స్వేచ్ఛను ప్రేమించే మనిషి బంధనాలతో పుట్టాడు. చాలామంది ఆ బంధనాలలోనే ఉండిపోతారు. కొందరు మాత్రం స్వేచ్ఛ గురించి తపిస్తారు. తాము ఎప్పుడూ నడిచే దారి నుంచి పక్కకు వచ్చి కొత్త దారిలో ప్రయాణిస్తారు. అద్భుతాలు సృష్టిస్తారు. గరీమ శంకర్, రేణు సింఘీ ఈ కోవకు చెందిన మహిళలు. వీరి జీవితంపై 'గోయింగ్ సోలో' అనే డాక్యుమెంటరీ ఫిల్మ్ వచ్చింది...

స్ఫూర్తి



'ఆడపిల్లలు సైకిల్ తొక్కడమేమిటి!' అని ఆశ్చర్యపోయే కుటుంబాల్లో పుట్టారు గరీమ శంకర్, రేణు సింఘీలు చిన్నప్పుడు సైకిల్‌ను చూడడం తప్ప నడిపింది లేదు. సైకిల్‌పై జెట్ స్పీడ్‌తో దూసుకుపోయేవాళ్లను చూసి ఆశ్చర్యపడేవారు. అలాంటి వారు సైకిలింగ్‌లో అద్భుతాల సృష్టిస్తారని ఎవరూ ఊహించలేదు.

'గోయింగ్ సోలో' డాక్యుమెంటరీలో వారి అంతర్. బహిర్ ప్రయాణం ఉంటుంది. నాలుగు గోడల మధ్య ఇంటికి పరిమితమైన రోజుల నుంచి లండన్-ఎడిన్‌బర్గ్-లండన్ (ఎల్‌ఈఎల్) లాంటి ప్రతిష్ఠాత్మకమైన సైకిలింగ్ ఈవెంట్స్ వరకు చేసిన ప్రయాణం కళ్లకు కడుతుంది.

'వారి జీవితాల్లో సైకిలింగ్‌కు మించి చెప్పవలసిన విషయాలు చాలా ఉన్నాయి అనిపించింది. వారి జీవితాల్లోని అద్భుతాలను ఆవిష్కరించడానికి సైకిల్ అనేది ఒక సాధనం మాత్రమే' అంటాడు 'గోయింగ్ సోలో' డైరెక్టర్ అమీ గోర్.

దిల్లీలోని ఒక సంపన్న కుటుంబంలో పుట్టిన గరీమకు స్వేచ్ఛాస్వాతంత్ర్యాలు తప్ప ఏ లోటూ లేదు. టీనేజ్‌లో ఉన్నప్పుడు అందరిలాగా తాను కూడా రోడ్డు మీద సైకిల్ తొక్కాలనుకునేది. సైకిల్ తొక్కడం మాట ఎలా ఉన్నా ఇల్లు దాటి బయటికి రావడమే గగనంగా ఉండేది. తల్లిదండ్రులు ఆమెను పొరపాటున కూడా బయటికి పంపేవారు కాదు.

గరీమకు పెళ్లి అయింది. ఆ తరువాత ఒక బిడ్డకు తల్లి అయింది. బాగా బరువు పెరిగింది. అది తనకు చాలా ఇబ్బందిగా మారింది. బరువు తగ్గడానికి మార్గాల గురించి ఆలోచిస్తున్న సమయంలో తనకు ఇష్టమైన సైకిలింగ్ గుర్తుకు వచ్చింది. టీనేజ్‌లో ఉన్నప్పుడు తమ్ముడి ద్వారా సైకిల్ తొక్కడం నేర్చుకుంది. అయితే ఆమె సైకిల్ యాత్ర ఇంటిపరిసరాలకే పరిమితం.

బరువు తగ్గడం మాట ఎలా ఉన్నా సైకిలింగ్ ద్వారా తాను ఒంటరిగా రోడ్డు మీదికి వచ్చింది. నగరంలో ప్రతి వీధిని చూసే అవకాశం వచ్చింది. అంతా కొత్తగా ఉంది. చాలా ఉత్సాహంగా ఉంది! ఇక అప్పటి నుంచి రెగ్యులర్ రైడర్‌గా మారింది. సైకిల్ లేకుండా ఆమెను చూడడం అరుదైపోయింది.

సైకిలింగ్‌పై గరీమ ఆసక్తిని గమనించిన సన్నిహితులు 'లక్ష్యం ఏర్పాటు చేసుకో. విజయం సాధించు' అని చెప్పేవారు. దీంతో తన కంఫర్ట్ జోన్ నుంచి బయటికి వచ్చి కొత్త అడుగులు వేసింది. సైకిల్ ఈవెంట్స్‌లో పాల్గొనడం ప్రారంభించింది. ఆ రేసులను విజయవంతంగా పూర్తి చేసిన తరువాత తన మీద తనకు ఎంతో నమ్మకం వచ్చేది. తెలిసినవాళ్లు లండన్-ఎడిన్‌బర్గ్-లండన్ (ఎల్‌ఈఎల్) సైకిల్ ఈవెంట్‌కు ప్రిపేర్ అవుతున్న సమయంలో షెడ్యూల్‌కు మూడు నెలల ముందు తన పేరును రిజిస్ట్రేషన్ చేయించుకుంది.


గరీమ శంకర్


రేణు సింఘీ

'నిజానికి అదొక అసాధ్యమైన లక్ష్యం. కాని ఏదో ధైర్యం నన్ను ముందుకు నడిపించింది' అంటున్న గరీమ ఎల్‌ఈఎల్‌లో 125 గంటలలో 1,540 కిలోమీటర్లు దూరం సైకిలింగ్ చేసింది. గరీమ ఉత్సాహం, సాహసానికి ముచ్చటపడిన ఎల్‌ఈఎల్ కమ్యూనిటీ ఆమెను మెడల్‌తో సత్కరించింది.

ఇక రాజస్థాన్‌కు చెందిన రేణు సింఘీ విషయానికి వస్తే పెళ్లికి ముందు అంతంత మాత్రంగా ఉన్న స్వేచ్ఛ ఆ తరువాత పూర్తిగా పోయింది. వంట నుంచి పిల్లల పెంపకం వరకు పూర్తిగా ఇంటికే పరిమితం కావాల్సి వచ్చింది. తన కుమారుడికి సైకిల్ కొనడానికి ఒకరోజు బైక్‌షాప్‌కు వెళ్లింది. తన కోసం కూడా ఒక సైకిల్ కొన్నది. అప్పటికి ఆమె వయసు 52 ఏళ్లు. 'ఈ వయసులో సైకిల్ తొక్కడమేమిటి' అనేవారు కుటుంబసభ్యులు. అయితే అవేమీ పట్టించుకోకుండా లాంగ్-డిస్టెన్స్ సైకిలింగ్ ఈవెంట్స్‌లో పాల్గొని అందరినీ ఆశ్చర్యపరిచేది. ఆ తరువాత ఇంటర్నేషనల్ ఈవెంట్స్‌పై దృష్టి పెట్టింది.

'మనకు నచ్చింది చేయాలి. వయసు అనేది అడ్డు కాదు' అంటున్న సింఘీ ఎల్‌ఈఎల్-ఈవెంట్ విజయవంతంగా పూర్తి చేసిన తొలి భారతీయ మహిళగా చరిత్ర సృష్టించింది.

దిల్లీ నుంచి ఇంగ్లాండ్ వరకు...

అమ్మీ మీడియా (న్యూయార్క్), ఖాన్ అండ్ కుమార్ మీడియా (ఇండియా) నిర్మించిన 'గోయింగ్ సోలో'ను దిల్లీ, ఊటీ, జైపూర్, జోద్‌పూర్, ఇంగ్లాండ్, స్కాట్లాండ్‌లో చిత్రీకరించారు. 70 నిమిషాల నిడివి ఉన్న ఈ డాక్యుమెంటరీకి అమీ గోర్ దర్శకుడు. టీవి, షార్ట్‌ఫిల్మ్స్, డాక్యుమెంటరీలలో పది సంవత్సరాల అనుభవం ఉంది. 'వారి అనుభవాలు, ప్రయాణం నన్ను ఎంతో ఉద్వేగానికి గురిచేశాయి. రకరకాల పరిస్థితులు లేదా వయసును కారణంగా చూపి తమకు తాము రకరకాల పరిమితులు విధించుకునే ఎంతోమందికి ఈ డాక్యుమెంటరీ స్ఫూర్తి ఇస్తుంది' అంటున్నాడు డైరెక్టర్ అమీ గోర్.



మీ నోరు బాగుందా?

నోరు మంచిదయితే ఊరు మంచిదవుతుందన్నది సామెత. అందులోని నిజానిజాల సంగతి ఎలా ఉన్నా, మన నోరు బాగుంటే ఆరోగ్యం బాగుంటుందన్నది వైద్య నిపుణుల మాట. కొందరి నోటి నుంచి చెడు వాసన వస్తుంటుంది. అది వారికి తెలియదు. ఒకవేళ తెలిసినా, అది కేవలం నోటి సమస్య మాత్రమే అనుకుని నోటిని పుక్కిలించి ఉమ్మెయ్యడం, మౌత్‌వాష్‌లను వాడటం వంటివి చేస్తారు. కానీ, చెడు శ్వాస అనారోగ్యానికి సంకేతమనే సంగతి మీకు తెలుసా?

అవును. అది నిజం. బాగా బ్రష్ చేసిన తర్వాత కూడా నోటి నుంచి దుర్వాసన వస్తుంటే తప్పకుండా అనుమానించాలి. శరీరంలో నీరు తగ్గినట్లయితే.. ఆకలి వేస్తుందనే తప్పుడు సంకేతాలు ఇస్తుంది మెదడు. ఆ సమయంలో ఆహారానికి బదులు నీళ్ల తీసుకోవడం మంచిది. ఎందుకంటే.. నోరు పొడిబారితే లాలా జలంలో ఉండే యాంటీబ్యాక్టీరియల్ గుణం తగ్గిపోయి నోటినుంచి చెడు వాసన వస్తుంది.

అలర్జీలు కూడా కారణమే

నోటి శుభ్రత పాటించకపోవడం, అలర్జీల వంటి సమస్యల వల్ల కూడా శ్వాస దుర్వాసన వస్తుంది. ఒకవేళ మీరు నోటిని శుభ్రంగా ఉంచుకుంటూ.. తగినన్ని నీళ్ల తాగే అలవాటు ఉన్నా సరే నోరు చెడు వాసన వస్తుంటే తప్పకుండా వైద్యులను సంప్రదించాలి.

టాన్సిల్ స్టోన్స్ వల్ల కూడా నోటి నుంచి చెడు వాసన వస్తుంది. కాబట్టి ఒకసారి పరీక్షలు చేయించుకోవడం ఉత్తమం.

వివిధ అనారోగ్య సమస్యలు, చెడు అలవాట్ల వల్ల కూడా నోటినుంచి దుర్వాసన వస్తుంది.

ప్రతి రెండు మూడు నెలలకోసారి టూత్ బ్రష్‌ను మార్చడం ముఖ్యం, అలాగే నాలుక స్క్రాపర్, ఫ్లాసర్ కూడా మార్చాలి. ఈ సాధనాలు మీ దంతాలు, చిగుళ్ళు, నాలుకను శుభ్రంగా ఉండేలా చూస్తాయి. పంటినొప్పి, చిగుళ్ళలో వాపు వంటి బాధాకరమైన పరిస్థితులకి దారితీసే అసౌకర్యాలను నివారిస్తాయి. భోజనం చేసిన తర్వాత ఉప్పునీటితో నోటిని పుక్కిలించడం సహజమైన మౌత్‌వాష్‌గా పని చేస్తుంది, ఇది మీ నోటి పరిశుభ్రతను మరింత మెరుగుపరుస్తుంది.

సరైన నోటి పరిశుభ్రత కోసం సాఫ్ట్–బ్రిస్టల్ బ్రష్, టూత్‌పేస్ట్, ఫ్లాస్, టంగ్ క్లీనర్, మౌత్ వాష్ వంటి ముఖ్యమైన ఉత్పత్తులను తప్పకుండా ఉపయోగించాలి. అప్పుడే నోటి ఆరోగ్యం బాగుండి, ఎలాంటి రోగాలు దరిచేరకుండా ఉంటాయి.

గుండె జబ్బులను నివారించాలని అనుకునే వారు ఉదయం బ్రేక్‌ఫాస్ట్‌కు ముందు పళ్లు తోముకోవడం ఎంత ముఖ్యమో రాత్రి భోజనం తర్వాత నిద్రకు ఉపక్రమించే ముందు పళ్లు తోముకోవడం కూడా అంతే ముఖ్యమని అధ్యయనకారులు సలహా ఇస్తున్నారు. కొన్ని ఆహారాలు మీ చిగుళ్ళను బలంగా ఇంకా దంతాలు ఎక్కువ కాలం ఉండేలా చేస్తాయి. చిగుళ్ళు తగినంత బలంగా లేకుంటే, దంతాలు ఊడిపోతాయి. అందువల్ల, చిగుళ్ళను దృఢంగా చేయడం కోసం మంచి ఆహారాన్ని తీసుకోవటం అవసరం.



నోటి దుర్వాసన అరికట్టేందుకు చిట్కాలు

- దుర్వాసన కేవలం నోటి నుంచే వస్తున్నట్లయితే.. రోజూ ఉదయాన్నే పళ్లు తోమగానే తప్పకుండా నాలుకను శుభ్రం చేసుకోవాలి.
- ఏదైనా ఆహారాన్ని తిన్న తర్వాత నీటితో నోరు పుక్కిలించి ఉమ్మేయాలి. నోటిలో ఆహారం ఎక్కువసేపు ఉన్నట్లయితే బ్యాక్టీరియా ఏర్పడే అవకాశం ఉంది. అది నోటిలో దుర్వాసన కలిగిస్తుంది కాబట్టి అప్పడప్పుడు కొన్ని నీటిని తాగుతుండాలి.
- రోజూ ఆపిల్ లేదా క్యారట్లను తినడం ద్వారా కూడా నోటిలో ఉండే మలినాలను తొలగించవచ్చు.
- కాఫీ ఎక్కువగా తాగినా సరే దుర్వాసన వస్తుంది కాబట్టి కాఫీకి బదులు గ్రీన్ టీ తాగడం మేలు. ఎందుకంటే గ్రీన్ టీ శ్వాసను మెరుగుపరుస్తుందని పరిశోధనల్లో తేలింది.
- యాలుక్కాయను నోటిలో వేసుకుని చప్పరిస్తూ ఉండాలి.
- దాల్చిన చెక్క, లవంగం కూడా మంచిదే.

అనారోగ్య కారణాలు కావచ్చు..!

కిడ్నీలు సరిగా పని చేయకపోతే రక్తంలో ఉండే వ్యర్థాలు, మలినాలు పేరుకుపోతాయి. ఆ ప్రభావం నాలుకపై ఉండే టేస్ట్ బడ్స్‌పై పడుతుంది. ఫలితంగా తినే ఆహారం రుచిగా అనిపించదు. పైగా ఏదో లోహాన్ని నోటిలో పెట్టుకున్నట్టుగా అనిపిస్తుంది. అంతేగాక.. చెడు రక్తం వల్ల ఊపిరితిత్తుల్లోకి కూడా చేరుతుంది. దానివల్ల శ్వాస క్రియ సమయంలో రక్తంలో ఉండే మలినాలు మనం వదిలే కార్బన్ డై ఆక్సైడ్‌లో కలుస్తాయి. ఆ గాలి బయటకు వచ్చినప్పుడు శ్వాస దుర్వాసనతో కూడి ఉంటుంది. కాబట్టి.. ఆ రెండు లక్షణాలు కనిపించినప్పుడు తప్పకుండా వైద్యులను సంప్రదించడం అవసరం. ఎందుకంటే నోరు బాగుంటేనే ఆరోగ్యం బాగుంటుంది!

మీకు తెలుసా?



పూర్వం 15 ఏళ్ల వయసుకే ఆడపిల్లలకు పెళ్లి చేసేవాళ్లు కాబట్టి రజస్వల అయిన వెంటనే పెళ్లి చేయాలని ఆ సమయంలో నేతితో తయారు చేసిన స్వీట్లు ఎక్కువగా తినిపించేవాళ్లు. నిజానికి రజస్వల అయినప్పుడే కాదు, ఏ వయసు పిల్లలకయినా స్వీట్లు, నేతి పదార్థాలు ఎక్కువగా పెట్టకూడదు. పైగా రజస్వల అయిన పిల్లలను కొద్దికాలం పాటు ఇంటికే పరిమితం చేస్తారు కాబట్టి పిల్లలు ఆ కొద్దిరోజుల్లో విపరీతంగా బరువు పెరగటంతోపాటు ఆ ఆహార శైలికి అలవాటు పడి అలాగే కొనసాగుతారు. అధిక బరువు వల్ల హార్మోన్లలో అవకతవకలు మొదలవుతాయి. ఇది ప్రమాదకరం. రజస్వల సమయంలో హార్మోన్ల స్రావాలు ఎక్కువగా ఉంటాయి కాబట్టి ఉప్పు, కారాలు, మసాలాలు తగ్గించి ప్రొటీన్లు ఎక్కువగా ఉండే ఆహారాన్ని ఇవ్వాలి. రక్తస్రావం ఎక్కువగా ఉండి ఐరన్ లోపం ఏర్పడుతుంది కాబట్టి ఈ సమయంలో ఆకుకూరలు, గుడ్లు ఎక్కువగా ఇవ్వాలి. క్యాల్షియం, విటమిన్ డి లోపాలు రాకుండా పాలు ఇవ్వడంతోపాటు వేరుసెనగ పప్పు, బెల్లం, ఖర్జూరాలు, పప్పులు, అటుకులు, రాగులు, నువ్వులతో తయారుచేసిన చిరుతిళ్లు తినిపించాలి.





ఏదీ బీట్ చేయలేదు..!

ఎండలు ఇప్పుడిప్పుడే తగ్గుముఖం పడుతున్నాయి. చిటపటా చినుకులు పడుతున్నాయి. రుతు సంధి కారణంగా అంటే సీజనల్ మార్పుల వల్ల ఇన్ఫెక్షన్లు, ఫ్లూ వంటి అనారోగ్య సమస్యలు రావడం సహజం. ఇటువంటి సమస్యల బారిన పడకుండా ఉండడానికి ఆహారంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు. అటువంటి వాటిలో బీట్‌రూట్ ఉత్తమమైనది.



★ ప్రోటీన్లు విటమిన్లు పుష్కలంగా ఉండే బీట్‌రూట్‌తో తయారు చేసిన ఆహారాలను ప్రతిరోజు తినడం వల్ల శరీరంలోని రోగనిరోధక శక్తి లోపం సమస్యలను కూడా తగ్గించుకోవచ్చని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు.

బీట్‌రూట్‌లో ఏయే పోషకాలుంటాయి?

బీట్‌రూట్‌లో సోడియం, పొటాషియం, కాల్షియం, ఫాస్పరస్ వంటి పోషకాలు అధిక పరిమాణంలో లభిస్తాయి. దీనిని సలాడ్‌లో తీసుకోవడం వల్ల శరీరానికి చాలా రకాల ప్రయోజనాలు కలుగుతాయని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. బీట్‌రూట్‌లో ఫోలేట్ పుష్కలంగా ఉంటుంది.. ఇది కణాల పెరుగుదలను మెరుగుపరచడంలో కీలకపాత్ర పోషిస్తుంది.



★ బీట్‌రూట్‌లో ఐరన్ సమృద్ధిగా లభిస్తుంది కాబట్టి ప్రతిరోజు బీట్‌రూట్ జ్యూస్‌ను తాగడం వల్ల రక్తహీనత, రోగ నిరోధక శక్తి సమస్యల నుంచి సులభంగా ఉపశమనం పొందవచ్చు.

★ బీట్‌రూట్‌లో అధిక మోతాదులో లభించే నైట్రేట్ వల్ల రక్తపోటు నియంత్రణలో ఉండడమే కాకుండా రక్తంలో గడ్డకట్టకుండా నిరోధిస్తుంది. అంతేకాకుండా రక్తప్రవాహాన్ని మెరుగుపరిచేందుకు సహాయపడుతుంది.

★ కార్బోహైడ్రేట్లు పుష్కలంగా ఉండే బీట్‌రూట్ శరీరంలో శక్తి స్థాయిలను పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తుంది. తరచు అనారోగ్య సమస్యలతో బాధపడేవారు ప్రతిరోజు బీట్‌రూట్ జ్యూస్ తాగడం వల్ల చక్కటి ఉపశమనం లభిస్తుంది.

★ బీట్‌రూట్ ఉండే గుణాలు చర్మాన్ని మెరిపించడంలో కూడా కీలకపాత్ర పోషిస్తాయి. ఇందులో ఉండే ఫోలేట్, ఫైబర్ చర్మ సౌందర్యాన్ని మెరుగుపరుస్తాయి. దీని రసాన్ని ముఖానికి రాసుకుంటే మొటిమలు, మచ్చలు తొలగిపోతాయి.

★ బీట్‌రూట్ రసాన్ని తాగడం వల్ల జ్ఞాపకశక్తి పెరుగుతుందని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. ఇందులో ఉండే గుణాలు ఒత్తిడిని తగ్గించడంలో కీలక పాత్ర పోషిస్తాయి. ముఖ్యంగా బరువు తగ్గాలనుకునేవారు బీట్‌రూట్ రసాన్ని తాగడం వల్ల మంచి ఫలితాలు పొందుతారు.

ప్రతినాయకుడు

కథను ముందుకు తీసుకెళతాడు కథానాయకుడు (హీరో). ఆ కథానాయకుడికి అడుగడుగునా అడ్డం పడుతుంటాడు ప్రతినాయకుడు (విలన్). హీరోగా ఒకరు, విలన్‌గా వేరొకరు నటిస్తుంటారు. అయితే నాయకులు అప్పుడప్పుడూ ప్రతినాయకులుగా కూడా నటిస్తుంటారు. ఇలా కొందరు కథానాయకులు 'ప్రతినాయకులు'గా కనిపించడానికి రెడీ అయిన చిత్రాల గురించి తెలుసుకుందాం.



• ఎన్టీఆర్ • రానా • కమల్‌హాసన్

మిషన్.. ప్రాజెక్ట్ కె

రెండొందలకు పైగా సినిమాల్లో నటించి, ఏడు పదుల వయసు సమీపిస్తున్న తరుణంలో కూడా కెరీర్‌లో దూకుడు ప్రదర్శిస్తున్నారు కమల్‌హాసన్. ప్రస్తుతం శంకర్ దర్శకత్వంలో 'ఇండియన్ 2' చిత్రంలో కథానాయకుడిగా నటిస్తున్నారు కమల్‌హాసన్. అలాగే దర్శకులు మణిరత్నం, హెచ్. వినోద్ కథల్లో కథానాయకుడిగా నటించేందుకు కమల్‌హాసన్ ఆల్రెడీ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. ఇలా హీరోగా వరుస ప్రాజెక్ట్స్‌ను ఆయన లైన్లో పెట్టారు. అయితే కథానాయకుడిగానే కాదు.. కథ నచ్చితే ఆ కథలోని కథానాయకుడికి ప్రతినాయకుడిగా సవాలు విసరడానికి రెడీ అయ్యారు కమల్. ప్రభాస్, దీపికా పదుకోన్ జంటగా అమితాబ్ బచ్చన్, దిశా పటానీ ప్రధాన పాత్రధారులుగా రూపొందుతున్న సైన్స్ ఫిక్షన్ ఫిల్మ్ 'ప్రాజెక్ట్ కె'లో నటించడానికి కమల్‌హాసన్ అంగీకరించిన విషయం తెలిసిందే. ఈ సినిమాలో కమల్ ప్రతినాయకుడి పాత్రలో నటిస్తున్నారనే టాక్ ఫిల్మ్‌నగర్‌లో వినిపిస్తోంది. అయితే ప్రతినాయకుడి పాత్రలు చేయడం కమల్‌హాసన్‌కు కొత్తేమీ కాదు. 'ఇంద్రుడు–చంద్రుడు' (కాస్త నెగటివ్ టచ్ ఉన్న క్యారెక్టర్), 'ఇండియన్', 'ఆళవందాన్' (తెలుగులో 'అభయ్'), 'దశావతారం' వంటి సినిమాల్లో ఆయన హీరోగా, విలన్‌గా నటించి మెప్పించారు. సో.. చాలా గ్యాప్ తర్వాత మళ్లీ నెగటివ్ షేడ్ క్యారెక్టర్‌లో కమల్ కనిపించినట్లు అవుతుంది. మరి.. 'ప్రాజెక్ట్ కె'లో కమల్ చేస్తున్నది నెగటివ్ షేడ్ ఉన్న క్యారెక్టరేనా? అనే విషయంపై క్లారిటీ రావాలంటే మరికొంత సమయం వేచి చూడాలి. 'మహానటి' ఫేమ్ నాగ్ అశ్విన్ దర్శకత్వంలో ఈ చిత్రాన్ని అశ్వనీదత్ నిర్మిస్తున్నారు.

బాలీవుడ్ వార్‌లో...

నాయకుడి పాత్రైనా, ప్రతి నాయకుడి పాత్రైనా ఎన్టీఆర్ అవలీలగా చేసేస్తుంటారు. 'జై లవ కుశ' చిత్రంలో ఎన్టీఆర్ చేసిన జై, లవ, కుశ పాత్రల్లో జై విలన్ క్యారెక్టర్ అనే సంగతి తెలిసిందే. తాజాగా మరోసారి ఈ తరహా పాత్రను 'వార్ 2'లో చేసేందుకు ఎన్టీఆర్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని తెలుస్తోంది. హృతిక్ రోషన్ హీరోగా నటించిన హిందీ హిట్ స్పై థ్రిల్లర్ ఫిల్మ్ 'వార్'. ఈ సినిమాకు సీక్వెల్‌గా 'వార్ 2' ఈ ఏడాది చివర్లో సెట్స్‌పైకి వెళ్లనుంది. 'వార్'లో హీరోగా నటించిన హృతిక్ రోషనే సీక్వెల్‌లోనూ హీరోగా నటించనున్నారు. కాగా.. ఈ చిత్రంలో ఎన్టీఆర్ ఓ లీడ్ రోల్ చేయనున్నారు. ఎన్టీఆర్ పాత్రకు కాస్త నెగటివ్ షేడ్స్ ఉంటాయని బాలీవుడ్ సమాచారం. స్పై థ్రిల్లర్‌గా రూపొందనున్న ఈ సినిమాకు 'బ్రహ్మాస్త్ర' ఫేమ్ అయాన్ ముఖర్జీ దర్శకత్వం వహిస్తారు. ఆదిత్యా చోప్రా నిర్మించనున్నారు. మరోవైపు ప్రస్తుతం కొరటాల శివ దర్శకత్వంలో ఎన్టీఆర్ 'దేవర' సినిమాలో హీరోగా నటిస్తున్నారు. అలాగే ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో ఓ సినిమా కమిట్ అయ్యారు.

రాక్షస రాజు

హీరో, విలన్, గెస్ట్ రోల్.. ఇలా ఏ పాత్రలో అయినా రానా అదుర్స్. 'బాహుబలి' సినిమాలో భళ్లాలదేవుడు పాత్రలో అద్భుతంగా విలనిజమ్ పండించారు రానా. అలాగే 'నేనే రాజు నేనే మంత్రి'లో హీరోగా నటించిన రానా క్యారెక్టర్‌లో కాస్త నెగటివ్ షేడ్స్ కనిపిస్తాయి. ఈ సినిమాకు తేజ దర్శకుడు. కాగా రానా, తేజ కాంబినేషన్‌లోనే 'రాక్షస రాజు' అనే టైటిల్‌తో మరో సినిమా తెరకెక్కనుంది. గోపీనాథ్ ఆచంట నిర్మిస్తారు. టైటిల్‌ని బట్టి ఈ చిత్రంలో హీరో క్యారెక్టరైజేషన్‌లో కాస్త నెగటివ్ టచ్ ఉంటుందని ఊహించవచ్చు. ఈ ఏడాదిలోనే ఈ సినిమాను సెట్స్‌పైకి తీసుకెళ్లాలనుకుంటున్నారు. మరోవైపు గుణశేఖర్ దర్శకత్వంలో మైథలాజికల్ ఫిల్మ్ 'హిరణ్య కశ్యప', మిలింద్ రావు దర్శకత్వంలో ఓ సినిమాలో రానా హీరోగా నటిస్తారని గతంలో ప్రకటనలు వచ్చాయి. ఈ సినిమాలపై మరో అప్‌డేట్ రావాల్సి ఉంది.

కొత్త ఇన్నింగ్స్

ఐదేళ్ల క్రితం వచ్చిన 'ఒక్కడు మిగిలాడు' సినిమా తర్వాత హీరోగా వెండితెరపై కనిపించలేదు మంచు మనోజ్. ప్రస్తుతం 'వాట్ ది ఫిష్' చిత్రంలో మనోజ్ హీరోగా నటిస్తున్నారు. వరుణ్ కోరుకొండ దర్శకత్వంలో విశాల్, సూర్య బెజవాడ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఒకవైపు హీరోగా నటిస్తూనే మరోవైపు విలన్‌గా కొత్త ఇన్నింగ్స్‌ను స్టార్ట్ చేయాలనుకుంటున్నారట మనోజ్. రవితేజ హీరోగా 'కలర్‌ఫోటో' ఫేమ్ సందీప్ రాజ్ దర్శకత్వంలో ఓ సినిమా తెరకెక్కనుందని, ఇందులో విశ్వక్ సేన్ కీలక పాత్రలో, మంచు మనోజ్ నెగటివ్ షేడ్స్ ఉన్న పాత్రలో నటించనున్నారని టాక్. మరి.. ప్రతినాయకుడి పాత్ర పరంగా మంచు మనోజ్ కొత్త ఇన్నింగ్స్‌ను స్టార్ట్ చేస్తారా? వెయిట్ అండ్ సీ.



• విశ్వక్ సేన్ • మంచు మనోజ్

లంకల రత్న?

'సామాజిక నిబంధనలను ధిక్కరించే ప్రపంచంలో బ్లాక్ ఉండదు, వైట్ ఉండదు, గ్రే మాత్రమే ఉంటుంది' అన్నది విశ్వక్ సేన్ తాజా చిత్రంలోని డైలాగ్. దీన్నిబట్టి ఈ చిత్రంలో విశ్వక్ క్యారెక్టరైజేషన్‌లో కాస్త నెగటివ్ షేడ్స్ ఉంటాయని ఊహించవచ్చు. ఈ సినిమా స్టార్టింగ్ సమయంలో మాస్ కా దాస్ బ్యాడ్‌గా మారాడు అంటూ చిత్ర యూనిట్ నుంచి వినిపించింది. రాజమండ్రి పరిసర ప్రాంతాల్లోని చీకటి సామ్రాజ్యం నేపథ్యంలో రూపొందుతున్న పీరియాడికల్ ఫిల్మ్ ఇది. ఈ సినిమాకు 'లంకల రత్న' టైటిల్ అనుకుంటున్నారనే ప్రచారం ఫిల్మ్‌నగర్‌లో వినిపిస్తోంది. తాజాగా ఈ సినిమా రెండో షెడ్యూల్ ముగిసినట్లు, రాజమండ్రి పరిసర ప్రాంతాల్లోని రిమోట్ లొకేషన్స్‌లో చిత్రీకరించినట్లు శుక్రవారం చిత్ర యూనిట్ ప్రకటించింది. కృష్ణ చైతన్య దర్శకత్వంలో సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య ఈ సినిమాను నిర్మిస్తున్నారు. మరోవైపు రవితేజ ముళ్లపూడి దర్శకుడిగా పరిచయం అవుతున్న చిత్రంలో హీరోగా నటిస్తున్నారు విశ్వక్ సేన్.

వీరే కాదు.. ఒకవైపు నాయకులుగా నటిస్తూ మరోవైపు ప్రతినాయకులుగానూ నటిస్తున్న హీరోలు ఇంకొందరు ఉన్నారు.

కామిక్-కాన్ 2023లో ప్రాజెక్ట్ కె

ప్రభాస్ హీరోగా తెరకెక్కుతోన్న పాన్ ఇండియా చిత్రం 'ప్రాజెక్ట్ కె' అరుదైన ఘనత సాధించింది. కాలిఫోర్నియాలోని శాన్ డియాగోలో నిర్వహించనున్న 'శాన్ డియాగో కామిక్-కాన్ 2023' వేడుకలో 'ప్రాజెక్ట్ కె' సినిమా టైటిల్, ట్రైలర్, సినిమా విడుదల తేదీని లాంచ్ చేయనున్నారు. నాగ్ అశ్విన్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో దీపికా పదుకోన్ హీరోయిన్. అమితాబ్ బచ్చన్, కమల్‌హాసన్, దిశా పటానీ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. అశ్వనీదత్ ఈ సినిమా నిర్మిస్తున్నారు. నాగ్ అశ్విన్ మాట్లాడుతూ– ''ఇండియా గొప్ప కథలకు, సూపర్ హీరోలకు నిలయం. మా 'ప్రాజెక్ట్ కె' సినిమా, కథ గురించి ప్రపంచ ప్రేక్షకులకు పరిచయం చేయడానికి 'శాన్ డియాగో కామిక్-కాన్ 2023' సరైన వేదిక అని భావిస్తున్నాం'' అన్నారు. ''శాన్ డియాగో కామిక్-కాన్ 2023'లో లాంచ్ అవుతున్న తొలి భారతీయ చిత్రంగా 'ప్రాజెక్ట్ కె' చరిత్ర సృష్టించనుంది. ప్రపంచపటంలో భారతీయ సినిమాను చూడాలని కోరుకునే భారతీయ ప్రేక్షకులందరికీ ఇది గర్వకారణం'' అన్నారు అశ్వనీదత్. ఈ నెల 20న ప్రారంభమయ్యే 'శాన్ డియాగో కామిక్-కాన్ 2023'లో కమల్‌హాసన్, ప్రభాస్, దీపికా పదుకోన్, నాగ్ అశ్విన్ తదితరులు పాల్గొంటారు.



• 'ప్రాజెక్ట్ కె' పోస్టర్

ఆగస్టులో ఆదికేశవ

పంజా వైష్ణవ్ తేజ్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'ఆదికేశవ'. శ్రీకాంత్ ఎన్. రెడ్డి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో శ్రీలీల హీరోయిన్‌గా నటిస్తున్నారు. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో ఎస్. నాగవంశీ, ఎస్. సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. ఈ చిత్రాన్ని ఆగస్టు 18న రిలీజ్ చేయనున్నట్లు తాజాగా చిత్ర బృందం ప్రకటించింది. ''యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందిన చిత్రం 'ఆదికేశవ'. ఇప్పటికే విడుదలైన టీజర్ సినిమాపై అంచనాలను పెంచేసింది. జాతీయ అవార్డు గ్రహీత, మలయాళ నటుడు జోజు జార్జ్ ఈ సినిమాతో తెలుగు పరిశ్రమలోకి అడుగు పెడుతున్నారు. త్వరలో ఈ చిత్రానికి సంబంధించిన మరిన్ని విషయాలను వెల్లడిస్తాం'' అని చిత్రయూనిట్ ప్రకటించింది. రాధిక, అపర్ణా దాస్ ముఖ్య పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: జీవీ ప్రకాశ్, కెమెరా: డడ్లీ.



• వైష్ణవ్, శ్రీ లీల

బెదురులంక డేట్ ఫిక్స్

'ఆర్‌ఎక్స్ 100' ఫేమ్ కార్తికేయ గుమ్మకొండ హీరోగా నటించిన 'బెదురులంక 2012' సినిమా విడుదల తేదీ ఫిక్స్ అయింది. ఈ చిత్రాన్ని ఆగస్టు 25న విడుదల చేస్తున్నట్లు శుక్రవారం ప్రకటించింది యూనిట్. క్లాక్స్ దర్శకుడిగా పరిచయమవుతున్న ఈ మూవీలో 'డీజే టిల్లు' ఫేమ్ నేహా శెట్టి కథానాయికగా నటించారు. రవీంద్ర బెనర్జీ (బెన్నీ) ముప్పానేని నిర్మించారు. ''హిలేరియస్ ఎంటర్‌టైనర్‌గా రూపొందిన చిత్రం 'బెదురులంక 2012'. ఇప్పటివరకు గోదావరి నేపథ్యంలో వచ్చిన రూరల్ డ్రామాలకు భిన్నంగా మా సినిమా ఉంటుంది'' అన్నారు బెన్నీ ముప్పానేని. ''మా సినిమా పోస్ట్ ప్రొడక్షన్ పనులు చివరి దశలో ఉన్నాయి. మణిశర్మగారు అద్భుతమైన బాణీలు అందించారు. కార్తికేయ, నేహా జోడీ ఆకట్టుకుంటుంది'' అన్నారు క్లాక్స్. ఈ చిత్రానికి కెమెరా: సాయి ప్రకాష్ ఉమ్మడిసింగు, సన్నీ కూరపాటి, సమర్పణ: సి. యువరాజ్, ఎగ్జిక్యూటివ్ నిర్మాత: దుర్గారావు గుండా, సహనిర్మాతలు: అవనీంద్ర ఉపద్రష్ట, వికాస్ గున్నల.



• కార్తికేయ, నేహా శెట్టి

సస్పెన్స్.. థ్రిల్



• సాయికృష్ణ

తల్లాడ సాయికృష్ణ, స్వప్న చౌదరి, సుమన్, అలీ, తనికెళ్ల భరణి, సత్య శ్రీ కీలక పాత్రల్లో 'మిస్టరీ' సినిమా షురూ అయింది. తల్లాడ సాయికృష్ణ దర్శకత్వంలో పీవీ ఆర్ట్స్ పతాకంపై వెంకట్ పులగం నిర్మిస్తున్న ఈ చిత్రం షూటింగ్ ప్రారంభమైంది. ఈ సందర్భంగా దర్శక–నిర్మాతలు మాట్లాడుతూ–''సస్పెన్స్ థ్రిల్లర్ చిత్రమిది. ఈ నెల 21 వరకు హైదరాబాద్, పరిసర ప్రాంతాల్లో షూటింగ్ జరుగుతుంది. సింగిల్ షెడ్యూల్‌లో షూటింగ్‌ని పూర్తి చేస్తాం. సెప్టెంబర్ చివరి వారంలో 'మిస్టరీ'ని విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నాం'' అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: రామ్ తవ్వ, కెమెరా: సుధాకర్, శివ రాథోడ్

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▽	505	65,280
నిఫ్టీ ▽	166	19,332

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (శుక్రవారం రాత్రి 11.30 ముగింపు)			
నాస్‌డాక్	13,794	▲	114
డోజోన్స్	34,020	▲	98
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,257	▽	24
డాక్స్	15,603	▲	75
షాంఘై	3,197	▽	9
నికాయ్	32,388	▽	385

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో – ముంబై			
బంగారం (99.9 స్వచ్ఛత)	58,586	▽	58
బంగారం (99.5 స్వచ్ఛత)	58,351	▽	58
వెండి (కిలో)	69,750	▽	1,066

వేదాంతా చేతికి ట్విన్ స్టార్ బిజ్



న్యూఢిల్లీ: సహచర సంస్థ ట్విన్ స్టార్ టెక్నాలజీస్ లిమిటెడ్ (టీఎస్‌టీఎల్) నుంచి సెమీకండక్టర్, డిస్‌ప్లే బిజినెస్‌లను సొంతం చేసుకోనున్నట్లు వేదాంతా లిమిటెడ్ వెల్లడించింది. తద్వారా సమీకృత సెమీకండక్టర్, డిస్‌ప్లే బిజినెస్‌లు కలిగిన తొలి కంపెనీగా వేదాంతా ఆవిర్భవించనుంది. వేదాంతాకు అల్టిమేట్ హోల్డింగ్ కంపెనీ అయిన టీఎస్‌టీఎల్.. వోల్కన్ ఇన్వెస్ట్‌మెంట్స్‌కు పూర్తి అనుబంధ సంస్థకావడం గమనార్హం! కాగా.. షేర్ల బదిలీ ద్వారా టీఎస్‌టీఎల్ సెమీకండక్టర్, డిస్‌ప్లే బిజినెస్ యూనిట్‌లో 100 శాతం వాటాను సొంతం చేసుకోనున్నట్లు వేదాంతా వెల్లడించింది. దీంతో వేదాంతా డైవర్సిఫైడ్ పోర్ట్‌ఫోలియోకు సెమీకండక్టర్, డిస్‌ప్లే గ్లాస్ బిజినెస్ జత కలవనున్నాయి.

భద్రతా ఫీచర్లకే అధిక ప్రాధాన్యత



ముంబై: కార్ల కొనుగోలు విషయంలో కస్టమర్లు భద్రతా ఫీచర్లకే అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు స్కోడా ఆటో ఇండియా, ఎన్‌ఐక్యూ బేసెస్ సర్వే వెల్లడించింది. ముఖ్యంగా క్రాష్ రేటింగ్‌లు, ఎయిర్ బ్యాగుల సంఖ్యను పరిగణలోకి తీసుకుంటారని తెలిపింది. జనాదరణ పొందిన ఫీచర్లలో ఇంధన సామర్థ్యం మూడో స్థానంలో ఉంది. భారత్‌లో కార్లకు భద్రతా రేటింగ్ తప్పనిసరిగా ఉండాలని 10 మందిలో 9 మంది కస్టమర్లు అభిప్రాయపడ్డారు. 'అధిక రేటింగ్ మోడళ్లు కలిగిన తొలి 3 బ్రాండ్లలో స్కోడా ఒకటి. గ్లోబల్ ఎన్‌సీఏపీ పరీక్షలో స్లావియా, కుషాక్ 5 స్టార్ సేఫ్టీ రేటింగ్ పొందాయి. భద్రత మాకు తొలి ప్రాధాన్యత' అని స్కోడా ఆటో ఇండియా బ్రాండ్ డైరెక్టర్ పీటర్ సోలాక్ తెలిపారు.

మ్యూచువల్ ఫండ్ ట్రస్టీలపై మరింత బాధ్యత

- పెట్టుబడిదారుల ప్రయోజనాలకు ప్రాధాన్యం
- తప్పుడు మార్గాల్లో విక్రయాలకు చెక్
- తగిన వ్యవస్థలను ఏర్పాటు చేసుకోవాలి
- నూతన ఆదేశాలు తీసుకొచ్చిన సెబీ



న్యూఢిల్లీ: మ్యూచువల్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేసే పెట్టుబడిదారుల ప్రయోజనాల పరిరక్షణకు, పారదర్శకత పెంచేందుకు క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ నూతన నిబంధనలు తీసుకొచ్చింది. మ్యూచువల్ ఫండ్ ట్రస్టీలపై మరింత బాధ్యతలు మోపింది. ప్రతి అసెట్ మేనేజ్‌మెంట్ కమిటీ (ఏఎంసీ/మ్యూచువల్ ఫండ్ నిర్వహణ సంస్థ) కొత్తగా యూనిట్ హోల్డర్ (ఇన్వెస్టర్) ప్రొటెక్షన్ కమిటీ (యూహెచ్‌పీసీ)ని ఏర్పాటు చేయాలని ఆదేశించింది. ఏఎంసీ నిర్ణయాలు యూనిట్ హోల్డర్ల ప్రయోజనాల కోణంలోనే ఉన్నాయా అన్నది యూహెచ్‌పీసీ పర్యవేక్షించనుంది. కొత్త నిబంధనలు జనవరి 2024 జనవరి 1 నుంచి అమల్లోకి వస్తాయని సెబీ శుక్రవారం సర్క్యులర్ జారీ చేసింది.

ఇవీ కొత్త మార్గదర్శకాలు

- మ్యూచువల్ ఫండ్స్ తమ నిర్వహణ ఆస్తులను పెంచుకునేందుకు తప్పుడు మార్గాల్లో పెట్టుబడులను ఆకర్షించకుండా తగిన వ్యవస్థలను ఏర్పాటు చేసుకునేలా సంబంధిత మ్యూచువల్ ఫండ్ ట్రస్టీ చూడాలి.
- తమ ఉద్యోగులు, అనుబంధ సంస్థలు దుర్వినియోగానికి పాల్పడకుండా చూడాలి. మోసపూరిత లావాదేవీలు చోటు చేసుకోకుండా, ఉద్యోగులు ఫ్రంట్ రన్నింగ్‌కు పాల్పడకుండా (సంస్థ నిర్ణయాలు ముందే తెలుసుకుని ప్రయోజనం పొందడం), డిస్ట్రిబ్యూటర్లు ఆకర్షించే అంచనాలతో ఉత్పత్తులను విక్రయించకుండా తగిన చెకింగ్ వ్యవస్థలు ఏర్పాటు చేసుకోవాలి.
- ఏఎంసీలు వసూలు చేసే ఫీజులు, వ్యయాలు పారదర్శకంగా ఉండేలా ట్రస్టీలు చూడాలి.
- ఏఎంసీల పథకాల వారీగా పనితీరు, పోటీ పథకాలతో, సూచీలతో పోల్చినప్పుడు ఎలా ఉందన్నది సమీక్షించాలి.
- కేవైసీ వివరాలు సరిగ్గా లేని పోలియోల విషయంలో ఏఎంసీలు తీసుకున్న నిర్ణయాలను ఎప్పటికప్పుడు సమీక్షించాలి.
- ఈ బాధ్యతల నిర్వహణకు ఫండ్ ట్రస్టీలు ఆడిట్, న్యాయ సేవల సంస్థలు, మర్చంట్ బ్యాంకర్లు, తదితర నిపుణుల సేవలు పొందొచ్చు.
- ఓ కంపెనీ ఫండ్ ట్రస్టీగా నియమితమైతే, చైర్‌పర్సన్‌గా ఇండిపెండెంట్ డైరెక్టర్ ఉండాలి.
- మ్యూచువల్ ఫండ్స్ అందించే ఉత్పత్తులు, సేవలకు సంబంధించి యూనిట్ హోల్డర్ల ప్రయోజనాలకు యూహెచ్‌పీసీ బాధ్యత వహించాల్సి ఉంటుంది.

ఫండ్ స్పాన్సర్లకు కొత్త నియమావళి

మ్యూచువల్ ఫండ్‌ను స్పాన్సర్ చేసే ప్రైవేటు ఈక్విటీ సంస్థలకు కొత్త కార్యాచరణను సెబీ ప్రతిపాదించింది. ప్రైవేటు ఈక్విటీ సంస్థలకు ఫండ్ మేనేజర్‌గా కనీసం ఐదేళ్ల అనుభవం, కనీసం రూ.5,000 కోట్ల ఆస్తులను నిర్వహించి ఉండాలి.

రికార్డు స్థాయి వద్ద లాభాల స్వీకరణ

- ప్రపంచ ప్రతికూల పరిణామాల నేపథ్యం
- ఫైనాన్స్, ఐటీ, ఇంధన షేర్లలో అమ్మకాలు
- నిఫ్టీ 8 రోజుల పరుగుకు విరామం
- సెన్సెక్స్ నష్టం 505 పాయింట్లు



ముంబై: స్టాక్ సూచీల రికార్డు ర్యాలీకి శుక్రవారం బ్రేక్ పడింది. ప్రపంచ ఈక్విటీ మార్కెట్ల నుంచీ ప్రతికూల సంకేతాలు అందాయి. గరిష్ట స్థాయిల వద్ద లాభాల స్వీకరణ చోటు చేసుకుంది. ఫలితంగా వారాంతపు రోజున సెన్సెక్స్ 505 పాయింట్లు నష్టపోయి 65,280 వద్ద ముగిసింది. ఈ సూచీలో మొత్తం 30 షేర్లకు గానూ 25 షేర్లూ నష్టపోయాయి. నిఫ్టీ 166 పాయింట్లు క్షీణించి 19,332 వద్ద నిలిచింది. ఈ సూచీ 8 రోజుల వరుస ర్యాలీకి బ్రేక్ పడినట్లైంది. సూచీలు ఉదయం నష్టాలతో మొదలయ్యాయి. దేశీయంగా నెలకొన్న సానుకూలతల అండతో ఆరంభ నష్టాలను భర్తీ చేసుకోవడమే కాకుండా స్వల్పంగా లాభపడ్డాయి. ఈ క్రమంలో సెన్సెక్స్ 113 పాయింట్లు బలపడి 65,899 వద్ద, నిఫ్టీ 27 పాయింట్లు పెరిగి 19,524 వద్ద చరిత్రాత్మక గరిష్టాలను నమోదు చేయగలిగాయి. అయితే ఫైనాన్స్, ఐటీ, ఆయిల్ షేర్లలో తలెత్తిన అమ్మకాలతో మళ్లీ నష్టాల బాటపట్టాయి. మిడ్‌సెషన్‌లో యూరప్ మార్కెట్ల నష్టాల ప్రారంభంతో ఏ దశలోనూ కోలుకోలేకపోయాయి. బీఎస్‌ఈ మిడ్, స్మాల్ క్యాప్ సూచీలు వరుసగా 0.76%, 0.28% చొప్పున నష్టపోయాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.790 కోట్ల షేర్లను కొన్నారు. ఈ వారం మొత్తంగా సెన్సెక్స్ 562 పాయింట్లు, నిఫ్టీ 143 పాయింట్ల చొప్పున లాభపడ్డాయి. డాలర్ మారకంలో రూపాయి విలువ 13 పైసలు క్షీణించి 82.73 స్థాయి వద్ద స్థిరపడింది.

''అమెరికాలో ప్రైవేటు రంగ ఉద్యోగ కల్పన అనూహ్యంగా పెరగడంతో వడ్డీరేట్ల పెంపు అంచనాలు తెరపైకి వచ్చాయి. బాండ్లపై రాబడి సైతం పెరిగింది. ఈ పరిణామాలకు తోడు సూచీలు చారిత్రాత్మక గరిష్ట స్థాయిల వద్ద ట్రేడవుతుండటం, వారాంతపు రోజు కావడంతో లాభాల స్వీకరణ చోటు చేసుకుంది'' అని రిలిగేర్ బ్రోకింగ్ వైస్ ప్రెసిడెంట్ అజిత్ మిశ్రా తెలిపారు.

మార్కెట్లో మరిన్ని సంగతులు

- ఐడియా ఫోర్జ్ షేరు లిస్టింగ్‌లో అదరగొట్టింది. బీఎస్‌ఈలో కంపెనీ ఇష్యూ ధర (రూ.672)తో పోలిస్తే 94% ప్రీమియంతో రూ.1305 వద్ద లిస్టయ్యింది. ట్రేడింగ్‌లో 100 శాతం మేర దూసుకెళ్లి రూ.1,344 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని తాకింది. చివరికి 93 శాతం లాభంతో రూ.1,295.50 వద్ద స్థిరపడింది. ట్రేడింగ్ మొత్తంలో 6.50 లక్షల ఈక్విటీ షేర్లు చేతులు మారాయి. లిస్టింగ్ తొలిరోజున కంపెనీ మార్కెట్ విలువ రూ.5,398 కోట్లుగా నమోదైంది.
- వజ్రాభరణాల తయారీ, విక్రయ సంస్థ టైటాన్ షేరు మెరిసింది. బీఎస్‌ఈలో 1.25% లాభపడి రూ.3145 వద్ద ముగిసింది. రూ.3211 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని తాకింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం క్యూ1లో కంపెనీ ఆదాయం 20 శాతం వృద్ధి చెందడంతో ఈ షేరుకు డిమాండ్ లభించింది.
- నష్టాల మార్కెట్లోనూ ప్రభుత్వరంగ బ్యాంకుల షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది. పీఎన్‌బీ, కెనరా బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ బరోడా షేర్లు 2% నుంచి 1.50% లాభపడ్డాయి. ఇండియన్ బ్యాంక్, యూనియన్ బ్యాంక్ షేర్లు ఒకశాతం పెరిగాయి.

ఫ్లిప్‌కార్ట్.. వ్యక్తిగత రుణాలు!
యాక్సిస్ బ్యాంక్‌తో ఒప్పందం

ముంబై: ఈకామర్స్ దిగ్గజం ఫ్లిప్‌కార్ట్ వ్యక్తిగత రుణాలందించనుంది. ఇందుకు ప్రైవేట్ రంగ దిగ్గజం యాక్సిస్ బ్యాంకుతో చేతులు కలిపింది. తద్వారా రూ. 5 లక్షల వరకూ వ్యక్తిగత రుణాలను ఈకామర్స్ ప్లాట్‌ఫామ్ ద్వారా అందించనుంది. ఇందుకు గరిష్టంగా మూడేళ్ల గడువును అనుమతిస్తోంది. రిటైల్ రంగ దిగ్గజం వాల్‌మార్ట్ అనుబంధ సంస్థ ఫ్లిప్‌కార్ట్‌కు 45 కోట్లమంది కస్టమర్లున్నారు. అత్యధిక రిస్కు లుండే అన్‌సెక్యూర్డ్ వ్యక్తిగత రుణాలు, క్రెడిట్ కార్డులలో భారీ వృద్ధిపై ఆర్‌బీఐ ఆందోళనలు వ్యక్తం చేస్తున్న నేపథ్యం ఫ్లిప్‌కార్ట్, యాక్సిస్ బ్యాంక్ ఒప్పందానికి ప్రాధాన్యత ఏర్పడింది. దేశీ వినియోగదారులు జీవనశైలి విధానాలను మెరుగుపరచుకునేందుకు ఆసక్తి చూపుతున్నట్లు ఈ సందర్భంగా ఫ్లిప్‌కార్ట్ పేర్కొంది. యాక్సిస్ బ్యాంక్‌తో భాగస్వామ్యం ద్వారా కస్టమర్ల కొనుగోలు శక్తి పుంజుకునే వీలున్నట్లు అభిప్రాయపడింది. కొనుగోలుదారులకు మద్దతుగా ఇప్పటికే సంస్థ బీపీఎస్ఎల్, ఈఎంఐ, కోబ్రాండెడ్ క్రెడిట్ కార్డులు అందిస్తున్నట్లు ఫ్లిప్‌కార్ట్ సీనియర్ వైస్‌ప్రెసిడెంట్ ధీరజ్ అనేజా పేర్కొన్నారు.



ఒలెక్ట్రాకు రూ.10,000 కోట్ల ఆర్డర్

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: మేఘా ఇంజనీరింగ్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ అనుబంధ కంపెనీలైన ఒలెక్ట్రా గ్రీన్‌టెక్, ఈవీ ట్రాన్స్‌ల కన్సార్షియం భారీ ఆర్డర్‌ను చేజిక్కించుకుంది. ఇందులో భాగంగా మహారాష్ట్ర స్టేట్ రోడ్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్‌కు (ఎంఎస్‌ఆర్‌టీసీ) 5,150 ఎలక్ట్రిక్ బస్‌లను 24 నెలల్లో సరఫరా చేయాల్సి ఉంటుంది. డీల్ విలువ సుమారు రూ.10,000 కోట్లు అని ఒలెక్ట్రా శుక్రవారం ప్రకటించింది. ఒలెక్ట్రా నుంచి ఈ ఎలక్ట్రిక్ బస్‌లను ఈవీ ట్రాన్స్ కొనుగోలు చేసి ఎంఎస్‌ఆర్‌టీసీకి అందిస్తుంది. కాగా, భారీ ఆర్డర్ నేపథ్యంలో ఒలెక్ట్రా షేరు ధర క్రితం ముగింపుతో పోలిస్తే బీఎస్‌ఈలో శుక్రవారం 18.02% ఎగసి రూ.1,231.35 వద్ద స్థిరపడింది.



దేశీ ఐటీకి వై2కే తరహా అవకాశాలు..

తెలంగాణ ప్రిన్సిపల్ సెక్రటరీ జయేశ్ రంజన్



ఐటీ సదస్సులో మాట్లాడుతున్న జయేశ్ రంజన్, వేదికపై శేఖర్ రెడ్డి తదితరులు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఐటీ రంగంలో భారత్ వేగంగా పురోగమిస్తోందని తెలంగాణ ఐటీ ప్రిన్సిపల్ సెక్రటరీ జయేశ్ రంజన్ తెలిపారు. రెండు దశాబ్దాల క్రితం వై2కే సమస్య తలెత్తినప్పుడు దాని పరిష్కారానికి దేశీ ఐటీ సంస్థలు, నిపుణులు తోడ్పాటు అందించారని పేర్కొన్నారు. ప్రస్తుతం మళ్లీ వై2కే తరహాలో .. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డిజిటల్ విభాగాల్లో వస్తున్న అవకాశాలను మరింతగా అందిపుచ్చుకోవాలని ఆయన ఆకాంక్షించారు. భారతీయ పరిశ్రమల సమాఖ్య సీఐఐ, తెలంగాణ ప్రభుత్వం సంయుక్తంగా కొత్త ఆవిష్కరణలు, భవిష్యత్ డిజిటల్ పరివర్తనపైన నిర్వహించిన ఐటీ సదస్సులో పాల్గొన్న సందర్భంగా జయేశ్ రంజన్ ఈ విషయాలు చెప్పారు. మరోవైపు, 2022–23లో తెలంగాణ నుంచి ఐటీ ఎగుమతులు 31 శాతం వృద్ధి చెందాయని, ఉద్యోగాల కల్పన 16.2 శాతం పెరిగిందని, ఇన్నోవేషన్ ఇండెక్స్‌లో రాష్ట్రం దేశంలోనే రెండో స్థానంలో ఉందని సీఐఐ తెలంగాణ చైర్మన్ సి. శేఖర్ రెడ్డి తెలిపారు.



ఫైనల్లో రష్మిక-వైదేహి జోడీ

అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య మహిళల టోర్నీలో హైదరాబాద్ అమ్మాయి భమిడిపాటి శ్రీవల్లి రష్మిక డబుల్స్ విభాగంలో ఫైనల్లోకి ప్రవేశించింది. థాయ్‌లాండ్‌లో శుక్రవారం జరిగిన డబుల్స్ సెమీఫైనల్లో రష్మిక-వైదేహి చౌధరీ (భారత్) ద్వయం 6-4, 6-3తో పునిన్ కొవాపిటుక్‌టెడ్-మంచాయ సావంగ్‌కెవ్ (థాయ్‌లాండ్) జంటపై నెగ్గింది. హైదరాబాద్‌కే చెందిన సహజ యామలపల్లి సింగిల్స్ విభాగంలో సెమీఫైనల్లోకి అడుగు పెట్టింది. క్వార్టర్ ఫైనల్లో సహజ 0-6, 6-1, 6-1తో లీ జాంగ్ సియో (కొరియా)పై విజయం సాధించింది. గంటా 34 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో సహజ రెండు ఏస్‌లు సంధించి, ఎనిమిది డబుల్ ఫాల్ట్‌లు చేసింది. తన సర్వీస్‌ను నాలుగుసార్లు కోల్పోయి, ప్రత్యర్థి సర్వీస్‌ను ఆరుసార్లు బ్రేక్ చేసింది.



క్వార్టర్స్‌లో లక్ష్య సేన్, సింధు

కాల్గరీ: కెనడా ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-500 బ్యాడ్మింటన్ టోర్నీ పురుషుల సింగిల్స్ విభాగంలో లక్ష్య సేన్... మహిళల సింగిల్స్ విభాగంలో పీవీ సింధు క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లారు. శుక్రవారం జరిగిన ప్రిక్వార్టర్ ఫైనల్లో లక్ష్య సేన్ 21-15, 21-11తో వైగోర్ కొల్హో (బ్రెజిల్)పై నెగ్గగా... సింధుకు ఆమె ప్రత్యర్థి నత్సుకి నిదైరా (జపాన్) నుంచి వాకోవర్ లభించింది. పురుషుల డబుల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో విష్ణువర్ధన్-కృష్ణప్రసాద్ ద్వయం 9-21, 11-21తో రెండో సీడ్ అహసాన్-సెతియవాన్ (ఇండోనేసియా) జోడీ చేతిలో ఓడింది.

అల్‌కరాజ్ ముందుకు...

- మూడో రౌండ్‌లోకి టాప్ సీడ్
- హోరాహోరీ పోరులో ముర్రేపై సిట్సిపాస్ విజయం



అల్‌కరాజ్

లండన్: వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ టెన్నిస్ టోర్నీ పురుషుల సింగిల్స్ విభాగంలో ప్రపంచ నంబర్ వన్, టాప్ సీడ్ కార్లోస్ అల్‌కరాజ్ మూడో రౌండ్‌లోకి దూసుకెళ్లాడు. శుక్రవారం జరిగిన పురుషుల సింగిల్స్ రెండో రౌండ్‌లో ఈ స్పెయిన్ స్టార్ 6-4, 7-6 (7/2), 6-3తో అలెగ్జాండర్ ముల్లర్ (ఫ్రాన్స్)పై గెలుపొందాడు. 2 గంటల 33 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో అల్‌కరాజ్ ఐదు ఏస్‌లు సంధించాడు. 32 విన్నర్స్ కొట్టి, 41 అనవసర తప్పిదాలు చేశాడు. నెట్ వద్దకు 29 సార్లు దూసుకొచ్చి 24 సార్లు పాయింట్లు గెలిచాడు. రెండు సార్లు ప్రత్యర్థి సర్వీస్‌ను బ్రేక్ చేసిన అల్‌కరాజ్ తన సర్వీస్‌లో మాత్రం ఒక్కసారి కూడా బ్రేక్ పాయింట్ అవకాశం ఇవ్వలేదు. మరోవైపు ఐదో సీడ్ సిట్సిపాస్ (గ్రీస్) హోరాహోరీ పోరులో గట్టెక్కి మూడో రౌండ్‌లోకి అడుగు పెట్టాడు. 2013, 2016 వింబుల్డన్ చాంపియన్ ఆండీ ముర్రే (బ్రిటన్)తో 4 గంటల 40 నిమిషాలపాటు జరిగిన రెండో రౌండ్ పోరులో సిట్సిపాస్ 7-6 (7/3), 6-7 (2/7), 4-6, 7-6 (7/3), 6-4తో విజయం సాధించాడు. 17 ఏస్‌లు సంధించిన సిట్సిపాస్ ఏకంగా 90 విన్నర్స్ కొట్టడం విశేషం. ఇతర రెండో రౌండ్ మ్యాచ్‌ల్లో మూడో సీడ్ మెద్వెదెవ్ (రష్యా) 6-3, 6-3, 7-6 (7/5)తో మనారినో (ఫ్రాన్స్)పై, ఆరో సీడ్ హోల్గర్ రూనె (డెన్మార్క్) 6-3, 7-6 (7/3), 6-4తో కార్బాలెస్ బేనా (స్పెయిన్)పై నెగ్గారు.

అజరెంకా జోరు

మహిళల సింగిల్స్‌లో మాజీ నంబర్‌వన్ అజరెంకా (బెలారస్), నాలుగో సీడ్ జెస్సికా పెగూలా (అమెరికా) ప్రిక్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించారు. మూడో రౌండ్ మ్యాచ్‌ల్లో అజరెంకా 6-2, 6-4తో 11వ సీడ్ కసత్‌కినా (రష్యా)ను ఓడించగా... పెగూలా 6-4, 6-0తో కొకియారెటో (ఇటలీ)పై గెలిచింది.

సుదీర్ఘ టైబ్రేక్...

మహిళల సింగిల్స్‌లో సురెంకో (ఉక్రెయిన్), అనా బొగ్డాన్ (రొమేనియా) మ్యాచ్ చరిత్రకెక్కింది. 3 గంటల 40 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో సురెంకో 4-6, 6-3, 7-6 (20/18)తో బొగ్డాన్‌ను ఓడించి ప్రిక్వార్టర్ ఫైనల్ చేరింది. నిర్ణాయక మూడో సెట్‌లో టైబ్రేక్ ఏకంగా 37 నిమిషాలు సాగింది. తద్వారా మహిళల గ్రాండ్‌స్లామ్ టోర్నీల చరిత్రలో సుదీర్ఘంగా సాగిన టైబ్రేక్‌గా రికార్డు నమోదైంది. 38 పాయింట్ల తర్వాత టైబ్రేక్‌లో ఫలితం తేలడం కూడా రికార్డే. ఈ మ్యాచ్‌లో సురెంకో ఐదుసార్లు, బొగ్డాన్ ఆరుసార్లు మ్యాచ్ పాయింట్లు కాపాడుకోవడం గమనార్హం.

ఆసియా క్రీడలకు భారత టీటీ జట్టులో శ్రీజ



న్యూఢిల్లీ: ఆసియా క్రీడల్లో, ఆసియా చాంపియన్‌షిప్‌లో పాల్గొనే భారత టేబుల్ టెన్నిస్ (టీటీ) జట్లను శుక్రవారం ప్రకటించారు. 10 మంది సభ్యులతో కూడిన భారత పురుషుల, మహిళల జట్లకు ఆచంట శరత్ కమల్, మనిక బత్రా సారథ్యం వహిస్తారు. మహిళల సింగిల్స్ జాతీయ చాంపియన్, తెలంగాణ అమ్మాయి ఆకుల శ్రీజ కూడా ఈ ప్రతిష్టాత్మక క్రీడల్లో భారత జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తుంది. తెలంగాణకు చెందిన ఎస్‌ఎఫ్‌ఆర్ స్నేహిత్, మహారాష్ట్ర ప్లేయర్ సానిల్ షెట్టి రిజర్వ్ ఆటగాళ్లుగా ఎంపికయ్యారు. ఆసియా టీటీ చాంపియన్‌షిప్ సెప్టెంబర్ 3 నుంచి 10 వరకు దక్షిణ కొరియాలో... ఆసియా క్రీడల టీటీ ఈవెంట్ చైనాలోని హాంగ్జౌలో సెప్టెంబర్ 23 నుంచి అక్టోబర్ 2 వరకు జరుగుతాయి.

భారత టీటీ జట్లు: పురుషుల టీమ్ విభాగం: ఆచంట శరత్ కమల్, సత్యన్ జ్ఞానశేఖరన్, హర్మీత్ దేశాయ్, మానవ్ ఠక్కర్, మనుష్ షా. **రిజర్వ్:** ఎస్‌ఎఫ్‌ఆర్ స్నేహిత్, సానిల్ శెట్టి. **మహిళల టీమ్ విభాగం:** మనిక బత్రా, ఆకుల శ్రీజ, సుతీర్థ ముఖర్జీ, అహిక ముఖర్జీ, దియా చిటాలె. **రిజర్వ్:** అర్చన కామత్, రీత్ రిష్యా. **పురుషుల డబుల్స్:** శరత్ కమల్–సత్యన్; మానవ్–మనుష్. **మహిళల డబుల్స్:** సుతీర్థ–అహిక ముఖర్జీ; శ్రీజ–దియా. **మిక్స్‌డ్ డబుల్స్:** మనిక–సత్యన్; శ్రీజ–హర్మీత్ దేశాయ్.

బ్రిజ్‌భూషణ్‌కు కోర్టు సమన్లు


న్యూఢిల్లీ: రెజ్లర్లను లైంగికంగా వేధించిన కేసులో అరోపణలు ఎదుర్కొంటున్న భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్‌ఐ) చీఫ్, బీజేపీ ఎంపీ బ్రిజ్‌భూషణ్ శరణ్‌సింగ్‌కు ఢిల్లీ కోర్టు సమన్లు జారీ చేసింది. పోలీసులు దాఖలు చేసిన చార్జిషీట్‌ను పరిశీలించిన ఢిల్లీ అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ హర్జీత్ సింగ్ జస్పాల్ ఈ కేసులో విచారించేందుకు తగిన సాక్ష్యాధారాలున్నాయని తెలిపారు. ఈ నెల 18న కోర్టు ముందు హాజరు కావాలని బ్రిజ్‌భూషణ్‌కు సమన్లు జారీ చేశారు.

'ఏషియాడ్'కు ద్వితీయ శ్రేణి జట్టు

ముంబై: ఆసియా క్రీడల్లో భారత పురుషుల, మహిళల క్రికెట్ జట్లు పాల్గొనడం ఖాయమైంది. శుక్రవారం జరిగిన బీసీసీఐ అపెక్స్ కౌన్సిల్ సమావేశంలో దీనికి అధికారికంగా ఆమోద ముద్ర వేశారు. చైనాలో సెప్టెంబర్ 23 నుంచి అక్టోబర్ 8 వరకు ఆసియా క్రీడలు జరుగుతాయి. అయితే ఈ పోటీల్లో మహిళల విభాగంలో మాత్రమే భారత రెగ్యులర్, పూర్తి స్థాయి జట్టు బరిలోకి దిగుతోంది. పురుషుల విభాగంలో మాత్రం ద్వితీయ శ్రేణి టీమ్‌ను పంపాలని బోర్డు నిర్ణయించింది. అక్టోబర్ 5 నుంచి భారత్‌లోనే వన్డే వరల్డ్ కప్ జరుగుతుండటమే దీనికి కారణం. ఐపీఎల్–2023 సీజన్‌లో కొత్తగా తీసుకొచ్చిన 'ఇంపాక్ట్ ప్లేయర్' నిబంధనను దేశవాళీ టి20 టోర్నీ ముస్తాక్ అలీ ట్రోఫీలోనూ అమలు చేయాలని బీసీసీఐ నిర్ణయించింది.

అజేయంగా లంక

నిసాంక సెంచరీ • చివరి మ్యాచ్‌లో విండీస్‌పై విజయం



నిసాంక

హరారే: వన్డే ప్రపంచకప్ క్వాలిఫయింగ్ టోర్నీలో 'సూపర్ సిక్స్' దశను కూడా శ్రీలంక జట్టు అజేయంగా ముగించింది. వెస్టిండీస్‌తో శుక్రవారం జరిగిన చివరి 'సూపర్ సిక్స్' మ్యాచ్‌లో శ్రీలంక ఎనిమిది వికెట్ల తేడాతో గెలిచింది. వెస్టిండీస్ నిర్దేశించిన 244 పరుగుల లక్ష్యాన్ని శ్రీలంక రెండు వికెట్లు కోల్పోయి 44.2 ఓవర్లలో ఛేదించింది. నిసాంక (113 బంతుల్లో 104; 14 ఫోర్లు) సెంచరీ సాధించగా... దిముత్ కరుణరత్నే (92 బంతుల్లో 83; 7 ఫోర్లు) అర్ధ సెంచరీ చేశాడు. వీరిద్దరు తొలి వికెట్‌కు 190 పరుగుల భాగస్వామ్యం జోడించారు. వీరిద్దరు అవుటయ్యాక కుశాల్ మెండిస్ (34 నాటౌట్; 3 ఫోర్లు), సమరవిక్రమ (17 నాటౌట్; 1 ఫోర్) మూడో వికెట్‌కు అజేయంగా 40 పరుగులు జత చేశారు. అంతకుముందు వెస్టిండీస్ 48.1 ఓవర్లలో 243 పరుగులకు ఆలౌటైంది. కీసీ కార్టీ (87; 6 ఫోర్లు, 1 సిక్స్) టాప్ స్కోరర్‌గా నిలిచాడు. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' మహీశ్ తీక్షణ 34 పరుగులిచ్చి 4 వికెట్లు తీశాడు. ఆదివారం జరిగే ఫైనల్లో నెదర్లాండ్స్‌తో శ్రీలంక తలపడుతుంది. ఫైనల్ చేరడంద్వారా శ్రీలంక, నెదర్లాండ్స్ ఈ ఏడాది అక్టోబర్–నవంబర్‌లలో భారత్ వేదికగా జరిగే వన్డే ప్రపంచకప్ టోర్నీకి అర్హత సాధించాయి.

సౌత్‌జోన్ లక్ష్యం 215



వైశాక్

బెంగళూరు: సౌత్‌జోన్ సీమర్ వైశాక్ విజయ్‌కుమార్ (5/76) నిప్పులు చెరిగే బౌలింగ్‌తో నార్త్‌జోన్‌ను కూల్చేశాడు. దీంతో దులీప్ ట్రోఫీ సెమీఫైనల్లో నార్త్ జోన్ రెండో ఇన్నింగ్స్‌లో 56.4 ఓవర్లలో 211 పరుగులకే ఆలౌటైంది. ఓవర్‌నైట్ స్కోరు 51/2తో శుక్రవారం మూడో రోజు ఆట కొనసాగించిన నార్త్ జట్టు 160 పరుగులు జోడించి మిగతా ఎనిమిది వికెట్లు కోల్పోయింది. ప్రభ్‌సిమ్రాన్ సింగ్ (63; 11 ఫోర్లు), హర్షిత్ రాణా (38; 4 ఫోర్లు, 1 సిక్స్) రాణించారు. మూడు పరుగుల స్వల్ప ఆధిక్యంతో కలిపి నార్త్ జట్టు సౌత్ జట్టుకు 215 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించగా... ఆట ముగిసే సమయానికి సౌత్‌జోన్ రెండో ఇన్నింగ్స్‌లో వికెట్ కోల్పోకుండా 21 పరుగులు చేసింది. ఆఖరి రోజు విజయానికి 194 పరుగుల దూరంలో ఉంది.

పుజారా శతకం

సెంట్రల్ జోన్‌తో జరుగుతున్న మరో సెమీఫైనల్లో చతేశ్వర్ పుజారా (133; 14 ఫోర్లు, 1 సిక్స్) సెంచరీతో కదంతొక్కగా, సూర్యకుమార్ యాదవ్ (52; 8 ఫోర్లు, 1 సిక్స్) అర్ధసెంచరీ సాధించాడు. దీంతో వెస్ట్ భారీ లక్ష్యంవైపు దూసుకెళుతోంది. ఆట నిలిచే సమయానికి రెండో ఇన్నింగ్స్‌లో 9 వికెట్లకు 292 పరుగులు చేసింది. సౌరభ్ 4, సారాంశ్ 3 వికెట్లు తీశారు. ప్రస్తుతం వెస్ట్ 384 పరుగుల ఆధిక్యంలో ఉంది. వర్షం కారణంగా చివరి రోజు ఆట సాధ్యంకాకుండా మ్యాచ్ 'డ్రా'గా ముగిస్తే తొలి ఇన్నింగ్స్ ఆధిక్యంతో వెస్ట్ జోన్ జట్టుకు ఫైనల్ బెర్త్ ఖరారవుతుంది.



స్టోక్స్

ఆస్ట్రేలియా 116/4

తొలి ఇన్నింగ్స్‌లో ఇంగ్లండ్ 237 ఆలౌట్

లీడ్స్: యాషెస్ సిరీస్ మూడో టెస్టు ఆసక్తికర మలుపులతో సాగుతోంది. రెండో రోజు కూడా ఇంగ్లండ్, ఆస్ట్రేలియా పోటాపోటీగా పోరాడాయి. శుక్రవారం ఆట ముగిసే సమయానికి ఆస్ట్రేలియా తమ రెండో ఇన్నింగ్స్‌లో 4 వికెట్లు కోల్పోయి 116 పరుగులు చేసింది. ఖ్వాజా (43), వార్నర్ (1), లబుషేన్ (33), స్మిత్ (2) పెవిలియన్ చేరారు. ప్రస్తుతం ఆసీస్ ఓవరాల్ ఆధిక్యం 142 పరుగులకు చేరింది. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 68/3తో ఆట కొనసాగించిన ఇంగ్లండ్ తమ తొలి ఇన్నింగ్స్‌లో 237 పరుగులకు ఆలౌటైంది. ఫలితంగా ఆస్ట్రేలియాకు 26 పరుగుల స్వల్ప ఆధిక్యం లభించింది. కెప్టెన్ స్టోక్స్ (80; 6 ఫోర్లు, 5 సిక్స్‌లు) ఒంటిచేత్తో జట్టుకు గౌరవప్రదమైన స్కోరు అందించాడు. చివర్లో మార్క్ వుడ్ (8 బంతుల్లో 24; 1 ఫోర్, 3 సిక్స్‌లు) మెరుపులు ఇంగ్లండ్ భారీ ఆధిక్యం కోల్పోకుండా కాపాడాయి. ఆసీస్ కెప్టెన్ కమిన్స్ (6/91) రాణించాడు.

తమీమ్ వీడ్కోలు వెనక్కి
ప్రధానితో భేటీ తర్వాత నిర్ణయం



బంగ్లాదేశ్ ప్రధాని షేక్ హసీనాతో మొర్తజా, తమీమ్

చిట్టోగ్రామ్: వన్డే ప్రపంచకప్‌కు ముందు... ఉన్నపళంగా అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు ప్రకటించిన బంగ్లాదేశ్ కెప్టెన్ తమీమ్ ఇక్బాల్ తన నిర్ణయాన్ని ఉపసంహరించుకున్నాడు. ఆ దేశ ప్రధాని షేక్ హసీనాతో భేటీ అయిన తర్వాత వీడ్కోలుపై వెనక్కి తగ్గి... ఆటకు సై అంటున్నాడు. భారత్ ఆతిథ్యమివ్వనున్న వన్డే మెగా ఈవెంట్‌కు మూడు నెలల ముందు అతని ఆకస్మిక నిర్ణయం బంగ్లాదేశ్ క్రికెట్ వర్గాలను నిర్ఘాంతపరిచింది. దీనిపై ప్రధాని హసీనా జోక్యం చేసుకొని అతని దృష్టిని క్రికెట్‌పై మళ్లించారు. శుక్రవారం ప్రధాని కార్యాలయం నుంచి కలవాలనే కబురు రావడంతో మధ్యాహ్నం 34 ఏళ్ల సీనియర్ క్రికెటర్ తన భార్యతో పాటు ప్రధాని నివాసానికి వెళ్లారు. బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు అధ్యక్షుడు నజ్ముల్ హసన్, మాజీ కెప్టెన్ మష్రఫే మొర్తజా... తమీమ్‌తో కలిసి ప్రధాని షేక్ హసీనాతో సమావేశమయ్యారు. ఈ భేటీ ముగిసిన వెంటనే తన రిటైర్మెంట్ నిర్ణయాన్ని వెనక్కి తీసుకుంటున్నట్లు ప్రకటించాడు. అఫ్గానిస్తాన్‌తో బుధవారం తొలి వన్డే తర్వాత తమీమ్ అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు ప్రకటించి షాక్ ఇచ్చాడు.

నేడు, రేపు మోస్తరు వానలు

సాక్షి, హైదరాబాద్‌: రాష్ట్రంలో రానున్న రెండ్రోజులు పలుచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ తెలిపింది. ప్రస్తుతం జార్ఖండ్‌ పరిసర ప్రాంతాల మీదుగా ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. ఇది సముద్ర మట్టం నుంచి సగటున 5.8 కిలోమీటర్ల ఎత్తువరకు విస్తరించి ఉంది. దీని ప్రభావంతో రాష్ట్రంలో పలుచోట్ల తేలికపాటి వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. ఆదిలాబాద్, కుమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్‌ భూపాలపల్లి జిల్లాల్లో కొన్నిచోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ వివరించింది. శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా 7.9 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. ఈ సీజన్‌లో ఇప్పటివరకు 16.77 సెంటీమీటర్ల వర్షపాతం నమోదు కావలసి ఉండగా, 11.90 సెంటీమీటర్ల వర్షం మాత్రమే కురిసింది. ఈ సీజన్‌లో 29 శాతం లోటు వర్షపాతం నమోదైంది.

మల్లికార్జున ఖాతాలో మరో గిన్నిస్‌ రికార్డు

13.16 సెకన్లలో ఒకటి నుంచి 50 అంకెలు టైప్‌ చేసి కొత్త రికార్డు



సదుం(చిత్తూరు జిల్లా): చిత్తూరు జిల్లా నడిగడ్డకు చెందిన డాక్టర్‌ మేజారి మల్లికార్జున ఖాతాలో మరో గిన్నిస్‌ రికార్డు నమోదైంది. ఒకటి నుంచి 50 వరకు అంకెలను వేగంగా టైప్‌ చేసే వ్యక్తిగా గుర్తింపు పొందాడు. 2015లో హైదరాబాద్‌కు చెందిన వ్యక్తి 14.88 సెకన్లలో టైప్‌ చేసి రికార్డు నెలకొల్పాడు. జూన్‌ 11న పుంగనూరులో నిపుణుల సమక్షంలో మల్లికార్జున 13.16 సెకన్లలో ఒకటి నుంచి 50 అంకెలను టైప్‌ చేసి కొత్త రికార్డు సాధించాడు. గతంలో 2022లో యోగాలో అష్టవక్రాసనంలో ఎక్కువ సేపు ఉన్న వ్యక్తిగా, 2023 జనవరిలో ఒక నిమిషంలో ఎక్కువ దేశాల కాలింగ్‌ కోడ్‌లను గుర్తించిన వ్యక్తిగా మల్లికార్జున రెండు సార్లు గిన్నిస్‌ రికార్డు నెలకొల్పడం విశేషం.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.